సంపుటం: 6 Kattukolu Subba Reddy ఫోన్ నెం:
సంచిక: 3 Home Library, Pedacgirala. 64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

ఏప్రెల్, 1983

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

మీ ఉత్తరాలు

కథలకు కార్టూన్స్ విధానం బాగుంది. వెరైటీగా కూడ వుంది. వచ్చే నెలనుంచి కార్టూన్స్ వస్తాయని ఎదురు చూస్తున్నాము.

—'కా. కా.', నూతక్కి.

ఈ నెల అపనలో—హంతకుడికి వెయ్యి కళ్ళు, తిరుగులేని సాక్ష్యాలు. నేరానికి మెట్లు, గాజు పెంకులు కథలు బాగున్నాయి. 'సాగరలోయ' సీరియల్‌లో ఆ టెన్షన్ భరించలేకుండా వున్నాము. సప్లిమెంట్‌లో ఫస్ట్ మార్కు మా వసుంధర గారి 'అమర ప్రేమికు'లదే.

—తోట కేశవరావు, సమనస.

కొత్త సీరియల్ 'విషసర్పాలు' మాకు బాగా నచ్చింది. వర్షం కురిసె రాత్రి గురించి రచయిత సికిందర్ గారు చక్కగా వ్రాశారు. కాని ఆ వర్ణన చాలా భయంకరంగా వుంది. కథలకు మల్లిక్‌గారి బొమ్మలు చాలా బాగున్నవి. ప్రతినెలా ఇటువంటి కార్టూన్ తరహా బొమ్మలు వేయించగలరు.

—యన్. శివానంద్, బెల్లంపల్లి.

ఈ నెల కథల్లో రమణగారి 'దుండగుల దాడి' చాలా బాగుంది. తాయిగారి 'నేరానికి మెట్లు' చాలా చక్కని కథ. ఇక సప్లిమెంట్‌లో సికిందర్ గారి నవల అత్యుత్తమంగా వుంది. కొత్త సీరియల్ 'విషసర్పాలు'కు మల్లిక్ గారితో బొమ్మలు వేయించ గలరు.

—ఆర్. జీవన్, పెంటాకలాన్.

వసుంధర గారి 'ప్లస్ - మైనస్' కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ధోరణిపై తీవ్రమైన సెటైర్. ప్రపంచ శాస్త్రజ్ఞుల ఖ్యాతి పొందిన మన సైంటిస్ట్ మేధావుల వలసకు. ఆయా ప్రభుత్వాల నిరాదరణకు అద్దం పడుతోంది. 'సాగరలోయ' వింత విభ్రాంతి భూతులతో, సస్పెన్స్‌లతో ముందుకు సాగుతోంది.

—బొడ్డపాటి రాజేశ్వరమూర్తి, మచిలీపట

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. జీవుడు—జొన్నలగడ్డ రామలక్ష్మి

16. తెరలవెనుక తరుణి శవం

—యం. వి. వి. సత్యనారాయణ, బొమ్మిడి అచ్చారావు

33. పొరపాటు ఖరీదు నాలుగు లక్షలు—ప్రతాప రవిశంకర్

44. నీచ సంస్కారము—ఇమంది రామారావు

65. బీచ్ రోడ్డులో స్త్రీ శవం—కె. వి. రమణ

81. జల సమాధి—యం. వి. వి. సత్యనారాయణ

105. ఆమె భయం— వసుంధర

117. వాసు అండ్ శేషు డిటెక్టివ్ ఏజన్సీ—బి. రాజేశ్వరి

128. మచ్చలేని ప్రతిబింబం—అజీజ్

157. అన్ ఫిట్—పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ

168. సాగర లోయ (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

నవలలు (సప్లిమెంట్)

3. పిశాచి కోరిక—వసుంధర

40. డేగ కళ్ళు—బొమ్మిడి అచ్చారావు

76. కసి—టెంపోరావు

115. కపాలం పగిలిన కలప వ్యాపారి—సికిందర్

159. విషసర్పాలు (సీరియల్)—సికిందర్

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

దేవుడు

జొన్నలగడ్డ రామలక్ష్మి

మాధవయ్య అవసానదశలో వున్నాడు. వైద్యు డింక అన్ని ఆశలూ వదులుకోవచ్చునని చెప్పాడు. ఇంట్లో దైవ ప్రార్థనలు చేస్తున్నారు. మాధవయ్య భార్య ఏడుస్తూ కూర్చున్నది. ఆయన అక్కగారు తులసితీర్థంతో సిద్ధంగా వున్నది. ఆయనకు అయిదుగురు సంతానం. మొదటి నలు

గురూ ఆడపిల్లలు. అందరికీ పెళ్ళిళ్ళైపోయాయి. వాళ్ళంతా ఏడుపు ముఖాలతో కూర్చున్నారు.

అయితే రెండు రోజుల్నించి కొనప్రాణంతో వున్నాడు మాధవయ్య. ప్రాణం పోయేలాగున వున్నది కానీ పోవడం లేదు. ఏదైనా వింత జరిగి అతడు బ్రతుకుతాడేమోనని ఆత్మీయులనుకుంటున్నారు. కొందరు దూరపు బంధువులకీ వ్యవహారం చిరాగ్గా కూడా వుంది. "పోయేవాడు పోక మమ్మల్ని చంపుతున్నాడు" అని వాళ్ళనుకుంటున్నారు.

ఏమైతేనేం మాధవయ్య ఇల్లంతా బంధుప్రీతులతో మహాసందడిగా వుంది. మరి ఆయనకున్న పేరు ప్రతిష్ఠలు అలాంటివి. మాధవయ్య రెండు చేతులా ఆర్జించడమే కాదు—అయిన వాళ్ళందరికీ యెంతగానో సాయపడ్డాడు కూడా! డబ్బు సంపాదించడంలో ఎంత ఖచ్చితంగా వుంటాడో, ఖర్చు చేసేటప్పుడు అంత వితరణా చూపిస్తాడాయన.

"ఆయన ప్రాణం కొడుకుని చూడాలని కొట్టుకు పోతున్నది. ఆ కోరిక బలంతోనే ఆ జీవుడింకా శరీరాన్ని అంటిపెట్టుకుని ఉండగల్గుతున్నాడు" అని కొందరు వ్యాఖ్యానించారు.

ఆ మాటల్లో నిజం ఎంతవరకూ వున్నప్పటికీ-అంత మంది బంధు మిత్రుల మధ్య గణపతి లేకపోవడం లోటుగానే వున్నది.

వినాయకుడి ఆశీర్వాదబలంతో మాధవయ్యకు లేక లేక కలిగిన మగబిడ్డ గణపతి. లేక లేక కలిగినా అతడు గారాబంతో చెడిపోలేదు. బుద్ధిగా చదువుకున్నాడు. ఆరునెలల క్రితం అతడికి ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఒక్కడూ విశాఖపట్నంలో వుంటున్నాడు.

తండ్రికి గణపతి ఉద్యోగం చేయడం ఇష్టంలేదు. కానీ గణపతి తన మనస్తత్వం వ్యాపారానికి సరిపడదని చెప్పాడు. తండ్రి నొక్కించలేదు.

ఉన్నట్లుండి మాధవయ్యకు జబ్బుచేసింది. అప్పుడు ఒక్కగానొక్క కొడుకును చూడాలని కలవరించి పోతున్నాడు. కానీ ప్రస్తుతం రెండ్రోజుల్నించీ ఆయన స్పృహలో లేడు. ఇప్పుడా, మరో క్షణమా అన్నట్లుంది ఆయన పరిస్థితి!

గణపతి కోసం ఉత్తరాలు వెళ్ళాయి. టెలిగ్రామ్సు వెళ్ళాయి. ఆఖరికి మనిషి కూడా వెళ్ళొచ్చాడు. గణపతి ఊళ్ళో లేడని తెలిసింది. అతడెక్కడున్నాడో కూడా ఎవరూ చెప్పలేకపోయారు.

అందుకు కారణముంది. అది గణపతి పెళ్ళి విషయం!

గణపతికి అతడి పెద్దక్కకూతుర్నిచ్చి పెళ్ళి చేయాలని ఇంటిల్లిపాదీ అనుకుంటున్నారు. ఆ విషయమై గణపతి ఇది అని ఓ అభిప్రాయం ఏర్పరుచ్చుకోలేదు. కానీ అక్క కూతురు అతడికి పెద్దగా నచ్చలేదు. ఈలోగా విశాఖ పట్నంలో అతడికో అమ్మాయితో పరిచయమయింది. ఆ అమ్మాయి పేరు లలిత. చాలా అందంగా వుంటుంది.

గణపతి చాలా త్వరగా ప్రేమలోపడ్డాడు. ఆమె కోసం కుల మత భేదం పాటించకూడదనీ, అంతస్థుల అడ్డు గోడల్ని ఛేదించాలనీ ఆవేశపడ్డాడు. అయితే అందుకూ కొన్ని అడ్డంకులు వచ్చాయి.

లలిత మరీ లేని కుటుంబానికి చెందినది కాదు. కనీసం పదివేలైనా కట్నమిచ్చి పెళ్ళి చేయాలని ఆమె యింట్లో వాళ్ళనుకుంటున్నారు. గణపతికీ, లలితకీ కులం కలవ లేదు. అందువల్ల లలిత యింట్లోనే ఈ పెళ్ళికి ఎవరూ

ఇష్టపడడంలేదు.

అయిన వాళ్ళందర్నీ వదులుకుని గణపతితో వచ్చేయ డానికి లలిత సిద్ధంగా ఉంది. కానీ అది గణపతికి ఇష్టం లేదు. ఆమె ఇంట్లోని వారందరికీ నచ్చజెప్పడానికి తను చేయవలసిన ప్రయత్నాలన్నీచేసి అవేమీ ఫలించనప్పుడే పెద్దల మనసు కష్టపెట్టవచ్చునని అతడి అభిప్రాయం. ముందు లలిత ఇంటి పెద్దల అనుమతి లభించేక అప్పుడు తన ప్రేమ వ్యవహారం తండ్రికి చెప్పవచ్చునని అతడను కున్నాడు.

లలిత విశాఖపట్నంలో వున్నది. అతడు రాయబారానికి ఆమె వుండే గ్రామానికి వెళ్ళాడు. అది రహస్యం.

2

"లలితా నువ్విక్కడున్నావా?" అన్నాడు గోపాలావు.

"నా కోసం నువ్వు వెతుకుతున్నావా? ఎందుకు?" అంది లలిత ఆశ్చర్యంగా.

"నేనొక్కడినే కాదు. ఇద్దరం వెతుకుతున్నాం నీకోసం, నేను, గణపతీ!"

"అరే-గణపతి తిరిగి వచ్చేశాడా—కాయా, పండా!" అంది లలిత ఆత్రుతగా.

"అంతా నస్పెన్సు—అన్నీ రూములోనే!"

లలిత గోపాలావుని అనుసరించింది. ఇద్దరూ గణపతి గదిని చేరుకున్నారు. ఆ యిల్లు కాస్త విసిరేసినట్లుగా వీధికి మూలగా వుంటుంది. ఇంటికి నాలుగు పక్కలా విశాల మైదానం. ఆ ఇంట్లో ఓ గది గణపతి అద్దెకు తీసు కున్నాడు. ఇంటాయన ప్రభుత్వం వారిచ్చే ఎల్టీసీ మీద భారత దర్శనం చేసుకుంటున్నాడు-సపరివార సమేతంగా.

గణపతి గది తాళంవేసి వుంది.

"అరే-గణపతి రూంలో లేడే!" అంది లలిత.

"నీ కోసమే లేడీస్ హాస్టలుకు వెళ్ళాడు. ఇప్పుడే వచ్చేస్తాడు. నాకు డూప్లికేట్ తాళం చెవి ఇచ్చాడు. పద లోపలకు పోయి కూర్చుందాం" అన్నాడు గోపాల్రావు.

గోపాల్రావు తాళం తీశాడు. ఇద్దరూ లోపలకు వెళ్ళారు. గదంతా చిందర వందరగా వుంది.

"బ్రహ్మచారి గది కదా" అని నవ్వాడు గోపాల్రావు. అతడు మంచంమీద లలితను కూర్చోమని తను కుర్చీలో కూర్చున్నాడు.

"కాయా, పండా?" అంది లలిత మళ్ళీ. విషయం తెలుసుకోవాలన్న ఆత్రుతనామె భరించలేకపోతోంది.

"అంత కంగారెందుకు? విషయం నేను చెబితే ఏం బాగుంటుంది? గణపతి నోటనే అన్నీ విందువుగాని—" అన్నాడు గోపాల్రావు.

"నీకు తెలిస్తే నువ్వు చెప్పకూడదూ?" అంది లలిత.

"నాకు తెలిసింది నేను చెప్పనా?" అన్నాడు గోపాల్రావు.

"ఊఁ త్వరగా" అంది లలిత ఆత్రుతగా.

"అరే—అడుగుల చప్పుడవుతోంది—గణపతి వస్తున్నాడు. ఉండు....నువ్వు కదలకు. అంతా సస్పెన్సు. రూంలోకి గణపతి రాగానే నిన్ను చూసి ఆశ్చర్యపోవాలి. అతడు తలుపు తట్టగానే నువ్వే వెళ్ళి తలుపు తీయాలి...." అంటూ గోపాల్రావు వెళ్ళి గది తలుపులు వేసి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"నాకేమీ అడుగుల చప్పుడు వినిపించలేదే!" అంది లలిత.

"నిజంగా—వినబడలేదా?"

"లేదు" అంది లలిత.

"అయితే నేను అదృష్టవంతుణ్ని. మన ఏకాంతా న్నిప్పుడు ఎవ్వరూ భంగపర్చడం లేదు...." అన్నాడు గోపాల్రావు.

"మన ఏకాంతమేమిటి?" అంది లలిత అనుమానంగా.

అప్పుడామెకు స్ఫురించింది. విసిరేసినట్లు వీధికి మూలగా ఓ ఇల్లు. ఆ ఇంటి వారూళ్ళో లేరు. ఆ ఇంట్లో ఓ గది. ఆ గదిలో తామిద్దరం.

అప్పుడామెకు గోపాల్రావు గురించికూడా స్ఫురించింది.

అతడు తనకు దూరపు బంధువు. తన్ను పెళ్ళి చేసుకో వాలని తహతహ లాడుతున్నాడు. తను నిరాకరించింది. గణపతి గురించి చెప్పింది. అప్పుడతడు గణపతి స్నేహం చేశాడు.

"తనకేమైనా ఉత్తరాలుంటే తెలియబర్చమని తన గది తాళం నా కిచ్చి వెళ్ళాడు గణపతి. మంచి అవకాశం కోసం చూస్తున్నాను. నిన్ననే ఇంటి వాళ్ళు ఊరికెళ్ళారు. ఈ రోజు నిన్ని గదికి తీసుకుని వచ్చాను...."

"ఎందుకు?" అంది లలిత.

"ఎందుకో చెప్పుకో" అన్నాడు గోపాల్రావు.

"చెప్పుకోలేను."

"పోనీ ఊహించుకో."

"ఊహించనూ లేను."

గోపాల్రావు నవ్వాడు—"అయ్యో—పాపం పసిపాప! మరి నువ్వు పసిపాపవైతే నేను నిన్ను ముద్దులాడనద్దూ... అయినా పసిపాపవు....నీకు వంటినిండా అన్ని దుస్తు లెందుకు?"

"మర్యాదగా మాట్లాడు" అంటూ గద్దించింది లలిత.

"నేను మర్యాదస్థుడినే....నీతో ఏకాంతంగా వున్నాను కాబట్టి ఇలా మాట్లాడుతున్నానంతే .... కాబోయే భార్యాభర్తలు ఏకాంతంలో ఇలాగే మాట్లాడుకోవాలి...."

"మనం భార్యాభర్తలం కాబోవడం లేదు...."

ఆ సంగతి నాకు తెలుసు. అందుకే మనం భార్యాభర్తలం కావడానికి అనుకూల పరిస్థితులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాను."

"అంటే?"

"మన దేశపు ఆడవాళ్ళ సెంటిమెంట్సు నాకు బాగా తెలుసు. ఒక్కసారి నువ్వు నాకు' లొంగిపోయావంటే చాలు....ఆ తర్వాత పెళ్ళి చేసుకొమ్మని నువ్వే నా వెంట బడతావని నాకు తెలుసు...."

"నేను నీకు లొంగను."

"అదీ నాకు తెలుసు. అయితే ఇప్పుడిక్కడున్న వాతావరణం నిన్ను లొంగతీసుకుందుకు చాలా అనుకూలంగా వున్నది. నువ్వు గ్రహించావో లేదో...."

"ఏమిటిది గోపాల్—నమ్మి నీతో వస్తే."

"నేను నీకు నమ్మకద్రోహం చేయను లలితా! నా ఆశలన్నీ నీమీదే వున్నాయి. నువ్వు లేనిదే నేను బ్రతకలేను. ఈ రోజు నీ జీవితం నాశనం కావడంలేదు. నువ్వు నా దానివి కావడానికి పునాది వేసుకుంటున్నాను. అంతే!" అన్నాడు గోపాల్రావు.

"గోపాల్....ప్లీజ్!" అంది లలిత.

"లలితా—ప్లీజ్!" అన్నాడు గోపాల్రావు.

లలిత గోపాల్రావును వేడుకుంటున్నది—తన జోలికి రావద్దని!

గోపాల్రావు లలితను అర్థిస్తున్నాడు—తన కౌగిలికి

రమ్మని!

ఇద్దరూ ఒకరి కోరిక నొకరు మన్నించలేదు. అప్పుడు బలాబలాలు తేల్చుకోవలసిన సందర్భం ఏర్పడింది.

ఇద్దరిలోనూ ఎవరు బలవంతులో వేరే చెప్పనవసరం లేదు.

లలిత ప్రతిఘటనలో ఎంత బలమున్నదో—గోపాల్రావు కోరికలోనూ అంత బలమూ వున్నది. అయితే అతడి బలానికి శారీరక బలం తోడైంది. అందువల్ల కొద్దిసేపట్లోనే లలిత వివస్త్ర అయి అతడి కాళ్ళు పట్టుకుని "ప్లీజ్ గోపాల్ ఇంతకంటే నువ్వు నన్ను చంపేసినా సంతోషిస్తాను నేను" అంది.

తన కాళ్ళు పట్టుకున్న ఆమెను చేతులు పట్టుకుని లేవదీసే ప్రయత్నంలో గోపాల్ కొంచెం వంగి ఉలిక్కిపడ్డాడు.

గదిలో గోడవారన ఒక మనిషి తనవంకే చూస్తున్నాడు.

"ఎవరు? ఎవరది?" అన్నాడతను.

ఆ మాట విని లలిత చటుక్కున లేచింది. గోపాల్రావు చూపిన వైపే చూసింది. ఆ మనిషి ఆమెకు కూడా కనబడ్డాడు.

"అయ్యా—నన్ను రక్షించండి" అంది లలిత.

"ఆ మనిషి మాట్లాడలేదు. అతడి కళ్ళు దేనినో వెతుకుతున్నట్లున్నాయి. అతడు లలితనూ, గోపాల్రావునూ మార్చి మార్చి చూస్తున్నాడు.

గోపాల్రావు నిశ్చేష్టుడైపోయాడు. ఎవరా మనిషి? లోనికి ఎలా వచ్చాడు? ఇప్పుడు తనేం చేయాలి?

లలిత ఆ అవకాశాన్ని తీసుకుని చటుక్కున దుస్తులు ధరించింది.

ఈలోగా గోపాలరావు నెమ్మదిగా ఆ మనిషిని సమీపించ బోయాడు. లలిత ఒక్క-క్షణం కూడా జాప్యం చేయలేదు. తలుపులు తీసుకుని పరుగున వీధిలోనికి దూసుకుపోయింది.

"అలికిడి విని గోపాలరావు వెనక్కు తిరిగి పారిపో తున్న లలితను చూపి అటువైపు ఒక్కడుగు వేసి "అరే-లలితా!" అన్నాడు. అంతలోనే అతడికి తను సమీపించ బోతున్న మనిషి గుర్తుకువచ్చి అతడివైపు తిరిగాడు.

అక్కడ ఆ మనిషి లేడు.

గోపాలరావు ఆ గదంతా తిరిగాడు. ఆ మనిషి తనకు భయపడి పారిపోయాడా? ఎలా జరిగిందిదంతా!

3

"గణపతీ-అబ్బ నువ్వేనా-నిన్ను చూస్తాననుకోలేదు.."

అంది లలిత అతడి వంక ప్రేమాభిమానాలతో చూస్తూ.

"నువ్వు నన్ను చూడ్డమే కాదు. మనం ఇంక మొహం మొత్తేదాకా ఒకళ్ళనొకరం చూస్తూ కూర్చోవచ్చును...." అన్నాడు గణపతి.

"అంటే—పెళ్ళిన విషం పండేనా?"

"నాకు గణపతి పేరు పెట్టినందుకు నా పెళ్ళి కథ అలాగే వుంది. ముందు మీ అమ్మా నాన్నల్ని ఒప్పించాను. కానీ వాళ్ళొప్పుకుంటే చాలదుట. మీ పెదనాన్నగా రొప్పు కోవాలన్నారు. ఆయన్నీ ఒప్పించాను. ఆ తర్వాత మీ తాతగారిని ఒప్పించాను. ఇంతకీ నా అదృష్టమేమిటంటే మా నాన్నగారి ఆస్తిపాస్తులు, సమాజంలో నాకున్న స్థానం ఇదే ఏ సినిమా హీరోలాగునో అయితే-ఎవ్వరూ ఒప్పుకుని వుండేవారు కాదు. అన్నింటికీ మించి మన ప్రేమబలం.

వాళ్ళొప్పుకున్నా ఒప్పుకోక పోయినా మన పెళ్ళి జరిగి తీరుతుందని చెప్పాను. లలితకు బలవంతం పెళ్ళి జరిపిం

చినా సరే—ఆ మొగుడిని వదిలేసి నాతో వచ్చేయగలదని బెదిరించాను. పెద్దల ఆశీర్వాదం మాకు కావాలనీ అందుకే నేనింతగా ప్రయత్నిస్తున్నాననీ చెప్పాను. వారం రోజుల నా శ్రమ వృధా పోలేదు. మీ వాళ్ళంతా ఏకగ్రీవంగా ఓకే అన్నారు. ఇంక మావాళ్ళ సంగతి తేల్చవలసి వున్నది" అన్నాడు గణపతి.

"అయితే ఇంకెప్పుడు ప్రయాణం?" అంది లలిత.

"మన మిద్దరం కలిసే వెడదాం. ఎవరో అమ్మాయిని ప్రేమించానని చెప్పే బదులు—ఈ అమ్మాయిని ప్రేమించా నని నిన్ను చూపించడమే బాగుంటుంది. నీకు గానీ గోపా ల్రావు కనిపించాడా? నాకు వచ్చే ఉత్తరాలన్నీ ఇంటివాళ్ళ దగ్గరుంటాయి. వాళ్ళూరికెళ్ళినట్లున్నారు. నా గది తాళం డూప్లికేటు గోపాల్రావుకు ఇచ్చాను. గోపాల్రావుకు ఇంటి వాళ్ళ గురించి తెలిసి వుంటుంది. ఇన్నాళ్ళు మావాళ్ళ దగ్గ ర్నుంచి ఉత్తరాలు రాకుండా వుండవు అతడివద్ద ఉత్తరా లుండి వుంటాయి. కానీ అతడా ఉత్తరాలను నా గదిలో వుంచలేదు" అన్నాడు గణపతి.

"గోపాల్రావు కొంతకాలం నీకు మొహం చూపించ లేదు...." అంది లలిత అదోరకంగా.

"ఏం?" అన్నాడు గణపతి.

"నువ్వు లేనప్పుడు మాయమాటలు చెప్పి నిన్న నన్ను నీ గదికి తీసుకువెళ్ళి బలాత్కారించబోయాడు...." అంటూ జరిగినదంతా వివరంగా చెప్పింది లలిత.

గణపతి ఆశ్చర్యంగా — "ఆ మనిషి ఎవరో నీకు తెలి యదా?" అన్నాడు.

"ఏమో — సమయానికి దేవుడిలా వచ్చి నా మానం కాపాడాడు. నేను అవకాశం తీసుకుని పారిపోయాను. ఆ

మనిషి గురించిన వివరాలు తెలిస్తే గోపాలావుకే తెలిపి వుండాలి" అంది లలిత.

"సరేలే—మనం ముందు అర్జంటుగా మా ఊరు వెళ్ళి వ్యవహారం పరిష్కరించుకుని—మా వాళ్ళ చేతకూడా ఓకే అనిపించుకుని వద్దాం. త్వరగా ప్రయాణంకా...." అన్నాడు.

ఇంట్లో అడుగుపెడుతూ గణపతి ఆశ్చర్యపోయాడు. అక్కడలాంటి వాతావరణ ముంటుందని అతడనుకోలేదు.

గణపతి మనసు కీడును శంకించింది.

"గణపతి వచ్చేడర్రా!" అన్నారెవరో. వెనువెంటనే గణపతి, గణపతి అన్న మాటలతో ఇల్లంతా ప్రతిధ్వనించింది. ఇంట్లోని అంతమంది బంధుజనంలో లలిత కలిసిపోయింది. ఆమె ఎవరో, ఎప్పుడొచ్చిందో. ఎవ్వరూ పట్టించుకోలేదు.

"కొడుకును చూడాలని ఆ జీవు దూరికే కొట్టుకు పోతున్నాడు...." అన్నారింకెవ్వరో.

గణపతి మరణశయ్యమీద వున్న తండ్రిని సమీపించాడు. తల్లి అతడి చేతులు పట్టుకుని భోరున ఏడ్చింది. అక్కలు నలుగురూ ఏడ్చారు. అప్పుడు గణపతికి ఏడుపు వచ్చింది.

గణపతి తల్లి భర్తవంక తిరిగి రుద్ధకంఠంతో "ఏమండీ బాబు వచ్చాడండీ—మన బాబు....మన గణపతి వచ్చాడండీ...." అంది.

ఉన్నట్లుండి మాధవయ్య కళ్ళు తెరిచాడు. ఆయన కంటిపాపలు వేగంగా కదిలాయి. ఆయన చూపు గణపతి పైన ప్రసరించగానే అవి స్థిరంగా నిలిచిపోయాయి.

ఆ కనులలో ఓదివ్యతేజస్సు....అపూర్వమైనవెలుగు....

"నాన్నా!" అన్నాడు గణపతి.

"బాబూ—వచ్చేవా?" అన్నాడు మాధవయ్య.

సరిగ్గా అప్పుడే లలిత గణపతి పక్కకు వచ్చింది. ఆమె మాధవయ్యను చూసి ఆశ్చర్యపడుతూ—"గణపతీ... నిన్న నేను గదిలో చూసిన మనిషి ఈయనే...." అంది.

గణపతి ఆశ్చర్యంగా—"ఏమిటవ్వాళ్?" అన్నాడు.

"అవును.... ఈయనే ... ఈయన కారణంగానే నన్ను నేను రక్షించుకుని నీకోసం మిగిలాను" అంది లలిత మళ్ళీ.

"అమ్మా—నాన్న నిన్న విశాఖపట్నం వచ్చేడా?"

"బాగుందిరా—పది రోజులయింది మంచం పట్టి— నిన్నట్నించయితే ఆయనకు స్పృహలేదు" అంది గణపతి తల్లి.

మాధవయ్య నవ్వాడు—"నిన్ను చూడాలనే బ్రతికి వున్నానురా! నీకోసమే—నిన్ను చూడాలనే నీ గదికి వచ్చాను. కానీ అలా వచ్చి అనుకోకుండా కోడలి మానం కాపాడాను. అంతా కాకతాళీయం. నీ పెళ్ళికి నేను అనుమతిస్తున్నాను" అంటూ ఆయన చటుక్కున గణపతికీ, లలితకూ చేతులు కలిపాడు.

ఆ మరుక్షణంలోనే ఆయన ప్రాణం పోయింది.

ఇంటిల్లపాదీ ఘొల్లుమన్నారు. అయితే అంత దుఃఖం లోనూ గత దినం మాధవయ్య విశాఖపట్నం వెళ్ళి వచ్చిన సంఘటనను చాలామంది ఆశ్చర్యంగా చెప్పుకున్నారు.

కొడుకును చూడాలన్న బలవత్తరమైన కోరికతో మాధవయ్య ఆత్మ మరో ఊరులోని అతడి గదికి వెళ్ళి అక్కడి దృశ్యాలన్నీ చూపి, విని అర్థం చేసుకోగలిగిందా?

ఊహకూ, మానవ మేధస్సుకూ అందని ప్రశ్న ఇది!

ఏమైతేనేం—గణపతి పెళ్ళి మరో సంవత్సరం తర్వాత ఏ విఘ్నమూ లేకుండానే జరిగిపోయింది. □

తెరల వెనుక తరుణిశవం

ఎమ్.వి.వి. సత్యనారాయణ............
బొమ్మిడి అచ్చారావు



థియేటర్ నుండి బయటకు వచ్చారు రాజేష్, మోహినీ, నందనరావు. మోహిని కారువైపు నడిచింది. ముందు వైపు తలుపు తెరిచింది. డ్రయివింగ్ సీట్లో కూర్చుంది. డాష్ బోర్డ్ తడిమి ఇగ్నిషన్ కీ త్రిప్పింది.

మగవాళ్ళిద్దరూ వెనుకసీట్లలో కూర్చున్నారు.

కారు చీకటిని చీల్చుకుంటూ మోహన్ కుంజ్ ఫ్లాట్స్ ముందు ఆగింది. ఆ ఫ్లాట్స్‌లో అక్కడక్కడా దీపాలు వెలుగుతొన్నాయి. ఫ్లాట్స్. వాటి చుట్టూ పరచుకుని వున్న నగరం నిశ్శబ్దంగా నిద్రపోతోంది.

కారు పోర్టికోలో ఆగింది. మోహిని కారు దిగింది. రాజేష్, నందనరావు చెరొకవైపు నుండీ కారు దిగారు.

"మోహిని కలవరపడింది. "నా హేండ్ బాగ్" సన్నగా అరచి తిరిగి కారులోకి చూచింది.

"హేండ్ బాగ్ లేదా? థియేటర్‌లో వున్నపుడు వుందా?"

"ఏమవుతుంది మోహినీ!"

"సీటులో మర్చిపోలేదు కదా!"

"బావా! నీకు డూప్లికేట్ తాళం చెవి యిచ్చానుకదా!" ఎదురు ప్రశ్న వేసింది మోహిని.

"అది గదిలోనే వుంది."

ముగ్గురూ తర్జనభర్జన పడ్డారు.

"ఒక్కసారి థియేటర్‌కి వెళ్ళి వస్తేనో...." అంది మోహిని.

"మంచి ఆలోచనే."

"ఆ మాత్రం దానికి ముగ్గురమూ ఎందుకు?"

"అవును నేను ఒక్కడినే వెళ్తాను!" రాజేష్ కదిలాడు.

"అన్నట్టు ఇగ్నిషన్ కీ ఎలా వచ్చింది?" అడిగాడు నందనరావు.

"థియేటర్‌లోకి వెళ్ళే ముందు డాష్‌బోర్డ్‌కి పదితే కాను."

రాజేష్ కారు స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

"ఎవరయినా హాండ్ బాగ్ పారవేసుకుంటారా?" అన్నాడు నందరావు.

ఏమిటో విచిత్రంగా వుంది. సినిమాలో లీనమై పోయాం" అంది మోహిని.

"నల్లటి హాండ్ బాగ్ మిలమిలలాడుతుంది. పర్కార్స్ ఎవరు చూచినా వదిలిపెట్టరు."

"పోతే పోనివ్వు. ఫ్లాట్ తెరుచుకునే తాళంచెవి దాని లోనే వుండిపోయింది. అదీ నా బాధ!"

నందనరావు భవనంలోకి నడిచాడు. మోహిని అతడిని అనుసరించింది. ఇద్దరూ మూడో అంతస్తు చేరుకున్నారు.

పదిహేడో నంబర్ ఫ్లాట్ కి ఒకే పెద్ద తలుపు. దాని ప్రక్క గోడలో కిటికీ. కిటికీ కూడా లోపల నుండి మూసి వుంది.

నందనరావు తలుపు నెట్టి చూశాడు. పది నిమిషాల్లో రాజేష్ వచ్చాడు. అతడి మొహంలో నిరాశ కనిపిస్తోంది.

"మోహినీ! తలుపు పగలగొట్టవలసిందే! మార్గంలేదు!" అన్నాడు నందనరావు.

రాజేష్ తలూపాడు.

మోహిని తెల్లబోయింది. "మూడువేల రూపాయల విలువచేసే తలుపు నాశనం కావాలా? లాభంలేదు. ఈ రాత్రి ఎక్కడయినా లాడ్జిలో అయినా సరే కాలక్షేపం చేయాలి!" అంది మోహిని.

"లాడ్జిలోనా? పోలీస్ రెయిడింగ్ జరిగితేనో!" అన్నాడు రాజేష్.

నందనరావు ఆలోచనలో పడ్డాడు.

"ఫ్లాట్ కి వెనుకవైపు బాల్కనీ వుంది కదూ!"

అన్నాడు నందనరావు.

"ఉంది....ఫ్లాట్స్ వెనుక బాల్కనీ. బాల్కనీకి ఆని వంటగది దాటాక మెయిన్ హాలూ, హాలుకు రెండు ప్రక్కలా రెండు బెడ్ రూంస్."

"పొరపాటునయినా వంట గదికి లోపలనుండి బాల్కనీ వైపు గడియ పెట్టకుండా వుంటే కదా!" రాజేష్ చప్ప రించాడు.

నందనరావు నవ్వి, "మోహిని అంత తప్పుపని చేయదు!" అన్నాడు.

"వంటగదికి అద్దాల తలుపులున్నాయి కదా! ఒక అద్దం తొలగించి లోపలికి దూరితే...."

"రైట్ పద."

మగవాళ్ళిద్దరూ ఫ్లాట్స్ వెనకభాగం చేరుకున్నారు. ఫ్లాట్స్ వెనుకభాగంలో అపరిశుభ్రంగా, మురికి కాలువల మయంగా వుంది. మగాళ్ళిద్దరూ ముక్కులు మూసు కున్నారు. ఎక్కడిదో ఎలక్ట్రిక్ దీపాల కాంతి అస్పష్టంగా పడుతోంది.

"అదిగో మూడో ఫ్లాట్....క్రింది నుండి మూడో ఫ్లాట్....అదే పదిహేడో నంబర్" అన్నాడు రాజేష్.

"కరెక్ట్. అదే అయుండాలి" అన్నాడు నందనరావు, నీటిపైపు సమీపించి.

నీటిపైపు అరచెయ్యి పరిమాణంలో వుంది. రెండు చేతులా పైపును పట్టుకున్నాడు నందనరావు. పైకి ఎగ బాకాడు. అతడి వెనుక రాజేష్ పైపును పట్టుకుని ఎగబాక సాగాడు. మధ్య మధ్య యిద్దరూ సన్ షెడ్స్ మీదకు కాలు చాపి తాత్కాలికంగా ఆగుతోన్నారు, చేతిపట్టు జారిపోకుండా.

ఊరకుక్క మొరుగుతోంది.

క్రింది నుండి రెండో ఫ్లాట్ దాటి పాకుతున్నారు యిద్దరూ. చివరికి బాల్కనీని అందిపుచ్చుకుని నందనరావు అతడి వెనుక రాజేష్ బాల్కనీలోకి మొగ్గవేశారు.

గాజు అద్దాల తలుపును లోపలికి నెట్టాడు నందనరావు. తలుపు లోపలకు తెరచుకుంది.

"మోహిని పొరపాటు చేసినప్పటికీ మంచి పనే చేసింది!" నవ్వాడు రాజేష్.

తెరచుకున్న మార్గంలోంచి నందనరావు రాజేష్ లోపలకు ప్రవేశించారు. ఫ్లాట్ చీకటిగా వుంది.

"జాగ్రత్తగా నడువ్. వంట యిల్లు. ఏం తన్నేస్తావో" స్విచ్ కోసం తడుముతూ రాజేష్ అన్నాడు.

నందనరావు ఏదో టేబులుమీద పడ్డాడు. ఫోల్డింగ్ టేబులు చప్పుడుచేసి తిరగబడింది. టేబులూ, దానితో పాటు నందనరావూ....తిరగబడ్డ చప్పుడయింది.

"ఏం జరిగింది?" అరిచినంత పనిచేశాడు రాజేష్.

"వంటింట్లోకి ఈ టేబులు ఎలా వచ్చింది!" మూలి గాడు నందనరావు.

"అవును. వంటింట్లో ఈ టేబులును ఎప్పుడూ చూడ లేదు."

రాజేష్ స్విచ్‌బోర్డ్ తడిమాడు. స్విచ్ నొక్కాడు.

వంట గదిలో లైటు వెలిగింది. లైటు వెలుగులో నందనరావు లేచి చుట్టూ చూశాడు.

"మై గుడ్‌నెస్! ఇది మన ఫ్లాట్ కాదు" అరిచాడు నందనరావు.

"హుష్. ఫ్లాట్‌లో ఎవరయినా నిద్రపోతోంటే ప్రమాదం."

"అవును. సైలెంట్‌గా దిగిపోదాం!"

"అసలు ఫ్లాట్‌లో ఎవరయినా వున్నారా?"

"ఏం! నీకు ఆ సందేహం ఎందుకు వచ్చింది?"

"ఇనుప టేబులు తిరగబడింది. పెద్ద చప్పుడయింది. అయినా ఎవరూ లేవలేదు."

"కరెక్ట్...." నందనరావు లేత వెలుగులో మెయిన్ హాలులోకి నడిచాడు. హాలులో బల్ల వుంది. బల్లకి అటూ యిటూ రెండు కుర్చీలున్నాయి. హాలుకి అటూ యిటూ రెండు బెడ్‌రూంస్. హాలుకి చివర ఒంటితలుపు. దాని ప్రక్క గోడలో కిటికీ. నందనరావును దాటి రాజేష్ తలుపు చేరుకున్నాడు.

నందనరావు బెడ్‌రూం తనిఖీ చేయసాగాడు.

తలుపువద్ద ఏవో కవర్లు పడివున్నాయి. కవర్లు తీసి రాజేష్ బల్లమీద వుంచాడు.

"ఇంట్లో ఎవరూ లేరు" అన్నాడు నందనరావు లైటు వెలిగిస్తూ.

రాజేష్ తలవూపి గుమ్మంవైపు కదిలాడు. లోపలి వైపు గడియపెట్టి వుంది. రాజేష్ తెల్లబోతూ గడియతీసి తలుపు తెరిచాడు.

వరండాలో మోహిని బిక్కు బిక్కుమని చూస్తోంది.

"గొప్పవాళ్ళు! పదహారో నెంబర్ ఫ్లాట్‌లో చొరబడ్డారు" అంది మోహిని విసుగ్గా.

"మోహినీ! ఈ ఫ్లాట్ ఎవరికి అద్దెకు ఇచ్చావు? వారం క్రితం వరకూ ఖాళీగా వుండేది కదా!" అన్నాడు నందనరావు.

"సరోజ" అనే ఆమె చేరింది. ఎక్కడో షిప్ యార్డ్‌లో కాబోలు పని చేస్తుందట!"

"ఈ ఫ్లాట్‌లో సరోజ లేదు. కాని లోపలివైపు తలుపు

గడియపెట్టి వుంది!"

"అదేమిటి?"

"అవును. వెనకప్రక్క వంటగది తలుపు తెరిచే వుంది!"

మోహిని భయంగా చూస్తోంది.

ఆలోగా రాజేష్ పదిహేడో నంబర్ ఫ్లాట్‌లోకి వచ్చి కిటికీ తెరిచాడు. ఫ్లాట్‌లో లైటు వెలుగుతోంది. కిటికీ వెనుక రాజేష్ ముఖం ప్రత్యక్షమయింది.

"మోహినీ! తాళం చెవి, అదే డూప్లికేట్ ఎక్కడ వుంది?" అడిగాడు రాజేష్.

గదిలో కుడిప్రక్క బెడ్‌రూంలో డ్రెస్సింగ్ టేబులు మీద చూడు!" అన్నాడు నందనరావు.

రాజేష్ వెతికి తాళం చెవిని కిటికీ మధ్యనుండి అందించాడు. మోహిని తలుపు తెరచింది.

"హమ్మయ్య! అరగంటపాటు చెక్కభజన అయాక గానీ విశ్రాంతి దొరకలేదు!" అంటూ మోహిని మెయిన్ హాలులో వున్న సోఫాలో కూలబడింది.

రాజేష్ కణతలు రుద్దుకున్నాడు. "వెనకభాగం లోంచి ఫ్లాట్‌లో ప్రవేశించడం తప్పు. అంతేకాదు. చాల కష్టం కూడానూ."

"నా అరచేతులు గొట్టం పట్టుకు ప్రాకినందుకు మండి పోతున్నాయి!" అన్నాడు నందనరావు.

మోహిని కెవ్వున అరిచింది. "రాజేష్! నీ అరచేతులు గాయాలయాయి. ఎర్రగా రక్తం!" అంది.

రాజేష్ తన అరచేతులు చూసుకున్నాడు. నుదురు చిట్లించాడు.

నందనరావు అతడిని వాష్ బేసిన్ వద్దకు నడిపించాడు.

చేతులు కడుక్కున్నాడు రాజేష్. అరచేతులలో ఎక్కడా గాయంలేదు.

"రక్తం ఎక్కడి నుండి వచ్చింది" చేతులు గాయపడ లేదు!" నందనరావు, మోహినీ చివరకు రాజేష్ మొహాలు చూసుకున్నారు.

ముగ్గురూ ఆలోచనలో పడ్డారు.

"సరోజ ప్లాట్ లోపలివైపు గడియ పెట్టివుంది. రక్తం ఆ ప్లాట్ లో అరచేతులకు అంటుకున్నదేమో!" అంది మోహిని.

"రాజేష్! పద! ఆ ప్లాట్ లోకి మరల ఒకసారి వెళ్ళి చూద్దాం" అన్నాడు నందనరావు.

రాజేష్ బయలుదేరాడు.

"ఆగండి! నాకు గుబులుగా వుంది!" అంది మోహిని.

"మోహినీ! నువ్వు కూడా వంటగది తలుపు వేయడం మర్చిపోయావు!" అన్నాడు రాజేష్.

"అవును. అది గుర్తుకువచ్చే భయం వేసింది. మన కంటే ముందే యింట్లో ఎక్కడయినా ప్రవేశించి వుంటే" మోహిని గజగజలాడింది.

"అయితే ముగ్గురమూ వెళ్దాం" నందనరావు కదిలాడు. మోహినీ, రాజేష్ అతడిని అనుసరించారు. ముగ్గురూ పదహారో నంబర్ ప్లాట్ లోకి నడిచారు.

మెయిన్ హాలులో బల్లమీద రెండు కవర్లు పడి వున్నాయి. అవి ఎర్రటి రంగును పులుముకుని వున్నాయి.

"నేనే ఈ కవర్లు తలుపు వద్ద పడివుంటే తీసి బల్లమీద పెట్టాను. వీటికి రక్తం అంటివుంది. అంటే ఉత్తరాలు తాకకముందే నా చేతులకు రక్తం అంటిందన్న మాట!" రాజేష్ హాలును పరకాయించి చూచి వంటింట్లోకి

వెళ్ళాడు.

నందనరావు బెడ్‌రూమ్స్ వెతికాడు.

"ఇదిగో....ఇక్కడ....వంటింట్లో.... టేబులు క్రింద" రాజేష్ కేకలు పెట్టాడు.

మోహిని అటు పరుగెత్తింది.

నందనరావు కళ్ళు బెడ్‌రూంలో వ్రేలాడుతోన్న కర్టెన్‌కి అతుకుపోయాయి. ప్రక్క ఫ్లాట్‌లోకి దారితీసే ఎమర్జన్సీ గుమ్మం వుంది. ఆ గుమ్మానికి కర్టెన్ వ్రేలాడుతోంది. గుమ్మం గోడ లోపలకు పెట్టడంవలన కర్టెన్‌కీ, గుమ్మానికీ మధ్య కొంత ఖాళీస్థలం వుంది. ఆ ఖాళీ స్థలంలోంచి కర్టెన్ వెనుకనుండి రెండు కాళ్ళు కనిపిస్తున్నాయి. నందనరావు బిగుసుకు పోయాడు.

"టేబులు క్రింద రక్తం వుంది. మైగాడ్! రక్తం! హత్య! ఇక్కడ ఎవరినో చంపేశారు...." మోహిని పిచ్చిగా అరుస్తూ వంగింది. గచ్చునేలమీద గాజుముక్కలున్నాయి. పగిలిన గాజుముక్కలు.

"సరోజను ఎవరో హత్యచేసి పారిపోయి వుంటారు!" అంది మోహిని.

"అయితే శవం ఏది?"

"శవాన్ని ఎత్తుకుపోయివుంటారు. లేదా ఫ్లాట్స్ వెనుకకు విసిరివేసి వుంటారు."

"బావా!" అంది మోహిని.

నందనరావు పలకలేదు.

రాజేష్ లోపలకు నడిచాడు. మోహిని అతడి వెనుక పరుగెత్తింది. నందనరావు బెడ్‌రూంలో కనిపించాడు. శిలావిగ్రహంలాగా నేలలోకి పాతుకుపోయాడు. రాజేష్ అతడిని కుదిపాడు.

నందనరావు అతనికి మౌనంగా కర్టెన్ చూపించాడు.

మోహిని ముఖంలో నెత్తురు చుక్కలేదు. రాజేష్ ముందుకు నడిచి కర్టెన్ తప్పించాడు.

తెరల వెనుక ఓ శవం కూర్చుని వుంది.

"మైగాడ్!! సరోజ! ఎవరో తల పగలగొట్టి చంపేశారు" అన్నది మోహిని.

"అవును. పక్కనే పూలకుండీ వుంది. దాంతోనే చంపి వుండాలి, రక్తం అంటివుంది" అన్నాడు నందనరావు.

రాజేష్ గొంతు బొంగురుపోయింది. ఈ ఫ్లాట్‌లో హత్య జరిగింది. మనమీ ఫ్లాట్‌లో ఎక్కడపడితే అక్కడ తిరిగాం. మన వేలిముద్రలూ, అడుగు జాడలూ ఎక్కడ పడితే అక్కడ అచ్చుపడ్డాయి. ఈ హత్యలో మనం పోలీసులకు అతిథులం కాం కదా!" అన్నాడు రాజేష్.

"మోహినీ, నువ్వు తాళం చెవి పారవేయటంకాదు గానీ మనం ఓ హత్యకేసులో ఇరుక్కున్నాం ఇప్పుడు" అన్నాడు నందనరావు కోపంగా.

మోహిని కంగారు పడింది.

"ఇప్పుడెలా?" అన్నాడు నందనరావు.

"ఎవరైనా ప్రయివేటు డిటెక్టివ్‌ని కల్సుకుంటే మంచిదని నా అభిప్రాయం" అన్నాడు రాజేష్.

2

మంచి గాఢనిద్రలో వున్న డిటెక్టివ్ శిరీష్ కాలింగ్ బెల్ ప్రసరించిన సంగీత ధ్వనులకు మేల్కొన్నాడు.

రేడియం డయిల్ వాచ్ పన్నెండు గంటలు చూపిస్తోంది.

తలుపులు తెరిచాడు. ఎదురుగా ఇద్దరు యువకులు!

"ప్లీజ్ కమింగ్!" అన్నాడు శిరీష్ సౌమ్యంగా.

ఇద్దరు లోనికొస్తూ, "క్షమించాలి. అర్ధరాత్రి మీకు శ్రమిస్తున్నాం" అన్నారు.

శిరీష్ తేలిగ్గా నవ్వేస్తూ "ఫరవాలేదు. ప్లీజ్ సిడవున్!" అన్నాడు డ్రాయింగ్ రూంలోకి అడుగుపెట్టి.

నందనరావు, రాజేష్ కూర్చున్నారు.

"చెప్పండి" ముందుకు వంగాడు శిరీష్.

నందనరావు ముందుగా అన్నాడు: "నా పేరు నందన రావు. 'మోహన్ కూజ్ ఫ్లాట్స్' యజమానురాలు మోహిని నా మరదలు. ఈయన మోహిని క్లాస్‌మేట్ మిష్టర్ రాజేష్. మేము ముగ్గురం మంచి స్నేహితులం కూడా" పరిచయం చేసుకున్నాడు.

శిరీష్ తల పంకించాడు. లేచి ఫ్రిజ్ దగ్గరకు వెళ్ళి మూడు గ్లాసుల్లో ఆరంజ్ క్రష్ తెచ్చి టేబిలు మీద పెట్టాడు. వాష్ బేసిన్ దగ్గర ముఖం కడుక్కుని వచ్చాడు.

"టైం కాని టైంలో మీకు ట్రబులిచ్చాం" అపాలజీ చెప్పుకుంటున్నట్టు అన్నాడు రాజేష్.

"నోనో, డాక్టర్సుకి, మాకు టైం లిమిట్సు వుండవు. ట్వంటీఫోర్ అవర్స్ సర్వీస్!" నవ్వుతూ అన్నాడు శిరీష్ "ప్లీజ్ హావిట్!" అన్నాడు డ్రింక్స్ ఆఫర్ చేస్తూ.

"మోహన్ కూజ్ ఫ్లాట్స్ మొత్తం గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిసి మొత్తం నాలుగు అంతస్తులు. పదిహేడో నంబర్ ఫ్లాట్‌లో నేను, మోహిని వుంటున్నాం. మాకు యింకా పెళ్ళి కాలేదు. త్వరలో కాబోతోంది. మా పక్కనున్న పదహారో ఫ్లాట్‌లో వారం రోజుల క్రితం సరోజ అనే యువతి అద్దెకు దిగింది...." అంటూ ఆ రాత్రి జరిగిన సంఘటనలను వరసగా చెప్పుకుంటూ వచ్చాడు నందన

రావు.

శిరీష్ శ్రద్ధగా విన్నాడు.

"నా గురించి ఎలాంటి సహాయం కావాలి!"

మే మిద్దరం హత్య జరిగిన పదహారో నంబరు ఫ్లాట్‌లో తెలీక కలియ తిరిగేశాం. మా ఆనవాళ్ళు చాలా స్పష్టంగా అక్కడ పడివుంటాయి. ఏ పాపం ఎరగని మమ్మల్ని హత్య కేసులో పోలీసులు ఇరికించేస్తారు. అందుకే బాధ్యత తెలిసివుండి కూడా పోలీసులకి రిపోర్టివ్వ లేదు. మీరయితే మమ్మల్ని గట్టెక్కిస్తారనే ఆశతో వచ్చాం" అన్నాడు నందనరావు.

శిరీష్ కొద్ది క్షణాలు మౌనం వహించాడు. తర్వాత అంగీకారంగా తలూపి, "ఓకే! అక్కడి పరిస్థితి ఓ సారి చూసి, తర్వాత క్రైంబ్రాంచ్‌కి తెలియచేస్తాను" అన్నాడు.

3

"ఈమె మిస్ మోహిని, నా మరదలు" అన్నాడు నందనరావు, మోహినిని పరిచయం చేస్తూ.

మోహిని నమస్కారం చేసింది.

"ఫ్లాట్‌లోకి వెళ్దాం, పదండి!" అన్నాడు శిరీష్.

నందనరావు దారి తీశాడు, వెనక అందరూ వెళ్ళారు.

సరోజ కుప్ప కూలినట్టుగా తలుపుమూల కూర్చున్నట్టుంది. కాళ్ళు ముడుచుకున్నాయి. హత్య చేశాక ఆమెను అక్కడకు తీసుకొచ్చి కూచోబెట్టారు. కర్టెన్ వెనక నుండి ఆమె కాళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయి. ఆమె తలమీద నుండి రక్తం మొహంమీదుగా ప్రవహించి గడ్డకట్టి వుంది. ఆమె పక్క కూజా బిందె ఆకారంలో వున్న పూలకుండీ వుంది. ఆ కుండీతోనే ఆమె తలమీద మోది హత్య చేశారు.

శవం వద్ద వంగి సరోజ చెయ్యి పట్టుకున్నాడు శిరీష్.

మంచుముక్కలా తగిలింది. మణికట్టు వద్ద చెయ్యి వంచా లని ప్రయత్నించాడు. వంగలేదు.

రిగర్‌మార్టిస్ ప్రారంభమైంది. వాచీ చూసుకున్నాడు శిరీష్. ఒంటి గంటయింది. రిగర్ మార్టిస్ ప్రారంభ మయిందంటే సరోజ చనిపోయి ఎనిమిది గంటల కంటె ఎక్కువ సమయం అయిందన్న మాట. మధ్యాహ్నం నాలుగు ఐదు గంటల మధ్య హత్య జరిగి వుండాలి! పట్ట పగలే హత్య చేశాడన్న మాట హంతకుడు!

శిరీష్ వంటగది వైపు నడిచాడు. టేబిలు కింద చూశాడు. రక్తం మడుగు కట్టి వుంది. వంటగదిలో హత్య జరిగిందన్న మాట! శవాన్ని కర్టెన్స్ వెనకదాచాడు. వంట గదిలోంచి పడక గదిలోకి శవాన్ని తీసుకువెళ్ళి దాచ డానికి కారణమేమిటి? శిరీష్ వూహ కందలేదు.

మెయిన్ హాల్లో బల్లమీద ఉత్తరాలు పరిశీలించాడు శిరీష్. రక్తపు మరకలున్న రెండు కవర్లు!

రాజేష్ అందుకు సంజాయిషీ యిచ్చుకున్నాడు. తాము ఎక్కిన బల్ల, అది తిరగబడ్డ సంగతి, పైపుమీదుగా ఫ్లాట్ పైకి చేరిన దారి, తన చేతికి రక్తం అంటుకోవటం, అన్నీ వివరంగా మరోసారి, చూపిస్తూ చెప్పాడు.

శిరీష్ వేలిముద్రలు పడకుండా లోపలి కాగితాల్ని బయ టికి తీశాడు. అందులోని ఓ కాగితం అతని దృష్టి నాకర్షిం చింది. కోటు జేబులో దాన్ని పదిలపరిచాడు.

"మిస్టర్ రాజేష్! హతురాల్ని మీ రింతకు ముందు ఎప్పుడయినా చూశారా?" అన్నాడు శిరీష్.

రాజేష్ తల అడ్డంగా తిప్పాడు, లేదన్నట్టు.

శిరీష్ మోహినివైపు తిరిగి "ఫ్లాట్‌ను మీరు, నందన రావు ఉపయోగిస్తున్నారు. ఇద్దరి వద్దా తాళం చెవులుంచు

కోవటం సహజం. అంతేకాని, డూప్లికేట్ తాళం చెవిని గదిలో వుంచుకోవట మేమిటి?" అన్నాడు.

"హాండ్ బ్యాగ్ పారేసుకుంటానని కల్లోకూడా ఊహించ లేదు" అన్నది మోహిని.

"సరోజ కోసం ఎవరైనా వచ్చేవారా?"

"నాకు తెలిసి ఎవరూ వచ్చేవారు కాదు."

"నిన్న మధ్యాహ్నం మీరు ఫ్లాట్ లోనే వున్నారా?"

"ఆఁ! మా ఫ్లాట్ లోనే వున్నాను."

"సరోజ ఫ్లాట్--అంటే యీ ఫ్లాట్—లోనించి ఏవైనా అలికిడులు వినిపించాయా?"

"లేదు. నిన్న ఆమె పదిగంటల ప్రాంతంలో డ్యూటీకి వెళ్తూ కనిపించింది. ఫ్లాట్ లో వుండే సమయం కాదు."

"సరోజ యిదివరలో మీకు తెలుసా?"

"లేదు. వారం రోజుల క్రితం యీ ఫ్లాట్ ఖాళీ అయింది. అదేరోజు ఫ్లాట్ కావాలని సరోజ వచ్చి అడిగింది. వెంటనే ఆమెకు అద్దెకిచ్చేశాను."

"పదండి. మీ ఫ్లాట్ లోకి వెళ్దాం!" అన్నాడు శిరీష్ మోహిని వంక చూసి. మోహిని రాజేష్ ముందు నడుస్తూండగా, శిరీష్ నందరావుకు ఏదో చెప్పి బయటకు పంపాడు.

పదిహేడో నంబరు ఫ్లాట్ కి వచ్చాక, "సార్ యిక నేను వెళ్ళిపోవచ్చా? మరేం ఫరవాలేదు కదా!" అన్నాడు రాజేష్ వెళ్ళడానికి ఉపక్రమిస్తూ.

శిరీష్ వాచ్ చూసుకుని, "తెల్లవారటానికి యిక ఆట్టే టైం లేదు కదా! ఇప్పుడెందుకు లెండి, నేనెలాగూ పోలీసులకి ఫోన్ చేసి రప్పించబోతున్నాను" అన్నాడు.

"పోలీసులకి తెలియచేస్తున్నారా?" అన్నది మోహిని భయంగా.

"అది నా బాధ్యత" అన్నాడు శిరీష్ నవ్వుతూ.

"బావ ఏడీ?" అన్నది మోహిని అప్పుడే గమనించి.

"సిగరెట్లు అయిపోయాయి. ఉన్నాయా అనడిగితే తేవ టానికి కిందికి వెళ్ళాడాయన — ఈ వీధి చివర బంకు రాత్రింబవళ్ళు తెరిచే వుంటుందట కదా!" అన్నాడు శిరీష్.

"మీ ఫోన్ ఉపయోగించుకుంటున్నాను" అన్నాడు శిరీష్, రిసీవర్ చేతిలోకి తీసుకుంటూ. "హల్లో! క్రైం బ్రాంచ్?" అన్నాడు.

అవతలి నుండి ఇన్స్పెక్టర్ కుమార్ పలికాడు.

అతనితో చెప్పి ఫోన్ పెట్టేశాడు శిరీష్

నందనరావు సిగరెట్టు ప్యాక్‌తో పైకొచ్చాడు. సిగరెట్టు నోట పెట్టుకుంటూ బాల్కనీలోకి వచ్చాడు శిరీష్. సిగరెట్టు పెట్టె అట్టపైన '3' అంకె వేసి వుంది.

శిరీష్ సంతృప్తిగా తలాడించాడు. లోపలికి వచ్చాడు. రాజేష్‌ని సమీపించి చటుక్కున వాటేసుకుని ప్యాంటు జేబులు వెతికాడు. పొడవుపాటి కవరు పైకి తీశాడు. ఓ పక్క రక్తం మరకలు అంటుకొని వున్నాయి. అడ్రసు సరోజది.

"ఏమిటి,ఏమిటీ దౌర్జన్యం?" గింజుకోబోయాడు రాజేష్. కవరు లాక్కోబోయాడు. శిరీష్ యివ్వలేదు.

కవరు చించి కాగితాల బొత్తి పైకి తీశాడు. దస్తావేజు! మోహిని కళ్ళప్పగించి చూస్తోంది.

దస్తావేజు పైకే చదివాడు శిరీష్.

....సరోజ తండ్రి పార్వతీశం రాసిన దస్తావేజు. సరోజకీ, రాజేష్‌కీ తన ఆస్తిలో చెరి నాలుగు ఎకరాలు యిస్తున్నట్టూ, తనకు బాంకులో వున్న లక్షరూపాయలు, సరోజకు, రాజేష్‌కు చెరిసగం వ్రాశాడు.

"మిస్టర్ రాజేష్! మీరు తపాలా కవర్లు తీశారన్న విషయం నాకు ఆశ్చర్యకరంగా తోచింది. వంటింట్లో ప్రవేశించినప్పుడే యీ ఫ్లాట్ మీది కాదన్న సంగతి నిర్ధారణ అయింది. అయినప్పటికీ, మీరు నందనరావు లోపలి గదులు తణిఖీ చేశారు.

నందనరావుకు అప్పుడు శవంగానీ, కాళ్ళుగానీ కనిపించ లేదు. అతని తర్వాత గదులు తణిఖీకి నువ్వు వెళ్ళావు. శవం కాళ్ళు కనిపించేలా చేసి తిరిగి నీటిపైపు ద్వారా కిందికి దిగావు. సరోజ వుంటున్న ఫ్లాట్ కి ఎలా అయితే వెనక అద్దాల తలుపు తెరిచి వున్నదో, అచ్చగా అలాగే మోహిని ఫ్లాట్ తలుపు తెరిచి వుంది. అంటే ఎవరో కావాలని తెరిచి వుంచారన్న మాట! ఆ అవసరం ఎవరి కుంది? నీ ఒక్కడికే!

నందనరావుతో కలిసి వున్నందున నిన్ను ఎవరూ అను మానించరని, చివరికి మోహిని కూడా అనుమానించదనీ నీకు తెలుసు. థియేటర్లో కావాలనే ఆమె హేండ్ బ్యాగ్ నీవు తీసి దాచేశావనీ ఆమెకు తెలీదు. ఆనక ఏం ఎరగనట్టు నా దగ్గరకు తీసుకొచ్చావు. నాకు, ఇన్ స్పెక్టర్ కుమార్ కి వున్న అనుబంధం నీకు తెల్సు. అందుకే నేనైతే, యిక పోలీసులు అనుమానించరని నీ నేరం కప్పిపుచ్చుకోవటానికి నన్ను ఎన్నుకున్నావు.

అయితే నీవు చేసిన చిన్న పొరపాటు, దస్తావేజున్న కవరే తీసుకున్నావు గాని, దాంతోబాటు వచ్చిన తక్కిన రెండు కవర్లలో ఒకటి సరోజ తండ్రి పార్వతీశం విడిగా దస్తావేజు పంపుతున్నట్టు రాసిన ఉత్తరమని నీకు తెలి యదు. సరోజ నీకు తెలియదనీ మరో అబద్ధం ఆడావు. అందుకే నందనరావుని అర్జంటుగా పోస్టుమన్ యింటికి పిగ

రెట్ల ప్యాక్ తేవటానికనే సాకుతో పంపించి, నిన్న సరోజ ఫ్లాట్‌లో అతను మూడు ఉత్తరాలు వేసిన విషయం నిర్ధారణ చేసుకున్నాను. నిన్న యీవెనింగ్ పోస్ట్‌లో వచ్చాయి ఉత్తరాలు.

సరోజతో యింత క్రితమే నీకు సంబంధం వుంది. అది పెళ్ళివరకూ వచ్చింది. అందుకే ఆమె తండ్రి నీకు ఆస్తి రాశాడు. ప్రస్తుతం నువు మోహిని ప్రేమలో పడ్డావు. నీకు సరోజ అడ్డమని తలచి ఆమెను హత్యచేసి, ఆస్థి కాజేయాలని చూశావు. కాని నేరం ఎంతకాలమో దాగదు, మైడియర్ ఫ్రెండ్!" అని శిరీష్ అంటూండగానే ఇన్‌స్పెక్టర్ కుమార్ తన బలగంతో చకచక మెట్లెక్కి వచ్చేశాడు.

తర్వాత రాజేష్ నేరం ఒప్పుకుంటూ స్టేటుమెంటు యిచ్చాడు:

తనకు మోహినికీ వున్న సంబంధం సరోజకి తెలిసిపోయినట్టు, తనని కనిపెట్టడానికే సరోజ కావాలని మోహిని వుంటున్న ఫ్లాట్ పక్కనే ఫ్లాట్ అద్దెకు తీసుకున్నట్టు, హత్య జరిగిన రోజు సరోజ తన తండ్రి ఆ రోజు పోస్టులో దస్తావీజులు పంపుతున్నట్టు చెప్పినట్టు అవి యింకా అందకముందే సరోజ ఆఫీసు నించి తిరిగొచ్చి తనతో జగడం వేసుకున్నట్టు, ఆవేశంతో తనామెను వంటగదిలోకి లాక్కుపోయి, మోహినికి తెలీకుండా మెల్లగా మాట్లాడమని సరోజని బతిమాలినా రెచ్చిపోయిందనీ, పక్కనే వున్న పూల కుండీతో కొట్టి స్పృహ తప్పించాలని ప్రయత్నిస్తే సరోజకు అది చావుదెబ్బ అయి చచ్చిపోయిందనీ, దస్తావేజులు చేజిక్కించుకోవటానికే సినిమా నుండి తిరిగొచ్చినపుడు సీటి పైపులుగుండా ఆమె ఫ్లాట్‌లోకి ప్రవేశించి దస్తావేజు చేజిక్కించుకున్నట్టూ—రాజేష్ తెలియజేశాడు.

పొరపాటు ఖరీదు నాలుగు లక్షలు

ప్రతాప రవిశంకర్



త్రారాచంద్ షాపులోనించి బయటకు వచ్చాడు.

సరిగ్గా తొమ్మిది గంటలయ్యింది.

నగల షాపులో దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

నిజానికి అతను ఆ షాపులోనించి బయటకు వస్తున్నప్పుడు ఎవరో ఇద్దరు మనుషులు నగల బేరం చేస్తున్నారు. అతను వాళ్ళు వెళ్ళిపోయే వరకూ వుండి షాపు మూసి బయటపడాలనుకున్నాడు.

కాని—అతని మనసు నిలవలేదు.

అందుకే తను అర్జంటు పనిమీద బయటకు వెళుతున్నాననీ, ఆ కస్టమర్లు వెళ్ళిపోయిన తర్వాత షాపు మూసి తాళం చెవులను ఇంట్లో తన భార్యకు ఇచ్చి వెళ్ళమనీ షాపులో చెప్పి తారాచంద్ బయటపడ్డాడు ఆ నగల షాపులో నించి.

ఇప్పుడు అతను సెంటర్‌దాకా నడిచి అక్కడ ఓ టాక్సీ ఎక్కాడు.

టాక్సీ బయల్దేరింది

కొంచెం పొట్టిగా వుండే తారాచంద్ సీటుమీద వెనక్కు వాలాడు. అతని కళ్ళముందు ఆ యువతి రూపం కదులుతోన్నది.

ఆ యువతి పేరు రూప. ఆమె వయసు ముప్పయి దాటి వుండక పోవచ్చునని తారాచంద్ అనుకున్నాడు. సరిగ్గా ఇరవై రోజుల క్రితం రూప పేరుగల ఆ అందమైన యువతి తారాచంద్ నగల షాపుకు ఒంటరిగానే వచ్చింది.

ఆమెకు ఓ జత బంగారు గాజులు కావాలని అన్నది. మొదటిసారిగా ఆమెను చూసినప్పుడు తారాచంద్ కళ్ళు మెరిశాయి. ఆమె చిరునవ్వు, చొరవ అతనికి ఆమెతో కొంచెం ఎక్కువగా మాట్లాడటానికీ, వెకిలిగా నవ్వటానికీ అవకాశాన్నిచ్చాయి.

ఆ రోజు ఆమె బంగారు గాజులు కొని వెళ్ళిపోయింది. కాని రెండు రోజుల తర్వాత తన స్నేహితులు కొంతమంది ఆ డిజైన్ బాగాలేదని మరో రకం డిజైన్ వున్న గాజు

లయితే తనకు బావుంటాయని చెప్పారనీ—అందువల్ల తను మరో జత గాజులు ఎన్నుకుంటాననీ అన్నది ఆమె—తారాచంద్‌తో.

అతను అందుకు అభ్యంతరం చెప్పలేదు. ఆమె మళ్ళీ తన షాపుకు రావటమే తన అదృష్టంగా అనుకున్నాడు.

ఆ రోజున తారాచంద్ ఆమెతో మాటలు కలిపాడు. ఆమె ఆ మరురోజు సాయంత్రం అతన్ని తన ఇంటికి టీకి రమ్మని ఆహ్వానించింది తన ఎడ్రసు ఇచ్చి.

తారాచంద్ సంతోషంతో వూగిపోయాడు.

మరురోజు తారాచంద్—రూప ఇంటికి వెళ్ళాడు. ఆ ఇంట్లో ఆమె ఒంటరిగా వుంటోన్నది. తను ఏదో ఎలక్ట్రికల్ కంపెనీలో స్టెనోగా పని చేస్తున్నాననీ చెప్పింది.

రూపతో పది నిముషాలు మాట్లాడిన తర్వాత తారాచంద్ చొరవతీసుకున్నాడు. మొదట రూప బిడియపడి దూరంగా వున్నట్టు ప్రవర్తించినా ఆ తర్వాత అతనికి సులభంగా లొంగిపోయింది.

ఆ రాత్రి ఒంటిగంట వరకూ తారాచంద్ రూపతో గడిపాడు. ఆ తర్వాత కొంచెం కష్టంమీద ఇంటి దగ్గర తన కోసం భార్య ఎదురుచూస్తూ వుంటుందని గుర్తుకు వచ్చి రూపను వదిలి వచ్చేశాడు.

అప్పటినించీ దాదాపు రోజూ తారాచంద్ — రూపను కలుసుకుంటూనే వున్నాడు.

ఇప్పుడుకూడా తారాచంద్ ప్రయాణం రూప ఇంటికే.

టాక్సీ ఆగింది.

తారాచంద్ దిగి ఫేర్ ఇచ్చి ముందుకు నడిచాడు.

నిమిషం తర్వాత అతను రూప ముందు నిల్చుని వున్నాడు.

"వచ్చావా డియర్. నీకోసమే ఎదురు చూస్తున్నాను" అన్నది.

"నాకు తెలుసు. అందుకే వచ్చాను" అన్నాడతను ఆమె భుజాలమీద చేతులు వేసి.

2

పన్నెండు గంటలు దాటి పది నిముషాలయ్యింది. వర్షం పడుతోన్నది సన్నగా-ఆ నగల షాపులో తారాచంద్-మరో మనిషి వున్నారు. మిగిలిన ఉద్యోగులు భోజనాలకు వెళ్ళారు వర్షం వస్తుందేమోనని—వాళ్ళు వెళ్ళిపోగానే వర్షం మొదలయ్యింది.

తడుస్తూనే సైకిలుమీద వచ్చాడు పోస్టుమేన్. అతన్ని చూసి కూర్చున్న బల్లమీద నించి లేచి ముందుకు వెళ్ళాడు ఆ మనిషి.

పోస్టుమేన్ ఇచ్చిన కవర్ని తీసుకుని దానిమీది పేరు చూసి ఆ కవర్ని కుషన్ ఛెయిర్‌లో కూర్చుని రూపతో క్రితం రాత్రి తను పొందిన సుఖాన్ని గుర్తు చేసుకుంటున్న తారాచంద్‌కి ఇచ్చాడు.

కవరు చించి అందులో నించి మూడు ఫోటోలు బయటకు తీసిన తారాచంధ్ షర్టు జేబులో బాంబు పేలినట్టు ఉలిక్కిపడ్డాడు.

ఆ ఫోటోల్లో అతను—రూప నగ్నంగా వున్నారు. ఈ ప్రపంచాన్నే మరచిపోయి మరెక్కడో విహరిస్తున్నారు.

బయట వర్షం పడుతున్నా అతనికి వళ్ళంతా చెమట పట్టింది ఒక్క నిముషంలోనే.

ఆ ఫోటోలు ఎవరు తీశారో? ఎలా తీశారో?

తారాచంద్‌కి అర్థం కాలేదు.

రూపతో తనకు వున్న సంబంధం గురించి ఎవ్వరికీ

తెలియదని తారాచంద్ అనుకున్నాడు.

కాని కవర్లో నించి బయటకు వచ్చిన ఆ మూడు ఫోటోలు ఆ ఇద్దరి రహస్య సంబంధాన్ని మరో మనిషి తెలుసు కున్నట్టు తెలియజేస్తున్నాయి.

మతిపోయినట్లనిపించింది తారాచంద్ కి.

ఆ ఫోటోలను చూస్తున్నప్పుడు భయమనిపించినా వాటిల్లో రూప వంటి అందాలను చూస్తుంటే అతని నరాలు పొంగాయి.

వర్షం తగ్గింది.

కొంచెం సేపటి తర్వాత తారాచంద్ ఆలోచనల్లోనించి బయటపడ్డాడు.

వెంటనే అ ఫోటోలను ముక్కలు చేశాడు....చాలా చిన్న ముక్కలు..

ఆ కవర్లో ఫోటోలతో పాటు ఉత్తరం లేకపోవటం తారాచంద్ కి బాగా ఆశ్చర్యాన్ని కలిగించింది.

అతనలా ఆశ్చర్యపడుతున్నప్పుడే ఫోను మోగింది.

వెంటనే రిసీవర్ తీసుకుని "తారాచంద్ ని" అన్నాడు.

"మిస్టర్ తారాచంద్ నేను నీకు అపరిచితుడిని. నా పేరుతో నీకు అవసరంలేదు. నేను పంపిన ఫోటోలు నీకు క్షేమంగా చేరాయనుకుంటాను. ఎలా వున్నాయంటావ్?" అంటూ నవ్వేడు ఫోన్లో మాట్లాడుతున్న అవతలి మనిషి.

ఇప్పుడు వెంటనే తారాచంద్ కి మాటలు రాలేదు.

"మాట్లాడవేం? బాగా వచ్చాయా? నా ఫోటోగ్రఫీ అద్భుతం అని చాలా మంది అంటారు. సరే. ఇక బిజినెస్ లోకి దిగుతాను. ఆ మూడు ఫోటోల విలువ మూడు లక్షలు. అంటే ఫోటోకి లక్షరూపాయలు. చాలా కాస్ట్లీ కదూ" అన్నాడతను ఆపి.

"ఏమిటీ నువ్వనేది? ఒక్కో ఫోటో ఖరీదు లక్ష రూపాయలా?" అన్నాడు కంగారుగా.

"అవును తారాచంద్. అక్షరాలా లక్ష రూపాయలు. నీ శృంగార ఫోటోలకు తక్కువ విలువ కట్టడం నాకు ఇష్టం లేదు. అందుకే ఒక్కో ఫోటో ఖరీదు లక్షరూపాయలు. మూడు లక్షలు ఇస్తే ఫోటోలు వాటి నెగటివ్‌లు నీకు ఇచ్చేస్తాను. ఏమంటావ్?" అన్నాడు.

మూడు ఫోటోలు మూడు లక్షలు అని అతను చెప్పే సరికి తారాచంద్‌కు వణుకు పుట్టింది.

"మూడు లక్షలు నే నివ్వను" అన్నాడతను వెంటనే.

అతను నవ్వాడు.

నవ్వి "మూడు లక్షలకు మూడు రూపాయలు తక్కువ ఐనా ఆ ఫోటోలు నీ భార్యకు నేనే వెళ్ళి అందజేస్తాను. అలా చెయ్యమంటావా?" అనడిగాడు.

ఉలిక్కిపడ్డాడు తారాచంద్. ఫోటోలను తన భార్యకు చూపిస్తే ఏమవుతుందో అతనికి బాగా తెలుసు. తనని బతక నివ్వదు.

తారాచంద్‌కి భార్యంటే భయం.

అందుకే "వద్దు. ఆ పని చెయ్యకు" అన్నాడు.

"ఐతే మూడు లక్షలకు బేరం కుదిరినట్టే....ఇక ఆ డబ్బును ఎలా ఇవ్వాలో చెబుతాను. మూడులక్షల రూపాయ లను తీసుకుని ఈ రాత్రి కూడా రూప ఇంటికి సరిగ్గా పది గంటలప్పుడు వచ్చెయ్యి. అక్కడ నిన్ను నేను కలుసు కుంటాను. ఏమంటావ్?" అన్నాడు.

"నీ యిష్టం. నువ్వు చెప్పినట్టే చేస్తాను. రాత్రి పది గంటలకు ఆ డబ్బుతో నిన్ను కలుసుకుంటాను" అన్నాడు తారాచంద్ చెమటలు కక్కుతూ.

"గుడ్. వెరీ గుడ్...." అని వినిపించింది తారా చంద్‌కి.

ఫోన్ పెట్టేశాడు అతను.

ఒక్కసారిగా ఎన్నో ఆలోచనలు తారాచంద్ మెదడులో గజిబిజిగా కదిలాయి.

ఎవరీ బ్లాక్‌మెయిలర్.

ఆ గదిలో జరిగిన తమ శృంగారాన్ని అంత తేలికగా ఫోటోలు తీయగలిగే అవకాశం అతనికి ఎలా దొరికింది?

ఓ అయిదు నిముషాల తరువాత అతని అనుమానం తీరిపోయింది.

రూప—

అవును. ఇదంతా ఓ ప్లాను ప్రకారం జరిగింది. రూప బ్లాక్‌మెయిలర్ చేతిలో పావు అనుకున్నాడు తారాచంద్.

అతను చేసిన పొరపాటు అర్థమయ్యింది.

ఇలా అనుకున్న తరువాత తారాచంద్ ఆ రాత్రి పది గంటలకు రూప ఇంటికి వెళ్ళలేదు.

3

ఫోన్ మోగింది.

బెడ్ మీద పడుకున్న రేఖ లేచివచ్చి రిసీవర్ తీసుకుని "సురేఖని మాట్లాడుతున్నాను" అన్నది.

"నేను బ్లాక్‌మెయిలర్‌ని....నీకు ఇచ్చిన గంట టైము అయిపోయింది" అన్నాడు అతను.

రేఖకు గుండెలు అదిరాయి.

ఆ బ్లాక్‌మెయిలర్ అంత ప్రాంప్టుగా సరిగ్గా గంట తరువాత ఫోను చేస్తాడని ఆమె అనుకోలేదు.

"నేనింకా ఆలోచించుకోలేదు. నాకు యింకా రెండు గంటలు వ్యవధి కావాలి" అన్నదామె.

నవ్వేడతను.

"రెండు గంటలు వ్యవధి యిస్తే యింకో పాతికవేలు పెంచుతాను....ఇష్టమేనా?" అన్నాడు తరువాత.

"వద్దు. నీ రేటు పెంచకు" అన్నదామె కంగారుగా.

"అందుకే నీకు నష్టం రాకూడదనే చెబుతున్నాను. నేను అడిగిన రేటుకు ఒప్పుకో. లక్షరూపాయలకు అంగీకరించు" అన్నాడు.

"ఒక్క ఫోటో ఖరీదు లక్షరూపాయలా! చాలా ఎక్కువ" అన్నది రేఖ.

అతను మళ్ళీ నవ్వాడు.

"ఫోటో ఖరీదు లక్షరూపాయలు కాదు. నీ జీవితం ఖరీదు. నువ్వు నీ ఎదిరింట్లో వుంటున్న సురేష్‌తో కలిసి వున్నప్పటి ఆ ఫోటోను నీ భర్తకు చూపిస్తే నీ బతుకు ఏమవుతుందో నువ్వు ఆలోచించు. ఇప్పటికయినా ఒప్పుకుంటావా?"

"నువ్వు చెప్పింది నిజమే. కాని లక్షరూపాయలు నా దగ్గర లేవు" అన్నది రేఖ చిన్నగా.

"లక్షరూపాయలు లేకపోయినా ఫరవాలేదు. అదే విలువ చేసే నగలయినా తీసుకుంటాను. ఒప్పుకో" అన్నాడు.

"ఏమో. ఇప్పుడు నేనేమీ ఒప్పుకోలేను. నాకు ఇంకో రెండు గంటలు టైము కావాలి" అన్నది రేఖ.

"ఒక్కసారి నేను పంపిన ఆ ఫోటోను చూసుకో. ఇప్పుడే వొప్పుకుంటావు" అన్నాడతను అదోలా.

"ఆ ఫోటోను ఎప్పుడో చించేశాను. రేపు ఫోన్ చెయ్యి. రెండు గంటల వ్యవధి కూడా నాకు చాలదు" అన్నదామె.

"సరే. నువ్వింతగా అడుగుతున్నావు కాబట్టి నీకు ఒక రోజు వ్యవధి యిస్తున్నాను. లక్షరూపాయలకు నువ్వు ఒప్పుకుంటావనే అనుకుంటాను. మరో విషయం. నీకు మళ్ళీ అలాంటి ఫోటో ఒకటి పంపిస్తాను. తొందరపడి దాన్ని కూడా చించెయ్యకు. ఆ ఫోటో నీ మనసు మారుస్తుంది. ఏమంటావ్?" అన్నాడతను.

రేఖ మాట్లాడకముందే డిస్కనెక్ట్ అయింది అవతలి వైపు.

తన రహస్య ప్రేమాయణం ఓ కెమెరాకు చిక్కుతుందని అది ఫోటో రూపంలో తననిలా వెంటాడుతుందని రేఖ కలలో కూడా వూహించలేదు.

4

"నువ్వు మోసం చేశావు తారాచంద్" అన్నాడు బ్లాక్ మెయిలర్ ఫోన్లో.

"మోసం చెయ్యలేదు. మూడు లక్షలంటే మాటలా?" అన్నాడు తారాచంద్.

"నీలాటి నగల వ్యాపారికి మూడు లక్షలంటే ఎక్కువ కాదని నాకు తెలుసు. అయినా నువ్వు ఆ డబ్బుతో రాత్రి పది గంటలకు నన్ను కలుసుకుంటానని రాలేదు."

"అవును. అంత డబ్బు నా దగ్గరలేదు. నువ్వు నాకు రెండు రోజులు టైమివ్వు" అన్నాడు.

"నువ్వు నిజం చెబుతున్నావని నన్ను నమ్మమంటావా?"

"నమ్మక తప్పదు."

"సరే. నువ్వడిగిన గడువు యిస్తున్నాను. నన్ను మోసంచేసే ప్రయత్నం చేసినట్టు నాకు అనుమానం వచ్చిన వెంటనే ఆ మూడు ఫోటోలను నీ భార్యకు ఇచ్చేస్తాను.

ఏ క్షణంలో ఐనా నన్ను మోసగించే ఆలోచన నీకు వస్తే నీ శృంగార ఫోటోలను ఒకసారి చూసుకో. ఆ ఫోటోలు అటువంటి ఆలోచనలను రానివ్వవు" అన్నాడు అతను.

అందుకు తారాచంద్ "ఆ ఫోటోలను అప్పుడే ముక్కలు చేశాను. ఐనా వాటి అవసరంలేదు" అన్నాడు.

"చించేశావా? సరే నువ్వు అవసరంలేదన్నా రేపు నీకు ఆ ఫోటోలను మళ్ళీ పంపిస్తాను. బై "అని ఫోను పెట్టేశాడు.

5

సాయంత్రం పోస్టులో తారాచంద్‌కు ఓ కవర్ వచ్చింది. అతను ఆ కవర్ని తీసుకుని తన ప్రయివేటు గదిలోకి వెళ్ళాడు ఆ కవర్లో ఏముంటుందో ముందే తెలుసు కాబట్టి-

అతను కవరు చించి ఒకే ఒక్క ఫోటోను బయటకు తీశాడు.

అతని గుండె ఆగినట్లనిపించింది.

అందులో అతని భార్య రేఖ ఎదురింటి సురేష్‌తో వున్నది, ఈ ప్రపంచాన్నే మరచిపోయి.

ఆ ఫోటోని చూస్తుంటే అతని కళ్ళు ఎర్రగా అయి మొహంలో నరాలు పొంగాయి.

ఇన్నాళ్ళు తను భార్య గురించి తెలీక భయపడుతున్నాడు.

కాని—తన భార్య ఇలాంటి మనిషా?

ఐనా ఈ ఫోటోని బ్లాక్‌మెయిలర్ తనకెందుకు పంపించాడు? తనకు తన మూడుఫోటోలను పంపుతానని చెప్పాడు.

అంటే తన ఫోటోలను తన భార్యకు పంపించి వుంటాడు.

ఇలా అనుకున్నా తారాచంద్‌కు భయమనిపించలేదు.

* * *

షాక్ కొట్టినట్టు అనిపించింది రేఖకు. ఎదురుగా మూడు

ఫోటోలు. మూడు ఫోటోల్లో తన భర్త తారాచంద్ మరో స్త్రీతో కలిసి వున్నాడు.

తన ఫోటో పంపుతానని బ్లాక్ మెయిలర్ ఈ ఫోటోలను తనకు ఎందుకు పంపించాడు?

తన భర్త ఫోటోలను తనకు పంపించాడంటే తన ఫోటోని తారాచంద్ కి పంపించి వుంటాడు.

ఇప్పుడు రేఖ భయపడదల్చుకోలేదు. ఎందుకంటే భర్తకు సంబంధించిన మూడు ఫోటోలు తన దగ్గర వున్నాయి.

* * *

ఆ సాయంత్రం ఆరు గంటలప్పుడు బ్లాక్ మెయిలర్ ముందుగా తారాచంద్ కు ఫోన్ చేశాడు.

"ఫోటోలు మళ్ళీ చూసుకున్నావా? మూడు లక్షలు ఇవ్వటానికి ఒప్పుకున్నట్టే కదూ" అనడిగాడు.

"ఒక్క రూపాయికూడా ఇవ్వను. ఆ మూడు ఫోటోలను నా భార్యకు ఇచ్చుకో" అని ఫోన్ పెట్టేశాడు తారాచంద్.

బ్లాక్ మెయిలర్ దెబ్బతిన్నాడు.

తర్వాత రేఖకు ఫోన్ చేసి "ఫోటో అందుకున్నావా రేఖా....ఇక లక్షరూపాయలు ఇస్తున్నట్టే కదూ" అన్నాడు.

"లక్ష కాదు. ఐదు పైసలు కూడా ఇవ్వను....ఆ ఫోటోను నువ్వు నా భర్తకు ఇచ్చుకోవచ్చు....ఐ హేవ్ నో అబ్జెక్షన్" అని డిస్కనెక్ట్ చేసింది.

మరోసారి దెబ్బ తిన్నాడు అతను. వాళ్ళంతా ఈజీగా ఎందుకు మాట్లాడారో బ్లాక్ మెయిలర్ కి తెలీలేదు.

ఎడ్రసు రాసిన కవర్లలో ఒకరి ఫోటోలను మరొకరికి పంపించాడని అతనికి గుర్తుకు రాలేదు.

అతను చేసిన ఒకే ఒక్క పొరపాటు ఖరీదు—నాలుగు లక్షలు. □

ఇమంది రామారావు

నీచసంస్కారం

శారదా వుమెన్స్ కాలేజీ కాంపౌండ్ అంతా విద్యార్థినులతో కిటకిటలాడిపోతోంది. టీచర్స్ అటూ ఇటూ పరుగెడుతూ తమ హడావుడిని వ్యక్తం చేయసాగారు. ప్రిన్స్‌పాల్ రాక కోసం ఎదురుచూడసాగారు. యిలాంటి విషయాల్లో తల దూర్చడానికి అందరికీ భయమే.

శ్రీదేవి చనిపోయింది. కాదు. శ్రీదేవిని ఎవరో బల

వంతంగా హత్య చేశారు, కాలేజి ఆవరణలో. హత్య చేసే ముందు శ్రీదేవిని మానభంగం చేశారు. యింతవరకూ ఆమె చీరపై కనిపించిన రక్తం మరకల్ని చూసి పోల్చుకో గలిగారు.

హెడ్ ఆఫ్ ది ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్ మిస్ కమల కుమారి అపుడే కాలేజీకి వచ్చి, శ్రీదేవి శవాన్ని చూసి ట్రాన్సుడిపోయింది. "మై గాడ్!" అని అరచింది.

"పోలీసులకు ఫోన్ చేశారా?" అంటూ ప్రక్కనే వున్న కొలీగ్ సుజలకుమారిని అడిగింది. లేదన్నట్లు ఆమె పెదవి విరిచేసింది.

"ఏం, ఎందుకని?" అర్థం కానట్లు చూసింది కమల కుమారి.

"ప్రిన్సిపాల్‌గారు వస్తారని ఎదురుచూస్తున్నాం!" అంది సుజలకుమారి.

"అంటే ప్రిన్సిపాల్‌గారు రాకపోతే ఈ రోజంతా ఈ శవాన్ని యిలాగే వుంచేస్తారా? ఏవిటి అర్థంలేకుండా. యిలాంటి ఏక్సిడెంటల్ ఇన్సిడెంట్స్‌లోనూ ఫార్మాలిటీస్ పాటిస్తే ఎలా?" అంటూ వడివడిగా ఆఫీసు రూమ్‌లోకి నడిచింది.

"హలో కాకినాడ ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్!" అంటూ అడిగింది.

"య్యాస్ ప్లీజ్!" అటునుంచి సమాధానం.

"నేను శారదా వుమెన్స్ కాలేజీ ఇంగ్లీషు హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ మాట్లాడుతున్నానండీ. మా కాలేజీ కాంపౌండ్‌లో బి.ఏ. ఫైనలియర్ చదువుతున్న శ్రీదేవి అనే విద్యార్థిన్ని ఎవరో హత్యచేశారు. ఇక్కడ స్టూడెంట్స్ అందరూ చాలా ఆందోళన పడుతున్నారు. దయచేసి మీరు వెంటనే

రావాలి!" అంది.

అయిదు నిముషాల్లో పోలీసు జీపు వచ్చేసింది.

జీపులోంచి ఇన్‌స్పెక్టర్ సురేష్ ముందు దిగాడు. ఆ తరువాత హెడ్‌కానిస్టేబుల్ మరికొందరు కానిస్టేబుల్స్ బిలబిలా దిగారు. అయిదు నిముషాల్లో ఈ వార్త చాలా వరకు ప్రాకింది. ఎక్కడెక్కడి నుండో జనాలు చూడ్డానికి స్కూటర్లలోనూ, రిక్షాల్లో తరలి వస్తున్నారు. శ్రీదేవి అంటే కాలేజీ విద్యార్థినులందరికీ యిష్టమే!

శ్రీదేవి ఆటపాటల్లోనూ, చదువులోనే కాకుండా, సాంస్కృతిక కార్యక్రమాల్లోనుకూడా విరివిగా పాల్గొనేది. శ్రీదేవి ఏవయినా 'నాటిక' ఆర్గనైజ్ చేసి పెర్‌ఫార్మెన్స్ యిచ్చిందంటే, ఆరోజు కాలేజీ స్టాఫ్‌తో సైతం పనులు అన్నీ మరుసటి రోజుకి వాయిదా వేసుకుంటూ ఎటెండవుతారు. అందరూ శ్రీదేవి అందాన్ని, ఆమెలోని యితర ఆకర్షణలనీ, మంచితనాన్ని బేరీజు వేసుకుంటూ గుసగుసలాడుకొంటున్నారు.

ఇన్‌స్పెక్టర్ సురేష్ శ్రీదేవి శవం దగ్గరకు వెళ్ళి పరిశీలనగా చూడసాగాడు.

జనం కాస్సేపు నిశ్శబ్దంగా ఉక్కిరిబిక్కిరయ్యారు. పెదవుల చివరికంటూ వచ్చిన మాటల్ని బలవంతంగా నొక్కిపెట్టుకుంటున్నారు.

శ్రీదేవి వయసు ఇరవై సంవత్సరాలు వుంటాయి.

మనిషి మంచి బింకంగా పిటపిటలాడుతోంది. అజంతా శిల్పంలోని అవయవ సంపదంతా శ్రీదేవి సొంతం చేసుకుందేమో అనిపిస్తుంది.

హత్య జరిగే ముందు చాలా సేపు పెనుగులాడిన ఛాయలు కనిపిస్తున్నాయి. జాకెట్ వెనుక హూక్స్ అన్నీ సొంతం

వూడిపోయి వున్నాయి. తెల్ల జాకెట్, తెల్లటి ఆర్గండీ చీర కట్టివుంది. చీర సగం చెదిరిపోయి వుంది. చీరకు రక్తం మరకలు వున్నాయి.

శ్రీదేవి దగ్గరగా కూర్చుని పరిశీలించసాగాడు. సెంటు వాసన వస్తోంది. తనకూ అప్పుడప్పుడూ సెంటు వాడే అల వాటు వుంది గనుక అది ఇంటిమేట్ సెంట్ అని తేలిగ్గా గుర్తుపట్టగలిగాడు. ఆమె చీర కుచ్చెళ్ళు పెట్టుకున్న చోట బూటుకాలి పిడప ముద్రలు వున్నాయి. అంటే చాలా ధారుణంగా చంపి వుండాలి. ఆమెను చంపిన పద్ధతిని ఊహించుకుంటే ఇన్స్పెక్టర్ సురేష్కి ఆవేశం కట్టలు త్రెంచుకు పరుగెత్తింది.

శ్రీదేవి నోట్లో ఏదో వున్నట్లనిపించింది. గ్లవ్స్ తొడు క్కొని ఆమె నోరు తెరిచాడు. నోటిలో ఒక వుంగరం వుంది. అది ఆమె ప్రాణాలు వదిలే ముందు హంతకుడి ఆధారాలు బయటికి తెలియడం కోసం భద్రపరచబడిందని స్పష్టంగా తెలుస్తోంది. శ్రీదేవి తెలివితేటలకు లోలోపలే ప్రశంసించకుండా వుండలేక పోయాడు. ఉంగరం మీద ఎల్.ఐ.సి. బిల్డింగ్ 'డి' అనే లెటరు వుంది. ఆమె మెడ లోని గొలుసుమీద కూడా అదే డిజైను వుంది.

"రాత్రిళ్ళు కాలేజీ కాంపౌండ్కి గేటు వెయ్యరా!" కమలకుమారికేసి చూస్తూ గంభీరంగా అడిగాడు.

కమలకుమారి వెంటనే మాట్లాడ్డానికి తడబడింది. "గేటు చాలాసార్లు వేయించామండీ....అదిగో చూడండి. ఎదురుగా 'రామకృష్ణ జూనియర్ కాలేజీ' వుంది చూశారూ. అక్కడి బాయ్స్ చాలా రౌడీలు. అల్లరిమూక మొన్న మా కాలేజీ వార్షికోత్సవాల సందర్భంగా పెద్ద అల్లరి చేసి గేట్లు విర

గ్గొట్టారు. కొత్త గేట్లు ఈసారి ఐరన్‌వి చేయించాలని తీర్మానించుకొని ఆర్డరు యిచ్చాం. రేపో మాపో వస్తాయి గేట్లు" అంటూ చెప్పింది.

"శ్రీదేవి తల్లిదండ్రులకు కబురు చేశారా?" సురేష్ ప్రశ్న.

"కబురు చేశాం. ఔటాఫ్ స్టేషనట" బాధను వ్యక్తం చేసిందామె.

"ఎక్కడికి వెళ్ళారో తెలుసుకొని లైటెనింగ్ కాల్ చేయలేక పోయారా?"

"ఆ ప్రయత్నంలోనే వున్నాం!" అంది కమలకుమారి.

"శ్రీదేవికి థిక్కెస్ట్ ఫ్రండు ఎవరు?" అంటూ స్టూడెంట్స్‌కేసి చూస్తూ అడిగాడు.

"సులోచన!" అని చెప్పింది కమలకుమారి.

"కాదు. త్రిపుర!" అంది సుజలకుమారి.

"ఊహూ. సుహాసిని — సుహాసిని గురించి శ్రీదేవికి చాలా మంచి అభిప్రాయం వుంది సుహాసిని గురించి తను ఒక పాటకూడా యింగ్లీషులో రాసి నాకు చూపించింది!" అని చెప్పింది కమలకుమారి.

"సుహాసిని కాలేజీకి వచ్చిందా?" స్టూడెంట్స్‌ని ప్రశ్నించాడు. అందరూ ఒకరి మొహాలు ఒకరు చూశారు.

అప్పుడే స్కూటరుమీద సుహాసినిని తన అన్నయ్య 'దక్షిణామూర్తి' డ్రాప్‌చేశాడు. సుహాసినికి శ్రీదేవిని ఎవరో హత్య చేసినట్లు దార్లో తెలిసిందట. కంగారుగా స్కూటరు దిగింది. శ్రీదేవి శవం దగ్గరికి పరుగెత్తుకొంటూ వచ్చింది.

శ్రీదేవి శవాన్ని చూసింది. "దేవీ!" అంటూ గొల్లు మంది.

2

డోంట్ వర్రీ సార్! మీరూ బరస్ట్ అయితే ప్రయోజనం లేదు. వియ్ విల్ ఫ్రెండ్ అవుట్ దట్ బగ్గర్!" అంటూ శ్రీదేవి తండ్రి దశరథరామయ్యకు ధైర్యం చెప్పేడు ఇన్‌స్పెక్టర్ సురేష్. శ్రీదేవి తల్లి లక్ష్మి నోట్లో పైట కుక్కుకుంది. బలవంతంగా దుఃఖాన్ని కంట్రోల్ చేసుకుంటుంది.

"మీరు అనుమానం పడకుండా నేనడిగిన వాటన్నికీ సమాధానం చెప్పాలి! మీ మనసులో ఏదీ దాచుకోకూడదు. మీ అమ్మాయి ఎవర్నయినా ప్రేమించిందా?" అనడిగాడు.

దశరథరామయ్య కొంచెం ముందుకు జరిగాడు.

"నాకు తెలిసి మా అమ్మాయి ఎవర్ని ప్రేమించలేదండీ!" అన్నాడు దశరథరామయ్య.

"మీకు తెలియకపోవచ్చు. మీ శ్రీమతికి తెలియొచ్చు కదా!"

"లేదండీ... శ్రీదేవి నాకంటే తండ్రితోనే ఎక్కువ చనువుగా వుంటుంది" అంది శ్రీదేవి తల్లి.

"అవునండి. నేనెప్పుడో చెప్పేను. దేవీ! నువ్వు వయసొచ్చిన పిల్లవి. అందమయిన పిల్లవి. నీమీద ఎందరో మనసు పడి ప్రేమ కబుర్లు చెప్పొచ్చు. వాటి గురించి నువ్వు ఆలోచించుకోకు. నాతోనూ ప్రస్తావించకు! ఒకవేళ మన అదృష్టంకొద్దీ నీకెవరయినా యోగ్యుడు, మంచివాడు, నీ మనసు దోచినవాడు అనిపిస్తే....నువ్వు నిజంగా ఎవర్నయినా ప్రేమిస్తే అతడ్ని గురించి చెప్పు! అతడ్ని నీకిచ్చి పెళ్ళి జరిపిస్తాను. నేను కేవలం నీ పెళ్ళి గురించి నీకు యిష్టమయిన వారితో కాపురం చేస్తుంటే తనివితీరా

చూడటం గురించీ బ్రతికున్నానమ్మా అని ఎన్నోసార్లు చెప్పేనండీ. అయినా నవ్వేసి ఊరుకొనేది."

అతని కళ్ళల్లో గిర్రున నీరు తిరిగి బొటబొటా రాలి పోయింది. మొహం చాటుచేసుకొని హాండ్ కర్చీఫ్‌తో కళ్ళు వొత్తుకున్నాడు.

3

సుహాసిని యింకా, శ్రీదేవి మరణం విషయంలో తిన్న షాక్‌నుంచి తేరుకోలేదు ఈ నాలుగు రోజుల్లోనూ సుహాసిని బాగా నీరసించిపోయింది. ఖాకీ దుస్తులు కళ్ళముందు కనిపించగానే కంగారుపడుతూ లేచి నిలబడి నమస్కరించింది.

సురేష్ హుందాగా ప్రవేశించాడు. కేప్ తీసి సోఫాలో పెట్టి కూర్చున్నాడు.

"ఏవిటి యిలా వచ్చారు....ఏదయినా పనిమీద...." తడబడుతూ ప్రశ్నించింది సుహాసిని.

"అవును. నీతోనే పనుంది. శ్రీదేవిని గురించి కొన్ని వివరాలు కావాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అడగండి సార్! 'దేవి'కి నాకూ మధ్య ఎలాంటి అలమరికలూ లేవు. యింత తొందరగా నా దేవి నన్ను విడిచి వెళుతుందనుకోలేదు. అసలు ఈ జన్మలోనే కాదు. జన్మ జన్మలకూ మేము యిద్దరమూ కలిసే వుంటాం అని ఎన్నో కలలు గన్నాం!" అంది. సుహాసిని కళ్ళు చెమర్చాయి.

"గుడ్: యిద్దరు స్నేహితురాళ్ళ మధ్య యింత మంచి అవగాహన వుండటం నిజంగా గర్వించదగిందే—అయితే, అనుకోనివి తలవని తలంపుగా జరిగినపుడే మనిషి 'జీవితం' గురించి లోతుగా ఆలోచించేది. ఇట్స్ ఆల్‌రయిట్ చెప్పండి.

శ్రీదేవి ఎవర్నయినా ప్రేమించిందా?" సుహాసిని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"ప్రేమించిందండీ!" అంది తలదించుకొని.

"ఎవర్ని?"

"దినేశ్ అనే అబ్బాయిని!"

"అతను ఏం చేస్తున్నాడు."

"ప్రస్తుతం ఏమీ చెయ్యడం లేదు. బి.కాం. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. పత్రికల్లో కథలూ, నవలలూ రాస్తుంటాడు. మనిషి చాలా మంచివాడు!" అంది.

"యిపుడెక్కడుంటున్నాడు?"

"పాత ఆస్పత్రి వీధి జగన్నాధపురంలో."

"ఆయనకీ ఈమెకీ మధ్య గొడవలేమయినా వచ్చాయా?"

"అబ్బే. అసలు వారిద్దరికీ ఒకరిపట్ల ఒకరికి యిష్టమే తప్ప....తరచూ కలుసుకోరండీ. పెళ్ళంటూ జరిగితే ఒకర్నొకరు పెళ్ళి చేసుకుందామనుకున్నారు!"

"ఆ విషయం మీకెలా తెలుసు. వారిద్దరూ మీ సమక్షంలో మాట్లాడుకున్నారా?"

"అవును!"

"ఎక్కడ?"

"గాంధీ నగరం పార్కులో."

"మాటలవరకేనా యింకేమయినా అడ్వాన్స్ అయ్యారా?"

"లేదండీ....భగవంతుడి సాక్షిగా ఆయనలాంటి వారు కాదు. చాలా మంచివాడు" అంది.

సురేష్ కాస్సేపు ఆలోచనల్లో పడ్డాడు. శ్రీదేవి మింగిన ఉంగరం మీద 'డి' అనే లెటరుంది. 'డి' అంటే 'దినేశ్'

అనా? దినేశ్ ప్రెజెంట్ చేసిన ఉంగరాన్ని తను ప్రాణాలు వదులుతున్నానని తెలిసి మింగడానికి ప్రయత్నించిందా? హంతకుడి ఆచూకీ తెలపడానికి పెనుగులాటలో హంతకుడి చేతి వ్రేలి ఉంగరం కాజేసి, అతనికి కనపడకుండా దాచిందా? ఈ ఉంగరం హంతకుడిదా? ప్రియుడిదా? మస్తిష్కంలో ఆలోచనలు పోటీపడసాగాయి. ఇంతలో బయట ఏదో స్కూటరు ఆగిన చప్పుడు వినిపించింది.

ఆ రోజు కాలేజీ కాంపౌండ్ దగ్గర సుహాసినిని డ్రాప్ చేసి వెళ్ళిన యువకుడు.

"మీ అన్నయ్యా!" అంటూ అతడ్ని పరిశీలనగా చూడ సాగాడు.

సుహాసిని అవునన్నట్లు తలూపింది.

"పేరు?"

"దక్షిణామూర్తి సార్?" అన్నాడు, వినయంగా సుహాసిని పక్కనే నిలబడుతూ.

"యింట్లో మీ రిద్దరే వుంటున్నారా?"

"లేదండీ. మమ్మీ డాడీ సర్పవరం వెళ్ళారు పొలాల్ని చూడ్డాని కని!" అన్నాడు దక్షిణామూర్తి.

"ఇక మీరు వెళ్ళండి!" అన్నాడు. దక్షిణామూర్తి మేడ మెట్లు హుషారుగా ఎక్కి వెళ్ళాడు.

"మీ అన్నయ్యగారు ఎప్పుడయినా ఆమెను ప్రేమించి నట్లు చెప్పేడా?"

"లేదండీ. అన్నయ్యకు అలాంటి ఆలోచనలు రావు!"

"ఎలా చెప్పగలరు!"

"అన్నయ్య బి.యస్సీ. చదువుతున్నాడు. తనూ తన చదువు ప్రపంచమే మిగతా ప్రపంచం గురించి పట్టించు కోడు."

"ఆ రోజు స్కూటరు మీద చెల్లెల్ని డ్రాప్ చేసి ఎంత గందరగోళం జరుగుతున్నా పట్టించుకోకుండా వెళ్ళి పోయాడు అతను.

ఒక చెయిను తీసి చూపించాడు సురేష్.

సుహాసిని పరిశీలనగా చూసింది. అదే యల్.ఐ.సి. బిల్డింగ్ మీద 'డి' అన్న అక్షరం చెయిన్ చివర అందంగా డిజైన్ చేయబడి వుంది. యిది ఎప్పుడో ఎవరో యివ్వడం తను చూసినట్లు గుర్తు. తల గోక్కుంది. సరిగ్గా గుర్తుకు రావడం లేదు.

"ఏవిటి ఆలోచిస్తున్నారు?"

"ఆలోచనలోంచి తేరుకుని "ఈ ప్రెజెంటేషను అదే. అదే దురానీగారు యిచ్చిందే" అంది సుహాసిని.

"దురానీ రామకృష్ణ జూనియర్ కాలేజీలో చదువు తున్నాడా? అనడిగాడు.

"అవును!"

"ఏం చదువుతున్నాడు!"

"ఇంటర్ సెకండ్ ఇయర్!" అంది. సురేష్ లేచాడు.

4

రామకృష్ణ కాలేజీకేసి జీపు కదిలింది—కాలేజి ప్రిన్సిపాల్ రూమ్‌కేసి ప్రవేశించగానే ప్రిన్సిపాల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌ని సాదరంగా ఆహ్వానించాడు. కుర్చీలో కూర్చున్నాడు సురేష్.

"ఏమిటిలా వచ్చారు?" అనడిగాడు.

"మీ కాలేజీలో చదువుతున్న దురానీ అనే అబ్బాయిని గురించి మీరు కొంత ఇన్‌ఫర్మేషను యివ్వాలి!" అన్నాడు సురేష్.

"ఆల్ రైట్. అలాగే. దురానీ మంచి నటుడుగా నాకు

తెలుసు. బాగా స్థితిపరులు. చదువు విషయంలో బాగా పూర్. అందువలన యింత వయసు వచ్చినా యింకా 'ఇంటర్' పాసవ్వలేదు!" అని చెప్పేడు.

"దురానీకి కాలేజీ పాలిటిక్స్‌లో పాల్గొనే అలవాటుందా?"

"అలవాటు లేదనుకోండి. దురానీ అంటే సహజంగా స్టూడెంట్స్, స్టాఫ్ అందరం లైక్ చేస్తాం. మనిషి సాఫ్ట్‌గా వుంటాడు. ఎవరికీ ఏ హానీ చెయ్యడు. చేతనయినంత వరకూ ఉపకారం చెయ్యడం తప్ప. పిలిపించమంటారా?" అనడిగాడు ప్రిన్సిపాల్.

"పిలిపించండి!" అన్నాడు. రెండు నిముషాల్లో దురానీ వచ్చాడు. 'దయచేసి మీరు నాతో ఒక అరగంట సేపు వస్తారా?" విత్ యువర్ ప్రిన్సిపాల్ పెర్మిషన్!" అని అడిగాడు.

దురానీ ప్రిన్సిపాల్‌కేసి చూశాడు. ప్రిన్సిపాల్ వెళ్ళమన్నట్లు రెస్పాన్స్ యిచ్చాడు. 'దురానీ' ఇన్‌స్పెక్టర్ సురేష్ వెంట బయలుదేరాడు. జీపు ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డుకేసి పరుగుతీస్తోంది.

దురానీ సెంటు వాడతాడు. ఇంటిమేట్ సెంట్ అని స్పష్టమవుతుంది. ఖరీదయిన డ్రస్సు. మెడలో చెయిను వ్రేలాడుతోంది. ఆ చెయిను మీద ఎల్.ఐ.సి. బిల్డింగ్ 'డి' అనే అక్షరం వుంది. సురేష్ గతుక్కుమన్నాడు. వ్రేలి ఉంగరం చూశాడు. ఉంగరానిక్కూడా సేమ్ డిజైన్ వుంది. సురేష్ కళ్ళు మెరిశాయి.

'నార్త్ స్టార్' షూ వేసుకున్నాడు. 'శ్రీదేవి' దగ్గర దొరికిన ఆధారాలన్నీ దురానీ దగ్గర వున్నాయి. జీపు సడన్‌గా ఆగింది.

"ఊం దురానీగారూ చెప్పండి. శ్రీదేవి మీకు తెలుసా?"

"తెలుసు?"

"ఎలా తెలుసు?"

"ఒక మంచి నటిగా తెలుసు!"

"మీ మధ్య ఎలాంటి పరిచయముంది?"

"పెద్ద పరిచయమేం లేదు. ఒకసారి అరకులోయ పిక్నిక్ పెళ్ళినప్పుడు నేను గిరిజన యువకుడుగానూ, ఆమె గిరిజన యువతిగానూ కలిసి నటించాం."

"కలిసి నటించారా?"

"లేదు. వేరు వేరుగా నటించాం. ముందు నేనూ, తరువాత తనూ పెర్ఫార్మెన్స్ యిచ్చాం. ఇద్దరి నటన బావుందని అందరూ ప్రశంసించారు. టు బి ఫ్రాంక్ ఆమె 'నటన' ముందు నేను బడాదూర్. అందుకే ఆమెను అభినందిస్తూ, నా జ్ఞాపకచిహ్నంగా నాకు ఆమె ప్రదర్శించిన నటన పట్ల ఆరాధనకు చిహ్నంగా ఒక చెయిను ఇచ్చాను."

"ఇదేనా? అంటూ ఛెయిను తీసి చూపించాడు" సురేష్.

"అవును!" కాస్సేపు పరిశీలనగా చూశాక అన్నాడు.

"ఈ ఉంగరం కూడా మీరే యిచ్చారా?" అంటూ చూపించాడు.

దురానీ ఆ ఉంగరం పరిశీలనగా చూశాడు. "అచ్చు నా ఉంగరంలా వుందే!" అన్నాడు.

"ఏం! మీ ఉంగరం కాదా?"

"కాదు!"

"ఏం. ఇది ఆమెకు ప్రెజెంట్ చేయలేదా?"

"లేదు!"

"పోనీ ఆమెను బలవంతంచేసి అనుభవించడానికి

ప్రయత్నిస్తుండగా మీ చేతిలోంచి ఆమె చేజిక్కించుకో వచ్చు కదా!"

"నో....నో ఇన్‌స్పెక్టర్ యు ఆర్ అప్‌సెల్యూట్లీ రాంగ్" అంటూ అసహనంగా అరిచాడు.

"ఏం! ఎందుకని?"

"ఆమెపట్ల నాకు ప్రత్యేకమయిన ఆరాధన భావం వుంది."

"ప్రతి ఒక్కరి జీవితంలోనూ ముందు ఆరాధన భావంతోనే 'ప్రేమ' స్టార్టవుతుంది. తరువాత ప్రేమ 'పిచ్చి'గా మారుతుంది. పిచ్చి సెక్సుగా మారుతుంది. సెక్సుకు కళ్ళుండవు. కామతృష్ణ తీర్చుకోవడంకోసం ఎంతటి పనికయినా వెనుకంజ వేయరు. అలాంటి బల వత్తరమయిన కారణాలుంటేనే హత్యలు జరుగుతాయి. ఈ హత్య కూడా అలాగే జరిగింది!" అంటూ గుక్క తిప్పుకోకుండా, ఎదుటి మనిషికి ఊపిరాడకుండా మాట్లా డేడు ఇన్‌స్పెక్టర్ సురేష్.

ధరానీ తల తిరిగిపోయింది.

"సార్! మీకు నిజం ఎలాచెప్పాలో అర్థం కావడంలేదు. అసలు శ్రీదేవిని శారీరకంగా అనుభవించాలనుకుంటే, ఇంత దూరం రానవసరంలేదు. నాతో ఆమె చాలా ఆత్మీయ తాను రాగాలతో ప్రవర్తిస్తుంది. నా మాటపట్ల కావలసినంత గౌరవం వుంది. ఆమెతో నేను మాట్లాడిన సంఘటనలు చాలా తక్కువ. తారసపడినా నేనే తుదించుకుంటాను. నా మార్గాన నేను పోతాను.

ఒకవేళ శ్రీదేవి నా వలనే హత్య గావించబడింది అని నిజంగా మీరనుకుంటుంటే ఆ నిందను భరించేకంటే 'ఉరి శిక్ష' అనుభవించడంలో తృప్తి. మీ ఇష్టమొచ్చిన శిక్ష

విధించండి ఇన్‌స్పెక్టర్!" అంటూ చేతులు ముందుకు చాపేడు.

దురానీ గొంతు జీరవోయింది అతని కళ్ళ ఎరుపు లోంచి కన్నీళ్ళు సుడులు సుడులుగా తిరిగి వెలికి వస్తున్నాయి

ఇన్స్పెక్టర్ సురేష్ క్షణం పరిశీనలగా చూశాడు దురానీని. మొహంలో ప్రశాంతత కొట్టొచ్చినట్లు కనపడు తుంది.

5

రాత్రి పన్నెండున్నర దాటింది.

సెకండ్ షో విడిచిపెట్టే సమయం. జగన్నాథపురం పాత అసువీధిలో దినేశ్ రూంలో లైటు మండుతోంది. దినేశ్ సిల్కులాల్చి, సిల్కు లుంగీలో వున్నాడు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ ఒక పేడ్ ముందర వేసుకొని, ఏదో కథ రాసుకుపోతున్నాడు.

"దినేశ్!" అంటూ పిలిచింది సుహాసిని. సుహాసిని కంగారు కంగారుగా పరుగెత్తుకు వస్తోంది ఎక్కడ్నుంచో. ఆమె వస్తోన్న చప్పుడు 'దినేశ్' తన సీరియస్ ఆలోచన ల్నుండి డ్రవర్ట్ అయ్యాడు.

తలుపులు తీసి క్షణం ఆశ్చర్యంతో మునిగిపోయాడు. సుహాసిని మొహం చెమటలు పట్టి జిడ్డుగా వుంది. ఆమె జుత్తు చెదిరిపోయి వుంది. పెదవులు వొణుకుతున్నాయి.

"వాట్ ....వాట్ ఈజ్ దిస్ సుహాసినిగారూ!" అంటూ కుర్చీ చూపించాడు కూర్చోమన్నట్టు సైగ చేస్తూ.

"థాంక్యూ. ముందు తలుపులు మూసెయ్యండి. ఈ రాత్రికి నాకు మీ రక్షణ కావాలి. మీ నీడలో నన్ను తెల్ల వార్లూ వుండనివ్వండి. నన్నొకడు తరుముకు వస్తున్నాడు"

అంది భయం భయంగా వెనక్కి తిరిగి చూస్తూ.

వెనుక యెవరో పెద్ద పెద్ద అంగలేస్తూ పరుగెత్తు కొంటూ వచ్చిన చప్పుడు వినిపించింది. వెంటనే దినేశ్ లైట్లు ఆర్పేశాడు.

దినేశ్ రూమ్ రోడ్‌కి సమీపంలోనే వుంది. లైటు ఆరి పోయేసరికి యెవరికీ ఏదీ కనిపించదు. బయట ఎవరు వచ్చి పోయేదీ స్పష్టంగా తెలుస్తోంది. సుహాసిని భయంతో వొణికిపోతుంది. ఆమె చేతిలో చిన్న సంచి వుంది.

"భయపడకండి. నేనున్నానుగా!" అంటూ ఆమెను దగ్గరగా తీసుకొని చెవిలో అన్నాడు.

"ఏమో. తెల్లారేలోగా నేనేమవుతానో భయంగా వుంది!" అంది తగ్గు స్థాయిలో.

"నథింగ్ వర్రీ" అంటుండగా ఆ రోడ్ మీదకు దురానీ, అతని ఫ్రండ్స్ పరుగు పరుగున వచ్చారు.

"ఎక్కడికి పోయిందిరా!" అన్నాడు దురానీ క్రూరంగా.

"ఏమోరా. అటే పోయింది!" యింకొకడు.

"నా కళ్ళను కప్పి పారిపోయింది. దీనికీ దీని ఫ్రండుకు పట్టిన గతి పడుతుంది. డర్టీరోగ్....నా రహస్యం తన కొక్కదానికే తెలుసు. ఈ రహస్యం పోలీసుల చెవికి చేరేలోగా దాన్ని స్వర్గానికి చేరుస్తాను!" అన్నాడు దురానీ.

దురానీ తాగినట్లున్నాడు. మాటలు జీరపోతున్నాయి— నత్తిగా వస్తున్నాయి.

"డామిట్! డ్రంకర్ట్!" కసిగా తిట్టుకున్నాడు దినేశ్ లోలోపలే.

"గురూ! మనం పోదాం రా గురూ!" అంటూ దురానీని పిలిచాడు మరొకడు.

ఇంతలో వెనకమూరుగా పోలీసు జీపు వచ్చింది. అంతే! వెనక్కి తిరిగి పారిపోయారు.

"రోగ్స్ మంచి పనే జరిగింది!" అన్నాడు దినేశ్.

"ఏం జరిగింది?" అనడిగింది సుహాసిని అతని చెవిలో. ఒకరికొకరు కనిపించడం తెలీదు. సుహాసిని అతని రెండు చేతులూ గట్టిగా బంధించేశాయ్.

"పోలీస్ జీప్ వచ్చింది!" అన్నాడు.

"పోలీస్ జీపా?" అంటూ కంగారుపడింది.

"భయపడకులే. వచ్చి వెళ్ళిపోయింది!" అన్నాడు నవ్వుతూ.

"హమ్మయ్య! పోలీసులనేసరికి పై ప్రాణాలు పైనే పోయాయి. లైటు వేయండి!" అంది సుహాసిని. దినేశ్ నవ్వాడు. సుహాసిని కూడా నవ్వుతూ శృతి కలిపింది.

"వద్దు! దురానీ మళ్ళీ యిటే రావచ్చు. నీకేం భయం లేదు. లైటు లేకపోయినా నిశ్చింతగా వుండొచ్చు!" అన్నాడు దినేశ్. మరింత దగ్గరకు తీసుకొంటూ.

సుహాసిని కిలకిలా నవ్వింది. ఆమె నవ్వు అతన్ని గిలిగింతలు పెట్టింది.

"య్యస్. దురానీ నిన్నెందుకు తరుముకొస్తున్నాడు?" దినేశ్ ఆసక్తిగా అడిగాడు.

"తన రహస్యం బయట పెడతానని భయంచేత?"

"ఏవిటా రహస్యం!"

"దురానీ శ్రీదేవిని ప్రేమించాడు. ఆమెకో ఛెయిను కూడా బహుమతిగా యిచ్చాడు. ఈ మధ్యనే ఆమెను కలిసి తన ప్రేమను వ్యక్తం చేసి, బీచ్‌కి రమ్మని అడిగాడు.

"శ్రీదేవి ఒప్పుకుందా?" దినేశ్‌లో ఆత్రుత పెరుగు

తోంది.

"ఉహూ. నేను శ్రీదేవి యిద్దరం కలిసి వెళ్ళాం. దురానీ అక్కడ విలువయిన పార్టీ ఎరేంజ్ చేశాడు. దురానీ లిక్కర్స్ కూడా తీసుకుంటాడని అప్పుడే తెలిసింది. శ్రీదేవి అసహ్యించుకుంది. తన కోరికను వ్యక్త పరిచాడు. చీదరించుకుంది. అసలు అక్కడే మొదలయింది క్లాష్" అంది సుహాసిని.

"ఏమిటి నువ్వు చెబుతుంది నిజమేనా?"

"అసలు శ్రీదేవి నా ఫ్రెండని మీరు ఒప్పుకుంటారా?"

"నో డవుట్ హి ఈజ్ యువర్ బెస్ట్ ఫ్రెండ్" అన్నాడు.

"అయితే నిజం చెబుతున్నాను నమ్మండి!" అంది అతని చేతిని దగ్గరకు లాక్కొని. అతని చేతిలో తను చెయ్యి వేసింది నిజం అన్నట్లుగా గిల్లింది.

దినేశ్ వేడి నిట్టూర్పులు విడిచాడు.

అతని శరీరం సలసలా కాగిపోతుంది.

పళ్ళు పటపట కొరికాడు. "డర్టీరోగ్స్. ప్రేమించాననడం మోసం చేయడం. పరాయి మగవాళ్ళతో తిరగడం అలవాటయిపోయింది ఈ నాడు లేడీస్‌కి. అందుకే సరైన శిక్ష విధించాడు ఆ భగవంతుడు ఆమెకు!" అన్నాడు.

"అనవసరంగా మిమ్మల్ని రెచ్చగొట్టాను. సారీ!" అంది అతన్ని కూల్‌చేస్తూ. ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. ఆమె కిలకిలా నవ్వింది. ఆమె నవ్వులో శతకోటి వీణలు ఒకేసారి మీటినట్లనిపించింది.

"లవ్‌లీ లాఫింగ్!" అన్నాడు.

"నిజంగా మీ అంత మంచివారిని అంత మోసం చేస్తుందనుకోలేదండీ. అసలు శ్రీదేవి మిమ్మల్ని పెళ్ళి

కూడా చేసుకుంటానని చెప్పింది కదండీ!" అంది అతని పిల్కు లాల్చిలోంచి 'ఇంటిమేట్ సెంట్' వాసన్ని పీలుస్తూ.

"అదే. అదే. నాకూ అర్థం కాలేను. ప్రేమించానంది. పెళ్ళి చేసుకుంటానంది. నాకు మనసు ఇచ్చినట్టే యిచ్చి పరొకరికేసి డైవర్ట్ అయింది. ఆ రోగ్ దురానీగాడ్ని లైక్ చేసింది. వాడేదో ఆరాధిస్తున్నాను, గుళ్ళో దేవతలా పూజ చేస్తున్నానూ అంటే వాడి వేషాలు, నటనా చూసి మోసపోయి, గ్రీన్ సిగ్నల్ యిచ్చింది. అప్పుడే నా బ్రెయిన్‌లో రెడ్ బల్బ వెలిగింది!" అన్నాడు కసిగా.

"అయినా మీ ముందు వాడికేముందని. అందమా! చదువా! భవిష్యత్తా రేపు మీకు ఉద్యోగం వస్తే లక్షలకు లక్షలు సంపాదిస్తారు!"

ఆ మాటే చెప్పేను సుహాసినీ, అయినా వినిపించుకో లేదు. నన్ను ప్రేమించినట్టే ప్రేమించి తెలివిగా 'చిత్ర హింస' చెయ్యాలనుకుంది. నేను 'చిత్రహింస చేసి' చూపించాను. ఐ కిల్ హెర్!" అంటూ పగలబడి నవ్వాడు.

"గుడ్—వెల్ డిసిసిన్. నా ఆలోచనలూ అలాగే వుంటాయి. నన్ను ప్రేమించిన వ్యక్తి, నన్ను అభిమా నించే వ్యక్తి పరొకర్ని ఇష్టపడినట్లు తెలిస్తే మండిపడ తాను. గొంతు నులిమి చంపాలనిపిస్తుంది. చంపేస్తానేమో కూడా!" అంది ఉక్రోషంగా. సుహాసిని వేడి నిట్టూర్పులు విడుస్తోంది.

"గుడ్ యు ఆర్....యు ఆర్ సూటబుల్ పర్సన్ ఫర్ మీ! అంటూ దగ్గరకు లాగి ముద్దు పెట్టుకోబోయాడు.

తప్పుకుంది.

"ఇప్పుడే వద్దండీ" అంటూ మారాం చేసింది.

"ఇదిగో అక్కడే ఒళ్ళు మండుతుంది. ప్రేమించానంటారు. పెళ్ళి చేసుకోడానికి సిద్ధమేనంటారు అక్కడికి వచ్చేసరికి తప్పించుకుంటారెందుకని? నో. ఇప్పుడు నన్ను కాదనడానికి వీల్లేదు. లేకపోతే నిన్ను సస్పెక్ట్ చేయాల్సొస్తుంది!" అంటూ పైనపడ్డాడు.

"నో దినేశ్ అండర్‌స్టాండ్ మీ ప్రాపర్లీ!" అంటూ రిక్వెస్ట్ చేసింది.

బలవంతంగా ఆమె చీరలాగాడు. ఆమె అవరబోయింది. అరవనివ్వకుండా చేశాడు. గింజుకుంటుంది.

శక్తినంతటినీ కూడదీసుకొని "హెల్ప్" అరిచింది సుహాసిని.

పోలీసులు తలుపుల్ని బలవంతంగా ఊడపీకేరు. హెడ్ టార్చ్‌లైటు దినేశ్ మొహంమీద పడింది.

దినేశ్ మొహంలో నెత్తురు చుక్కయినా లేదు. దురానీ అతని ఫ్రండ్సూ పోలీసుల వెనుక నిలుచున్నారు. దినేశ్ తల తిరిగిపోయింది.

"వాట్ ఇన్‌స్పెక్టర్. వాట్ ఈజ్ దిస్!" అంటూ పిచ్చిగా అరిచాడు దినేశ్.

"వింటావా! విను!" అంటూ హేండ్‌బాగ్‌లోంచి పోర్టబుల్ టేప్‌రికార్డర్ తీసి వినిపించింది సుహాసిని. వారు మాట్లాడిన మాటలన్నీ స్పష్టంగా రికార్డ్ అయివున్నాయి.

"మోసం! దగా! నన్ను పోర్టెబుల్‌గా హంతకుడ్ని చేస్తున్నారు! ఇదంతా ప్లాన్!" అంటూ జుత్తు పీక్కున్నాడు. ఇన్‌స్పెక్టర్ సురేష్ పిడికిలి బిగిసి అతని మొహం

మీద ఒకటిచ్చాడు. 'దినేశ్' ముక్కు చిట్లిపోయింది. రక్తం ధారగా వస్తోంది.

"యు. యూ. చీట్!" అంటూ సుహాసిని గొంతు పిసకబోయాడు. సురేష్ దినేశ్ తల వంచి వెన్నుమీద మరొకటి వేశాడు. దాంతో 'అమ్మా!' అంటూ క్రింద పడి పోయాడు.

"రాస్కెల్. ఒంటిమీద దెబ్బ పడితే యింత కష్టంగా వుందా? ఆ రోజు నువు శ్రీదేవిని చంపినపుడు ఆమె ఎంత నరకం అనుభవించిందో ఊహించావా?"

"నేను శ్రీదేవిని చంపలేదు. శ్రీదేవి నెవరు చంపారో నాకు తెలీదు" అన్నాడు.

అంతే! సురేష్ మరొకటి తగిలించాడు. నేలపడిపోయి గింగుర్లు తిరిగాడు దినేశ్—దినేశ్ పొట్టమీద బూటుకాలితో నొక్కబోయి 'అధికారం' అడ్డువచ్చి ఆగిపోయాడు.

"బ్రతికి పోయావ్! బాధ్యతగల ప్రభుత్వోద్యోగిగా

దురానీ అలవాట్లనూ, ఆధారాలనూ సేకరించి శ్రీదేవిని హత్యచేసి, ఈ హత్య దురానీ మీదకు నెట్టాలని ప్రయత్నించావు. కాని, సుహాసిని స్నేహితురాలికి జరిగిన అన్యాయాన్ని బయటపెట్టాలని, తన శీలాన్ని సైతం లెఖ్ఖచేయకుండా, నువు హంతకుడివని తెలివిగా నిరూపించింది!" అంటూ ప్రేమగా సుహాసిని కేసి చూశాడు సురేష్.

"ఇదంతా అన్నయ్య దురానీ ధైర్యం చెప్పబట్టి, మీరు వెంట వుండబట్టి చేయగలిగాను!" అంది వినయంగా.

దినేశ్ మారు మాట్లాడకుండా పోలీస్ జీప్ ఎక్కి కూర్చున్నాడు.

జీపు విజయ గర్వంతో ముందుకు కదిలింది. □

బీచ్ రోడ్ లో స్త్రీ శవం

కె.వి.రమణారా

విశాఖపట్టణం బీచ్ రోడ్డు. రోడ్డుమీద ఒకచోట జనం కుప్పలాముూగి వున్నారు. జారిపోతున్న బెల్టును అదే పనిగా సర్దుకుంటూ హెడ్ కానిస్టేబుల్ ఐరావతం జనాన్ని అదుపులో పెట్టే పనిలో చెమటలు కారుస్తున్నాడు.

ఇంతలో 'జయ్' మంటూ పోలీసు జీపు వచ్చి అక్కడ

ఆగింది. ఇన్‌స్పెక్టర్ షరీఫ్. డిటెక్టివ్ అజయ్‌కుమార్, అతని అసిస్టెంటు నందహరీ జీపులో నుండి దిగారు. ముగ్గురికీ ఒకే సెల్యూట్ అన్నట్టు భూమి అదిరేట్టు అటే న్షన్‌లో నిలబడి సెల్యూట్ చేసాడు ఐరావతం.

శత్రుసైన్యాల్లో చొరబడే రాజపుత్ర వీరుడిలా ఐరావతం లారీని ఝళిపిస్తూ దారి చేయగా ముందు షరీఫ్ ఆ వెనక డిటెక్టివ్‌లూ శవాన్ని చేరారు.

స్త్రీ శవాన్ని చూస్తూనే షరీఫ్ "మైగాడ్ హారిబుల్" అంటూ తల పక్కకు తిప్పుకున్నాడు. ఎన్నో హత్య కేసు లను పరిశోధించి, లెక్కలేనన్ని శవాలను చూసిన అజయ్ కుమార్, నందహరులు సయితం ఆ దృష్యాన్ని చూపి "బాప్‌రే" అనకుండా వుండలేకపోయారు.

వెల్లకిలా పడున్న ఆ స్త్రీ శవం వక్షస్థలం నుండి తొడల పైభాగం వరకూ ఏ లారీకిందనో బాగా తొక్కబడినట్టు పచ్చడయిపోయింది. చేతులు రెండూ తలవేపు మడిచి' వున్న కారణంగా చెక్కుచెదరలేదు. కింద భాగంలో సగం తొడలూ కాళ్ళూ మిగిలి వున్నాయి. దేనితోనో బలంగా కొట్టబడిన కారణంగా తల వెనకభాగం పగిలి కేశాలు పూర్తిగా రక్తంతో గడ్డకట్టి వున్నాయి.

శవం ఎడమచేతికి ఒక వాచీ మాత్రమే వుంది. వంటి మీద ఎలాంటి వస్తువులూ లేవు. ముఖమూ మిగిలిన అవ యవాలను బట్టి మనిషి చాలా అందమైనదే గాక సంపన్న కుటుంబానికి చెందినదని అనుకోవచ్చు.

"ఈమెకు సంబంధించిన వారెవరైనా వచ్చారా?" అని ఐరావతాన్ని అడిగాడు షరీఫ్.

ఐరావతం తల అడ్డంగా వూపుతూ "ఎవరూ రాలేదు సార్!" అన్నాడు.

అజయ్, షరీఫ్‌లు శవాన్ని, పరిసరాలను కొద్దిసేపు పరిశీలించారు. ఫొటోగ్రాఫర్లు, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్టులూ తమ పనులు ప్రారంభించారు.

అంతా పూర్తయాక డిటెక్టివ్‌లు షరీఫ్ జీపు వద్దకు వచ్చారు. "ఈ హత్యను గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అని అజయ్‌ని అడిగాడు షరీఫ్.

ఏదో తీవ్రాలోచనలో వున్న అజయ్ తల తిప్పి షరీఫ్‌ను చూస్తూ "ముందు నీ వుద్దేశం ఏమిటో చెప్పు" అన్నాడు.

షరీఫ్ గొంతు సవరించుకుంటూ "మనిషినిబట్టి చూస్తే బాగా డబ్బున్న తరగతి స్త్రీ అని తెలుస్తూనే వుంది. బహుశా నిన్న సాయంత్రం తరవాత ఏ రాత్రప్పుడో బీచికి షికారు కని ఒంటరిగా వచ్చి వుండాలి. ఏ దొంగ వెధవో వెనక మారుగా తలమీద కొట్టి స్పృహ లేని స్థితిలో వంటిమీద నగలూ గట్రా దోచుకుపోయి వుంటాడు. దెబ్బ బలంగా తగిలి రక్తం విపరీతంగా కారడం వలన ఆమె మరణించింది. రాత్రివేళ ఏ లారీలో తొక్కుతూపోయిన కారణంగా శవం అలా పచ్చడయి వుంటుంది" అన్నాడు.

అజయ్ చిరునవ్వుతో "షరీఫ్ భాయ్! నీ పరిశోధన మరింత చురుగ్గా వుండాలి. నువు చెప్పిన దానిలో చాలా లోపాలున్నాయ్! రాత్రివేళ నగలతో ఒంటరిగా ఏ స్త్రీకూడా ఇటువంటి ప్రాంతాలకు రాదు. నువు చెప్పినట్టుగా తల వెనక దెబ్బ ఇక్కడ రోడ్డుమీదనే తగిలి వుంటే శవం పడి వున్న చోట తల క్రింద, నేలంతా రక్తమయం కావాలి గదా! అలాంటిదేమీ లేకుండా తలకు వున్న రక్తంలో కొద్దిగా మాత్రమే నేలకు అంటింది. అంటే హత్య ఇక్కడ జరగలేదన్న మాట! ఇక శవాన్ని చూస్తే అది రోడ్డుకు బాగా ఎడంగా వుంది. రోడ్డుకూడా చాలా వెడల్పుగావున్న

కారణంగా ఏ లారీలూ పొరపాటునైనా అంతవరకు వచ్చే అవకాశం లేదు" అన్నాడు.

షరీఫ్ "ఆల్‌రైట్ నా వాదనలో లోపం వుంది. ఒప్పుకుంటున్నాను. నిజమేమిటో నువు చెప్పు" అన్నాడు మామూలుగా.

అజయ్ గంభీరంగా "నిర్ధారణ అయేంతవరకూ ఏదీ నిజమనిపించుకోదు. కాకపోతే మన పరిశోధన సహేతుకమా కాదా అన్నదే మనం ఆలోచించాలి. నా వూహ ప్రకారం ఆమె ఏదో ఒక ఇంట్లో గత రాత్రి 11 గం॥ల ప్రాంతంలో మరణించింది. శవం చేతికి వున్న వాచీకి ఒక చోట సున్నం అంటి వుంది. వాచీ అద్దం పగిలి సరిగ్గా పదకొండు గంటలకు ఆగిపోయి వుంది. వాచీ వున్న చేయి ఏదో ఒక గోడకు బలంగా కొట్టుకున్నపుడే వాచీ అద్దంతో సహా పాడయి దానికి సున్నం అంటే అవకాశం వుంది. అందుచేత ఇంట్లోనే ఆమెపై దౌర్జన్యం జరిగిందని నా అంచనా. తరువాత శవాన్ని ఏ రెండు మూడు గంటలకో లారీలాంటి దానిలో తెచ్చి ఇక్కడ పడేశారు. అలా పడేసిన శవాన్ని అదే వాహనంతో బాగా తొక్కించి వుంటారు" అంటూ ముగించాడు.

"మైగాడ్! దెన్ ఇటీజ్ ప్లాన్ మర్డర్!" చచ్చిన మనిషిని సయితం అలా పచ్చడికింద తొక్కించాడంటే హంతకుడికి ఆమెపై ఎంతో ద్వేషం వుండి వుండాలి" అన్నాడు షరీఫ్.

అజయ్ తలవిదిలిస్తూ "నో, నో. నేనలా అనుకోవడం లేదు. హంతకుడు దేన్నో దృష్టిలో పెట్టుకొని అలా చేసాడు. అంత శ్రమపడి శవాన్ని తొక్కిస్తూ రోడ్డుమీద రిస్క్ తీసుకుంటూ సమయాన్ని వృధా చేసాడంటే దాని

వలన హంతకుడికి ఏదో ప్రయోజనం వుండి వుండాలి" అన్నాడు.

"అదేమిటో తెలుసుకోగలిగావా?" అనడిగాడు షరీఫ్ ఆశ్చర్యపోతూ.

అజయ్ చిరునవ్వుతో "అదేమిటో వూహించగలిగితే కేసు స్వరూపం చాలావరకు తేలిపోయినట్టే! ఇంతకూ ఆ స్త్రీ వివరాలు ఎలా తెలుసుకోదలిచావు?" షరీఫ్‌ను అడిగాడు అజయ్.

"ఏముందీ మామూలు పద్ధతే! ఫొటో పేపర్లో వేయించడం, రేడియోలో ప్రకటించడం" జవాబిచ్చాడు షరీఫ్.

"అటువంటప్పుడు ఆమె ఎవరో తెలిసేందుకు టైంపడుతుంది. ఒకవేళ మరణించిన స్త్రీకి సంబంధించిన వారి హస్తమే యీ హత్యలో వుంటే వాళ్ళంతట వాళ్ళు ఎలాగూ ముందుకు రారు. అందుకని ఒక పని చెయ్!

"హతురాలి చేతికి వున్న వాచీని మన HMT కంపెనీ వారు ఈ మధ్యనే తయారు చేశారు. వాచీ చాలా విలువైనది. అందులో ప్రత్యేకత ఏమిటంటే ఏడాది పొడుగునా పని చేసినప్పటికీ ఒక సెకనుకూడా తప్పు పడవదు. అటువంటి వాచీలు ఐదంటే ఐదు మాత్రమే మన చమన్‌లాల్ వాచ్ హౌస్‌కి వచ్చాయి. వాటిలో ఒకటి మా చెల్లాయికోసమని నేనే కొన్నాను. ఆ వాచీల పనితనాన్ని అపుడపుడూ పరీక్షించేందుకని షాపువాళ్ళు వాచీ కొన్నవారి ఎడ్రసుకూడా తీసుకుంటున్నారు.

ఈమె చేతికి వున్న వాచీ మన అదృష్టం కొద్దీ చమన్‌లాల్ వద్ద కొన్నదే. ఐతే మనకు ఈమెకు సంబంధించిన వివరాలు తెలిసినట్టే! నా ఎడ్రసు మినహాయించి మిగిలిన నాలుగు ఎడ్రసులకు చమన్‌లాల్ షాపులో ప్రయత్నించు"

అన్నాడు.

షరీఫ్ సంతోషంగా అజయ్ చేతిని పట్టి వూపుతూ ఎడ్రసులన్నీ ఇక్కడివే ఐతే మధ్యాహ్నాని కల్లా ఏ సంగతి నీకు ఫోన్ చేస్తాను" అన్నాడు.

2

మధ్యాహ్నం భోజనం ముగించి ఒంటి గంట ప్రాంతములో ఆఫీసులో ఏదో ఫైలు తిరగేస్తున్నాడు అజయ్. నందహరి సీరియస్‌గా "అపరాధ పరిశోధన" చదవడంలో మునిగిపోయాడు. సెక్రటరీ సుజాత టైపు చేస్తున్నది.

ట్రింగ్ మంటూ మోగింది ఫోను. సుజాత ఫోను ఎత్తి మాట్లాడి "షరీఫ్ సాబ్" అంటూ రిసీవరు అజయ్ చేతికి ఇచ్చింది.

"హలో షరీఫ్ భాయ్! ఎంతవరకు వచ్చావ్!" అన్నాడు అజయ్.

"అజయ్! వుయ్ ఆర్ లక్కీ! నాలుగు ఎడ్రసులూ లోకల్‌వే. వాటి ప్రకారం మూడు యిళ్ళలో ఎంక్వయిరీ చేసాను. వారికి సంబంధించి ఎవరూ మిస్ కాలేదని ఖచ్చితంగా తెలియజేసారు. ఇక మిగిలిన ఒకే ఒక ఎడ్రసు లలితా నగర్‌లోని ప్రభాకర్ అనే ట్రాన్సుపోర్టు కంపెనీ యజమానిది. బహుశా మనకు కావలసిన వ్యక్తులు వాళ్ళే కాబట్టి నాతో నువుకూడా వుంటే బాగుంటుందని నా ఉద్దేశం. వీలుంటే రా!" అన్నాడు షరీఫ్.

"అలాగే! పది నిముషాల్లో నీ దగ్గరికి నేనే వస్తాను" అని ఫోన్ పెట్టి బయలుదేరాడు అజయ్.

"నేను రానా!" అంటూ చదువుతున్న అ.ప.న ప్రక్కన పెట్టబోతూ అడిగాడు నందు.

చిరునవ్వుతో "అవసరం లేదులే" అని చెప్పి అజయ్

బయటికి నడిచాడు. నందు మళ్ళీ అ.ప.నలో లీనమయి పోయాడు.

స్టేషను వద్ద తన కారు వదలి షరీఫ్‌తోబాటు జీప్‌లో బయల్దేరాడు అజయ్. ప్రభాకర్ నివాసం వారికి సులువుగానే తెలిసింది.

రాజమహల్ లాంటి బంగళా! ప్రభాకర్ బాగా సంపన్నుడు. షరీఫ్‌ను అజయ్‌ను చూస్తూనే మొదట ఆశ్చర్యపోయినా ప్రభాకర్ వారిని సాదరంగానే ఆహ్వానించాడు.

మెయిన్ హాల్లోని సోఫాలలో ముగ్గురూ ఆశీనులయారు. ప్రభాకర్‌కి దాదాపు ముప్పై ఐదు సంవత్సరాల వయసు వుండొచ్చు. మనిషి ఆరోగ్యంగా బలంగా వున్నాడు.

"అనూ! అర్జంటుగా రెండు కాఫీలు పంపించు" అంటూ కేకేశాడు.

షరీఫ్ సోఫాలో ఇబ్బందిగా కదులుతూ 'అబ్బే ఇప్పుడవన్నీ ఎందుకండీ! మేం ఇక్కడికి డ్యూటీమీద వచ్చాం" అన్నాడు.

ప్రభాకర్ చిరునవ్వు నవ్వుతూ "డ్యూటీమీద వచ్చినా మీరు మాకు గెస్టులే. కాఫీ ఇవ్వడంలో తప్పులేదు. మీరెవరో చెప్పనక్కర్లేదు లెండి, మరి వీరు....అంటూ అజయ్‌కేసి చూస్తూ ఆగిపోయాడు ప్రభాకర్.

"వీరు ప్రఖ్యాత డిటెక్టివ్ అజయ్‌కుమార్! నాకు చిన్ననాటి నుండీ మిత్రులు. ఇంతకీ మే మిక్కడికి వచ్చిన కారణమేమిటంటే...." అంటూ అలా పనిమనిషితో కాఫీలు పట్టించుకు వస్తున్న స్త్రీని చూసి దిగ్భ్రాంతుడిలా వుండిపోయాడు. అజయ్ పరిస్థితీ దాదాపు అలాగే వుంది.

ఆ స్త్రీ ముమ్మూర్తులా బీచ్‌లో మరణించిన స్త్రీ మాదిరిగానే వుంది. ఏ మాత్రం తేడా లేదు.

"నా భార్య అనుపమ" అంటూ ఆమెను వారికి పరిచయం చేస్తూ, కాఫీలు సోఫా ముందున్న టేబిలుపై పెట్టించాడు ప్రభాకర్.

ఆ షాక్ నుండి ముందుగా తేరుకున్న అజయ్ "ప్రభాకర్ గారూ! మీ భార్యకు కవల సోదరి ఎవరైనా వున్నారా:" అని అడిగాడు.

అజయ్ ప్రశ్న విన్న ప్రభాకర్, అనుపమల ముఖాలు ఒక్కసారిగా కాంతిహీన మయ్యాయి.

ప్రభాకర్ "ముందు కాఫీలు తీసుకోండి" అన్నాడు అజయ్ ప్రశ్నను వినిపించుకోనట్టు.

"ఫరవాలేదు. దయచేసి నా ప్రశ్నకు జవాబివ్వం" అన్నాడు అజయ్.

ప్రభాకర్ నెమ్మదిగా "ఔను! నా భార్య అనుపమ, అనురాధ ఇద్దరూ కవలపిల్లలు. అనురాధకూడా వుండేది" అన్నాడు.

"అంటే అనురాధ ఇప్పుడు మీ వద్ద వుండడం లేదా?" ప్రశ్నించాడు షరీఫ్.

ప్రభాకర్ ఇబ్బందిగా చూస్తూ "అది చెబితే మా ఇంటి గుట్టు మా నోటితోనే రచ్చకీడ్చుకున్నట్టవుతుంది" అని "ఇంతకు మీరు అనురాధ గురించే ఇక్కడకు వచ్చారా? అనురాధకేమయింది? కొంపతీసి. ఆ కేశవరావు ఆమెను ఏదన్నా చేసి....అంటూ భార్య మొహంలోకి చూసి ఆగిపోయాడు.

అనుపమ కళ్ళు అప్పటికే వర్షించే మేఘాల్లా వున్నాయి.

"ప్రభాకర్‌గారూ! అనురాధ, కేశవరావుల గురించి మీకు తెలిసిందల్లా చెప్పండి" సీరియస్‌గా అన్నాడు షరీఫ్.

ప్రభాకర్ కొద్దిసేపు మౌనంగా వుండిపోయాడు. తరు

వాత నెమ్మదిగా చెప్పడం ప్రారంభించాడు.

ప్రభాకర్ అత్తవారిది విజయనగరం. అనుపమ అనురాధలు కవలపిల్లలు. ప్రభాకర్ మామగారు అంతగా వున్నవారేంకాదు. ప్రభాకర్‌తో అనుపమ పెళ్ళినాటికి అనుపమ అనురాధలకు మిగిలినదల్లా ఒక్క తండ్రి మాత్రమే! అనుపమ పెద్దగా చదువుకోలేదు. అనురాధ మాత్రం వుమన్స్ కాలేజీలో బి.ఎ. పూర్తిచేసింది.

అనుపమ ప్రభాకర్‌తో కాపరానికి వచ్చి ఏడాది గడవకుండానే తండ్రి చనిపోయాడు. అనురాధ వంటరిదయింది. అనుపమ తనతోబాటు వుండేందుకు అనురాధను విశాఖపట్నం తీసుకు వచ్చేసింది. ఒంటరిగా అలా వుంటే మరీ చికాకుగా వుంటుందని అనురాధను ప్రభాకరరావే టైపు ఇన్స్టిట్యూట్‌లో చేర్పించాడు.

తను కాలేజీలో చదివిన రోజుల్లో తనలాగే పురుషుల కాలేజీలో బి.ఎ. చదివేవాడని, తన స్నేహితుడని కేశవరావు అనే వ్యక్తిని ఒక రోజు ప్రభాకర్ అనుపమలకు పరిచయం చేసింది అనురాధ.

కేశవరావు అది మొదలు వారి యింటికి తరచుగా రావడం ప్రారంభించాడు. కేశవరావు చాలా అందంగా వుండేవాడు. కాని ఎందుకనో అతడి వాలకం ప్రభాకర్‌కి నచ్చలేదు. కేశవరావుతో పరిచయం మంచిదికాదని ప్రభాకర్ అనురాధను హెచ్చరించాడు. అనురాధ అతని హెచ్చరికను లక్ష్యపెట్టలేదు ఒక వంక ప్రభాకర్ అనుపమలు ఆమెకు పెళ్ళి చేయాలనే వుద్దేశంతో ప్రయత్నాలు ప్రారంభించారు.

ఒకరోజు టైపుకు బయలుదేరిన అనురాధ మరి ఇంటికి తిరిగి రాలేదు. బీరువాలో కొన్ని నగలు, దాదాపు డెబ్బై

ఎనభై వేల క్యాషు కనిపించలేదు.

ప్రభాకర్ చెప్పడం ముగిస్తూ "ఇన్‌స్పెక్టర్‌గారూ! నేను వెంటనే పోలీసు రిపోర్టు ఇద్దామన్నాను. కాని అనుపమ అందుకు అంగీకరించలేదు. మనం ఎలాగూ దానికి పెళ్ళి చేసి ఒక అయ్యచేతిలో పెడదామనుకున్నాం. పెళ్ళి ఘనంగా కట్న కానుకలతో చేద్దామనుకున్నాం. అదేదో తనే చేసుకున్నది. పోయిన డబ్బు మనమే ఖర్చు చేసాం అనుకోండి! పోలీసు రిపోర్టూ అదీ అంటే పోయేది మన పరువే' అన్నది అనుపమ. నాకు అదీ నిజమే అనిపించి వూరుకున్నాను" అన్నాడు.

"అయితే—అనురాధ కేశవరావుతో వెళ్ళిపోయిందని మీరు భావించారా?" అన్నాడు అజయ్.

"భావించడమేం కాదు. తరువాత కేశవరావు మా యింటికి రాలేదు" చెప్పాడు ప్రభాకర్.

"ఇది జరిగి అంటే అనురాధ మీ ఇల్లు వదలి ఎన్నాళ్ళయింది?" ప్రశ్నించాడు అజయ్.

"సుమారు నెల రోజులయింది" అన్నాడు ప్రభాకర్.

"కేశవరావు వివరాలు ఏమన్నా చెప్పండి" అన్నాడు షరీఫ్ నోట్‌బుక్ తీస్తూ.

"సారీ అవేమీ మాకు తెలియవు, తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు అన్నాడు ప్రభాకర్.

షరీఫ్ ఏదో అనేంతలో హాలులో ఒకప్రక్కగా ఉన్న ఉయ్యాల నుండి పసిపిల్ల ఏడ్పు వినిపించింది.

ప్రభాకర్ వెనుక నిలుచున్న అనుపమ ఉయ్యాలలోని పిల్లవాణ్ణి సముదాయించే ప్రయత్నం చేసింది. జో కొట్టింది, ప్రక్కనేవున్న పాలసీసా కుర్రాడి నోటి కందించింది. ఎన్ని చేసినా కుర్రవాడు ఏడుపు మానలేదు. ఇంతలో ఒక

స్త్రీ వచ్చి పిల్లాణ్ణి ఉయ్యాల నుండి తీసి భుజానికెత్తుకొని బయటకు తీసుకెళ్ళింది. పిల్లాడికి దాదాపు ఆరేడు మాసా లుండొచ్చు.

అటువేపే ఏదో ఆలోచిస్తూ తీక్షణంగా చూస్తున్న అజయ్‌తో ప్రభాకర్ "మా ఏకైక పుత్రుడు, వాడితో పోరు పడలేక వాణ్ణి చూసేందుకు పనిమనిషిని పెట్టుకోక తప్ప లేదు. ఆమె ప్రత్యేకించి వాడికోసమే" అన్నాడు.

అజయ్, షరీఫ్‌లు లేచారు "సారీ ప్రభాకర్! మీ అను రాధ హత్య చేయబడింది. శవం ప్రస్తుతం హాస్పిటల్‌లో వుంది" అంటూ ముందుకు నడిచాడు షరీఫ్.

"ఆ" అంటూ నోరు తెరిచాడు ప్రభాకర్. అనుపమ ఘొల్లుమన్నది.

జీపులో షరీఫ్ "కేసు మరింత గజిబిజిగా మారింది" అన్నాడు నిస్పృహతో.

"అజయ్ చిరునవ్వుతో "నువ్వు ముందు కేశవరావు సంగతి తేల్చు" అన్నాడు.

"అదే! ఆ కేశవరావు సంగతి ఎలా తేలుతుందన్నదే నా బాధ. పేరు కేశవరావు, మనిషి అందంగా వుంటాడు అన్న రెండు పాయింట్లు అతన్ని పట్టుకోవడానికి ఏ మాత్రం సరిపోవు" అన్నాడు షరీఫ్ దిగులుగా.

"షరీఫ్! పరిశోధనలో సూదితో గునపాన్ని మార్చే దారి చేయాలి. కేశవరావు, అనురాధ ఒకే సమయంలో చెరొక కాలేజీలోనూ చదివారని తెలుసుకున్నాం. కేశవరావు నిజంగా వుంటే అతన్ని పట్టుకోవడం కష్టం కాదు" అన్నాడు అజయ్.

షరీఫ్ ఆశ్చర్యపోతూ "అదేమిటి! కేసును నువ్వు మరింత గందరగోళం చేసేట్టున్నావు. కేశవరావు వుంటే,

అనడంలో నీ ఉద్దేశం ఏమిటి?" అన్నాడు.

"ప్రభాకర్ చాలా విషయాలు దాస్తున్నాడని నా నమ్మకం. కేశవరావు విషయం నాకు అనుమానంగా వుంది. ప్రభాకర్ అనుపమలు అనురాధకు పెళ్ళి చేసే తలంపుతో వున్నపుడు చదువుకున్నవాడు, అందగాడు అన్నిటినీ మించి అనురాధకు నచ్చినవాడు ఐన కేశవరావును గురించి ఏ వివరమూ తెలుసుకోకుండా, కనీసం వాటికోసం ప్రయత్నించకుండా వుండడం నమ్మదగినదిగా లేదు.

ప్రభాకర్ ఆరోపిస్తున్నట్టుగా కేశవరావు అనురాధను హత్య చేయడం గురించి కూడా మనం ఆలోచించాలి. అనురాధ హత్యవలన కేశవరావుకు ఒరిగేదేమిటి? అనురాధ తనతో వచ్చి నెల రోజులైనా గడవకముందే అతడికి ఆమెను అంత ఘోరంగా హత్య చేసేటంతటి పగ ఎందుకు కలిగింది. అలాకాక ఆమె తనతో తెచ్చిన డబ్బు నగల కోసం కేశవరావు అందుకు పూనుకున్నాడా? ఈ అనుమానం ఎంతవరకు సమంజసం. తనే సర్వస్వమని నమ్మి వెంట వచ్చిన స్త్రీని మోసగించి వాటిని తస్కరించడం అతనికి ఏమంత కష్టమైన పని కాదే!

ఈ సంఘటనలలో కేశవరావు పాత్ర ఎక్కడా సరిగా ఇమడడం లేదు. అందుకే నువ్వు విజయనగరంలో పరిశోధన సాగిస్తే కేశవరావు సమస్య తేలుతుంది" అన్నాడు అజయ్.

జీపు పోలీసుస్టేషను చేరింది.

3

ఉదయం తొమ్మిది గంటలయింది. అజయ్ పేపరు తిరగేస్తున్నాడు. ఇంతలో ఫోను మోగింది.

అవతల నుండి షరీఫ్ గొంతు వినపడింది.

"అజయ్ భాయ్! నీ మాట నిజమే అయింది. నిన్నంతా విజయనగరంలో తిష్టవేశాను. కాలేజీ లిస్టులో అనురాధ పేరు పట్టుకోగలిగాం. కాని ఆ టైములో పురుషుల కాలేజీలో యెంత వెతికినా కేశవరావు పేరుతో ఒకే ఒక వ్యక్తి వున్నాడు. అదృష్టవశాత్తూ అతడు స్థానిక వ్యక్తే.

ఎలాగైతేనేం శ్రమపడి అతని అడ్రసు సంపాదించగలిగాను. ఈ కేశవరావు పొట్టిగా నల్లగా వున్నాడు. చాలా నెమ్మదస్తుడు. వివాహం చేసుకొని హాయిగా కాపురం చేస్తున్నాడు. ఇతనికి అప్పుడుగాని ఇప్పుడుగాని అనురాధతో ఏ సంబంధము లేదని గట్టిగా చెప్పగలను" అన్నాడు.

అజయ్ ఫోన్ పెట్టేస్తూ ఆలోచనలో పడ్డాడు.

ఇప్పుడు తన అనుమానం నిజమని తేలింది! ఇంతకీ ప్రభాకర్ కేశవరావు పాత్రను ఎందుకు సృష్టించినట్టు? హత్యానేరాన్ని లేని వ్యక్తికి అంటగట్టాలని ఎందుకు ప్రయత్నించినట్టు? ఈ హత్యలో అతని భార్యకువున్న సంబంధం ఏ మాత్రం? లేక ఆ ఇద్దరూ కలిసే అనురాధను హత్య చేసారా!

అనురాధ లక్షల ఆస్థికి వారసురాలు కాదు. దిక్కులేక తమ దగ్గరికి చేరింది. మరి అటువంటప్పుడు ఆమెను వారెందుకు చంపుతారు?

అనుపమ, అనురాధ ఇద్దరూ మాటలోను, రూపులోను అన్నిటా ఒకే పోలిక! ఒకవేళ చనిపోయిన స్త్రీని కొద్దిసేపు అనుపమ అనుకుంటే? అవును.... చిక్కులు ఒకటొకటే

విడిపోతున్నాయి. తొలినుండి తికమక పెడుతున్న అనేక ప్రశ్నలకు సమాధానాలు వరుసగా లభించాయి.

4

సిబ్బందితోబాటు తన నివాసానికి అరుదెంచిన అజయ్, షరీఫ్‌లను చూస్తూనే కలవరపాటుతో ఏమిటిలా అందరు కట్టకట్టుకు వచ్చేసారు. కేశవరావు ఆచూకీ ఏమన్నా తెలిసిందా?" అన్నాడు ప్రభాకర్.

"కేశవరావుతో మాకేం పని ప్రభాకర్‌గారూ!" అన్నాడు అజయ్ చిరునవ్వుతో.

"అదేమిటి? వాడేకదా మా అనురాధను హత్యచేసింది?" అన్నాడు ప్రభాకర్.

"మేమిక్కడికి వచ్చింది అనుపమను హత్యచేసిన హంతకుణ్ణి బంధించేందుకు" అంటూ "షరీఫ్ కట్టుకున్న భార్యను హత్యచేసిన నేరానికి ఈ దుర్మార్గుణ్ణి అరెస్టు చెయ్!" అన్నాడు.

"డిటెక్టివ్! నీకు నిజంగా పిచ్చెక్కింది. హత్య చేయబడింది అనురాధ. నా భార్య అనుపమ అదిగో! అక్కడే సజీవంగా వుంది" అన్నాడు కోపంగా పోలీసుల అలికిడికి అప్పుడే గదిలోనుండి హాల్లో కొచ్చిన అనుపమను చూపిస్తూ.

"మిష్టర్ ప్రభాకర్ ఇక బుకాయించి లాభంలేదు. నేను మొదట ఇక్కడికి వచ్చినపుడు ఉయ్యాలలో ఏడుస్తున్న పసివాణ్ణి ఈమె లాలించే పద్ధతిని ఆ నాడే అనుమానించాను. గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్న తన బిడ్డను ఏ తల్లీ అక్కున చేర్చుకోకుండా వుండలేదు.

నువ్వు ఇప్పటివరకూ నీ భార్య అనుపమలా నటిస్తున్న

అనురాధ కలసి అనుపమను హత్యచేశారు. అనురాధ ఆకర్షణలో పడి నువ్వు నీ సహధర్మచారిణికి అన్యాయం తలపెడితే, నీ ఆస్తిపాస్తులకు ఆశపడి తోడబుట్టిన సోదరికే ద్రోహం తలపెట్టింది అనురాధ.

అనుపమ, అనురాధలు రూపంలో ఏ మాత్రం తేడాలేని కవలలు. ఆ అవకాశాన్ని మీ రిద్దరూ మీ ద్రోహబుద్ధికి ఆసరా చేసుకోదలిచారు. సమయం చూసి అనుపమను తల మీద గాయంచేసి హత్యచేశారు. అనుపమను అనురాధగా చేసి రోడ్డుమీద పారేశారు.

అనురాధ అనుపమగా చెలామణి అయేందుకు ఏ అడ్డంకీ లేదు కానీ, రూపాలు ఒకటే అయినా అనుపమ బిడ్డతల్లి. ఒకవేళ పోస్టుమార్టంలో ఎక్కడ ఆ సంగతి బయటపడి పోలీసులు తీగ లాగుతారో అని భయపడి అనుపమ శవాన్ని లారీతో పచ్చడిచేశావు.

మరణించిన నీ భార్యను మరొదలుగా చేయడమేగాక ఆ శవానికి కేశవరావు పేరుతో ఒక ప్రియుణ్ణి సృష్టించి కథకు మరింత రక్తి కట్టించాలనుకున్నావు. పోలీసులు తమ దృష్టిలో మరణించిన అనురాధకు లేని ప్రియుడు కేశవరావుకోసం అన్వేషణ సాగిస్తూ వున్నా నీ ప్రియురాలిని అసలు పట్టించుకోరని నీ దూరాలోచన ఇంకో రకంగా చెప్పాలంటే దురాలోచన. అక్కడే నీ పాపం పండి కేశవరావుకోసం విసిరిన వుచ్చు నీ మెడలో చుట్టుకొంది'' అన్నాడు అజయ్.

''బాగుంది అజయ్ కుమార్ చాలా బాగుంది మీ కథ. మీ రెన్ని చెప్పినా మరణించిన మనిషి ద్వారా నిజం తెలియదు కదాని చెల్లిపోతుందనుకోకండి'' అన్నాడు ప్రభాకర్.

''మరణించిన అనుపమ ద్వారా నిజం తెలియదనే

భ్రమ నీది ప్రభాకర్। కాని ఒక సంగతి జ్ఞాపకం ఉంచుకో. ఏ నాటికైనా గెలుపు నిజానిదే. ఆ నిజం నీ అనురాధ రూపంలో ఇంకా బ్రతికే వుంది. ఈమె అనురాధ కాదు అనుపమ అని నిరూపించదలచుకుంటే నీకు ఒక అవకాశ మిస్తున్నాను. అందుకు నువ్వు సిద్ధమేనా?" అన్నాడు అజయ్ సవాలుగా.

"ఏమిటది?" అన్నాడు ప్రభాకర్.

"మరేంలేదు నీ భార్యామణిచేత ఆమె బిడ్డకు పాలు తాగించండి. ఆ విషయం మా సెక్రటరీ సుజాతచేత అంగీక రింపచేస్తే మా వాళ్ళెవరూ మీ యింటి ఛాయల్లో కూడా నిలవరు" అన్నాడు అజయ్ చిరునవ్వు మొగంతో.

ఆ మాటకు ప్రభాకర్ "అదా.... అది.... ఆమెకు బిడ్డ పుట్టినప్పటి నుండి పాలు అసలు లేవు" అంటూ తడ బడ్డాడు.

"ప్రభాకర్। నిజం ఇపుడు నిన్ను మించి పెరిగి పోయింది. దానిని నీ గుప్పిట ఇక ఏ మాత్రం దాచలేవు. పాపం విషయం ఇంతవరకూ వస్తుందని నువ్వు అసలు అనుకోలేదు. అంతా జరిగి పూటిలో కూరుకుపోయే సమ యానికి కప్పదాట్లు వేయాలని చూస్తున్నావు. అనురాధను ఏ వైద్యుడికి చూపించినా ఆమె ఒక బిడ్డకు జన్మనిచ్చిన తల్లి కాదని యిట్టే చెప్పగలడు. ఆ విషయం నీకూ తెలుసు।" అన్నాడు అజయ్ కుమార్.

ఆ మాటతో ప్రభాకర్ సోఫాలో కుప్పలా కూలి పోయాడు. అనురాధ తన ముఖాన్ని చేతుల్లో దాచుకుంటూ ఏడవసాగింది.

ఐరావతం బేడీలతో ముందుకు నడిచాడు. □

జలసమాధి

ఎమ్. వి. వి. సత్యనారాయణ

బాలు స్కూల్ నుండి పరుగెత్తుకు వచ్చాడు. పుస్తకాల సంచిని మంచంమీద పడవైచి, "అమ్మా! అమ్మా!" అంటూ వంటింట్లోకి పరుగెత్తాడు.

అనసూయ బియ్యం ఏరుతుంది.

"నాన్న యింకా రాలేదా అమ్మా?" అడిగాడు బాలు.

"ఇంకా రాలేదు. ఉదయం పది గంటలకు వస్తానన్న వారు సాయంత్రం వరకూ ఎక్కడున్నట్టు?" అంది అనసూయ.

"ఏమో, నాకు పుస్తకాలకు డబ్బు యిస్తానని చెప్పాడు."

"అయితే ఒకపని చెయ్. మల్లిఖార్జునంగారి యింటికి ఒకసారి వెళ్ళిరా!" ఆయన మీ నాన్నను ఏదైనా పనిమీద వుంచేశారేమో!"

బాలు తలూపి బయటకు నడిచాడు. మెయిన్ రోడ్డు మీద ఒక ప్రక్కగా వుంది మల్లిఖార్జునంగారి ఇల్లు.

అది యిల్లుకాదు బంగళా. చిన్న గ్రామం కట్టుకోవచ్చు. అంత వెడల్పైయిన ప్రహరీ గోడలు! బాలు గేటు దగ్గర ఆగాడు. బంగాళా గంభీరంగా వుంది. విశాలమైన ఆవరణకు మధ్యగా మూడు అంతస్థుల భవనం. గేటుకూ, భవనానికీ మధ్యదూరం అరఫర్లాంగు వుంటుంది. గేటు లోంచి సిమెంటు రోడ్డు వుంది. రోడ్డు కిరుప్రక్కలా క్రోటన్స్ మొక్కలూ, సన్నజాజి తీవెలూ తీగలతో అల్లిన పందిళ్ళూ వున్నాయి. బంగళాకు వెలుపల అటుప్రక్క మామిడి తోట వుంది.

బాలు మెల్లగా గేటు తెరిచాడు. విపరీతంగా అరుచుకుంటూ కుక్క పరుగెత్తుకు వచ్చింది. కుక్క వెనుక పని వాడు గేటువద్దకు వచ్చాడు.

"అరె! బాలూ! ఏం యిలా వచ్చావు?" అన్నాడు పని వాడు.

"మా నాన్నకోసం."

"మీ నాన్న యింకా రాలేదు"

"రావడం కాదు. ఉదయం నుండి యింటికి రాలేదు."

"రాలేదా?"

"అవును."

"బంగళాలోంచి ఉదయమే బయలుదేరాడు."

"అయ్యగారు మా నాన్నను యెక్కడికయినా పంపారేమో?"

"లేదనుకుంటాను. ఉదయం అతడు గేటు దాటేటప్పుడు నేను అడిగాను. మార్కెట్టుకు వెళ్ళి యింటికే వెళ్తానన్నాడు.

"మార్కెట్టుకా? అక్కడ ఏం పని వుంటుంది?"

పనివాడు నవ్వాడు. "చేపల కూరకు అయి వుంటుందిరా!" అన్నాడు.

"కాని యింతవరకూ రాలేదు."

బాలు మార్కెట్టుకు వెళ్ళాడు. పిచ్చికుక్కలాగ తిరిగాడు. తండ్రి కనిపించలేదు.

వాసుదేవం ఎదురయాడు.

"అంకుల్! మా నాన్న కనిపించాడా," అడిగాడు బాలు.

వాసుదేవం ఆశ్చర్యంగా చూచి, "నేనూ అతడికోసమే వెతుకుతున్నాను. ఇపుడు మీ ఇంటికి వెళ్ళాను" అన్నాడు.

బాలు ఏడుపు మొహం పెట్టాడు.

"ఏడవకు! నాకు మధ్యాహ్నం కవిత యింటి దగ్గర కనిపించాడు. మాటిమాటికి వాచీ చూసుకుంటున్నాడు. కవిత యింటికి తాళం పెట్టి వుంది."

"ఇప్పుడు ఆమె ఇంటి దగ్గరే వున్నాడేమో."

"లేదు. చూశాను. ఆ యింటికి తాళం పెట్టివుంది."

"ఆమె ఎక్కడికి వెళ్ళింది?"

"ఏమో!"

"ఆమెతో నాన్నకేం పని?"

వాసుదేవం కొంటెగా చూచి, "ఏమో! మనకేం తెలుస్తుంది?" అన్నాడు.

"కవిత యిల్లు చూపించు అంకుల్!"

వాసుదేవం చురుకుగా చూచి, కుర్రవాడివి. నువ్వు యింటికి వెళ్ళు. నేను చూచి యింటికి పంపిస్తానులే మీ నాన్నను" అన్నాడు.

"అసలు ఆమె యిల్లు ఎక్కడ?"

"గోపురం వీధిలో ఆరో యిల్లు!"

వాసుదేవం వద్ద సెలవు పుచ్చుకుని బాలు యింటికి బయల్దేరాడు.

వాసుదేవం మార్కెట్ వీధిలోంచి గోపురం వీధిలోకి తిరిగాడు. ఆరో నెంబర్ యింటి ముందు ఆగాడు. ఇంటికి తాళం పెట్టివుంది. రోడ్డుమీద దీపాలు వెలుగుతున్నాయి.

కవిత ఎక్కడికి వెళ్ళింది? అసలు ఆమె ఎక్కడికయినా వెళ్ళే అవకాశం ఎక్కడిది? తాను ఎంతసేపని మాధవన్ కోసమూ, కవిత కోసమూ వేచివుండాలి?

వాసుదేవం ఉలిక్కిపడ్డాడు. గోపురం వీధిలోకి కారు వస్తున్న చప్పుడయింది. వాసుదేవం చటుక్కున రోడ్డుకి అవతలకు నడిచాడు. క్రీనీడలో ఆగాడు. కవిత యింటి ముందు ప్లైమత్ కారు ఆగింది. కారులోంచి యెవరూ దిగలేదు.

ప్లైమత్ మళ్ళీ కదిలింది. వీధి చివర కారు మాయమయ్యేవరకు వుండి రోడ్డుమీదకు వచ్చాడు వాసుదేవం.

2

"కవితా!" పిల్చాడు మాధవన్. "నీ శీలం చెడిపోయింది."

కవిత రోషంగా చూచింది. "అవును దేశంలో నీలాంటి రాబందు ఉన్నంత కాలం ..." కవిత కంఠం వణికింది. "నాలాంటి పడుచులకు రక్షణలేదు. నా గురించి నువ్వేకదా ఆ రాస్కెల్‌కి చెప్పింది. వాడు నా యింటిమీద దాడి చేశాడు. నేను నీ కేం అపకారం చేశాను?"

మాధవన్ పెదిమలు చప్పరించాడు. "కోపంలో కూడా నువ్వు చాలా అందంగా వుంటావు. అదే నాకు నువ్వు చేసిన అపకారం."

కవిత అతడిని తిట్టసాగింది. మాధవన్ చిరునవ్వుతో తిట్లు వింటున్నాడు. కవిత తిట్టి తిట్టి అలసిపోయింది. మాధవన్ ఆమెను సమీపించాడు. చెయ్యి పట్టుకున్నాడు. కవిత గింజుకుంది. ఆమెను మీదకు లాక్కున్నాడు మాధవన్.

కవిత అతడిని ప్రతిఘటిస్తోంది.

"నీకు ఏం కావాలి?" కవిత రొప్పుతోంది.

"నువ్వు ...."

"ఛీ! నీకు సిగ్గులేదు!"

"సిగ్గా? ఎందుకు? నువ్వు వాడితో కులికినప్పుడు లేదా సిగ్గు?"

"వాడు కూడా నీ వల్లనే కదా నా మీద రెచ్చిపోయింది?"

"అవును. ముందు వాడిని నీ మీదకు పంపాను. పెద్దవాడూ, కుబేరుడు.

అతడికి నువ్వు లొంగిపోవడం నీకు అంత బాధగా

లేదు. కాని నా లాంటి పేదవాడికి లొంగకూడదని నీ ఉద్దేశ్యం కాబోలు!"

"వాడు నన్ను పాడుచేసినందుకు అనుభవిస్తాడు."

"నీ మొహం వాడు మరల నిన్నే...." మాధవన్ ఆమె మొహాన్ని తన మొహం వద్దకు తెచ్చుకోబోయాడు.

తలుపు చటుక్కున తెరచుకుంది. మాధవన్, కవిత ఒకే సారి గుమ్మంలోకి చూశారు. ఇద్దరు మొహాల్లో చెక్కతే నెత్తురు లేదు. అతడు వాళ్ళను సమీపించాడు. పిడికిలి బిగించి మాధవన్ మొహం మీద గుద్దాడు. మాధవన్ తల వంచుకున్నాడు.

"ఈమెను నేను స్వంతం చేసుకున్నాను. నీకు ఎన్ని వేల గుండెలురా! నేను ఇష్టపడిన వ్యక్తి ఒంటిమీద చెయ్యి వేస్తావా?" అరిచాడు అతడు.

"సారీ....సార్...." మాధవన్ వణికిపోయాడు.

లోపలకు వచ్చిన పెద్దమనిషి హూంకరించాడు. శక్తి కొద్దీ మాధవన్‌ని పొట్టలో తన్నాడు. మాధవన్ ఉండలు చుట్టుకుని పడిపోయాడు. మరుక్షణంలో అతడికి స్పృహ తప్పింది.

3

డిటెక్టివ్ శిరీష్ ఆమెను ఎగాదిగా చూశాడు. ఆమెకు నలభయి సంవత్సరా లుంటాయి. ముక్కుపొడుం రంగు చీర కట్టింది. తెల్లటి వదులు రవిక వేసుకుంది. నుదుట పెద్ద బొట్టు. అటూ యిటూ దువ్విన జుత్తూ, చెవులకు కిలుము పట్టిన రోల్డుగోల్డు దుద్దులూ.

"మీ రెవరు?" అడిగాడు శిరీష్.

ఆమె మాటల కోసం వెతుక్కుని "నన్ను మరిడమ్మ అంటారండి. మా ఆయన పేరు వాసుదేవం" అంది.

"మీ ఆయన ఏం చేస్తుంటాడు?"

"ఏదో బ్రోకరేజి ఆఫీసులో పని అని చెబుతాడండి. అది గోపురం వీధిలో వుందన్నాడు."

"చెప్పండమ్మా, మీరు వచ్చిన పనేమిటి?"

ఆమె క్షణంపాటు దీనంగా చూచింది. "మా ఆయన కనిపించడం లేదండి. మీరు వెతికి పెట్టాలి" అంది.

"కనిపించడం లేదా? ఎప్పటి నుండి?"

"వారం రోజులవుతుందండి. ఆయన మూడు నాలుగు రోజులకోసారి యింటికి రావడం మామూలేనండి. అందుకే ఆయనే వస్తారని వూహించుకున్నాను. వారం రోజులపాటు ఆయన ఎన్నడూ యింటికి రాకుండా లేరు. నాకు ఏదో భయంగా వుంది."

"మీకు పిల్లలా?"

"లేరు."

"వాసుదేవంగారికి చెడు అలవాట్లున్నాయా?"

"మరిడమ్మ నిట్టూర్చి "ఎన్ని అలవాట్లుండాలో అన్నీ వున్నాయి. అందుకే నేను గాభరా పడుతున్నానండి" అంది.

"మీ అడ్రసు?"

"వించిపేటలో వుంటున్నాం. రైస్‌మిల్లు వెనుక వీధి. అయిదో యింట్లో వుంటున్నాం."

శిరీష్ తలూపి "మీరు యింటికి వెళ్ళండి. నేను వాసుదేవంగారి కోసం వెతుకుతాను. సమాచారం తెలియగానే మీకు చెబుతాను" అన్నాడు.

ఆమె నమస్కరించి వెళ్ళిపోయింది.

శిరీష్ డాట్సన్ కారులో బయలుదేరాడు. గోపురం వీధిలో కారు త్రిప్పాడు. ఆ వీధిలో రెండు బ్రోకరేజ్

ఆఫీసు లున్నాయి. మొదటి ఆఫీసులో వాసుదేవం గురించి తెలిసింది. అతడు రెండో ఆఫీసులో బంట్రోతుగా పని చేస్తున్నాడు.

డాట్సన్ కారు రాఘవేంద్రా బ్రోకరేజ్ ఆఫీసు ముందు ఆపాడు శిరీష్. ఆఫీసు తెరిచే వుంది. కుర్చీలో ఒకతను కూర్చుండి పేపర్ చదువుకుంటున్నాడు.

శిరీష్ అతడిని సమీపించి విష్ చేశాడు. అతడు ప్రతి నమస్కారం చేసి, "ఏం కావాలండి?" అన్నాడు. సీటు చూపించాడు.

"మీరు ఆఫీస్ మేనేజరా?" అడిగాడు శిరీష్.

"అవునండి."

"మీ ఆఫీసులో వాసుదేవం పనిచేసేవాడు కదా?"

"అతడు తలూపాడు. "కాని వారం రోజులుగా అతడు డ్యూటీకి రావడం లేదు. ఇంటికి కబురు పెట్టాలనుకున్నాం. ఇల్లు తెలియదు."

"వాసుదేవంతో సన్నిహితంగా వుండే స్నేహితు లెవరు?"

"నరసింహం అని మా ఆఫీసులోనే పని చేస్తాడు. రికార్డు అసిస్టెంటు. ఎక్కడకు వెళ్ళినా యిద్దరూ కలసే వెళుతుంటారు."

"వాసుదేవం ఎటువంటివాడు?"

"పనిలో నమ్మకంగానే వుంటాడు. అందుకే అతడు వారం రోజులయి డ్యూటీకి రాకపోయినా యింతవరకూ టెర్మినేట్ చేయలేదు. కాని వ్యసనాల పుట్ట."

"నరసింహం కూడానా?"

"అవును సార్!"

"నరసింహం ఈరోజు డ్యూటీకి వచ్చాడా?"

"ఈ రోజు సెలవు పెట్టినట్టు కబురు పంపాడు సార్!"

"నరసింహం అడ్రసు తెలుసా?"

"ఈ వీధిలో చివర అటుప్రక్క నుండి రెండో యిల్లు."

"వాసుదేవంగానీ డ్యూటీకి వస్తే నాకు తెలియ పర చండి" శిరీష్ తన గుర్తింపుకార్డు యిచ్చాడు.

మేనేజర్ తలూపి, "సార్! ఈ ప్రశ్నలన్నీ ఎందు కడిగారో తెలుసుకోవచ్చునా?" అన్నాడు.

శిరీష్ నవ్వి, "తప్పకుండా. వాసుదేవం వారం రోజు లుగా యింటికి రాలేదు. అతడి భార్య కంగారు పడుతుంది" అన్నాడు.

డాట్సన్ కారు ఆ వీధిలో చివరకు పరుగెత్తి రెండో యింటి వద్ద ఆగింది. ఇంటి అరుగుమీద ముసలాయన కూర్చుని వున్నాడు.

"నరసింహంగా రున్నారా తాతగారూ?" అడిగాడు శిరీష్.

ముసలాయన మెల్లగా తలెత్తి "రాత్రినుండి యింటికే రాలేదు బాబూ!" అన్నాడు.

"మీ అబ్బాయా నరసింహం?"

"అవును బాబూ!"

"రాత్రి ఎక్కడకు వెళ్ళాడు?"

"ఎక్కడికి వెళతాడో ఎప్పుడూ చెప్పడు బాబూ! ఎందుకురా ఈ తిరుగుళ్ళు అంటే వినడు. వాడి పెళ్ళాం గోల! రాత్రి ఆరు గంటల ప్రాంతంలో బయటపడ్డాడు.

"అతడికి యింటిపట్టున సరిగా వుండకపోవడం అల వాటేనా?"

"అవును బాబూ! కొన్ని రాత్రులపాటు కూడా రాడు. మా వాడికి ఆ వాసుదేవం కూడా తోడు."

"అతడు వారం రోజులుగా యింటికి రావడం లేదట."

"ఇంకేం! వీడు వాసుదేవం ఇంటికి వెళ్ళే వుంటాడు."

"ఎందుకు?"

"వాసుదేవం గురించి తెలుసుకోవడానికి."

"నరసింహం వస్తే డ్యూటీకి వెళ్ళమనండి!" డాట్సన్ కారు తిరిగి బయలుదేరింది.

వీధి చివర సిటీబస్సుస్టాపులో కారు ఆపాడు శిరీష్. బస్సుస్టాపులో లాండ్రీషాపూ, కిళ్ళీ దుకాణాలూ వున్నాయి.

శిరీష్ కారు దిగాడు. లాండ్రిషాపు ముందు నిలబడ్డాడు. షాపులో ఇస్త్రీ చేసుకుంటున్న వ్యక్తి అతడిని ఎగాదిగా చూశాడు. నరసింహం గురించి చెప్పి శిరీష్ "అతడు మీకు తెలుసా?" అన్నాడు.

అతడు తలూపి, "నరసింహం బట్టలు నేనే ఇస్త్రీ చేస్తాను సార్!" అన్నాడు.

"ఇతడు నిన్న షాపు వద్దకు వచ్చాడా?"

"వచ్చాడు సార్!"

"ఎన్ని గంటలకో చెప్పగలవా?"

"ఆరు దాటాక-సాయంకాలం."

శిరీష్ ఉత్సాహం తెచ్చుకున్నాడు.

"బట్టలు యిస్త్రీకి యిచ్చి రోడ్డుమీద నిలబడ్డాడు సార్! కొంతసేపటికి అతడి ముందు ఒక కారు ఆగింది. అతడు కారు ఎక్కి వెళ్ళిపోయాడు. అంతేసార్!"

"కారు ఏ రకమో చెప్పగలవా?"

"ఎలక్ట్రిక్ దీపాల వెలుగు కదా సార్! సిమెంటు రంగు కానీ, బూడిద రంగుకానీ అనుకుంటాను. పెద్ద

కారు.''

''అంబాసిడరా?''

''పేరు నాకు తెలియదు సార్!''

''కారును చూస్తే మరల గుర్తుపట్టగలవా!''

అతడు యిబ్బందిగా కదిలాడు, ''చెప్పలేను సార్!''

శిరీష్ అతడికి కృతజ్ఞతలు చెప్పుకుని కారులో బయలుదేరాడు. నరసింహం కారులో వెళ్ళాడు. కారులో అతడి కోసం ఎవరు వచ్చారు? కారు వస్తుందని నరసింహానికి ముందే తెలుసు. అందుకే అతడు లాండ్రీషాపువద్ద కాచుకుర్చున్నాడు. కారు ఏ రకమో, దాని నెంబరేమిటో ఎలా తెలుస్తుంది?

4

టెలిఫోన్ గణగణలాడింది. క్రయిమ్‌బ్రాంచి యిన్‌స్పెక్టర్ కుమార్ రిసీవర్ ఎత్తాడు.

''హలో....ఈజిట్ క్రయిమ్‌బ్రాంచ్?'' వినిపించింది.

''ఎస్. కుమార్ స్పీకింగ్.''

''సార్! మామిడి తోటవద్ద కాలువలో అస్థిపంజరం వుంది.''

''అస్థిపంజరమా! ఏమిటి మీరనేది? అసలు మీరెవరు?''

అవతల నిశ్శబ్దం. ఎక్కడో కారు ఆగింది. తలుపు తెరుచుకున్నట్టు కిర్రుమంది.

''ధాం! ధాం!!''

కారు తిరిగి బయలుదేరిన శబ్దమయింది ఫోన్‌లో.

కుమార్ చురుకుగా రిసీవర్‌ను బల్లమీద పెట్టి ముందు గదిలోకి నడిచాడు. సార్జంటు రాసుకుంటున్నవాడల్లా వులిక్కిపడ్డాడు. కుమార్ అతడిని పట్టించుకోకుండా టెలిఫోన్ రిసీవర్ ఎత్తి టెలిఫోన్ ఎక్చేంజ్‌కి డయల్

చేశాడు.

"క్రయిమ్‌బ్రాంచ్ ఆఫీస్ - 65318 కి యిప్పుడు ఫోన్ ఎక్కడి నుండి వచ్చిందో చెప్పగలరా?" అడిగాడు కుమార్.

"మామిడి తోట దగ్గర పబ్లిక్ బూత్ నుండి."

"థాంక్స్!" కుమార్ రిసీవర్ పెట్టేసి, "జీప్ సిద్ధం చెయ్యి సార్జెంట్! టెక్నికల్ యూనిట్‌తో సహా క్విక్!" అని లోపలకు నడిచాడు.

రెండు నిమిషాలలో జీపులు బయలుదేరాయి. మోటార్ సైకిల్ మీద కుమార్ బయలుదేరాడు. మామిడితోట యివతల కాలువ వుంది. కాలువకు నూట యాభయి గజాల యివతల వాహనాలు ఆపారు పోలీసులు. వాళ్ళకు నూరు గజాల దూరంలో పబ్లిక్ టెలిఫోన్ బూత్ వుంది. ఇన్‌స్పెక్టర్ కుమార్ కాలువవైపు నడిచాడు.

మట్టి రోడ్డుమీద కారు వెళ్ళిన జాడ లున్నాయి. జాడలకు అటుప్రక్క టెలిఫోన్‌బూత్ వుంది. బూత్ తలుపు తెరచి వుంది. తలుపు యివతల మట్టిరోడ్డు. మట్టిరోడ్డుమీద అతడు వెల్లకింతలా పడివున్నాడు. అతడి పొట్టవద్ద, గుండెలవద్ద రెండు గాయాలున్నాయి. వాటిలోంచి యింకా నెత్తురు ప్రవహిస్తూంది.

కుమార్ తన సిబ్బందికి తగినసూచన లిచ్చి కాలువలోకి దిగాడు. రోడ్డుమీది కారు టైర్ల గుర్తులు ఫోటో తీసి వాటి మధ్య దూరాన్ని కొలవసాగారు పోలీసులు. మరి కొందరు శవానికి ఫోటోలు తీయడమూ, వ్రేలిముద్రలు సేకరించడమూ నిర్వర్తించసాగారు.

కుమార్ కాలువలో ఒకచోట ఆగాడు. కాలువలో తక్కువగా వుంది నీరు. నీటి మధ్య మట్టి పేరుకుపోయి

వుంది. మట్టిలోంచి చేతి ఎముకలు కనిపిస్తున్నాయి. మణికట్టువరకు గాలిలోకి లేచి వుంది చెయ్యి.

కుమార్ మట్టికుప్పను సమీపించాడు. మట్టికుప్పలో అస్థిపంజరం తాలూకు మిగతా భాగాలు కప్పబడి వుండాలి. మట్టికుప్పలో అస్థిపంజరం వున్న సంగతిని చెప్పడం వల్లనే టెలిఫోన్ బూత్‌వద్ద అతడు ప్రాణాలు కోల్పోయాడు. అతడు ఎవరు? అతడికీ యీ విషయం ఎలా తెలుసు?

ఫోటోగ్రాఫర్ శవానికి ఫోటోలు తీశాడు. తరువాత కుమార్‌ను సమీపించాడు. కుమార్ మణికట్టు చూపించి సైగ చేశాడు. ఫోటోగ్రాఫర్ ఆ అస్థిపంజరం మణికట్టుకు క్లోజప్‌లో ఫోటో తీశాడు. కుమార్ తన సిబ్బందిని పిలిచాడు. మట్టికుప్పను త్రవ్వించాడు.

కుమార్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయాయి. మట్టికుప్పలో మోచేతివరకూ మాత్రమే ఎముకల గూడు వుంది. మిగతా అస్థిపంజరం భాగాలు లేవు. మణికట్టు చెయ్యి దీనికి సంబంధించినది కాదు. ఎముకల గూడులో ఎముకల మధ్యలో నల్లటి లోహపు వలయం యిరుక్కుని వుంది. లోహపువలయాన్ని కర్రముక్కతో తప్పించాడు కుమార్. చేతి గడియారం అది. మట్టికొట్టుకుపోయి త్రుప్పు పట్టివుంది.

కుమార్ కాలువలోకి దూరంగా చూశాడు. కాలువ మామిడితోటను చుట్టివస్తూంది. తోటకు అవతలిప్రక్క బంగళా వుంది. బంగళాలోంచి కుక్క అరుపు వినిపిస్తోంది.

రోడ్డుమీద కారు ఆగిన చప్పుడయింది. కుమార్ అటు చూశాడు. డాట్సన్ కారు. కారులోంచి డిటెక్టివ్ శిరీష్ దిగాడు. అతడి ప్రక్క మరెవరో నడివయస్కుడు

వున్నాడు. శిరీష్ కాలువలో నిలబడి వున్న కుమార్‌ను చూశాడు. చకచక ఎండిపోయి వున్న కాలువలోనికి దిగాడు.

"కుమార్! ఏమిటిది? మీ సిబ్బంది మొత్తం యిక్కడే వుంది!" అన్నాడు శిరీష్.

కుమార్ నీరసంగా నవ్వి, "ఇక్కడ చేతి భాగం మాత్రమే ఎముకల గూడు వుంది. అదిగో టెలిఫోన్ బూత్‌వద్ద శవం సిద్ధంగా వుంది. రెండు బుల్లెట్లు దూరాయి. ఆ శవం ఎవరిదో!" అన్నాడు.

శిరీష్ నుదురు చిట్లించాడు. తన వెంట వున్న నడి వయస్కుడిని ప్రశ్నార్థకంగా చూశాడు. టెలిఫోన్‌బూత్ వద్దకు అతడిని తీసుకు వెళ్ళాడు.

లాండ్రీషాపు యజమాని నేలమీద పడివున్న శవాన్ని చూచి తెల్లబోయాడు. "నరసింహం!" అన్నాడు.

కుమార్ అతడిని అనుమానంగా చూచి "నీకెలా తెలుసు?" అన్నాడు.

తన వద్దకు వాసుదేవం గురించి మరిడమ్మ రావడం చెప్పి శిరీష్ అంతవరకూ జరిగిన విషయం వివరించాడు.

సార్జెంట్ కాగితం అందించాడు. కారు టైర్ల మధ్య దూరాన్ని రాసి, ఆ టైర్లు గల కారు ఏ రకానికి చెంది వుంటుందో కాగితంలో రాసి వుంది.

టైర్ల మధ్యదూరం మామూలు కార్ల కంటె ఎక్కువగా వుంది. అంటే హంతకుడు వచ్చిన కారు పెద్దతరహా కారు. చెవర్లెట్ కానీ, ప్లిమత్ కానీ అయివుంటుంది" అన్నాడు కుమార్.

"అవును. సిమెంటు రంగుది కానీ బూడిదరంగుది కానీ అయివుండాలి" అన్నాడు శిరీష్.

"అస్థిపంజరం ఎవరిదో నరసింహం కనిపెట్టాడు. ఆ

విషయం పోలీసులకు చెప్పాలనుకున్నాడు. కాని చెప్ప లేకపోయాడు. వాసుదేవం అని బ్రోకరేజ్ ఆఫీసులో పని చేసే తన సహచరుడిదేమో అస్థిపంజరం చెయ్యి. చేతికి వాచీ వుంది. కాబట్టి తన పరిశోధన మరికొంత సులువవుతుంది.”

కుమార్ తలూపి, “అప్పుడు ఈ చెయ్యి తాలూకు వ్యక్తికీ, వాసుదేవానికీ ఉమ్మడి శత్రువు ఎవరో తెలు స్తుంది. శత్రువుకు పెద్దతరహా కారు చెవర్లెట్ కానీ, ప్లిమత్ కానీ వుంది. ఆల్‌రైట్! కొస దొరుకుతోంది” అన్నాడు.

శవాన్ని, అస్థిపంజరం చేతినీ అంబులెన్స్‌లో ఎక్కిం చారు.

5

చెయ్యి వాసుదేవరాంది కాదు. అతడికి వాచీ లేదు.” అన్నాడు ఇన్‌స్పెక్టర్ కుమార్.

శిరీష్ కుర్చీలో వెనక్కు వాలి, “ఇప్పటికి యిద్దరు వ్యక్తులు చచ్చిపోయారు. ఈ చెయ్యి మూడోవ్యక్తి దన్న మాట!” అని కాగితాలు కుమార్‌కు అందించాడు.

“గుడ్! లిస్టు తయారు చేయించావా! ప్లిమత్ కారూ, చెవర్లెట్ కార్లూ, వాటి నెంబర్లూ, కారు యజమానుల పేర్లూ....” లిస్టు చదవసాగాడు కుమార్.

“వాటిలో సిమెంట్ రంగు వాహనాలు ప్లిమత్ కంపె నీకే వున్నాయి. ఆ రంగువాహనాలు నగరంలో అయిదు వున్నాయి. వాటిలో మనకు కావలసిన వాహనం ఏదో సులువుగా ఒడబోయాలి.”

“అస్థిపంజరం చేతినీ, వాచీనీ పత్రికలలో ప్రకటిం చాలి. మూడో హతుడు ఎవరయిందీ తెలియవచ్చు.”

కుమార్ తలూపాడు.

"పోస్టుమార్టం రిపోర్టు వచ్చిందా?"

"పద వెళదాం, పాథాలజీ సర్జన్‌తో మాట్లాడదాం!" లేచాడు కుమార్. ఇద్దరూ జీపులో కూర్చున్నారు, కుమార్ జీపు నడపసాగాడు.

పాథాలజీ సర్జన్ తన ఆఫీసు గదిలో కూర్చున్నాడు. కుమార్, శిరీష్ అతడికి ఎదుటి సీట్లలో కూర్చున్నారు.

"నరసింహాన్ని మొదటి బులెట్ గుండెలో గాయ పరచి క్షణాలలో ప్రాణం తీసింది. రెండో బులెట్ ప్రేగు లను చీల్చుకొని వెనక్కి దూసుకుపోయింది. గుండెను గాయపరచిన బులెట్ వెన్నెముకలో యిరుక్కుంది" అన్నాడు సర్జన్.

"బులెట్‌ను చూపిస్తారా?"

సర్జన్ తలూపి, టేబులు సొరుగు తెరిచాడు. చిన్న ప్లాస్టిక్ భరిణె వాళ్ళకు అందించాడు. కుమార్ బులెట్‌ను బయటకు తీశాడు.

"పాయింట్ త్రీ టూ కాలిబర్ పిస్తోలు నుండి ఈ బులెట్ వెలువడింది" అన్నాడు కుమార్.

సర్జన్ మరో భరిణె తీసి, "నరసింహం దుస్తులలో ఈ నాచు దొరికింది. అతడి జీర్ణకోశాలలో నిలవ నీరు వుంది. తలలో కూడా నాచు యిరుక్కుంది. అంటే నరసింహం ఏదో చెరువులో మునిగి వుండటమో, ఎవరైనా అతడిని ముంచి చంపాలని ప్రయత్నించడమో జరిగి వుండాలి" అని కుమార్‌కు అందించాడు.

శిరీష్ నుదురు చిట్లించాడు. నరసింహం శరీరం మీద నాచు వుంది. అస్థిపంజరం చెయ్యి నీటి కాలువలో దొరి కింది. కాలువలో నీరు ఎటు వస్తోంది? అస్థిపంజరం

మొత్తం కొట్టుకురాకుండా చెయ్యి మాత్రమే ఎలా కొట్టుకు వచ్చింది? నరసింహం నీటిలో హత్య కాకుండా తప్పించు కుని చివరకు పిస్తోలుకు బలి అయాడా?

శిరీష్ కళ్ళు పెద్దవయ్యాయి.

చెరువులోంచి కాలువలోకి నీరు ఎలా వస్తుంది? బయట చెరువులో అయితే నరసింహంను చంపాలని ప్రయత్నిం చడం సాధ్యం కాదు. అయితే........

"సర్జన్‌గారూ! అస్థిపంజరం చెయ్యి నాచునీటిలో వుందేమో చెప్పగలరా?" అన్నాడు శిరీష్.

సర్జన్ తలూపి లోపలకు వెళ్ళాడు. అరగంట తర్వాత తిరిగి వచ్చాడు.

"చేతి ఎముకలను విడదీశాను. ఎముకల మధ్య నాచు ఆకు వుంది. అంటే మిగతా అస్థిపంజరం కూడా నాచు నీటిలో వుండి వుండాలి" అన్నాడు సర్జన్.

శిరీష్ హుషారుగా లేచాడు.

"ఎక్కడకు వెళదాం?" అన్నాడు కుమార్.

"పత్రికలో ప్రకటన యిచ్చాక మామిడితోటకు వెళ్దాం. కాలువలోకి నీరు ఎలా వస్తోందో తెలియవచ్చు."

"రైట్, పద!"

ఇద్దరూ సర్జన్‌కి కృతజ్ఞతలు చెప్పుకుని బయటకు కదిలారు.

6

అనసూయ పోలీస్‌స్టేషన్ ముందు ఆగింది. బాలూ ఆమె ముఖంలోకి చూస్తూండిపోయాడు.

"చెయ్యి స్పష్టంగా చూశావుట్రా?" అడిగింది అన సూయ. ఏడ్చి ఏడ్చి ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి.

బాలూ దీనంగా చూశాడు, "చూశానమ్మా! అదే వాచీ, హెన్రీ శాండజ్ - అద్దం పగిలిన వాచీ" అన్నాడు.

"పత్రికలో బొమ్మ సరిగా పడిందో లేదో...."

"లోపలకు వెళ్ళి చూద్దాం."

ఇద్దరూ పోలీస్ స్టేషన్‌లోకి నడిచారు. రైటర్ వాళ్ళని ప్రశ్నార్థకంగా చూచి బయటే నిలబెట్టేశాడు.

"ప....త్రికలో....చెయ్యి ఫోటో వేశారు. దాన్ని చూడాలని వచ్చాం" అంది అనసూయ బొంగురు గొంతుతో.

"మీ యింట్లో ఎవరు కనిపించడం లేదు?" అడిగాడు రైటర్.

"మా ఆయన మాధవన్."

"ఎంతకాలం నుండి?"

"సరిగ్గా క్రిందటి ఈ రోజు. అంటే పోయిన బుధ వారం!"

"అప్పటి నుండి పోలీస్ రిపోర్టు యివ్వలేదా!"

"ఇవ్వాలని నాకు తెలియదండి."

"చేతిని చూపిస్తే గుర్తుపట్టగలరా?"

"వాచీ కూడా వున్నదట కదండీ!"

కానిస్టేబులును పిలిచాడు రైటర్. తల్లీ కొడుకులను లోపలకు పంపాడు.

స్టేషన్ ముందు కారు ఆగింది. డిటెక్టివ్ శిరీష్, ఇన్‌స్పెక్టర్ కుమార్ కారు దిగి స్టేషన్‌లోకి నడిచారు. రైటర్ శల్యూట్ కొట్టి మాట్లాడాడు.

బాలూ, అనసూయా గాజు కేసు ముందు నిలబడి వున్నారు. ఇద్దరూ గుడ్లప్పగించి గాజు కేసులోకి చూస్తున్నారు. గాజు కేసులో ముంజేతి ఎముకల కూర్పు, దాని పక్కగా అద్దం వూడిన చేతి వాచీ వున్నాయి. వాచీ

డయల్ మీద హెన్రీశాండజ్ అన్న ఇంగ్లీషు అక్షరాలు స్పష్టంగా వున్నాయి.

ఎడమచేతి ఎముకల కూర్పు.

కుమార్ గాజుకేసు వైపే నడిచాడు. "ఈ చేతి వాచీని గుర్తుపట్టావా అమ్మా?" అన్నాడు.

ఆమె తలూపింది. "వాచీ మావారిదే నండి?" అంది.

"మీవారేం చేస్తుంటారు?"

"మల్లిఖార్జునం అయ్యగారింట్లో గుమాస్తానండి."

"ఎనిమిది రోజులుగా మాధవన్ కనిపించకపోవడం మీకు ఆందోళనగా లేదా!"

"అయ్యగారు అతడిని ఎక్కడికయినా పనిమీద పంపారేమో అనుకున్నాను. అక్కడికీ బాలూ నేనూ కంగారు పడుతున్నాం."

"మల్లిఖార్జునంగారిని మీవారి విషయమై అడగలేదా?"

"రెండు మూడుసార్లు బాలూ అడిగాడు. ఎక్కడికి వెళ్ళాడో తనకు తెలియదన్నారట."

శిరీష్ మెల్లగా దగ్గి. "మీవారు అప్పుడప్పుడూ రాత్రిళ్ళు యింటికి రాకపోవడం అంటూ వుండేదా?" అన్నాడు.

"అవును బాబూ!"

"మీకు వాసుదేవం తెలుసా?"

"తెలుసండి. మావారికి బాగా స్నేహితుడు."

బాలూ ఆసక్తిగా చూచి "అంకుల్‌గారు కనిపించారండి-మా నాన్న కోసం వెతుకుతూంటే!" అన్నాడు.

శిరీష్ మొహంలో వెలుగు కనిపించింది. "ఎక్కడ?" అన్నాడు.

"మార్కెట్ వీధిలో నండి."

"ఎప్పుడు?"

"పోయిన బుధవారం నాడు."

"ఏం మాట్లాడాడో గుర్తుందా?"

"మా నాన్న కవిత యింట్లో దొరుకుతాడని చెప్పాడండి."

"కవిత యిల్లు ఎక్కడ?"

"గోపురం వీధిలో ఆరో నెంబర్ యిల్లు."

శిరీష్ నోట్ చేసుకున్నాడు. ఆ తరువాత అడిగాడు "కవిత ఎవరు?"

"తెలియదండి."

అనసూయ మెల్లగా ఏడుస్తోంది.

కానిస్టేబులును తోడు యిచ్చి అనసూయనూ బాలూనూ యింటికి పంపించేశాడు కుమార్.

"మామిడితోట దగ్గరున్న కాలువలోకి నీరు మల్లిఖార్జునం బంగళాలోంచి వస్తోంది. ఎండిపోయిన కాలువలోకి అతడి బంగళా డ్రెయినేజ్‌లోంచి మాత్రమే నీరు రావడంలో అంతరార్థం ఏమిటి? మల్లిఖార్జునం వద్ద పని చేసే మాధవన్ చెయ్యి కాలువలో దొరికింది. మాధవన్‌కి బాగా పరిచయం వున్న వాసుదేవం అంతర్ధానమయాడు. మాధవన్‌కీ వాసుదేవంకీ కవిత తెలుసు. మధ్యలో నరసింహం పాత్ర ప్రత్యక్షమయింది. మల్లిఖార్జునానికి పిమెంట్ రంగులో వున్న ప్లిమత్ కారు వుంది. నరసింహం అతడి కారులో ప్రయాణించాడు. మరునాడు అతడివి ప్లిమత్ కారులో ప్రయాణించిన వ్యక్తి పిస్తోలుతో కాల్చిచంపాడు" కుమార్ ఆగాడు.

"అవును. కవిత ఎవరో తెలియాలి. కవితకు ఈ నలుగురు మగవాళ్ళతో పరిచయం ఎలాగో తెలియాలి. పైగా మల్లిఖార్జునం లాంటి యజమానికీ మాధవన్‌వంటి పనివాడికీ

ఆమె అంతగా చనువు కావడంలో అంతరార్థం ఏమిటి?"

శిరీష్ కణతలు సర్దుకుని, "కేసు అంతా గొలుసు కట్టు లాగా అల్లుకుపోయింది. పద కుమార్! గోపురం వీధిలో ఆరో యింటి సంగతి తెలుసుకుందాం!" అన్నాడు.

కుమార్ తలూపి కదిలాడు.

కారు గోపురం వీధిలో ఆరో నెంబర్ యింటి ముందు ఆపాడు శిరీష్. ఇంటికి తాళం పెట్టి వుంది.

శిరీష్ మారుతాళం చెవుల సహాయంతో తాళం కప్ప తెరిచాడు. ఇద్దరూ యింట్లోకి నడిచారు. ఇల్లు నిశ్శబ్దంగా వుంది. పడక గదిలో మంచం మీద బట్టలు చెదిరిపోయి వున్నాయి. పౌడర్ డబ్బా క్రిందపడి వుంది. నేలమీద దుమ్ము పేరుకుని వుంది.

"కవిత యిల్లు విడిచిపెట్టి వారం రోజు లయింది" అన్నాడు శిరీష్.

"అవును. మల్లిఖార్జునం యింటిమీద దాడిచేస్తే వ్యవహారం బయట పడుతుంది" పళ్ళు పట పట కొరికాడు కుమార్.

శిరీష్ మందహాసం చేశాడు. "ఆధారా లేమిటి? మల్లిఖార్జునమే ఈ హత్య వెనుకా, అంతర్ధానాల వెనుక వున్నట్టు సాక్ష్యాలు సంపాదించాలి. వీటికి కారణభూతమైన అంశాలను వెతికి పట్టుకోవాలి."

"అవును. మార్గం ఏమిటి?"

"చెబుతాను" శిరీష్ బయటకు నడిచాడు. కుమార్ అతడిని అనుసరించాడు.

7

మల్లిఖార్జునం పోర్టికోలోకి వచ్చాడు. ప్లిమత్ కారు పోర్టికోలో నిగనిగలాడుతోంది.

"డ్రయివర్!" పిలిచాడు మల్లిఖార్జునం.

క్రోటన్స్ మొక్కల వద్ద నుండి డ్రయివర్ పరుగెత్తుకు వచ్చాడు. యూనిఫాం, టోపీ సర్దుకున్నాడు. కుక్క దూరంగా నిలబడి తోకాడిస్తోంది.

"కొత్తకారు బుక్ చేశాను. కంపెనీకి వెళ్ళిరా!" అన్నాడు మల్లిఖార్జునం. డ్రయివర్ తలూపి బయల్దేరాడు.

అరగంటలో కొత్త అంబాసిడర్ కారులో తిరిగి వచ్చాడు డ్రయివర్. కారును పోర్టికోలో ఆపాడు. అక్కడ వుండవలసిన సిమెంట్ రంగు ప్లిమత్ కారు లేదు. డ్రయివర్ బంగళా లోపలకు వెళ్ళాడు.

మల్లిఖార్జునం హాలులో కూర్చున్నాడు. అతడి ముందు టీపాయ్ వుంది. టీపాయ్ మీద గాజు గ్లాసులో నీళ్ళు వున్నాయి.

"కారు తీసుకు వచ్చాను సార్!" తాళం చెవులు అందించాడు డ్రయివర్.

"గుడ్. తాళం చెవులు అందుకుని తలూపాడు మల్లిఖార్జునం.

డ్రయివర్ బయటకి నడిచాడు. తోటలో పచార్లు చేశాడు. ఆలోచనలు తరుముతున్నాయి. ప్లిమత్ కారు ఏమయింది! డ్రయివర్ మొక్కలకు దూరంగా నడిచాడు. సిమెంటు చప్టా కట్టిన స్విమ్మింగ్‌పూల్ ప్రక్క నిలబడ్డాడు. వెడల్పయిన పూల్. చాల కాలం నుండి ఉపయోగంలో లేనట్టు నీళ్ళు నాచుపట్టి వున్నాయి.

డ్రయివర్ చప్టామీద నిలబడ్డాడు. నీటిలోకి చూశాడు. అతడి నుదురు ముడతలు పడింది.

నీరు కలకబారి వుంది. నాచు దూరంగా జరిగింది. తిరిగి దగ్గరగా అల్లుకుంటోంది. నాచు క్రింద చేపలు తిరుగు

తున్నాయి.

డ్రయివర్ చప్టాదుట్టి తిరిగి వచ్చాడు. అటుప్రక్క కారు పైర్ల గుర్తులున్నాయి. పట్టి నేలమీద నుండి చప్టా మీదకు వచ్చినట్టు స్పష్టంగా వున్నాయి. డ్రయివర్ తిరిగి పోర్టికోలోకి వచ్చాడు.

డ్రయివర్ గుమ్మంచాటున నిలబడి మెయిన్ హాలులోకి చూశాడు. మెయిన్ హాలులో మల్లిఖార్జునం లేడు. డ్రయివర్ లోపలకు నడిచాడు. మెల్లగా టీపాయ్ సమీపించాడు.

మెట్లపై గదిలో సంభాషణ వినిపిస్తోంది. డ్రయివర్ చటుక్కున జేబులోంచి మాత్ర తీసి గ్లాసులో వేశాడు. మెట్లు ఎక్కి నడవాలో ఆగాడు. వెనుక గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి! అతడు చప్పుడు చేయకుండా అటు నడిచాడు. కీటికీలోకి మైకు వదలిపెట్టి జేబులోని టేప్ రికార్డర్ స్విచ్ ఆన్ చేశాడు. మల్లిఖార్జునం గొంతుతోబాటు ఆడగొంతు వినిపిస్తోంది.

"అట్టే అరవక! వాళ్ళకు పట్టిన గతి నీకూ పడుతుంది" అంటున్నాడు మల్లిఖార్జునం.

ఆడగొంతు కెవ్వుమంది. "మాధవన్‌ని ఏం చేశావు?" అంది.

"మాధవన్ చచ్చిపోయాడు."

"ఎలా?"

"వాడు నీ మీద చెయ్యి వేశాడు. అందుకే స్విమ్మింగ్ పూల్లో ముంచి చంపేశాను. వెధవ! వాడి చెయ్యి నీరుపోయే ఇనుప జల్లెడలో కట్ అయిపోయింది. స్విమ్మింగ్‌పూల్ పేరుకే పూల్. అదో పెద్ద అఘాతం!" క్రూరంగా నవ్వాడు.

"మాధవన్‌ని చంపేశారా?"

"అవును. వాడిని వెంబడించుకుని వాసుదేవం వచ్చాడు. వాసుదేవం ద్వారా నీ రహస్యం నరసింహానికి తెలిసింది.

అప్పటికే మాధవన్, వాసుదేవం నా చేతిలో చచ్చారు. నరసింహం వాళ్ళు యెలా చచ్చారో కనిపెట్టాడు. నా కళ్ళు కప్పి తప్పించుకున్నాడు. మామిడి తోటలోకి వదలిపెట్టే స్విమ్మింగ్‌పూల్స్ నీటిలో శవాలకు సంబంధించిన మాంస ఖండాలు గుర్తించాడు. చేపలు శవాలను తినగా నీటి ప్రవాహంలో తప్పించుకున్న మాంసఖండాలవి.

నరసింహం ప్రమాదం గుర్తించి నా నుండి పారిపోబోయాడు. పబ్లిక్ టెలిఫోన్ బూతులో దూరాడు. చావును కొనితెచ్చుకున్నాడు.

"ఈ విషయం బయటపడితే...."

"పిచ్చి కవితా! ఆధారాలు లేవు. సిమెంటు రంగు ప్లిమత్ కారులో నరసింహాన్ని తీసుకు వచ్చాను. అదొక్కటే సాక్ష్యం! అందుకే కారును స్విమ్మింగ్ పూల్‌లో ముంచేశాను."

కవిత గొల్లుమన్నది.

"అందుకే నువ్వు యెదురుతిరిగితే నీకూ జలసమాధే కాచుకుని వుంది."

కవిత ఏం మాట్లాడిందో డ్రయివర్ వేషంలో వున్న డిటెక్టివ్ శిరీష్ వినలేదు. టేప్‌రికార్డర్ స్విచ్ ఆఫ్‌చేసి మెల్లిగా క్రిందకు నడిచాడు

బయటకు వెళ్ళి ఫోన్‌చేసి తిరిగివచ్చాడు శిరీష్.

అప్పటికి మెయిన్ హాలులో మల్లిఖార్జునం మగతగా కూర్చుండి కనిపించాడు. టీపాయ్‌మీది గాజుగ్లాసు ఖాళీగా వుంది. పోలీసులు కొద్దిసేపట్లో లోపలకు వచ్చారు.

శిరీష్ వాళ్ళకు ఎదురువెళ్ళాడు. □

ఆమె భయం

వసుంధర

నాకింకా పెళ్ళి కాలేదు. అయ్యే అవకాశమూ దగ్గర్లో లేదు.

చెల్లెలి పెళ్ళి చేశాకనే నా పెళ్ళి అని నాన్న అంటున్నాడు. దాని పెళ్ళి ఎప్పుడు చేస్తాడో తెలియదు.

నా కిప్పుడు ఇరవై ఆరేళ్ళు ఉద్యోగం వచ్చి రెండేళ్ళయింది. పెళ్ళి చేసుకుంటే నేను, నా భార్య సుఖంగా బ్రతకడానికి సరిపోతుంది జీతం.

నాది మంచి పెర్సనాలిటీ. నా చెల్లెలిది నాన్న పోలికైతే నాది అమ్మపోలిక. నేను చాలా అందంగా ఉంటానని

స్నేహితులంటారు. నాకూ అనిపిస్తుంది. సినిమాల్లోకి పోతే లక్షలకు లక్షలు సంపాదించ వచ్చునని చాలామంది అన్నారు. చేతిలో లక్షలు లేకుండా సినిమాల్లోకి వెళ్ళి హీరోలైనవాళ్ళు అరుదని అనుభవజ్ఞులు అన్నారు. అందు కని ఆ ఆలోచన కట్టిపెట్టాను.

మగాడికి ఎలాగైనా పెళ్ళవుతుంది. నా పోలిక చెల్లికీ, చెల్లిపోలిక నాకూ వచ్చి ఉంటే బాగుండునని అమ్మ తరచుగా అనుకుంటూంటుంది.

ఏది ఏమైతేనేం నా కింకా పెళ్ళికాలేదు. అయ్యే అవకాశమూ దగ్గర్లో లేదు. కానీ వయసు, మనసు ఊరుకోవు కదా!

నా కిప్పుడు కావలసింది పెళ్ళికాదు. ఆడపిల్ల!

ఆడపిల్లను పెళ్ళి రూపంలో సంపాదించాలని చూస్తున్నాను. అది చాలా చవకైన పద్ధతి. వాళ్ళే నాకు బట్టలు పెడతారు. మా వాళ్ళందరికీ బాగా మర్యాదలు చేస్తారు. కట్నం పేరు చెప్పి డబ్బుకూడా ఇస్తారు.

ఆడపిల్ల కావాలనుకుంటే మరో పద్ధతికూడా ఉంది. వేశ్య దగ్గరకు వెళ్ళడం!

నాకు వేశ్య దగ్గరకు వెళ్ళాలనే ఉంది. అయితే....

మర్యాదస్థుల కుటుంబంలో పుట్టినవాణ్ని. బుద్ధిగా చదువుకున్న వాణ్ని. మంచి పేరు నిలుపుకోవాలనుకునే వాణ్ని. వేశ్యావాటికల కెలా వెడతాను?

అదీగాక, వేశ్యలకు వేర్వేరు ధరలుంటాయి. నేను ఎక్కువ ఇచ్చుకోలేను. అలాగని ధర తక్కువని కక్కుర్తి పడితే భయంకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది. ఎక్కువ ఇచ్చుకున్నా సుఖవ్యాధులు రావన్న గ్యారంటీ ఏమీ లేదు. అవి తగ్గించుకుందుకు డాక్టర్లకు మంచినీళ్ళలా

డబ్బు పోయాలి. అసలు అలాంటి రోగాలతో డాక్టరు దగ్గ రకు వెళ్ళాలంటేనే సిగ్గుగా ఉంటుంది.

పెళ్ళి కాకుండా ఆడపిల్ల పొందు కావాలంటే చాలా ఉపాయలున్నాయని అడక్కుండానే నా స్నేహితుడు సోమ లింగం చెప్పాడు నాకు. వాటిల్లో ఒకటి ప్రేమించి మోసం చెయ్యడం. మోసం చెయ్యడం నావల్ల నవుతుందా అన్నది నా అనుమానం. నా వయసు నన్నెంతగా తొందరపెడు తున్నదంటే నా మనసు నన్ను మోసానికి ప్రోత్సహిస్తు న్నది. మోసానికి కాక మరొకందుకు భయపడ్డాను నేను.

ఈ రోజుల్లో ఆడపిల్లలు తెలివి మీరిపోయారుట. వాలు చూపులను ఎరగా పెట్టి అమాయకత్వాన్ని నటించి—తల్లి దండ్రుల వల్ల తీరని డబ్బు కోరికలను బాయ్‌ఫ్రెండ్సు ద్వారా తీర్చుకుని ఆపైన బుద్ధిగా పెళ్ళి చేసుకుని కాపురం చేసుకుంటున్నారుట. అందువల్ల ఇది బాగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే!

ఖర్చంటేనే భయం నాకు. ఖర్చు లేకుండా ఆడపిల్ల కావాలంటే నిజంగా అమాయకురాల్ని వెతికి పట్టుకోవాలి. అయితే అందమైన ఆడపిల్లలందరూ చూడ్డానికి అమాయకం గానే కనబడతారు. మరెలా?

ఖర్చులేకుండా ఆడపిల్ల దొరికే ఉపాయం కూడా ఓ రోజున నాకు అనుకోకుండా సోమలింగమే చెప్పాడు.

ఆ రోజు ఇద్దరం పార్కులో కూర్చున్నాం.

ఎందుకో సోమలింగం నిట్టూర్చి — "నాకు నీలాంటి పెర్సనాలిటీ ఉన్నా బాగుండును. పైసా ఖర్చు లేకుండా స్త్రీ సుఖం పొందేవాణ్ణి" అన్నాడు.

నా కళ్ళు మెరిశాయి "అదెలా?" అన్నాను.

"డబ్బున్న వాళ్ళూ, పెద్ద పెద్ద ఆఫీసర్లూ వెతికి వెతికి

అందమైన ఆడపిల్లల్ని పెళ్ళి చేసుకుంటారు. అయితే వాళ్ళ దృష్టి డబ్బుమీదా, సంఘంలోని హోదామీదా ఉండడంవల్ల భార్యలను నిర్లక్ష్యం చేస్తూంటారు. అంతేకాదు. వాళ్ళు స్త్రీ సుఖం కోసం భార్యమీదనే ఆధారపడరు. అందువల్ల ఆ ఆడవాళ్ళు పరాయి మగవాళ్ళ వేటలో ఉంటారు. అలాంటి వాళ్ళు దొరికితే మనకు పైసా ఖర్చుండదు సరి గదా—వాళ్ళే ఎదురిస్తారు....'' అన్నాడు సోమలింగం.

“నేను నమ్మను....'' అన్నాను కానీ నాకు నమ్మాలని ఉన్నది.

“అదిగో అలా చూడు ...'' అన్నాడు సోమలింగం.

అటు చూశాను. కళ్ళు చెదిరాయి. అంతసేపూ అటు చూడనందుకు నన్ను నేనే నిందించుకున్నాను. అక్కడ ఓ అందాల భరిణ బెంచీమీద ఒంటరిగా కూర్చుని ఉన్నది. చూడగానే తెలిసిపోతోంది—ఖరీదైన మనిషి.

“ఆమె పేరు పుణ్య, భర్త పేరు దిలీప్. దిలీప్ చాలా పెద్ద ఆఫీసరు. నెలకు ఇరవై రోజులు టూర్లలోనే ఉంటాడు. ఆ పది రోజుల్లోనూ వారం రోజులు పూర్తిగా క్లబ్బుల్లో ఉంటాడు. ఇంత అందమైన భార్యను వదిలి ఎలా ఉంటాడో ఫూల్ అనిపిస్తుంది. ఆమె రోజూ సాయంత్రం పార్కుకి వచ్చి కూర్చుంటుంది. దిగులు ఆమె కళ్ళలో కనబడుతుంది. ఇలాంటి స్త్రీని వలలో వేసుకొనడం సులభం. అయితే అందుకు ముఖ్యంగా అవసరమైన అందం, పర్సనాలిటీ నాకు లేవు....'' అన్నాడు సోమ లింగం.

నాలో ఆశలు రేగాయి. అదృష్టం బాగుంది ఈమె నన్ను ప్రేమిస్తే పెళ్ళి బాధ్యతా ఉండదు. నాకు సుఖమూ లభిస్తుంది. అపైన వీలైనంత డబ్బుకూడా ఈమెవద్ద

నుంచి లాగవచ్చు. మనిషి బాగా ఖరీదైనదానిలా కనిపిస్తుంది.

"నువ్వు చెప్పేది నిజమే నంటావా?" అన్నాను.

"నన్నిలా వచ్చుప్రశ్నలు వేసి బాధించే బదులు నువ్వే వెళ్ళి ప్రయత్నించి నిజానిజాలు తీసుకోరాదూ" అన్నాడు సోమలింగం.

"చెంప పగుల్తుందేమోనని భయం...." చెంప తడుముకుంటూ అన్నాను.

"అడిగేలా అడిగితే చెంప ఎందుకు పగుల్తుంది?" అంటూ సోమలింగం ఆడవాళ్ళతో పరిచయం ఎలా పెంచుకోవాలో నాకు చెప్పాడు.

నాలో ఆవేశం రగిలింది. అతడి పాఠాల నప్పటికప్పుడు అమలు జరపాలనిపించింది. చటుక్కున లేచి ఆమె వద్దకు వెళ్ళాను. ఆమెను సమీపించి ఆగిపోయాను. ఆమె ప్రశ్నార్థకంగా నా వంక చూసింది.

"ఆ చూపులు ఎంత బాగున్నాయి? ఆ అమాయకత్వం...

"మీ పేరు పార్వతి కదూ...." అన్నాను.

"కాదండీ....పుణ్య...." అన్నదామె.

"అయామ్ సారీ-నా చిన్ననాటి స్నేహితురాలు పార్వతి పోలికలు మీలో కన్పిస్తేనూ అవునేమోనని పలకరించాలని వచ్చాను. ఒంటరిగాణ్ణి. వెధవ్వాళ్ళో బోరు కొడుతోంది. తెలిసినవాళ్ళెవరైనా కనబడితే ప్రాణంలేచినట్లుంటోంది" అన్నాను. అక్కణ్ణించి కదలకుండా ఆమె ఆహ్వానంకోసం ఎదురు చూస్తున్నాను.

"ఒంటరితనం బోరేనండీ" అన్నదామె. కానీ ఆమె నన్ను ఆహ్వానించలేదు.

"అవునండి. మీకు అభ్యంతరం లేకపోతే కాసేపు

ఇక్కడ కూర్చుంటాను. మిమ్మల్ని చూస్తూంటే మా పార్వతిని చూసినట్లే వుంది" అన్నాను.

ఆమె అభ్యంతరము చెప్పలేదు. ఆహ్వానించనూలేదు. నేను చొరవచేసి అదే బెంచీమీద ఆమెకు కాస్త దూరంగా కూర్చున్నాను-

ఇద్దరి మధ్యా కాసేపు మౌనం రాజ్యమేలింది. నెమ్మదిగా నేనే సంభాషణ ప్రారంభించాను. నేను నా గురించి చెప్పుకున్నాను. ఆమె తన గురించి చెప్పుకుంది. సోమలింగం ఆమె గురించి చెప్పిందంతా నిజమే!

కాస్సేపయ్యాక నేను లేచి నిలబడ్డాను.

"మా యిల్లు ఇక్కడికి దగ్గరే—టీ తాగి వెడుదురుగాని రండి...." అంటూ ఆహ్వానించిందామె.

"అయ్యో-ఎందుకండీ శ్రమ" అన్నాను.

"శ్రమ ఏమీలేదు-టీయే గదా" అన్నదామె.

పార్కుకి ఆమె ఇల్లు బాగా దగ్గర. ఏవేవో అనుభవాలను వూహించుకుంటూ ఉత్సాహంగా ఆమె వెంట వెళ్ళాను.

ఇల్లు చాలా బాగుంది. ఇంట్లో ఖరీదైన ఫర్నిచర్.

ఆమె తన పెళ్ళి ఫొటోల ఆల్బం చూపించింది. పెళ్ళి చాలా వైభవంగా జరిగిందనిపించింది. భయం కూడా వేసింది. ఈమె నిజంగా నా వలలో పడుతుందా అని.

టీ అనే అంది కానీ ఆమె నాకు స్వీట్సు పెట్టింది. బ్రూ ఇచ్చింది. కానీ అంతకు మించి ఏమీ ఇవ్వలేదు.

"రోజూ పార్కుకి రండి. సరదాగా కబుర్లు చెప్పుకో వచ్చు...." అన్నదామె.

నా కెంతో సంతోషం కలిగింది. అయితే మనసు, వయస్సు నన్ను తొందరపెడుతున్నాయి. ఈమె భర్త

ప్రస్తుతం ఊళ్ళో ఉన్నట్లు లేడు. అతడు వచ్చేలోగా మొదటి అవకాశం చిక్కించుకుంటే....

"మీ వారిని నా కెప్పుడు పరిచయం చేస్తారు?" అన్నాను.

"ఏమో—ఆయన ఊర్నించి ఎప్పుడొస్తారో—" అన్నదామె అనాసక్తతతో. భర్త ప్రసక్తి తీసుకురావడం ఆమెకు నచ్చలేదని నేను గ్రహించి సంతోషించాను. నా వద్ద భర్త ప్రసక్తి తీసుకురాదల్చుకోలేదంటే ఆమె నన్ను ప్రేమిస్తున్నదన్నమాటే!

ఆ రోజుకు బయటపడ్డాను. ఆ రాత్రికి ఇంట్లో తీపి కలలు కన్నాను. మర్నాటి సాయంత్రం కోసం ఎదురు చూశాను. ఆమెను కలుసుకున్నాను. ఇద్దరం ఏమేమో కబుర్లు చెప్పుకున్నాం.

మాటల సందర్భంలో ఆమెకు అయిస్క్రీం అంటే తనకు గల ఇష్టం గురించి చెప్పింది. సరిగ్గా అదే సమయంలో నాకు అయిస్క్రీం బండి కనబడింది. వాణ్ని పిలిచాను. రెండు అయిస్క్రీంలు తీసుకున్నాను.

అయిదు రూపాయలు! నేను అయిస్క్రీం తినను. కడుపు నిండదు—ఖర్చు ఎక్కువ. బయట టిఫిన్ తింటే నేను మసాలాదోసె తింటాను....మనసులో ఉసూరుమంటోంది. ఉత్తిపుణ్యాన అయిదు రూపాయలు....కానీ ఆ మాత్రమైనా ఖర్చు చేయకుండా ఇలాంటి సుఖం దొరుకుతుందా? అసలు పుణ్యతో మాట్లాడడమే ఓ అదృష్టంగా, అపూర్వానుభవంగా ఉన్నది నాకు. ఈ అదృష్టానికే ఖర్చు చేయవచ్చు—అయిదు రూపాయలు! అసలు నా పేదరికం వల్ల కానీ—లక్షలు పోసి కొనుక్కోవలసిన అపురూప యువతి పుణ్య!

నేను పర్సు తీసేలోగా పుణ్య తన జాకెట్లోంచి ఐదు

రూపాయల నోటు తీసింది. అదే అవకాశంగా తీసుకుని నేనామె చేయి పట్టుకుని వారించాను.

"ప్లీజ్—అయిస్క్రీం నాకు యిష్టం. దీనికి నేనే డబ్బివ్వాలి" అన్నదామె. ఆమె చేయి విడిపించుకోలేదు. అందుకని నేనూ వదలకుండా—"ఇతన్ని పిలిచింది నేను. కాబట్టి నేనే డబ్బివ్వాలి" అన్నాను.

"మీరిచ్చినా అతను తీసుకోడు. ఇవ్వండి చూద్దాం" అంది పుణ్య.

"అప్పుడు నేనామె చేయి వదిలి—"సారీ!" అన్నాను.

ఆమె మనోహరంగా నవ్వింది. తనేవాడికి డబ్బిచ్చింది.

ముష్టి అయిదు రూపాయల కోసం నేనెంతగానో మథనపడ్డాను. తీరా చేసి డబ్బు ఆమే ఇచ్చేసింది. డబ్బు పుణ్య ఇవ్వడం నాకు బాధే ననిపించింది. ఏమనుకున్నా ఆడదాని ముందు తనే పైచేయిగ ఉండాలని మగవాడికుంటుందేమో!

ఇద్దరం మళ్ళీ కబుర్లలో పడ్డాం.

ఆ రాత్రికూడా నన్నామె ఇంటికి పిలిచింది. మర్యాదలు చేసింది. ఎంతో అభిమానంగా చూసింది.

ఇలా ఎన్నాళ్ళు!

ఆడది చొరవచేసి తన కోరికను చెప్పదు కదా! పుణ్యతో నేను కాలక్షేపార్థం స్నేహం చేయడం లేదు. తిండికోసం స్నేహం చేయడం లేదు. డబ్బుకోసం స్నేహం చేయడం లేదు. స్త్రీ పురుషులకు సంబంధించిన సుఖాన్ని ఖర్చు లేకుండా, బాధ్యతలు తగులుకోకుండా పొందాలన్నది నాఆశ.

ఇంక జాప్యం చేయడ మెందుకు?

చటుక్కున ఆమె చేయి పట్టుకున్నాను.

ఆమె ఆశ్చర్యంగా నావంక చూసింది. ఆ కళ్ళలో కోపం లేదు. భయం లేదు. ఆశ్చర్యం .... కేవలం

ఆశ్చర్యం....

ఆమె నా చేతిని విడిపించుకోలేదు. ఆ ధైర్యంతో ఆమెను దగ్గరగా తీసుకున్నాను. ఆహా....ఏమి ఆ మధురానుభవం....

ఆమె చటుక్కున నన్ను విడిపించుకుని—"ఏమిటిది?" అంది.

ఆమె నన్ను తిట్టలేదు. ఏమిటిది—అనడిగింది.

"కోరిక!" అన్నాను.

"నువ్వు నా గురించి ఏమనుకుంటున్నావు?" అన్నదామె.

"అందమైనదానివని!" అన్నాను.

"నాకు వివాహమయింది. నన్ను కోరడం తప్పుకదూ" అన్నదామె.

"తప్పొప్పుల గురించి నాకు తెలియదు. నా కోరిక నీకు చెప్పాను. అటుపైన నీ యిష్టం."

"నే నొప్పుకోకపోతే—....?"

"ఎందుకు ఒప్పుకోవు? నీ భర్త నిన్ను నిర్లక్ష్యం చేస్తూంటే సహించి—నీమీది ప్రేమతో నీ దరికి వచ్చిన వాడిని అసహనంతో గెంటేస్తావా?" అన్నాను.

"నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?"

"నా ప్రేమ బలం నా కౌగిలిలో చూపిస్తాను" అంటూ ఆమెను మరోసారి బలంగా కౌగిలించుకున్నాను. ఆమె నన్ను విడిపించుకుందుకు కాసేపు పట్టింది.

ఆమె వెళ్ళి దూరంగా సోఫాలో కూర్చుని—"నా మనసు వశం తప్పుతోంది. ప్లీజ్—వెళ్ళిపో" అంది

నేనామెను సమీపించి పక్కన కూర్చుని "నీ మనసు వశం తప్పడమే నాక్కావలసింది. నేను నిన్ను దేవతలా

ఆరాధిస్తాను. ప్లీజ్—కాదనకు....” అన్నాను.

“నాకు రెండు రోజులు గడువు కావాలి—సరిగ్గా రెండు రోజులు....” అన్నదామె.

నేను మరి కాసేపు ప్రయత్నించి—ఆమె గడువు విషయంలో తిరుగులేని నిర్ణయం తీసుకున్నదని గ్రహించి వచ్చేశాను. రెండురోజులు గడువెందు కడిగిందామె? పూర్వకాలం అందమైన యువతులు ఇష్టంలేని పురుషుడి బాధ వదుల్చుకునేందుకు ఇలా వ్రతమనో, మరేదోచెప్పి గడువు అడిగేవారు. ఈమెకూడా అదే చేస్తోందా?

నేను తొందరపడ్డానా? మరికొంత పరిచయం వరకూ ఆగి ఉండవలసిందా? ఏమో—ఏది ఏమైనా జరిగిందానికి విచారించి ప్రయోజనం లేదు.

రెండు రోజుల తర్వాత నాకు జీతాలు వచ్చాయి. ఆరోజు ఆమెకు మంచి ఖరీదైన బహుమతి ఏదైనా ఇచ్చి వశపర్చుకొనవలెనని ఉన్నది. అయితే ఎంత ఖర్చుపెట్టాలి—ఏం కొనాలి?

చాలాసేపు ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను. ఏం కావాలో ఆమెనే అడగాలి. ఆమె వద్దన్నా బలవంతపెట్టి ఏదైనా కొనాలి! ఆమె డబ్బుమనిషి కాదు. అలాంటప్పుడు మొదటిసారికి నేను కొంత ఖర్చుచేస్తే ఆ తర్వాత అది నేను ఎలాగో అలా వెనక్కు రాబట్టుకొనవచ్చును.

బహుమతి విషయంలో ఓ నిర్ణయానికి వచ్చాను.

సాయంత్రం పార్కుకి అనుమానంగానే వెళ్ళాను. కానీ ఆమె అక్కడ ఉన్నది.

“ఈరోజు నేను నీకోచీరకొని ఇవ్వదల్చుకున్నాను. నువ్వు నాతో బజారుకివచ్చి నీకు నచ్చింది కొనుక్కో” అన్నాను.

“నాకు చీర కొంటావా? దగ్గర ఏమాత్రం డబ్బులున్నా

యేమిటి?" అన్నదామె చిలిపిగా నవ్వుతూ.

ఆమె నన్ను మరీ లేనివాడనుకుంటోందేమోనని అనుమానం వచ్చింది. అదృష్టవశాత్తూ ఆ రోజే నాకు జీతాలు వచ్చాయి. పర్సులో ఏడువందల యాభై చిల్లర ఉన్నది. అందుకే గర్వంగా పర్సుతీసి ఆమె చేతికిచ్చాను.

ఆమె పర్సందుకుని డబ్బు లెక్కపెట్టింది — "అబ్బా చాలా డబ్బుందే" అంది. తర్వాత నెమ్మదిగా—"పర్సు నా కిచ్చేయకూడదూ—నాకు చీర అక్కర్లేదు" అంది.

ఆమె వేళాకోళమాడుతున్నదని నాకు తెలుసు. అందుకే "ఆ పర్సు నీదే ననుకో — మరి నువ్వు నా కోరిక తీరుస్తావా?" అన్నాను.

"తప్పకుండా" అంటూ ఆమె లేచినిలబడి "పద!" అంది.

ఇద్దరం ఆమె ఇంటికి వెళ్లాం.

ఆమె నా స్వంత మవుతుందని నేను నిజంగా ఊహించలేదు. ఆ అనుభవం ఎంత గొప్పగా ఉందో మాటల్లో చెప్పలేను. ఆమెను వదిలి వెళ్ళాలనిపించడం లేదు.

సరిగ్గా అప్పుడు....

గుమ్మం దగ్గర ఎవరో కనిపించారు.

ఆమె కంగారుగా లేచింది. గుమ్మందగ్గర వ్యక్తి మాయమయ్యాడు.

"ఎవరు?" అన్నాన్నేను.

"కొంప మునిగింది. నా భర్త వచ్చేశాడు" అందామె కంగారుగా.

నేను లేచి పారిపోవాలనుకున్నాను. కానీ ఎలా? కంగారులో బట్టలు కట్టుకునేసరికి మామూలుకంటె ఎక్కువసేపు పట్టింది. ఆ తర్వాత గుమ్మం వద్దనే అతడుంటాడేమోనని భయం.

"మనల్ని చూశాడా?"

"ఆఁ మన గురించి ఏమీ సందేహం లేని విధంగా చూశాడు...."

"మరెలా?" అన్నాను.

"ఎందుకలా కంగారుపడతావు? ఇప్పుడు నీకేం నష్టం వాటిల్లలేదుగా—నష్టం నాది...."

"అవును—నిజమే! కాని నీ భర్త బాగా పలుకుబడి ఉన్నవాడు.... నన్నేమైనా చేయించగలడు ..."

"నిన్నేమో ఎందుకు చేయిస్తాడు....నీ కారణంగా తనకు మూడువందల డెబ్బై ఐదు రూపాయలు వస్తే...." అంది పుణ్య.

"నా కారణంగా నీ భర్తకు డబ్బు రావడమేమిటి?" అన్నాను అర్థంకాక.

"నీ దగ్గర నేను డబ్బు తీసుకున్నానుగా. అందులో సగం నా భర్తది. ఆయన మనని చూడకుండా ఉన్నట్లయితే మొత్తమంతా నేనే కొట్టేసి ఉండేదాన్ని...."

నేను నివ్వెరపోయి "నువ్వు నా దగ్గర డబ్బు తీసుకుంటావా? అందులో నీ భర్తకు వాటా యిస్తావా?"అన్నాను.

"నువ్వొట్టి డబ్బు లేనివాడివని నాకు తెలుసు. మామూలుగా నీ దగ్గర డబ్బులుండవని తెలుసు. నేను రెండు రోజులు గడువెందుకడిగానో తెలుసా? నీ జీతాల రోజు కోసమే! నా దురదృష్టంకొద్దీ నా భర్త కంటపడిపోబట్టి కానీ లేకపోతే మొత్తం ఏడువందల యాభై రూపాయలు నా స్వంతమయ్యేవి...." అంటూ ఆమె కొద్దిగా చిల్లర నోట్లు ఉంచి పర్సు నాకు తిరిగి ఇచ్చింది.

నేను బయటకు పోబోతూంటే — "నేను కావాలనుకుంటే మళ్ళీ జీతాలరోజుకే రా!" అంది పుణ్య. □

వాసు అండ్ శేషు డిటెక్టివ్ ఏజెన్సీ



"ఈ రోజు కూడా ఒక్క కేసు రాలేదు" అన్నాడు డిటెక్టివ్ వాసు విచారంగా.

"ప్రతిరోజు ఒక్కో కేసు దొరికితే ఇక చెప్పేదేముంది. నెలకి ముప్పై కేసులు. ఒక్కో కేసుకి అధమపక్షం అయిదు వేలు చొప్పున వేసుకున్నా నెలకి లక్షా ఏభై వేలు. బాబోయ్ నెలకి లక్షా ఏభై వేలే?!" అన్నాడు డిటెక్టివ్ శేషు గుండెల మీద చెయ్యి వేసుకుంటూ.

"అసలు. నీ లెక్కలేమిటోయ్, గాల్లో మేడలు కట్టేస్తున్నావు! ఒకకేసు పూర్తి చెయ్యటానికి ఒక్కోసారి పదిహేను నుంచి ముప్ఫయి రోజులు పట్టొచ్చు. అయినా కేసుకి అయిదువేలిచ్చే పాపాత్ము డెవడున్నాడు? సో, ఏవరేజ్‌న పదిహేను-ఇరవై రోజులకో కేసు తగిలితే చాలు. మన భుక్తి గడిచిపోతుంది."

"మరీ అంత చీప్‌గా మాట్లాడకు. వాసు అండ్ శేషు డిటెక్టివ్ ఏజన్సీ పరువు తీసేస్తున్నావు."

"ఈ నెల అద్దె కట్టలేదు. పరువు తీసేస్తున్నది నేను కాదు, రేపు యింటి ఓనరు మన బోర్డు పీకేసి బయట పారేస్తాడు చూడు, అప్పుడు-మన పరువనేది ఏమైనా మిగిలుంటే రోడ్ మీద పొర్లుతుంది."

"అయినా మనం సరైన ముహూర్తం చూసుకుని బోర్డు కట్టాల్సింది. బొత్తిగా వారం, వర్జం చూడకపోతే ఇలాగే అవుతుంది. ఖర్చెక్కువ, ఆదాయం తక్కువ...."

"అసలు ఆదాయం వచ్చిందేది? అంతా ఖర్చే!"

"సో, వారం రోజులు చూసి సైలెంటుగా బిచాణా ఎత్తేదాం! మరో వూళ్ళో తెరుద్దాం."

"అసలు దేశంలో నేరస్థులే కరువైపోతున్నారా? ఏమి యీ వైపరీత్యం?"

"నేరస్థులు కరువైపోవటంలేదు. ఆ లోటు తీర్చటానికి ఈ మధ్య పోలీసులు కూడా శాయశక్తులా కృషి చేశారు కూడా—మానభంగాలవీ దండిగా చేసేస్తూ!"

"ఉష్. పోలీసుల గొడవ మన కెందుకు? మనది ప్రయివేట్ ఏజన్సీ! ఉయ్ ఆర్ గ్రేటర్ దేన్ పోలీసన్న మాట!"

"సైలెన్స్! ఏదో కేసు వచ్చినట్లుంది. బి ఎలర్ట్. కేసు

వదలొద్దు. వందరూపాయలు, కనీసం యాభై రూపాయ లిచ్చినా ఒప్పేసుకుందాం."

"గట్టిగా అరవకు. అతనికి వినపడితే వదే ఇస్తానంటా డేమో!"

"రండి సార్. వెల్‌కమ్, వాట్ కెన్ ఉయ్ డూ ఫర్ యూ?"

"ఇది వాసు అండ్ శేషూ డిటెక్టివ్ ఏజన్సీయేనా?"

"ఎగ్జాట్లీ! అయామ్ డిటెక్టివ్ వాసూ! మీట్ మై కొలీగ్ డిటెక్టివ్ శేషూ!"

"థాంక్స్! వస్తాను" ఆయన వెళ్ళటానికి ముందుకు కదిలాడు.

వాసు, శేష యిద్దరు ఆయన్ని పట్టి ఆపేశారు.

"అదేమిటి సార్ వెళ్ళిపోతున్నారు? వచ్చిన పని చెప్ప కుండానే....రండి, కూచోండి, చెప్పండి. మీకేం సహాయం కావాలి?"

"అబ్బబ్బ, నన్నొదలండయ్యా బాబూ, అవతల బోలెడు అర్జంటు పనులున్నాయి."

"వచ్చిన పని చెప్పకుండా వెళ్ళిపోతాననటం ఏం బావుంది చెప్పండి! మేము మీ సమస్య పరిశీలించి పరి శోధించి పరిష్కారం చేసేస్తాం. కమాన్, కమాన్, చెప్పండి!" అన్నాడు వాసు.

"వాసూ! డోంట్ బి హర్రీ! ఆయన్ని కాస్త ఊపిరి తీసుకోనియ్యవోయ్....ఆc! చెప్పండి సార్! బోయ్ లేడు కాఫీ తెప్పిద్దామంటే! ఇప్పుడే ఓ అర్జంటు ఇన్ఫర్మేషన్ కోసం ఇంటెలిజెన్స్ బ్యూరోకి పంపించాం. మా ఆఫీసు బోయ్ కూడా డిటెక్టివ్ కావలసినవాడు, తప్పిజారి మాకు బోయ్‌గా కుదిరేడు."

"ఇంతకూ మీ కొచ్చిన ఆపదేమిటి, మీ అబ్బాయి తప్పిపోయాడా?"

"మీ అమ్మాయి కనిపించటంలేదా?"

"మిమ్మల్నెవడైనా బ్లాక్ మెయిల్ చేస్తున్నాడా?"

"మీ ఆస్తి నెవడైనా కాజేస్తున్నాడా?"

"మీ యింట్లో ఏదైనా చోరీ అయిందా?"

"మీ మీద ఎవడైనా నిఘా వేశాడా? వాడి ఆచూకీ కనుక్కోవాలా?"

"మీ మీద ఎవడైనా హత్యాప్రయత్నం చేయబోయాడా? లేక మర్డర్ చేస్తానని బెదిరింపు ఉత్తరం రాశాడా?"

ఆ వచ్చినాయన యిద్దరికీ రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టేశాడు.

"బాబోయ్, నన్నొదిలెయ్యండి నాయనోయ్! ఎక్కడో కాదు ఇక్కడే మీ చేతుల్లోనే మర్డరయిపోయేలా ఉన్నాను కాసేపుంటే! బుద్ధి గడ్డితిని మీ గుమ్మం తొక్కాను!"

"అలా యిన్సల్టింగా మాట్లాడకండి. అలాంటి వాళ్ళు ఎందుకు రావాలి?"

"నే నొచ్చింది మీ కోసం కాదు బాబోయ్!"

"మరెవరి కోసం?" ఇద్దరూ ఒకేసారి ప్రశ్నించారు.

"మీ డిటెక్టివ్ ఏజన్సీ పక్కన కోతిమార్కు పళ్ళపొడి కంపెనీ వుందట. అక్కడికని వచ్చాను. మీ ఆఫీసు గుర్తుకి చెప్పారు" అంటూ ఆయన పరుగు నడకతో ఆఫీసు మెట్లు దిగేసి 'హమ్మయ్య' అంటూ ఊపిరి పీల్చుకున్నాడు.

"ఛీ, ఛీ! పొద్దున్నే మంచి బేరం తగిలింది. కేసను కుంటే బోడికేసు తగిలింది. అయినా మిష్టర్ వాసూ, అనవసరంగా కంగారుపడిపోయి వాడిముందు తేలిక అయిపోయావు."

"నువ్వు వాడి గడ్డం పట్టుకు బతిమాలేసి మరీ లోకువ చేసేశావ్!"

"నువ్వు మాత్రం వాడుతప్ప గతిలేదన్నట్టు కాళ్ళా వేళ్ళా పడిపోలేదూ?"

"హుష్! అవసరం అలాంటిది. మనం ఒకరినొకరు ఇలా నిందించుకోవడం ఏం బాగాలేదోయ్ శేషూ!"

"అలా అన్నావు కరెక్టు మాట! .... నాకయితే ఓ విషయం నిర్ధారణయింది."

"ఏమిటది?"

"మన ఏజన్సీకి జనంలో బాగా గుర్తింపు వచ్చింది."

"ఎందుకలా అనుకుంటున్నావు?"

"మన ఏజన్సీని గుర్తుగా చెపుతున్నారంటే అందరి దృష్టిలోనూ పడిందన్న మాట!"

"ఎందుకు పడదు? రెండు వందలుపోసి ఎనామిల్ పెయింటుతో బోర్డు రాయించాం కదూ! ఆ బోర్డు గుర్తు చెప్పివుంటాడు. ఈ వచ్చిన సచ్చినోడికి చదువు రాదేమో! సరాసరి మన దగ్గిరికే వచ్చి అడిగాడు!"

"పోనీయ్! గతం నాస్తి. ఏక్ట్ ఇన్ ప్రజెంట్!"

"అదిగో. ఈసారి నిజంగా కేసే! పల్లెటూరి బాపతులా వున్నాడు. పైసలు ఎక్కువే గుంజవచ్చు."

"ఈసారి కంగారుపడి మన పరువు తీసెయ్యకు. బాగా బింకంగా వుండాలి, తెల్సిందా?"

"అలాగే, చూస్తావుగా!"

"ఏమిటోయ్, ఎవరు కావాలి?"

అతను బెరుకు బెరుగ్గా చూశాడు.

"అయ్యా, ఇది డిటెక్టివ్ లుండే చోటేనా?" అనడిగాడు అమాయకంగా.

"ఖర్మ! డిపెక్టివ్ కాదు, డిటెక్టివ్ ...డిటెక్టివ్ అనాలి, తెలిసిందా?"

"ఏమో, అయ్యేటీ నాకు తెల్దుగానీ, పోయిన ఒస్తువులు అయ్యా ఎదికిపెడతారంట కదూ!"

వాసు ఉషారుగా ముందుకు వంగి, "అవునవును. నీ వస్తువు లెవరైనా దొంగిలించారా? బంగారు వస్తువులేనా? నోట్ మిస్టర్ శేషూ!" అన్నాడు.

శేషు నోట్ బుక్ పెన్సిల్ సిద్ధంగా పట్టుకున్నాడు.

"నా గాడిద తప్పిపోయింది బాబూ!"

"గాడిదా??"

"అవును బాబులూ! నేను చాకలిని. రేవునించి బట్ట లన్నీ అదే మోపి తెస్తుంది. నిన్న సందేలనించీ కనపడ్డం లేదు. నా సెయ్యిరుసుకున్నట్టుంది బాబూ! దయసేసి...."

"ముందు యిక్కడ్నించి బయటికి కదులు! మేము గాడిదలు, గుర్రాలు వెతికే వాళ్ళలాగా కనిపిస్తున్నామా?!
శేషు రుద్రుడయిపోయాడు.

"అదేంటి బాబూ, బయట పెద్ద బోరుడు కట్టుకున్నారు గందా, ఏదో సాయంసేత్తారని వొచ్చాను. ఉత్తినే సెయ్యొద్దు లెండి, ఓ నెల్లాళ్ళపాటు మీ గుడ్డలు సలవసేసి పెడతాను."

"సలవా వొద్దు, ఏదీ వొద్దుగాని, నువ్వు దయసెయ్యి బాబయ్యా!" శేషు దాదాపు అతన్ని మెడబట్టి గెంటినంత పని చేశాడు.

"మిస్టర్ శేషూ! శాంతం, శాంతం! ఏదో తెలీక మన ఏజన్సీలో అడుగుపెట్టాడతను. మెల్లిగా చెప్పి పంపేస్తే సరి!....ఇదిగో చూడు మడివేలూ, మా పని అదికాదు, నువ్వు వేరేవాళ్ళను చూసుకో!"

చాకలి వెళ్ళిపోయాడు ఏదో గొణుక్కుంటూ.

"ఛీ ఛీ, మరీ యింత చీప్ అయిపోయామా మనం? ప్రతి అడ్డగాడిదా వచ్చి యిలా గాడిదల్ని, కుక్కల్ని వెతక మంటుంటే మన పరువేం కాను?" అన్నాడు శేషు మండి పడిపోతూ.

"మిస్టర్ శేషూ!...."

"శాంతం. శాంతం—అంటావు, అంతేనా?"

"ఆవేశపడటంవల్ల ఆయాసంతప్ప యేం లాభం చెప్పు! అందుకే శాంతం వహించమంటాను మై డియర్ శేషూ!"

"కాఫీ తాగితే బావుండును."

"నాకూ అలాగే అనిపిస్తోంది."

"ఆఫీసుబాయ్‌ని పెట్టుకుంటే బావుండును."

"ఉత్తుత్తి బోయ్ వున్నాడు కదూ!"

"అది ఆ పెద్దమనిషిని బోల్తా కొట్టించటానికి గాలి పోగేసి వాగేశాం. మనకే గత్యంతరం లేదంటే ఆఫీసు బోయ్‌ని మెయిన్‌టెయిన్ చేయటం కూడానా?"

"సరే.పద! మనమే కాస్తకడుపులో పోసుకునివద్దాం!"

ఇద్దరూ లేచారు.

"వాసూ! అదిగో, యీసారి బాగా డబ్బున్నవాడిలా వున్నాడు. బాగా గిట్టుబాటు కావచ్చు" అన్నాడు శేషు.

"రండి సార్, రండి!" అన్నారిద్దరు ఒకేసారి.

ఆయన హుందాగా వచ్చి కూచున్నాడు.

"కాఫీ తీసుకుంటారా, కూల్‌డ్రింకా?" అన్నాడు వాసు.

"కూల్‌డ్రింకే తెప్పించండి. కాఫీ సయించదు" అన్నాడాయన.

"బోయ్!" అన్నాడు శేషు బిగ్గరగా.

"ఇప్పుడేగా స్పెషల్ బ్రాంచ్‌కి పంపించావు? తిరిగి

వస్తూంటాడు'' అన్నాడు వాసు.

''అవును కదా, మరచిపోయాను'' నాలిక్కొరచుకున్నాడు శేషు.

''నా పేరు ముకుందం'' అన్నాడాయన ఉపోద్ఘాతంగా.

డిటెక్టివ్ లిద్దరూ ఆసక్తిగా ముందుకు వంగారు.

''మీది పేరుమోసిన డిటెక్టివ్ ఏజన్సీ అని విన్నాను'' అన్నాడు ముకుందం.

వాసు, శేషు ఆయన మాట పొందికకు చాలా ఆనందించారు. ''ఏదో మీరు అభిమానంతో అంటున్నారు గాని, మాదెంత లెండి!'' అన్నారు.

''అంటే, మరీ కొత్త ఏజన్సీయా?'' అంటూ లేవబోయాడు ముకుందం.

శేషు, వాసు చటుక్కున ఆయన చెయ్యిపట్టి ఆపేశారు. ''అదేం కాదు సార్! పేరుమోసిన ఏజన్సీయే! పొగుడుకుంటే పేరు క్షీణమని పైకి గట్టిగా అనటం లేదంతే! డిటెక్షన్‌లో మా జంట డిటెక్టివ్‌లకు సాటివచ్చేవాళ్ళు ఈ నగరంలోనే యెవరూ లేరు'' అన్నారు.

ముకుందం కూచున్నాడు.

''నాకో సమస్య వచ్చింది. కావటానికి చిన్నదే అయినా, పరిష్కారం కష్టసాధ్య మయినది'' ఆగాడు కొన్ని క్షణాలు. డిటెక్టివ్‌లు చెవులు రిక్కించారు.

ముకుందం కొనసాగించాడు:

''మాది పెద్దకుటుంబం. నాకు పదిలక్షల స్థిరాస్తి, అయిదారు లక్షల బ్యాంక్ బాలెన్సు వున్నాయి. ఇద్దరు కొడుకులు, నలుగురు కూతుళ్ళు, యిరవై యిద్దరు మనుమలు - పెద్ద తామరతంప. అల్లుళ్ళని యిల్లరికం తెచ్చుకున్నాను— కూతుళ్ళని అత్తవారిళ్ళకు పంపటం యిష్టంలేక!

అయితే నా వాళ్ళనుకున్నవాళ్ళే నాకు ఎదురు తిరిగారు. అందరూ కలిసి నన్ను అంతమొందించాలని ప్రయత్నిస్తున్నారు. అయితే అందరికీ నా ఆస్థి కావాలి। అందుకే నా ఆస్తిని తమ పేర రాయించుకోవాలని నా కొడుకులు, కూతుళ్ళు చాలా విధాలా ప్రయత్నిస్తున్నారు ఎవరికి వారు। ఆస్తి రాయించుకున్నాక నా విలువ గడ్డిపరకకన్నా అన్యాయమని నాకు తెలుసు.

ఇంకో విషయమేమంటే, నాకు యీ బంధుకోటి అందరూ చాలా సపర్యలు చేస్తున్నారు—ఒకరిమీద ఒకరు పోటీపడి। అయితే యిందులో ఎవరి ప్రేమ, భక్తి, గౌరవం—నిజమైనవో నేనే బేరీజు వేసుకోలేక పోతున్నాను. దానితో మన స్తిమితం వుండటంలేదు.

ఇదంతా యెందుకు చెప్పుకొస్తున్నానంటే మీరు నా బంధుకోటిలో యెవరికి నిజంగా నేనంటే గౌరవాభిమానాలున్నాయో జాగ్రత్తగా కనిపెట్టి వాళ్ళ పేర్లు నాకు చెప్పాలి. అదీ మీరు నాకు చెయ్యవలసిన సహాయం।" అన్నాడు ముకుందం.

వాసు, శేషు ముఖాలు చూసుకున్నారు.

"అలా చెయ్యటం మీవలన అవుతుందా?"

ఇద్దరూ వులిక్కిపడి "ఎందుక్కాదు? మాకు అసాధ్యమయినదేమీ లేదు. ఒక్క పదిరోజుల్లో మీ యింట్లోని ప్రతి మనిషి నిజస్వరూపం మీకు ఫోటోతీసి యిచ్చేస్తాం. అసలు మాకు తీగెదొరికితే చాలు డొంకంతా అల్లుకుపోతాం. ఒక్క పదిరోజులు టైమివ్వండి, చాలు।" అన్నారు.

"అలాగే। పదిరోజులు కాకుంటే మరో వారం తీసుకోండి. అవసరమయితే మా యింట్లోనే దూరపు చుట్టాల మాదిరి వచ్చి వుండండి. అన్ని విషయాలు బాగా ఆకలింపు

చేసుకోవటానికి వీలుంటుంది" అన్నాడు ముకుందం.

"ఆల్‌రైట్! అలాగే! మా భోజన సదుపాయాలు నిమిత్తం ఖర్చుపెట్టేది మా బిల్లునుంచి మినహాయించుకోండి. అది మా ప్రిన్సిపుల్!"

"ఓ, అలాగే! మీ ఫీజు విషయం చెప్పండి" అన్నాడు ముకుందం జేబునుండి చెక్‌బుక్కు తీసి బయటపెడుతూ.

వాసు, శేషు మళ్ళీ ముఖాలు చూసుకున్నారు.

"అయిదు.........అయిదువేలు. అంతకు తక్కువైతే కష్టం" అన్నాడు శేషు.

"అయిదువేలేనా? ఇది చాలా కష్టమైన పని. కనీసం పదిహేను వేలయినా లేకుంటే మీకు గిట్టుబాటు కాదు. ఇదిగో పదిహేనువేలకు చెక్! తీసుకోండి" అన్నాడు ముకుందం.

వెంటనే మాట రాలేదు వాళ్ళ నోళ్ళవెంట.

శేషు చటుక్కున చెక్ ఆయన చేతిలోంచి లాక్కొని, "అలాగే సార్! మీది భారీ చెయ్యి" అన్నాడు.

"పనయ్యాక మరో పదివేలిస్తాను. ఇది అడ్వాన్సు మాత్రమే!" అన్నాడు ముకుందం.

డిటెక్టివ్‌లు ఉబ్బి తబ్బిబ్బయ్యారు.

"పని రేపట్నుంచి మొదలుపెడతారు కదూ!"

"తప్పకుండా! మీ అడ్రసు యిచ్చారు కాదు" అన్నాడు వాసు.

ముకుందం ఫెళ్ళున నవ్వి "అవును కదూ! ఇదిగో నా విజిటింగ్ కార్డు...." అంటుండగానే ఓ యువకుడు లోపలికి ఆత్రుతగా వచ్చాడు.

"నాన్నా, నువ్విక్కడున్నావా? నీకోసం ఊరంతా గాలిస్తున్నాను....మళ్ళీ చెక్కుబుక్కులు పట్టుకుని బయల్దేరావా? ....యెవరికి రాసేశావు చెక్కు?" అన్నాడా యువకుడు.

శేషు చెక్‌ని చటుక్కున డ్రాయరు సొరుగులో తోసే శాడు ఏం ఎరగనట్టు.

"మా నాన్నగారు మీకేమయినా ట్రబులిచ్చారాండీ?" అన్నా డా యువకుడు.

"నో, నో! ఆయనెందుకు ట్రబులిస్తారు? హి యీజే జంటిల్‌మన్!" అన్నాడు వాసు గబగబ.

"కరెక్టు! ఆయన చాలా పెద్దమనిషి!" అన్నాడు శేషు.

"ఈయన మా నాన్నగారండి!"

"ఆఁ! తెలుస్తోంది కదా! మిమ్మల్ని కల్సుకున్నందుకు చాలా సంతోషంగా వుంది" అన్నారు డిటెక్టివ్ లిద్దరూ.

"మా నాన్నగారు బాగా బతికారండి! లక్షలకి లక్షలు చేతిలో నడిపించారు. ఒక్కసారిగా వ్యాపారంలో పది లక్షలు నష్టం వచ్చింది. ఇల్లు, ఆస్తి అన్నీ అమ్మేసినా నష్టం పూడలేదు. అప్పటినుంచీ మతిస్థిమితం లేకుండా యిలా తిరుగుతుంటారు. కనిపించిన వాళ్ళందరితోను ఏవేవో చెపుతుంటారు. మీకేమయినా శ్రమిస్తే క్షమిం చండి, వస్తాం....పద నాన్నా!" అన్నాడా యువకుడు.

ముకుందం బుద్ధిమంతుడిలా కొడుకువెంట నడిచాడు. ఆ యువకుడు మళ్ళీ వెనక్కొచ్చి, "సారీ, ఆ చెక్కు చెల్లదు! నో బాంక్ బాలెన్స్!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

శేషు డ్రాయరు సొరుగులోనుంచి చెక్కు తీసి ముక్క ముక్కలుగా చించేసి అగ్గిపుల్ల వెలిగించాడు కసిగా.

"ఛ, ఫస్ట్‌కేసు యిలాంటి పిచ్చికేసు దొరుకుతుందనుకో లేదు!" అన్నాడు శేషు ముఖం ఎర్రగా చేసుకుని.

"నెక్స్ట్‌టైం బెటర్‌లక్!" అన్నాడు వాసు ఆశావాదంతో.

"నెలయిపోయింది కదా! నెక్స్ట్‌మంత్ బెటర్‌లక్ అను కుందాం" అన్నాడు శేషు. □

మచ్చలేని చంద్రబింబం

అజీజ్

అందమైన అమ్మాయిని చూడగానే అరవై ఏళ్ళ అంద వికారిక్కూడా ఆనందంతో కళ్ళు జిగేల్మని, లిప్త పాటు మస్తిష్క కర్తవ్యాన్ని విస్మరించి, నోట్లో రవంత లాలాజలం ఊరి, లొట్టలు పడటం ప్రకృతి సహజం!

ఐతే, ఆ సమయంలో, ఖరీదైన ఆ హోటల్ డైనింగ్ హాల్లో మాత్రం అరవై ఏళ్ళ అందవికారు లెవ్వరూ లేరు అంతా ముప్పై, నలభై లోపు పడుచు పురుష పుంగవులే వున్నప్పుడు. కళ్ళు మిరిమిట్లు గొలిపే పడుచుపిల్ల ప్రవేశిస్తే ఇహ వేరే చెప్పాలా?

తింటున్న నోళ్ళు అలాగే తెరుచుకున్నాయి. మాట్లాడుతున్న పెదాలు హఠాత్తుగా పలకబారిపోయాయి. అప్రయత్నంగానే అయినా కొందరి చేతుల్లోంచి ఫోర్కులూ, చెంచాలూ చప్పున ప్లేట్లలో పడి చిత్రమైన చప్పుళ్ళు జేశాయి.

అంతవరకూ కబుర్లతో, ముసి ముసి నవ్వులతో మారుమోగుతున్న హాలు సూది పడినా స్పష్టంగా వినిపించేటంతటి నిశ్శబ్దాన్ని సంతరించుకుంది.

"ఆ అమ్మాయిని చూశావా?" అడిగాడు విజయకుమార్ చేతిలోని ఫోర్క్‌ను ప్లేట్‌లో పెడుతూ రహస్యంగా.

"చూశాను. బావుంది. హిందీ సినిమా హీరోయిన్‌లా!" అన్నాడు స్నేహప్రసాద్ చాలా నింపాదిగా.

"తప్పు? మేకప్ లేకుండా ఏ సినిమా హీరోయిన్నైనా నువ్వు చూపివుంటే యిలా కామెంట్ చేసేవాడివి కాదు. చంద్రబింబంతోనూ ఆమెని పోల్చడానికి వీల్లేదు. కారణం అందులోనూ అనేక మచ్చలున్నాయి కనక!

లే ఉషస్సు వేళ తూరుపు దిక్కున ఉదయించే నులి వెచ్చని రవి కిరణంలా వుందంటే బావుంటుంది" అన్నాడు విజయకుమార్ కాకలుదీరిన తెలుగు కవి ధోరణిలో.

స్నేహప్రసాద్ నవ్వి "నువ్వు ఎం.బి.బి.ఎస్‌కు బదులు తెలుగు సాహిత్యంలో ఎమ్మే చేసివుంటే సినిమాలకు ప్రేమగీతాలు రాసి బాగా పైకొచ్చేవాడివి" అన్నాడు.

"చాల్లే! కొట్టు....పెట్టు....లట్టు....పట్టు అనే ఆ ప్రేమ గీతాలు రాయడానికి ఎమ్మే చదివి చావాలా? ఎలాంటి బడుద్ధాయికయినా ఓ కలం, కాగితం చేతికిస్తే అరక్షణంలో రాసిపారెయ్యగలడు అలాటి చచ్చు సాహిత్యం! అది సరే

గానీ, ఆ అమ్మాయి నాకు కొత్తకాదు. ఇదివరకే ఆమెతో నాకు పరిచయం వుంది."

"వా....ట్!?" కరెంటు షాక్ తగిలినట్టు ఉలిక్కిపడ్డాడు స్నేహప్రసాద్. "నీకు పరిచయమున్న ప్రతిప్రాణీ నాకు పరిచయమున్నదే. ఐమీన్, అమ్మాయిలూ, అబ్బాయిలతో సహా! మరి నాకు తెలీకుండా ఈమె నీ కెలా తెలుసు?"

"యాదృచ్ఛికంగా నెల రోజుల క్రితం సంగతి. మా నాన్నగారు జబ్బుపడి వారం రోజుల వరకూ ఫ్యాక్టరీకి వెళ్ళకుండా ఇంట్లోనే వుండిపోవడంవల్ల ఆయన ఆఫీసు వ్యవహారాలన్నీ నేనే చూసుకున్న విషయం నీకు తెలుసుగా?

ఓ రోజు సాయంత్రం నేను ఫ్యాక్టరీనించి కార్లో ఇంటికి వస్తున్నాను. మీనంబాకం ఏర్‌పోర్ట్ దాటి, ఓ నిర్మానుష్యమైన రోడ్డుమీదికి రాగానే, నా కారు వెనక నించి ఓ ఆటోరిక్షా రివ్వున వచ్చి నన్ను ఓవర్ టేక్ చేసి దూసుకెళ్ళింది. అందులోంచి 'రక్షించండి .... కాపాడండి' అంటూ ఆడకంఠం ఆర్తనాదాలు వినిపించాయి. నే నింకేమీ యోచించకుండా కారు స్పీడ్ హెచ్చించి, ఆ ఆటోని వెంబడించాను. కారు స్పీడ్‌నించి అది తప్పించుకోలేక దగ్గిర పడింది. నేను దాన్ని ఓవర్ టేక్ చేసి రోడ్డుకడ్డంగా కారాపాను.

మరో దారిలేక ఆ ఆటో ఆగిపోయింది. మరుక్షణం ఈ అమ్మాయి చెంగున బైటికి దూకి నా దగ్గరికి పరిగెత్తుకొచ్చింది. తాను తాంబరంలో ఆ ఆటో ఎక్కి నుంగంబాకం తీసికెళ్ళమని చెబితే, వాడు మరోదారి గుండా మీనంబాకం వైపు తీసుకొచ్చాడనీ, తానెంత చెప్పినా వినడం

లేదనీ, బాపురుమంది.

అలోగా నేను కారుదిగి విసురుగా ఆటోని సమీపించాను. ఆ లోపలే వాడు ఆటోని వెనక్కి తిప్పి వెళ్ళే ప్రయత్నంలో వున్నాడు. నేను వాడి కాలర్ పట్టుకుని అడిగితే, ఆవిడ నుంగంబాకం అంటే, తాను మీనంబాకం అనుకున్నాననీ, తనకి కొంచెం చెవుడున్నందువల్ల ఆమె మాటలూ, కేకలూ ఆటో శబ్దంలో సరిగ్గా వినలేకపోయాననీ, ఏదో కుంటిసాకు చెప్పి రివ్వున దూసుకుపోయాడు.

భయ విహ్వాల అయివున్న ఆమెను కారెక్కించుకుని, ట్రిప్లికేన్‌లో వున్న ఆమె యింటి దగ్గర దిగబెట్టి వెళ్ళిపోయాను. ఐతే, ఆమె రూపం మాత్రం నా కళ్ళల్లో అలాగే నిలిచి నాతోబాటు నా ఇంటికి వచ్చేసింది. నాలుగైదు రోజులైనా ఆ రూపం నా కళ్ళల్లోంచి చెదిరిపోలేదు.

ఇహ వుండబట్టలేక, ఓ రోజు ఆమెను చూద్దామని ఇంటికెళ్ళాను. తలుపుకు తాళం వేసుంది. అంతకు రెండు రోజుల క్రితమే ఆమె ఆ ఇల్లు ఖాళీజేసి వెళ్ళిపోయిందని తెలిసి నిర్ఘాంతబోయాను.

ఆ తరువాత ఆమెకోసం ఈ మద్రాసు మహానగరంలో ఎంత వెదికినా కానరాలేదు. ఇప్పుడు హఠాత్తుగా దివినించి దిగి వచ్చిన కిన్నెర కన్యలా ఇక్కడ...." విజయకుమార్ మాట పూర్తి కాకముందే ఆ అమ్మాయి ఖాళీ టేబిల్‌కోసం చుట్టూ కలయ జూస్తూ, కాళ్ళకి వేసుకున్న హైహీల్స్ సాండిల్స్ టకటక లాడిస్తూ వాళ్ళు కూర్చున్న టేబిల్ని సమీపించి, విజయకుమార్ని చూడగానే అవాక్కయిపోయింది క్షణంపాటు.

అతను చిన్నగా నవ్వి "గుర్తుపట్టారా?" అడిగాడు.

"ఆపదలో ఆదుకున్న మనిషిని ఎవ్వరైనా మర్చి

పోగలరా?" అంది ఆమె నమ్రతగా.

"కూర్చోండి" అన్నాడు విజయకుమార్ పక్కనే ఖాళీగా వున్న కుర్చీ చూపుతూ.

ఆమె కూర్చుంది "థాంక్స్!" అంటూ.

దురదృష్టవశాత్తు ఆ సమయంలో తమ టేబిళ్ళు ఖాళీగా లేనందువల్ల తమలో తామే నిట్టూర్పులు విడిచి, మళ్ళీ తమ తమ గొడవల్లో నిమగ్నమై పోయారు మిగతా జనం!

"మిమ్మల్ని కలుసుకుందామని ఒకసారి ట్రిప్లికేన్‌లో ఉన్న మీ యింటికి వచ్చాను. అంత క్రితమే మీరా యిల్లు ఖాళీచేసి వెళ్ళారని తెలిసింది. ఆ తరువాత మళ్ళీ ఎక్కడా కనిపించలేదు. మద్రాసు వదిలిపోయారా?" అడిగాడు విజయకుమార్.

ఆమె నవ్వుతూ తల అడ్డం తిప్పి, "ఇక్కడే ఉన్నాను. ఆ ఇంటి ఓనర్లతో సరిపడక ఇల్లు మార్చాను. ఎంతో అత్యవసరమైన పనుంటే తప్ప అనవసరంగా బైట తిరిగే అలవాటులేదు నాకు. అందుకే ఇంతకాలం మీ కెక్కడా కనిపించలేదనుకుంటాను" అంది.

విజయకుమార్ అంతవరకూ దిష్టిబొమ్మలా దిక్కులు చూస్తూ కూర్చున్న స్నేహితుణ్ణి మర్యాదకోసం ఆమెకు పరిచయం చేస్తూ, "మీట్ హిమ్, మై డియరెస్ట్ ఫ్రెండ్ మిష్టర్ స్నేహప్రసాద్....ఈవిడ....అంటూ" ఆమె పేరు తెలీక నీళ్ళు నమిలాడు.

"ప్రతిభ!" అంటూ అతని ఇబ్బందిని తొలిగించి నవ్వింది ఆమె.

"మా ఇద్దరి స్నేహం ఈనాటిది కాదు. బాల్య ఓనమాలు నేర్చుకొనే బడి ప్రాంగణం నించి కాలేజీ, కాలేజీ

నించి యూనివర్సిటీ వరకూ బదిలీ అవుతూ ఈ నాడు ఇద్దరం మెడిసన్ ముగించేవరకూ తొణక్కుండా బెణక్కుండా బాగా బలపడుతూ వస్తున్న స్నేహం!" అన్నాడు విజయకుమార్.

"మీరు డాక్టర్లా!?" అడిగింది ప్రతిభ రవంత ఆశ్చర్యంగా.

"ఆఁ, ఈ మధ్యే ఎం. బి. బి. ఎస్. డిగ్రీలు పుచ్చుకున్నాం!"

"ప్రైవేట్ ప్రాక్టీసు పెట్టాలనుకుంటున్నారా! లేక, గవర్నమెంట్ జాబ్ చెయ్యాలనుకుంటున్నారా?

"రెండూ కాదు!"

"మరి? అంత పెద్ద చదువు ఎందుకు చదివారు? మానవుల పాలిటి సంజీవిని అయిన ఆ డిగ్రీ ఎవ్వరికీ ఉపయోగపడకుండా వ్యర్థమైపోతుందిగా?" అంది ప్రతిభ కళ్ళు పెద్దవి జేసి.

విజయకుమార్ పకపక నవ్వి "నిజమే! కానీ, నేను మామూలు డాక్టర్లకన్నా ఇతోధికంగా మానవజాతికి సేవ జేసి, ఆ డిగ్రీకి సార్థక్యం చేకూర్చాలనుకుంటున్నాను. ఈ అభిప్రాయం నాదేకాదు. నా తండ్రిది కూడా!

నగరం వెలుపల మాకు ఓ మందుల ఫ్యాక్టరీ వుంది. అందులో నిరంతరం అనేక రోగ నివారణోపాయాల మీద రకరకాల ప్రయోగాలు జరుగుతూ వుంటాయి. కొంగ్రొత్త మందులు కనిపెట్టి తయారు జెయ్యబడుతూ వుంటాయి.

నేను మెడిసిన్ చదివితే ఆ వ్యాపారానికి మరింత మెరుగులు సమకూరతాయని మా నాన్న ఆశించాడు. ఆయన ఆశయాలను వాస్తవాలుగా మార్చే బాధ్యత ఇప్పుడు నా

మీదుంది'' అన్నాడు.

"చాలా మంచి ఆలోచన. ఇంకేం, మీ ప్రాణ మిత్రుడు కూడా ఆ ప్రయోగాల్లో పాల్గొని మీకు చేదోడు వాదోడుగా వుంటారనుకుంటాను'' అంది ప్రతిభ స్నేహప్రసాద్ వైపు చూస్తూ.

అతను జవాబిచ్చేలోపలే విజయకుమార్ అందుకుని, "మొదటి నించీ ప్లాస్టిక్ సర్జరీ మీద ఆసక్తి వుంది. అదీ గాక, మన దేశంలో ప్లాస్టిక్ సర్జరీ సబ్జెక్టులో నిపుణులన దగ్గవారు దాదాపు లేరనే చెప్పాలి.

అమెరికా, జపాన్ వంటి దేశాల్లో ఇప్పుడా రంగంలో కాకలుదీరిన వాళ్ళెందరో వున్నారు. రెండు చేతులా ఆర్జిస్తున్నారు. నా కోసం నా స్నేహితుడి కోరికను బలిచేసి, అతని బంగారు భవిష్యత్తును పాడుచెయ్యడం భావ్యంకాదు. అందుకని అతన్ని అమెరికా వెళ్ళి ఆ కోర్సులో మంచి అనుభవం సంపాదించమని నేనే వత్తిడి చేస్తున్నాను'' అన్నాడు.

అంతలో బేరర్ మెనూకార్డుతో వచ్చాడక్కడికి.

"ఏం తీసుకుంటారు?'' అడిగాడు విజయకుమార్ ఆమెని.

"మీ ఇష్టం! ఏం తెప్పించినా నా కభ్యంతరంలేదు. నిజానికి నేను వచ్చింది భోజనం చెయ్యడానికే!''

"విజిటేరియనా? నాన్ విజిటేరియనా?''

"రెండోదే!'' అంది ఆమె నవ్వి.

"చికెన్ బిర్యానీ, ఎగ్ కూర్మా, ఫ్రూట్ సలాడ్'' చెప్పాడు విజయకుమార్.

బేరర్ ఆర్డర్ తీసికెళ్ళి, పది నిమిషాల్లో తెచ్చిపెట్టాడు చెప్పినవి.

విజయకుమార్ ఆమెని ఉద్దేశించి, "ప్లీజ్ హావిట్! మా భోజనం ఇందాకే అయిపోయింది. ఐనా, మీ కంపెనీ కోసం కూల్‌డ్రింక్స్ పుచ్చుకుంటాం!" అంటూ రెండు నోవాకోలాలు తెమ్మని చెప్పాడు బేరర్‌తో.

తినడం, తాగడం పూర్తయ్యాక ఆమె నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుని, రిస్టువాచీ చూసి, "మీరు కార్లో వచ్చారా?" అడిగింది విజయకుమార్ని.

తలూపాడతను.

"అన్యథా తలచకుంటే నన్ను ఇంటివరకూ దిగబెడతారా? మీకు నా కొత్త ఇల్లు చూపించినట్టూ వుంటుంది."

"తప్పకుండా! పదండి" అంటూ స్నేహితుణ్ణి చూసి, కన్నుగీటి లేచాడు విజయకుమార్.

బేరర్‌కు బిల్ పే చేసి, ఆమెవెంట బైటికి నడిచాడు. మళ్ళీ ఒకసారి అక్కడ కూర్చున్న వాళ్ళందరి కళ్ళూ ఆమె వైపు మళ్ళాయి.

స్నేహితుడు ఆ అమ్మాయి వెంట అలా వెళ్ళడంతో నిట్టూర్చాడు స్నేహప్రసాద్. అది ఈర్ష్యాసూయలకు సంబంధించిన నిట్టూర్పు కాదు! విజయకుమార్ తిరిగి వచ్చేవరకూ తానక్కడే తిష్టవేసి అతనికోసం ఎదురు చూడక తప్పదన్న విసుగు!

వారి మధ్య అంతటి ప్రగాఢ స్నేహం వున్నా, ఇద్దరి జీవితాల మధ్యా నింగికీ, నేలకూ నడుమ వుండే తారతమ్యం వుంది. విజయకుమార్ వింజామరలు వీచే ఇంట్లో పుట్టిన లక్షాధికారి బిడ్డ అయితే, స్నేహప్రసాద్ సేతుబంధనం వంటి మధ్యస్థ కుటుంబంలో పుట్టిన ముద్దుల దొడ్డ!

తాను మెడిసిన్ చదవడానికి అన్ని విధాలా ఆర్థిక

సాయం అందించి, అడుగడుగునా ఆపద్బాంధవుడిలా ఆదుకున్న మిత్రుడు విజయకుమార్ అంటే స్నేహప్రసాద్‌కు స్నేహాభిమానాలతోబాటు ఎనలేని భక్తిప్రపత్తులూ వున్నాయి.

2

హాల్లోంచి బయటకు వచ్చాక పార్కింగ్ ప్లేస్‌లో ఆగివున్న తన ఫియట్ కార్లో ఆమె నెక్కించుకుని బైలుదేరాడు విజయకుమార్.

ప్రతిభ కబుర్లు చెబుతూ, నవ్వుతూ అతనికి దారి చూపుతోంది.

కొన్ని రోడ్లు కట్ జేశాక కారు వరదరాజన్ వీధిలోకి ప్రవేశించింది.

"ఆ బిల్డింగ్ కాంపౌండులోకి తిప్పండి" అంది ప్రతిభ.

అటు పోనిచ్చాడు విజయకుమార్. మూడంతస్థుల విశాలమయిన భవనం అది. అందులో అనేక కుటుంబాలు అద్దెకుంటున్నాయి.

"ఇక్కడేనా మీ రుండేది?" అంటూ కాంపౌండ్లో కారాపాడు విజయకుమార్.

తల వూపింది ప్రతిభ.

"ఒంటరిగానా?"

"ఔను. మా పేరెంట్స్ గుంటూరులో వున్నారు."

"మీరేం చేస్తుంటా రిక్కడ?"

"ఓ ప్రైవేట్ కంపెనీలో స్టెనోగా పని చేస్తున్నాను."

"ఇక నాకు సెలవిప్పిస్తారా?"

"అప్పుడేనా? రండి? నా అపార్ట్‌మెంటు చూపి వెళ్ళండి" అంది ఆమె కారు దిగుతూ. ఎక్కడ గుడ్ నైట్ అంటుందోనని భయపడ్డ విజయకుమార్ ఆమె

ఆహ్వానంతో ఉబ్బి తబ్బిబ్బయి కారు లాక్‌చేసి, ఆమె వెంట బిల్డింగ్ వైపు నడిచాడు.

మెట్లగుండా ఇద్దరూ రెండో అంతస్థు జేరుకుని నడవాలో అడుగు పెట్టారు. ఆమె కొంత దూరం నడిచి మధ్యలో వున్న ఓ ఫ్లాట్ తలుపు ముందాగింది. హాండ్ బాగ్‌లోంచి తాళంచెవి తీసి డోర్‌లాక్ తెరిచి, తలుపు తోసింది లోపలికి. ఇద్దరూ లోని కెళ్ళగానే తలుపు మూసి లైటు వేసింది.

ఆ కాంతిలో గది గోడల మీద కనిపించిన దృశ్యాలు చూసి నిర్ఘాంతపోయాడు విజయకుమార్. ప్రతి గోడమీదా నాలుగేసి పోస్టర్ సైజు ఫోటోలు వేలాడుతున్నాయి. ఈస్ట్‌మన్ కలర్ ఫోటోలు. వివిధ భంగిమల్లో వున్న ఆ ఫోటోలన్నీ అందమైన అమ్మాయిల్ని కామాంధులైన పురుషులు కిరాతకంగా బలాత్కారిస్తున్నవే!

ఓ ఫోటోలో పురుషుడు ఆకలిగొన్న తోడేలులా ఓ అమ్మాయి బట్టలు చించి పళ్ళతో కొరుకుతోంటే, మరో ఫోటోలో అమ్మాయిని పరుపు మీద పడేసి, దోర మామిడి పండును నలిపినట్టు నలిపేస్తున్నాడు....

ఆ ఫోటోలు చూస్తున్న విజయకుమార్ ఒళ్ళు ఒక్కసారి ఝల్లుమని రోమాలన్నీ క్రమ క్రమంగా నిక్కబొడుచుకోసాగాయి. అతను ఎం. బి. బి ఎస్. ఫైనల్ విద్యార్థి. ఇంట్లోని అలంకరణ చూసి ఆ ఇంటి మనిషి అభిరుచినీ, మనస్తత్వాన్నీ ఇట్టే పసిగట్టగల నేర్పరి. ఆ ఫోటోలు, అందులోని దృశ్యాలు చూడగానే ఆ యువతి అంతరార్థం ఇట్టే అర్థమైపోయిం దతనికి.

ఆమె శాడిస్ట్.

అంటే పురుషుడి ద్వారా అన్ని విధాలా హింసించబడి,

బలాత్కరించబడి, కామతృప్తి పొందే మనస్తత్వం గలది. అదొక మానసిక రుగ్మత. ఆ రుగ్మత కొందరు పురుషుల్లోనూ వుంటుంది.

ఆలోచిస్తూ బెదిరిన కళ్ళతో ప్రతిభ వయిపు చూశాడు విజయకుమార్. ఆమె కళ్ళు కారు చీకట్లో ఆకాశాన మెరిసే తారల్లా తళతళమంటున్నాయి.

రెండు చేతులు అతని వైపు చాచి, "రా...." అంది తమకంతో.

ఐనా అతని కాళ్ళు నిల్చున్న చోటినించి అంగుళం కూడా కదలక పోవడంతో ఆమె వున్మాదిలా అతని భుజాలు పట్టి ఊపుతూ, "నువ్వు మగాడిని కావా? నీలో మగతనం లేదా? అందమయిన అమ్మాయి వలచి రమ్మంటే దేభ్యం మొహంలా చూస్తూ నిల్చుంటావా? సిగ్గులేదూ?" అంది ఉద్రేకంగా,

అప్పుడు పడగ విప్పింది ఆతనిలోని పురుషత్వం. ఒక్కతోపు తోశాడు ఆమెని మంచం మీదికి.

"హమ్మయ్య! నువ్వు మగాడివే!" పక పక నవ్వుతూ వెల్లకిలా మంచం మీద పడింది ప్రతిభ.

ఒక్క ఉరుకుతో ఆమెమీదికి చేరాడతను. పంజాతో బ్లౌజు పట్టి పరపర చింపేశాడు. బుగ్గమీద గాటు పడేట్టు కసుక్కున కొరికాడు. తన్మయత్వంతో కేరింతలుకొడుతోం దామె. ఎత్తుపల్లాలను గట్టిగా నలుపుతూ, పెదవుల్ని పిండేశాడు తన పెదాలతో.

తన్మయత్వంతో ఆమె ఎగిరెగిరి పడుతోంది. అతని వేళ్ళు ఆమె ఒంటిమీద నాట్యంజేస్తూ చీర కుచ్చిళ్ళను లాగేశాయి. పొత్తికడుపును పట్టి నలిపేశాయి. లంగా ముడి తెంపి కిందికి జరిపాడు.

అంతే! ఒక్క తోపుతో అతన్ని వెనక్కి తోసి లేచి కూర్చుంది ప్రతిభ. ఊహించని ఆ పరిణామాని కతను అప్రతిభుడై ఆశ్చర్యంగా చూశాడామెవైపు.

"ఇక చాలు. ఆ పనికి మాత్రం నే నొప్పుకోను!"

"ఐతే, ఇందాక నన్నెందుకు రెచ్చగొట్టావ్? ఇప్పుడు వద్దంటే మాత్రం నే నూరుకుంటానా? రా, ప్లీజ్, కాదనకు! ఇది చాలా అన్యాయం!" అంటూ ఆమెని సమీపించ బోయాడు విజయకుమార్.

"అడుగు ముందుకు వేశావంటే మర్యాద దక్కదు జాగ్రత్త! నేను కోరుకునేది ఇంతవరకే! నాక్కావలసిన తృప్తి నాకు లభించింది. అంతేగాని ఎట్టి పరిస్థితిలోనూ నా శీలాన్ని కోల్పోవడం నా కిష్టంలేదు.

నువ్వు బలత్కారంతో దాన్ని కబళించడానికి ప్రయత్నించావంటే, అరచి గోలపెడతాను. నలుగురూ పోగై నిన్ను చితగ్గొడతారు. మర్యాదగా వెళ్ళిపో! నువ్వు నా కిచ్చిన ఆనందానికి ప్రతిఫలం ఎప్పుడో ఒకప్పుడు తప్పక ముట్టజెబుతాను. ఐతే, నువ్వు కోరుకున్నది మాత్రం కాదు. ఇక వెళ్ళు. గుడ్ నైట్!" అంది ఆమె చీరె చుట్టుకుంటూ.

జీవితంలో ఎన్నడూ కనీ వినీ ఎరగని సంఘటన అది. కణకణ మండే నిప్పు కణికలమీద చల్లని నీళ్ళు చిలకరించినట్టు తుస్సుమంది అతని ఆవేశమంతా! ఆమెను బలాత్కరించి అనుభవించడం పెద్ద సమస్య కాదు.

ఐతే, ఆ తరువాత జరిగే భయంకర పరిణామాలనూ, అవమానాలనూ తట్టుకోవడం తన తరమూ, తన కుటుంబ తరమూ కాదు. అందుకే తల వంచుకుని, నెమ్మదిగా వెనుదిరిగి, అడుగులో అడుగు వేసుకుంటూ తలుపుని సమీ

పించి, గడియతీసి, ఒక్క వుదుటున బైటికి నడిచాడు విజయకుమార్.

కింద పార్క్‌జేసి వున్న కారెక్కి తిన్నగా హోటల్ జేరుకున్నాడు. స్నేహప్రసాద్ యింకా అక్కడే కూర్చొని ఎదురుచూస్తున్నాడు స్నేహితుడికోసం!

విజయకుమార్నీ, పాలిపోయిన అతని మొహాన్నీ చూడగానే చిన్నగా నవ్వుతూ, "వ్యవహారం బెడిసికొట్టలేదు కదా!" అడిగాడు.

తలూపాడు విజయకుమార్. "ఆమె నువ్వూ నేనూ ఊహించిన మనిషి కాదు."

"అంటే?"

"శాడిస్ట్!"

"మైగాడ్!"

ఆ తర్వాత ఆమె విషయం మరచిపోయాడు విజయకుమార్.

3

ఆ సంఘటన జరిగి సరిగ్గా ఐదు సంవత్సరాలు గడిచాయి. ఈ ఐదు సంవత్సరాల్లోనూ అతని జీవితంలో అనేక మార్పులూ, చేర్పులూ సంభవించాయి. తల్లిదండ్రులిద్దరూ తనువులు చాలించారు. దాంతో తండ్రిద్వారా సంక్రమించిన అపార ఆస్థికి ఏకైక వారసుడయ్యాడతను. ఆ ఆస్థిలో ముఖ్యమయినది నగరం వెలుపల వున్న మందుల ఫ్యాక్టరీ.

అతని స్నేహితుడు స్నేహప్రసాద్ యిప్పుడు అమెరికాలో ప్లాస్టిక్ సర్జరీ డిప్లొమా చేస్తున్నాడు. అతను అమెరికా వెళ్ళి చదవడానికి తగిన ఆర్థిక సాయం కూడా విజయకుమారే అందిస్తున్నాడన్న సత్యం ఆ స్నేహితు లిరువురికీ

తప్ప అన్యులకు తెలీదు.

ఓ రోజు ఉదయం విజయకుమార్ తన ఫ్యాక్టరీ ఆఫీసులో కూర్చుని వీక్లీ రిపోర్ట్సు చూస్తుండగా పోస్టుమెన్ వచ్చి ఓ రిజిస్టర్డ్ కవర్ ఇచ్చివెళ్ళాడతనికి. ఆ కవర్ సీళ్ళు విప్పి చూసిన విజయకుమార్ కళ్ళు దిగ్భ్రాంతితో పెద్దవయ్యాయి.

ఓ ఉత్తరమూ, నాలుగు కేబినెట్ సైజు ఫోటోలూ వున్నాయందులో. ఆ ఫోటోలు చూసిన విజయకుమార్ కళ్ళల్లో కారుచీకట్లు కమ్ముకోసాగాయి క్రమంగా. దానితో బాటు ఐదేళ్ళ క్రితం ఒకరాత్రి జరిగిన విచిత్ర ఘటనా దృశ్యాలు ఒక్కొక్కటీ అతని మస్తిష్కపు తెరపై ప్రత్యక్షం కాసాగాయి.

తనూ తన మిత్రుడూ ఓ హోటల్లో భోంచేస్తుండగా, ప్రతిభ అనే అందమయిన అమ్మాయి కలవడం, తనని యింటికి తీసికెళ్ళడం, శాడిస్టు అయిన ఆమెని తను....

వణికే చేత్తో ఓ ఫోటో అందుకుని చూశాడు విజయకుమార్.

తానామె బట్టల్ని ఆకలిగొన్న ఆంబోతులా చింపి వివస్త్రను చేస్తున్న దృశ్యం అది మరో ఫోటో అందుకున్నాడు.

ఆమె మంచంమీద తానామె మీద!

మూడో ఫోటోలో ఆమె బుగ్గలపై గాటు పెడుతున్నాడు తను.

నాలుగో ఫోటోలో లంగా ముడి తెంపుతున్న దృశ్యం!

ఫోటోలు టేబిలుమీద పెట్టి, ఉత్తరం అందుకున్నాడు. గులాబీరంగు కాగితంపై అందంగా ఆకుపచ్చ రంగు సిరాతో రాసిన అక్షరాలు.

'మై లవింగ్ పాల్!

ఫోటోలు చూశావు కదూ? ఎలా వున్నాయి? చాలా నీట్‌గా, నాచురల్‌గా వచ్చాయనుకుంటాను. కలర్లో తీస్తే యింకా బాగా వచ్చేవి. అప్పుడు నాకా ఐడియా తట్టలేదు. ఏదైతేనేం, మొత్తానికి నా ప్రయత్నం ఫలించింది,

ఐదేళ్ళ తరవాత హఠాత్తుగా ఈ ఫోటోలు చూసి నువ్వెంతటి దిగ్భ్రమకు గురవుతావో నాకు బాగా తెలుసు. ఇంతకాలం నీ కంటికి కానరాకుండా నే నెక్కడున్నానో? ఇప్పుడు అకస్మాత్తుగా వీటిని ఎందుకు పంపానో తెలుసుకోడానికి నువ్వెంత ఆరాటపడతావో కూడా నాకు తెలుసు.

ఈ ఫోటోలను పత్రికలకు విడుదల చేస్తే, నీ బంధుమిత్రులకు పంపితే, తరతరాలుగా సంఘంలో ఎంతో పేరు ప్రతిష్ఠలు సంపాదించి మూటగట్టు కున్న మీ వంశగౌరవం ఏమౌతుందో, నీ బంధు మిత్రుల ముందు నువ్వెలా తల వంచుకోవలసి వస్తుందో నా కన్నా నీకే బాగా తెలుసు.

పెళ్ళి కావలసినవాడివి. ఇటువంటి శృంగార, బలాత్కార భంగిమలు పత్రికల్లో పడితే, ఈ దేశంలో కాదుకదా, ఏ విదేశంలోనూ నీకు పిల్ల నిచ్చే సత్కుటుంబీకు లుంటారా? అందుకే, ఈ రాత్రి సరిగ్గా ఎనిమిది గంటలకు మెరీనా బీచికి వచ్చి, పార్కింగ్ ప్లేస్‌లో కారాపి, నన్ను కలుసు కున్నావంటే నీ సమస్యలకు పరిష్కార మార్గం సూచిస్తాను. సరేనా ఉంటా. ఇట్లు,

నీ డ్రీమ్ గర్ల్!'

ఉత్తరం చదివి పళ్ళు పటపట కొరికాడు విజయ కుమార్. ఎంత మోసం! ప్రశాంతంగా సాగిపోతున్న తన జీవితంలో ఏమిటీ ఊహించని సుడిగుండం? ఇప్పుడేమిటి దీని పరిష్కారం? చూడగానే ఎంతటి వాడికైనా జుగుప్స కలిగించే ఈ ఫోటోలు పత్రికల్లో పడితే తన తాత ముత్తాతలు సంఘంలో సంపాదించిన మాన మర్యాదలు యేం కాను?

ఈ ఆలోచన రాగానే అతని నుదుటిపై సన సన్నగా స్వేదబిందువులు పేరుకోసాగాయి. ఆ రోజు ఆమె తనని వెంటబెట్టుకొని ఇంటికి తీసికెళితే శాడిస్టు అనుకుని పొర బడ్డాడు. అనుభవించబోయి పప్పులో కాలేశాడు. పచ్చి బ్లాక్ మెయిలర్ల అని ఇప్పుడు తెలిసింది.

అదీ ఐదేళ్ళ తరవాత. ఐతే ఇంతకాలం తన జోలికి రాకుండా ఎందుకు వూరుకుంది? ఓహో, అప్పుడు తన చేతుల్లో ఆ స్తిపాస్తుల్లేవు. ఇప్పుడు అన్నిటికీ తానే ఏకైక వారసుడు. లక్షలకు లంకెలు వేసి, సులభంగా రాబట్టుకో వచ్చు. ఎంత పకడ్బందీగా అల్లింది ప్లాన్!

ఆలోచిస్తూ ఓ నిర్ణయానికి వచ్చాడు విజయకుమార్.

రాత్రి సరిగ్గా ఎనిమిది గంటలకు చేరుకున్నాడు మెరీనా బీచ్. పార్కింగ్ ప్లేస్‌లో కారాపి చుట్టూ కలయజూశాడు. మనిషిమాత్రుడు లేడు. చలికాలం కావడంవల్ల ఎనిమిది గంటలకే ఎంతో రాత్రయినట్టు స్ఫురిస్తోంది. పైగా ఒళ్ళు జలదరించే చలి. చేరువలోనే నురగలు కక్కుతున్న సముద్రం! ఎవరుంటా రక్కడ ఊరకుక్కలు తప్ప!

రిస్టువాచీ చూసుకున్నాడు. ఎనిమిది గంటల ఎనిమిది నిమిషాలు. అదే క్షణంలో దూరాన ఎవ్వరో నడిచి వస్తు న్నట్టు సర సర ఇసక సవ్వడి కాసాగింది. అటు చూశాడు

పరీక్షగా. స్త్రీ ఆకారం!

కారును సమీపించాక చుట్టూ వెలుగుతున్న ఫ్లోరోసెంట్ లైట్ల కాంతిలో ఇట్టే పోల్చుకున్నాడు విజయకుమార్. ఆమే! ఐదేళ్ళు గడిచినా ఆమె అందం ఇంకా చెక్కు-చెదరలేదు. పైగా, ఎత్తుపల్లాలు నిండి ఇంకా అందంగా కనిపిస్తోంది.

డ్రైవింగ్ సీట్లో కూర్చున్న అతన్ని చూసి ముత్యాల పలువరుస కనిపించేలా నవ్వింది మురిపెంగా. ముఖం చిట్లించాడు విజయకుమార్. ఎంతో చొరవగా కారు బాక్ డోర్ తెరిచి లోపల కూర్చుంది ప్రతిభ. వెను తిరిగి ఉరిమి చూశాడు.

"చుట్టు పక్కల మనిషి మాత్రుడు లేడు. సముద్రం కూడా చేరువగానే వుంది. నన్ను చంపి, శవాన్ని సముద్రంలో పారేసి, సులభంగా నా పీడ విరగడ చేసుకుందామనుకుంటున్నావు కదూ?" అన్న ఆమె మాటలు విని తన మనసులోని విషయాన్ని ఎలా పసిగట్టిందా అని ఆశ్చర్యపోయాడు విజయకుమార్.

ఆమె నవ్వి-"అదే నిజమయితే నువ్వు మరోసారి పప్పులో కాలేస్తావ్! ఎందుకంటే, నేనా ఫోటోలూ, వాటి నెగెటివ్‌లూ నాలుగు ప్రదేశాల్లో రెడీగా వుంచాను. నేను మరణించిన మరుక్షణం అవి పోలీసులకూ, పత్రికాఫీసులకూ చేరుకుంటాయి. నన్ను చంపింది నువ్వేనన్న ఉత్తరాలతో సహా!" అంది.

కోటు జేబులో ఉన్న పిస్తోలు తడుముకుని, పెదవి విరిచాడు విజయకుమార్. ఇక ఆమెతో రాజీకి రావటం తప్ప మరో మార్గం కనిపించడం లేదతనికి. సాలోచనగా తలూపి, "ఆల్‌రైట్. ఎంత కావాలి?" అడిగాడు-అసలు

విషయానికి వస్తూ.

ఆమె కనుబొమలు ముడివడ్డాయి. "ఏమిటి?"

"దేనికోసమైతే నువ్వింత కష్టపడుతున్నావో! డబ్బు!"

ఆమె పక పక నవ్వి-"మళ్ళీ నువ్వు పప్పులో కాలే శావ్! నీ నించి నాకు నయాపైసా అక్కర్లేదు" అంది.

తన అంచనా మరోమారు తారుమారు కావడం చూసి ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయ్యాయి. "మరి దేనికీ నాటకం?"

"నాటకం కాదు! ఆరాటం! నేను కన్న కలలు ఫల ప్రదం జేసుకోడానికి ఎంచుకున్న వింత మార్గం! ఆమార్గం నీకు వింతగా తోచినా, అంతకి మించి నాకు మరో గత్యం తరం కనిపించలేదు...."

"ఉపోద్ఘాతం కట్టిపెట్టి అసలు సంగతి సూటిగా చెప్పు."

"నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవాలి!"

విరగబడి నవ్వాడు విజయకుమార్. "పెళ్ళా? నిన్నా?"

"ఏం, నాలో ఏం తక్కువని? నా అందానికి కళ్ళు చెదిరి ఆ రోజు వెంటబడి వచ్చిన సంగతి అప్పుడే మరచి పోయావా?"

"పెళ్ళి జేసుకోడానికి అందమే కాదు ముఖ్యం! సౌశీల్యం కూడా వుండాలి."

"నా సౌశీల్యాని కేమైంది? శీలంలేనిదాన్నే అయితే ఆ రోజు నిన్ను అవధులు దాటకుండా ఆపేదాన్నా?"

"నువ్వు నీతిలేని ఒక బ్లాక్ మెయిలర్వి!"

"నిన్ను డబ్బు యివ్వమని అడగడం లేదే! నేను చేసిన తప్పల్లా గొప్పింటి ఇల్లాలిని కావాలని ఆశించడం! దాన్ని

సాధించడానికి ఈ మార్గాన్ని అన్వేషించడం! నా జీవితంలో నువ్వు తప్ప మరో మగాడు చిటికెన వేలితో కూడా ముట్టుకోలేదంటే నువ్వు నమ్మకపోవచ్చు. నా శీలం మీద నీకేమాత్రం అనుమానం వున్నా, ఏ డాక్టరుతోనైనా నన్ను పరీక్ష చేయించు. ఆ పరీక్షలో నేను నిష్కళంకినని తేలితే నువ్వు నన్ను పెళ్ళాడక తప్పదు. నిరాకరించావంటే జరగబోయే పరిణామా లెలా ఉంటాయో నీ ఊహకే వదిలేస్తున్నాను" అంది ప్రతిభ.

కాసేవు తీవ్రంగా ఆలోచించి, సాలోచనగా తల వూపాడు విజయ్‌కుమార్. "ఆల్‌రైట్! నిన్ను పరీక్ష చేయిస్తాను. రేపు ఉదయం సరిగ్గా పది గంటలకు నా ఇంటికి రా! డాక్టర్ని కలుసుకుందాం!"

"ఓ. కే. గుడ్‌నైట్!" అంటూ కారు దిగబోయిందామె.

"కూర్చో. నీ ఇంటివరకూ దిగబెడతాను" అన్నాడు విజయకుమార్.

ఆమె అతని వైపు చూసి నవ్వి-"నో థాంక్స్!" అంటూ కారు దిగి చకచక వెళ్ళిపోయింది.

దూరంగా ఉండి ఆమెని వెంబడిస్తూ ఎక్కడికెళ్తుందో కనుక్కుందామా? అన్న ఆలోచన తట్టింది విజయ్‌కుమార్‌కు. ఇదివరకే మూడుసార్లు పప్పులో కాలేశాడు. ఇప్పుడామెని వెంబడించి వెళితే పప్పుకు బదులు ఉప్పులో కాలేసే ప్రమాద ముంది అనుకుంటూ కారు స్టార్టు చేసి తిన్నగా ఇల్లు జేరుకున్నాడు.

మర్నాడు చెప్పిన వేళకి ఠంచనుగా వచ్చింది ప్రతిభ. ఆమెను కారెక్కించుకుని, నగరంలో తనకు బాగా నమ్మకస్తుడైన ఓ డాక్టర్ డిస్పెన్సరీకి తీసికెళ్ళాడు విజయ

కుమార్.

అతను అరగంట పరీక్షించి తేల్చేశాడు.

ఆమె శీలం చెడని యువతి అని!

విజయకుమార్ వయిపు చూసి విజయగర్వంతో నవ్వింది ప్రతిభ.

"ఆల్‌రైట్! ఇప్పుడు నిన్ను పెళ్ళాడటానికి నా కెలాటి అభ్యంతరం లేదు. రేపే పండితుల్ని పిలిపించి ముహూర్తం నిర్ణయిస్తాను" అన్నాడతను తిరిగి వస్తూ.

4

అనుకున్న ప్రకారం అన్ని ఏర్పాట్లూ పూర్తయి, ఓ శుభముహూర్తాన ఎంతో వైభవోపేతంగా జరిగిపోయింది వారి పెళ్ళి. పెళ్ళికి ఇరుపక్షాల బంధు మిత్రులు వచ్చారు గానీ అట్టే వ్యవధి లేకపోవడంతో అమెరికా నించి స్నేహ ప్రసాద్ రాకపోయినందుకు ఆ పెళ్ళి ప్రభంజన మంతా పేలవంగా తోచింది విజయకుమార్‌కు.

నూతన దంపతుల్లో నవోత్సాహాన్ని రేపే ప్రకృతి సంపద నిండి ఉన్న నెదర్లాండ్స్‌ను తమ హనీమూన్ కేంద్రంగా నిర్ణయించుకుని, ప్రయాణప్రయత్నాలు ప్రారంభించారా కొత్త దంపతులు.

విజయకుమార్ తాను వెళ్ళి వచ్చేలోగా ఫ్యాక్టరీ వ్యవహారాలు ఎలా క్రమబద్ధంగా సాగాలో ప్లానింగ్‌జేసి, మేనేజర్లకు వివరించే గొడవల్లో మునిగి తేలుతుంటే, ప్రతిభ హనీమూన్ కవసరమయ్యే బట్టలు, ఇతర వస్తువులు సేకరించి, సిద్ధంచేసే హడావుడిలో వుంది.

పెళ్ళి తరువాత ఆమె నిజంగా తానొక సంసారపక్షమైన స్త్రీ నని నిరూపించుకుంది. అప్పుడు స్థిమితపడింది విజయకుమార్ మనసు ఆమె విషయంలో.

ఓ రోజు ఉదయం అతను ఫ్యాక్టరీకి వెళ్ళాలని బయట ఆగివున్న కారెక్కబోతున్నాడు. సరిగ్గా అదే సమయంలో ప్రతిభ ఇంట్లోంచి ఆదరా బాదరా చేతిలో చెక్కుబుక్కు పట్టుకొచ్చి "ఇంకా కొన్ని అవసరమైన వస్తువులు కొనడం మిగిలిపోయినవి. ఇంట్లో నెట్ క్యాష్ లేదు. ఈ చెక్ బుక్ మీద సంతకం పెట్టండి. బ్యాంకులో డ్రా చేసుకుంటాను" అంది.

విజయకుమార్ నవ్వుతూ బాల్ పెన్ తీసి, ఓ బాంక్ చెక్ మీద సంతకం చేసి, "ఎంత కావాలో నువ్వే రాసుకో" అని కారెక్కాడు.

తనమీద అతనిలో అంకురించిన నమ్మకానికీ, విశ్వాసానికీ ప్రతిభలో పట్టరాని ఆనందం పెల్లుబికింది. తళ తళ మెరిసే కళ్ళతో, మందహాసంతో కారు గేటుదాటేవరకూ అక్కడే నిల్చుని చెయ్యి ఊపసాగింది.

5

"సామాను సర్దేశావా?" అడిగాడు విజయకుమార్ ఇంట్లో అడుగు పెట్టగానే.

"ఓ యస్! టంగ్ క్లీనర్ నించి, కొత్తగా కొన్న బట్ట లన్నీ సర్దేశాను. త్వరగా స్నానం చేసి రండి. భోజనం వడ్డిస్తాను. ఎనిమిది గంటలవుతోంది. తొందరగా తిని పడుకుంటే పెందరాళే లేచి తయారుకావచ్చు" అంది ప్రతిభ సోఫాలో చతికిలబడ్డ అతని బూట్లు విప్పుతూ.

"నౌఖర్లందరికీ చెప్పేశావా, రేపట్నించి నెలరోజులు సెలవు తీసుకోమని?"

"అంతేకాదు, అందరికీ నెలరోజుల జీతం అడ్వాన్సు కూడా ఇచ్చేశాను. గూర్ఖా ఒక్కడే ఉంటాడు ఇంటిదగ్గర. పెందరాళే మనల్ని సామానుతో సహా ఏర్ పోర్ట్ చేర్చడానికి

టాక్సీ ఏర్పాటుకూడా చేశాను."

మద్రాసులో వారికది చివరి రాత్రి. మర్నాడు ఉదయం ఆరుగంటలకే ఢిల్లీ వెళ్ళే విమానం ఎక్కాలి. అట్నించి నెదర్లాండ్స్ మీదుగా వెళ్ళే బ్రిటిష్ విమానం అందుకోవాలి.

"మన టూర్ ప్రోగ్రాంలో ఈ రోజే చిన్న మార్పు జేశాను. నెదర్లాండ్స్‌లో రెండు వారాలు వుండి, అట్నించి అమెరికా వెళదాం! మనం అమెరికా వస్తున్నట్టు అక్కడున్న స్నేహప్రసాద్‌కు ఏమాత్రం తెలీకూడదు. హఠాత్తు మనల్నక్కడ చూసి, ముఖ్యంగా నిన్ను చూసి వాడు నిర్ఘాంతబోవచ్చు. ఎందుకంటే నేను పెళ్ళి జేసుకోబోతున్నానని వాడికి రాశాను గానీ, నిన్నే చేసుకుంటున్నాననిమాత్రం తెల్పలేదు" అన్నాడు విజయకుమార్ కోటు విప్పుతూ.

చిన్నగా నవ్వి కోటందుకుంది ప్రతిభ.

అదే క్షణంలో కిర్రుమంటూ తలుపు తెరుచుకుంటున్న శబ్దం విని ఉలిక్కిపడి అటు చూశాడు విజయకుమార్. ఆ గది లోపలే ఉన్న బాత్‌రూం తలుపు తెరుచుకుని బైటికి వస్తున్న వ్యక్తిని చూడగానే అంతవరకూ ఆడుతున్న ఊపిరి ఒక్కసారి స్తంభించినట్టు తోచిందతనికి.

"స్నేహప్రసాద్! నువ్వా? ఎప్పుడొచ్చావిక్కడికి?" అనగలిగాడు అప్రయత్నంమీద.

స్నేహప్రసాద్ చిన్నగా నవ్వి—"అమెరికాలో హఠాత్తుగా మిమ్మల్ని చూసి నేను నిర్ఘాంతబోవడం ఏమోగానీ, ఇప్పుడు ఇక్కడ అకస్మాత్తుగా నన్ను చూసి, నీకు మతి పోయినట్టు మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది". అన్నాడు.

"కనీసం ఉత్తరం ముక్కైనా రాయకుండా ఊడిపడ్డావేం? వచ్చిన వాడివి బాత్‌రూంలో దూరి దాక్కున్నావేమిటి? అమెరికా వెళ్ళాక నీ మతి మంటగలిసినట్టుంది"

అన్నాడు విజయకుమార్ చిరుకోపం నటిస్తూ.

"ఔను. అక్షరాలా నిజం చెప్పావ్! అక్కడికి కెళ్ళాకే నాకు తెలిసింది, అసలు జీవితమంటే ఏమిటో? చేతినిండా డబ్బుంటే ఆ జీవితాన్ని స్వర్గధామంగా ఎలామార్చుకోవచ్చో కూడా అక్కడే స్పష్టంగా తెలిసింది నాకు. అందుకే నిన్ను చంపి, నీ పిడికిళ్ళలో వున్న అపారమైన డబ్బును నాకబంధ హస్తాల్లోకి బదిలీ చేసుకుందామని అద్భుతమైన పథకం అల్లాను. ఇది ఆ పథకపు చివరి సీను!" అంటూ జేబులోకి చెయ్యి పోనిచ్చాడు స్నేహప్రసాద్.

తిరిగి వచ్చిన అతని చేతిలో నల్లగా నిగనిగ మెరుస్తున్న పిస్తోలు చూడగానే, అతను వేళాకోళం చెయ్యడం లేదనీ, నిజమే చెబుతున్నాడనీ అర్థమైపోయింది విజయకుమార్‌కు. ఐనా, నమ్మాలా? వద్దా? అన్న మీమాంసలో పడి గుడ్లప్పగించి అతన్నే చూస్తుండిపోయాడు రాతిబొమ్మలా!

"ప్రతిభతో రేపు హనీమూన్ యాత్రకు బైలుదేరబోతున్నానని మురిసిపోతున్నావు కదూ? ఆమె వెళ్ళేది నీతోకాదు. నాతో!" అన్న స్నేహప్రసాద్ మాటలకు అంతవరకూ అణిగి వున్న క్రోధం ఒక్కసారి పెల్లుబికింది విజయకుమార్‌లో.

"స్కౌండ్రల్! ఏం కూశావురా?" అంటూ చటుక్కున ప్రతిభవైపు చూశాడు. స్నేహప్రసాద్ అన్నది అబద్ధం కాదన్నట్టు ఆమె పెదవులపై విషపునవ్వు వెల్లివిరుస్తోంది!

అతని అవస్థ చూసి, "ఇంకా అర్థం కాలా? ఐతే నీ కర్థమయ్యేలా చెబుతా విను. ఐదేళ్ళ క్రితమే ఈ ప్లాన్‌కు అంకురార్పణ జరిగింది. నేర చరిత్రలోనే ఇంతవరకూ ఎవ్వరూ అల్లని పథకం ఇది.

ఐదేళ్ళ క్రితం ఫ్యాక్టరీనించి ఇంటికి వస్తూ, దార్లో ఓ

ఆటోవాడి బారినించి ప్రతిభను రక్షించిన క్షణాన్ని బహుశా నువ్వెన్నడూ మర్చిపోవనుకుంటాను. నిజానికి అది మీ ఇద్దరి మధ్యా పరిచయం ఏర్పరచడానికి నేనాడించిన నాటకమే!

ఆ ఆటోవాడికి డబ్బిచ్చి, ఏం చెయ్యాలో నూరిపోసి, నువ్వు ఫ్యాక్టరీ నించి బైలుదేరగానే అందులో నా ప్రియురాలైన ప్రతిభను ఎక్కించి పంపాను. ఆ విధంగా మీరిద్దరూ పరిచయ మయ్యారు. ఆ తొలి పరిచయంతోనే నువ్వామె మోహంలో పడిపోయావ్.

తరవాత హోటల్లో మీ ఇద్దరి రెండో పరిచయానికి ఏర్పాట్లు జేశాను. నన్ను హోటల్లో వదిలి నువ్వామెను ఇంటిదగ్గర దిగబెట్టడానికి వెళ్ళడంతో నా పథకానికి ప్రాణం పోసినట్టయింది.

నిన్ను తన రూంకు తీసికెళ్ళి, శాడిస్ట్‌లా నటించి, వెర్రి వెంగళప్పను జేసి తిప్పి పంపింది ప్రతిభ. నువ్వామెపై విజృంభించినప్పుడే గదిలో ఏర్పాటు జేసిన ఆటోమెటిక్ కెమెరా వివిధ భంగిమల్లో మీ ఫోటోలు తీసింది. ఆ మర్నాడే ఆమెనా రూం ఖాళీ జేయించి, మళ్ళీ నీ కందకుండా మరోచోటికి తరలించాను.

తరవాత ఎంతో ఓపిగ్గా నీ తండ్రి మరణంకోసం ఎదురు చూస్తూ, ఆ ఆస్తిపాస్తులన్నీ నీ చేతికి వచ్చే క్షణంకోసం నిరీక్షిస్తూ అమెరికా వెళ్ళి ప్లాస్టిక్ సర్జరీలో నైపుణ్యం సంపాదించాను. ఐదేళ్ళ తరవాత నా కల ఫలించింది తండ్రి మరణంతో నువ్వు యావదాస్థికీ వారసుడివయ్యావు.

ఐదేళ్ళ క్రితం తీసిన ఆ ఫోటోలు నీకు పంపి, నీ మతి పోగొట్టి బ్లాక్‌మెయిల్ ద్వారా ప్రతిభను పెళ్ళి జేసుకునేట్టు జేశాను. నిన్న ఆమె తన చాకచక్యంతో ఖాళీ చెక్కుమీద

నీ సంతకం తీసుకుంది. ఈ రోజు నీ పని ముగించి, రేపా చెక్కుద్వారా బ్యాంకులో వున్న నీ నెట్ క్యాష్ అంతా తీసి, మరో బ్యాంకులో మా పేర వేసుకుంటాం!

మనిద్దరి మొహాలూ వేరైనా, ఒడ్డూ పొడుగూ దాదాపు ఒక్కటే. నాకన్నా నీవు కాస్త తెలుపైనా ఐదేళ్ళు విదేశాల్లో తిరగటం వల్ల నా రంగు కాస్త నల్లబడిందని సరి పుచ్చుకోవచ్చు. రేపు ప్రతిభతో విదేశం వెళ్ళగానే ప్లాస్టిక్ సర్జరీ ద్వారా అచ్చు గుద్దినట్లు నా రూపాన్ని నీలా మార్చుకుంటాను. నిజానికి నేను అమెరికా వెళ్ళి ఇంతకాలం ఆ కోర్సు చేసింది అందుకోసమే.

హాయిగా హనీమూన్ యాత్ర ముగించుకుని, కొన్నాళ్ళ తరవాత తిరిగి మద్రాసులో అడుగుపెట్టిన నన్ను చూసి నువ్వేనని అందరూ భ్రమపడతారు. నేనూ నీలా మెడిసిన్ చదవడం వల్ల నీ మందుల ఫ్యాక్టరీ మీద అజమాయిషీ చెయ్యడానికి నాకేమాత్రం ఇబ్బందులు ఎదురుకావు.

అంతే కాదు. ఈ ఐదేళ్ళూ నీ సంతకాన్ని సాధనచేస్తూ ఇప్పుడు ఎడం చేత్తో సైతం నీ సంతకం పెట్టగలిగే ప్రావీణ్యాన్ని సంపాదించుకున్నాను. పోతే, అమెరికా వెళ్ళిన నేను ఏమయ్యానని ఎవ్వరైనా అడిగితే, అక్కడేదో దుర్ఘటనలో చనిపోయానని పుకారు పుట్టించి, నా చాప్టర్ క్లోజ్ చేసుకుంటాను.

రేపు ప్రతిభతో విదేశం వెళ్ళేటప్పుడు నా పేర వున్న పాస్‌పోర్ట్ మీదే వెళతాను. తిరిగి వచ్చేటప్పుడు మాత్రం ఆమె దగ్గరున్న నీ పాస్‌పోర్ట్‌మీద వస్తాను. ఎలా వుంది పథకం?'' అన్నాడు.

కోపంతో విజయకుమార్ మొహం జేవురించింది. "నీచుడా! విశ్వాస ఘాతకుడా! పేదవాడివని దయతలచి,

బాల్యం నించీ అన్నివిధాలా ఆదుకుంటూ ప్రాణమిత్రుడివని భావించి ఇంతటి వాణ్ని జేసిన నన్నే ఈ రోజు ప్రాణాలతో మట్టుబెట్టడానికి పూనుకుంటావా? కుక్కకుండే విశ్వాసంలో పీసమెత్తు కూడా నీలో లేకపోడం మానవజాతికే సిగ్గు చేటు!"

చిన్నగా నవ్వాడు స్నేహప్రసాద్. "ఈ లోకంలో ప్రతి ప్రాణీ పరాన్న భుక్కు! అంటే ఇతర ప్రాణుల్ని భుజించి జీవించే జీవి! ఆదిమానవుడు అవసరం వస్తే సాటి మాన వుణ్ని భుజించి జీవించలేదా? జంతువుల్లో అనేకం తమ కడుపున పుట్టిన కూనల్ని కూడా ఇంకా కళ్ళు తెరవక ముందే తిని కడుపుమంట చల్లార్చుకోవడం లేదా?

పక్షులు పురుగుల్ని తింటాయి. చేపలు చేపల్నే మింగు తాయి. అంతెందుకు, కంటికి కానరాని సూక్ష్మజీవులుకూడా మరో జీవిని భుజించి క్షుద్బాధ తీర్చుకుంటాయని డాక్టర్‌వి నీకు వేరే చెప్పాలా?

నాగరికత పెరుగుతున్న కొద్దీ మానవుడు తిరిగి ఆది మానవుడై పోతున్నాడీ రోజు. ఆస్తిపాస్తుల కోసం కన్న తండ్రుల్నీ, తోబుట్టువుల్నీ ఎంతమంది చంపడం లేదు? ఆఫ్టరాల్ స్నేహితుడివి, నువ్వో లెఖ్ఖా!"

"పాపాత్ముడా! తుచ్ఛమైన ఐశ్వర్యంకోసం స్నేహమనే పవిత్ర పదాన్ని పాపపంకిలం జెయ్యక! నువ్వు చెయ్యా లనుకున్నా ఆ మధుర భావాన్ని నేను మలినం కానివ్వను. ఈ క్షణమే లాయర్ని పిలిపించి నా యావదాస్తినీ నీ పేర రాసి పారేస్తాను. అంతా నువ్వే అనుభవించు. నా దగ్గర డిగ్రీ ఉంది. ప్రాక్టీసు పెట్టుకుని నా బ్రతుకు నేను బ్రత గ్గలను.

పోతే, ప్రతిభ సంగతి. ఆమె నీతోనే వుండాలను కుంటే అలాగే కానివ్వు. పనిలో పనిగా ఆమెకూ, నాకూ విడాకు లిప్పించమని లాయర్‌తో చెబుతాను" అన్నాడు విజయకుమార్ విరక్తిగా.

పకపక నవ్వాడు స్నేహప్రసాద్. "మృత్యువు కళ్ళ ముందు కనిపిస్తే ఎంతటి వాడికయినా ఇలాటి కాకమ్మ కబుర్లు వస్తాయి. ఇప్పటికే ఆలస్యమయిపోయింది. చావు కోసం సిద్ధంకా!"

"నన్ను చంపి నువ్వు చట్టంనుంచి ఎన్నటికీతప్పించుకో లేవు. పిస్తోలు శబ్దం విని గేటు దగ్గరున్న గూర్ఖా పరిగెత్తు కొస్తాడు."

"ఆ విషయాలేవో నేను ముందే ఆలోచించుకున్నాను. నోరు మెదపకుండా రెండు చేతులూ వెనక్కి పెట్టుకో" అంటూ ప్రతిభవైపు చూసి, "నువ్వీ రివాల్వర్‌తో కవర్ చేస్తూ వుండు. నేను వాడి కాళ్ళూ చేతులూ కట్టేస్తాను" అన్నాడు స్నేహప్రసాద్.

ప్రతిభ ముందుకు వచ్చి అతని చేతిలోంచి రివాల్వర్ అందుకుని, విజయకుమార్‌కు గురిపెట్టి నిల్చుంది. స్నేహ ప్రసాద్ జేబులోంచి పొడవాటి నైలాన్ తాడు తీసి ముందు విజయకుమార్ చేతులు కట్టేశాడు బిగదీసి.

తరవాత కోటు జేబులోంచి ఉరితాడు ఉచ్చువేసిన నైలాన్ రోప్ తీసి, "ఇప్పుడర్థమైందా? నిన్ను చంప డానికి నేను యెంచుకున్న విధానం! ఈ ఉచ్చు నీ మెడలో వేసి ఒక్కలాగు లాగితే చాలు, నీ ప్రాణాలు నిశ్శబ్దంగా అనంతవాయువుల్లో లీనమైపోతాయి. తరవాత నీ శవాన్ని

ఇంటివెనక తోటలో పాతిపెట్టడం పెద్ద సమస్య కాదు నాకు" అంటూ విజయకుమార్ని సమీపించాడు.

భయంతో విజయకుమార్ ఒళ్ళు జలదరించసాగింది.

స్నేహప్రసాద్ వంగి అతని మెడకు ఉరితాడు వేశాడు.

అంతే!

"ఆగు!" అన్న ప్రతిభ కేక మారుమోగింది గదిలో.

స్నేహప్రసాద్ తలెత్తి ప్రశ్నార్థకంగా చూశాడు ఆమె వైపు.

"నావైపు కాదు. అదుగో, నీ కెదురుగా వున్న ఉక్కు బీరువావైపు చూడు. దానిమీద ఐదేళ్ళ క్రితం నువ్వు మా నగ్న ఫోటోలు తియ్యడానికిచ్చిన ఆటోమేటిక్ కేమెరా వుంది. అంతేకాదు. దానిపక్కనే ఇంతవరకూ మన సంభాషణ టేప్‌జేసిన రికార్డర్ కూడా ఉంది."

"ఏమిటి నువ్వంటోంది?వాటినెవరు పెట్టారక్కడ?"

"ఎవ్వరో కాదు. స్వయంగా నేనే పెట్టాను."

"వాటార్‌యూ టాకింగ్ నాన్సెన్స్?ఎందుకు పెట్టావ్" అరిచాడు స్నేహప్రసాద్.

ప్రతిభ చిన్నగా నవ్వి — "నీ పథకాన్ని తారుమారు చెయ్యడానికి. బాల్యంనించీ ప్రాణ స్నేహితుడివని భావించి ఎంతో సహాయపడ్డ ఆయన్నే మట్టుబెట్టడానికి పూనుకున్న నీవంటి నమ్మక ద్రోహి, రేపు నన్ను నట్టేట్లో ముంచవని ఏమిటి నమ్మకం?

ప్లాస్టిక్ సర్జరీతో నకిలీ విజయకుమార్‌గా మారే నీతో దిన దిన గండంగా గడిపేకంటే, చట్టబద్ధంగా నన్ను పెళ్ళాడి, ఎంతో అపురూపంగా చూసుకుంటున్న అసలు విజయకుమార్‌తోనే జీవించడం అన్నివిధాలా శ్రేయస్కర

మన్న ఆలోచన ఎప్పుడైతే నాకు తట్టిందో, అప్పుడే ఆయనకు నీ పథకమంతా పూసగుచ్చినట్టు వివరించాను.

అంతేకాదు, నువ్వాయన్ని చంపే బదులు మేమిద్దరం కలిపి నిన్నే ఆత్మరక్షణ కోసం చంపివెయ్యడం మంచిదనీ, చట్టం దృష్టిలో అది నేరం కాదనీ ఆయనకు నూరి పోశాను.

అందు కాయన సమ్మతించకుండా, నిన్ను ప్రాణాలతో చట్టాని కప్పగించడమే మంచిదని నిర్ణయించారు. ఇప్పుడు విదేశీ యాత్రకు బదులు శ్రీకృష్ణ జన్మ యాత్రకోసం సిద్ధంకా!" అన్న ప్రతిభ మాటలు విని, కోపంతో ఊగిపోయాడు స్నేహప్రసాద్.

"నీచురాలా! ఇంతకు తెగిస్తావా? ఇక మీ రిద్దరూ ప్రాణాలతో వుండటానికి వీల్లేదు. మీ ఇద్దరి శవాలనూ ఒకే గోతిలో పూడ్చి నా పథకాన్ని అమలు చేస్తాను" అంటూ అడుగు ముందుకు వేశాడు.

అంతే! మూసి వున్న గది తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి! క్రయింబ్రాంచి ఇన్స్పెక్టర్ రాజారెడ్డీ, సార్జంట్ విశ్వం, మరో ఇద్దరు కానిస్టేబుళ్ళూ గదిలోకి దూసుకొచ్చి స్నేహప్రసాద్‌ని చుట్టేశారు.

"ఇప్పు డర్థమైందా డియర్! నువ్వు రాకముందే మేము పోలీసులకంతా వివరించి, వాళ్ళు నిన్ను రెడ్ హాండెడ్‌గా పట్టుకోడానికి ఏర్పాట్లు జేశాం! రేపు కోర్టులో ఆ కెమెరా తీసిన ఫోటోలూ, టేప్‌జేసిన సంభాషణా చాలు నీకు యావజ్జీవ శిక్ష పడటానికి, ఏమంటావ్?" అంది ప్రతిభ నవ్వుతూ.

స్నేహప్రసాద్ మొహం దుర్భిణీపెట్టి వెదికినా రవ్వంత రక్తపు చుక్క కనిపించనట్టు పాలిపోయింది తెల్లగా! □

అనర్హత

పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ

ఈ రోజు నాకెంతో సంతోషంగా వుంది. నా సంతోషాన్ని దాచి పెట్టలేక పోతున్నాను. తెల్సినవారికి తెలియని వారికి దాని కారణం చెబుతున్నాను. అలా చెప్పడం వల్ల సంతోషం అధికమౌతుంది.

ఎన్నాళ్ళనుండో ఉద్యోగాల వేటలో వున్నాను. నా అదృష్టానికి ఎక్కడా ఎలాంటి చిన్న ఉద్యోగమైనా దొరకలేదు. నేను ఈ మధ్య ఓ ఇంటర్వ్యూకి వెళ్ళాను. అందులో మొత్తం ఎనమండుగురు సెలక్టు అయ్యారు. ఆ ఎనమండుగురిలో నేను ఒకడ్ని కావడమే నా సంతోషానికి కారణం!

మాకు మెడికల్ టెస్టు పెడతారట. దాని తర్వాత అపా యింట్ మెంట్ ఆర్డర్సు ఇస్తారు.

నాకు వూరిలో స్నేహితు లెక్కువ మంది లేరు. నేను అందర్నీ పరిశీలిస్తుంటాను. కాని ఎక్కువమందితో స్నేహం చేయను. నాకు పరిచయస్తులే ఎక్కువ. స్నేహితులు చాల తక్కువ. చాలామంది నా పరిచయస్తుల్నే స్నేహితులను కుంటుంటారు.

అమ్మతో ఈ విషయం చెప్పాను.

ఆమె నామీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇంటికి పెద్ద వాడినై, ఇంటికి ఆధారమైన నాకు ఉద్యోగం దొరుకుతుం దంటే సంతోషం ఆమెకి కాక ఇంకెవరికుంటుంది?

ఆమె ఆ విషయం వినగానే తాను నమ్మిన దేవుడికి కొబ్బరికాయ కొట్టి ఉద్యోగం రావాలని ప్రార్థించింది.

ప్రస్తుతం మా యింటికి నేను తప్ప వేరే ఆధారం లేదు. ఇద్దరు తమ్ముళ్ళని, ఇద్దరు చెల్లెళ్ళని పోషించ వల్సిన బాధ్యత నామీదే వుంది.

అమ్మ అప్పడాలు చేసి, పూలు అమ్మి కొంత సంపాది స్తుంది. ఆ పైన అక్కడా ఇక్కడా చిన్నచిన్న పనులు చేస్తుంటాను. మా సంపాదనతో సంసారం చాల కష్టంగా సాగుతుంది. ఇంట్లో వారందరూ ఒక్కరోజు కూడా సంతృప్తిగా తిండి తినలేదు. పండుగ రోజుల్లో అందరిళ్ళ ల్లోనూ పిండివంటలయితే మా యింట్లో గంజిమెతుకులు. మా పరిస్థితి చాల దీనంగా వుండేది.

డిగ్రీ అయిన దగ్గర నుండీ ఉద్యోగాల కోసం ఎంతగానో ప్రయత్నించాను. నా ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో విసిగిపోయాను. నేను ఫస్టు క్లాసులో పాసయినా ఉద్యోగం

రాకపోవడంతో నాకనిపించింది: 'ఈ కాలంలో ఉద్యోగాలు రావాలంటే తెలివి అక్కరలేదు. కాస్త డబ్బు, సిఫార్సు చేసే పెద్దమనుష్యులుంటే చాలు' అని.

నాకు చదువుంది. డిగ్రీ ఫస్టు క్లాసులో పాసయ్యాను. టైపు, షార్టుహేండ్ లోయరు, హయ్యరు పాసయ్యాను. ఐనా నాకుద్యోగం రాలేదు. అదంతా నా దురదృష్టమనే భావిస్తున్నాను.

ఈ రోజు మెడికల్ టెస్టు పోర్టులో.

వారు చెప్పిన టైముకంటే ఒక గంట ముందుగా బయలుదేరి అక్కడికి వెళ్ళాను.

అక్కడ, అప్పుడే నాతోటి సెలక్టు కాబడ్డ అభ్యర్థులు వచ్చి కూర్చుని వున్నారు ఓ ప్రక్క నీరసంగా గోడకి చేర బడ్డ యువకుడి ప్రక్కన కూర్చున్నాను.

అక్కడికి వచ్చిన ఏడుగురిలో నా ప్రక్క జబ్బు యువ కుడు తప్ప మిగిలిన ఆరుగురు పరిచయం లేకపోయినా వారెవరో తెలుసును.

నేను కాక మిగిలిన ఏడుగురిలో ఆరుగురు ఈ వూరిలో పెద్ద పేరు ప్రఖ్యాతులున్న వారికి సంబంధించినవారు. వారిని చూసి నాకు కాస్త భయమేసింది. ఉన్న పోస్టులు వారే తన్నేస్తారని.

వారిలో మొదటివాడు.

పేరు—మురళీధర్.

మురళీధర్ నాకు తెలుసును. అతను పోర్టు ఆఫీసరు ఇంట్లోనే వుంటాడు. ఆఫీసరుతో చాలాసార్లు తిరగడం నేను చూసాను. అతను ఆఫీసరు బంధువు. ఎక్కడినుండో ఉద్యోగం కోసం వచ్చి ఆఫీసరు గారింటిలో వుంటున్నాడు. అందుకే అతనికి తప్పకుండా ఉద్యోగం వస్తుంది.

అందుకే అతని మీద ఆశ వదులుకోవాలి. అతనికి సిఫార్సు వున్నట్టు ఖచ్చితంగా తెలుస్తుంది.

రెండవవాడు.

పేరు—రంగన్న.

ఈ వూరిలో తిరుగులేని, ఎదురులేని గూండా వీరరాజు. అటువంటి వీరరాజు తమ్ముడు రంగన్న వీరరాజు చేయలేని పని ఏదీ లేదు. తనకి అడ్డు వచ్చిన వారిని గొర్రెల్లా నరికి వేయగలడు.

అతను ఎన్నోసార్లు జైలుకి వెళ్ళివచ్చాడు. ఒకసారి వీరరాజు కొడుకు స్కూల్లో సీటుకోసం వెళ్ళాడట. అప్పటికి ఆ స్కూలులో ఇవ్వవల్సిన సీట్లు నిండిపోవడంతో వారు ఇవ్వలేమని చెప్పారట!

ఆ మర్నాడే ఆ హెడ్‌మాష్టర్ ఇంటికి వెళ్ళి తన పరిస్థితి అంతా చెప్పి "ఖబడ్దార్ సీటు ఇవ్వకపోతే జాగ్రత్త!" అని బెదిరించాడట. మర్నాడు వచ్చినట్లు సీటు వచ్చింది. అందుకే అలాంటి గూండాతో ఎవరూ తగువులు పెట్టుకోరు. అతనికి పెద్ద పెద్ద మినిష్టర్లు, వూరిలో మేకవన్నె పులులు.. ఎందరో తెలుసు. ఏదైనా అవసరానికి....అపోజిషన్‌లో ఎవరినైనా ఎగరగొట్టించడానికి వీరరాజుని పిలుస్తారు.

అలాంటి వీరరాజు తమ్ముడు రంగన్న. రంగన్నకి ఉద్యోగం రాకపోతే వీరరాజు వూరుకోడు. వీరరాజు చేతిలో పెద్ద పెద్ద మంత్రులే వున్నారు. తన తమ్ముడికి ఉద్యోగం ఈయకపోతే ఆఫీసర్లని ఏమైనా చేయించగలడు - చేయగలడు.

మూడో వాడు—

చంద్రశేఖర్.

ప్రస్తుతం ఎం.ఎల్.ఎ. గా వున్న సర్వోత్తమరావుగారికి

స్వయానా అల్లుడికి తమ్ముడు చంద్రశేఖర్.

ఆ ప్రాంతంలో సర్వోత్తమరావు మాటకి తిరుగులేదు. అతను ఎలా జరగాలని చెబితే అలా జరగవల్సిందే. అతను చెప్పింది అక్కడి వారికి వేదవాక్కు.

ఆయన తన అల్లుడి తమ్ముడికి ఉద్యోగం ఇప్పించకుండా వుంటాడా? అందుకే ఇంటర్వ్యూలో సెలక్టు చేయించాడు. ఉద్యోగం యిప్పించగలడు. ఎం.ఎల్.ఎ. రికమండేషన్ వుంది గాబట్టి చంద్రశేఖర్ గ్యారంటీ.

నాలుగోవాడు —

రమణమూర్తి.

రమణమూర్తికి ఈ ఉద్యోగం చేయకపోయినా పర్వా లేదు. అసలు ఉద్యోగం అవసరమే లేదు. అతనికి ఏడేడు తరాలు ఖర్చుపెట్టినా తరగని ఆస్థి వుంది. గోదావరి జిల్లాలలో ఎన్నో ఎకరాల పొలాలున్నాయి. ఈ ప్రాంతంలో అతనికి వూరిలో ఓ పది పన్నెండు ఇళ్ళు వున్నాయి. అవన్నీ కాకుండా రికార్డు దొరకకుండా మరెంతో ఆస్థి వుంది.

ఉద్యోగం పురుష లక్షణం గాబట్టి ఏదో సరదాకోసం వచ్చాడు. అతనికి కుతూహలం వుంది గాబట్టి ఉద్యోగం కోసం ఎంత డబ్బయినా ఖర్చు చేయగలడు. అందువల్ల అతనికి తప్పకుండా ఉద్యోగం వస్తుంది. రమణమూర్తికి ఏవిధమైన రికమండేషన్ లేకపోయినా మహామహులు లొంగిపోయే డబ్బు వుంది.

నేను రమణమూర్తి ఆశకూడా వదులుకోవల్సిందే!

ఐదవవాడు —

సూర్యప్రకాష్.

పట్నంలో డి.ఎస్.పి.కి ఎంత విలువ వుంటుందో అందరికీ తెలిసిందే! అటువంటి డి.ఎస్.పి. ముద్దుల కొడుకు సూర్యప్రకాష్.

అందుకే సూర్యప్రకాష్‌మీదా ఆశ వదులుకోవల్సిందే!

ఆరవవాడు.

ప్రభాకర్.

ప్రభాకర్‌కి ఒక కాలు లేదు. అతను వికలాంగుడు. ఈ ఉద్యోగంలో ఒకరికి రిజర్వేషన్ వుంది. వికలాంగుడికి ఉద్యోగం వస్తుంది.

ప్రభాకర్ క్వాలిఫికేషన్‌లు అన్నీ సరిపోయాయి. అతనికి రిజర్వేషన్‌లో తప్పకుండా ఉద్యోగం వస్తుంది!

అందుకే ప్రభాకర్‌మీదా ఆశ వదులుకొన్నాను.

నా ప్రక్క నున్నవాడు ఏడవవాడు.

అతని మీదే నా ఆశంతా వుంది. అతను మాటిమాటికీ దగ్గుతున్నాడు. అక్కడ కూర్చున్న అరగంటలో ఆరు సిగరెట్లు కాల్చి పారేశాడు.

ఆ వ్యక్తి వైపు చూసాను. మనిషి సన్నగా, నీరసంగా వున్నాడు. మనిషిని చూస్తే ఆరోగ్యవంతుడు అనిపించుకోడు. ఏవో రోగాలతో దీర్ఘకాలం నుండీ బాధ పడుతున్నాడనిపిస్తుంది.

అతను కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. నేను వాటిని పరీక్షగా చూసాను. అవి సోడా బుడ్డీ అద్దాల్లా వున్నాయి. అంటే అతనికి సైటుకూడా చాలా ఎక్కువే వుందని అర్థమైంది.

అతను మాటిమాటికి దగ్గుతున్నాడు. దగ్గలేక గుండెల్ని పట్టుకుని విపరీతంగా బాధపడుతున్నాడు.

నా ఆశ అంతా అతనిమీదే వుంది.

అతనిని వూరిలో అంతకు ముందెన్నడూ చూడలేదు. బహుశా ఎక్కడి నుండో వచ్చి వుంటాడని సరిపెట్టుకున్నాను.

అతనిని నాతో పోల్చిన తర్వాత అతను నాకంటే ఎంతో తక్కువ వాడని, అన్నింటిలోనూ నాకంటే తీసికట్టే అని అనిపించింది.

అతని ఆరోగ్యంతో నా ఆరోగ్యం పోల్చిన తర్వాత చాల వ్యత్యాసం కనిపించింది. నేను చిన్నప్పటి నుండీ ఎక్సర్‌సైజు చేస్తున్నాను. ఇంతవరకూ జీవితంలో ఒక్క సిగరెట్ కూడా కాల్చలేదు. నేను ఎప్పుడూ ఆరోగ్యంగా వుంటాను. ఎక్సర్‌సైజు తరుచుగా చేస్తుంటే అనారోగ్యమన్నది మన ఛాయలకే రాదు.

మొత్తం వచ్చిన ఎనిమిది మందిలోనూ ఏడుగురే ఎన్నిక కాబడతారు. ఉన్నవి ఏడు పోస్టులు. వచ్చినవారు ఎనిమిదిమంది. వీరిలోనే ఎవరో ఒకరు 'మిస్' అయి పోతారు.

రికమండేషన్‌లున్న, పరపతులు, డబ్బులు వున్న మొదటి ఆరుగురు తప్పకుండా సెలక్టు కాబడతారు. నాకు ఉద్యోగం తప్పకుండా వస్తుంది. ఎందుకంటే ఆ ఆరుగురిని మినహాయిస్తే మిగిలిన ఒక్క సీటుకి నేనూ, ఆ అనారోగ్యవంతుడూ పోటీ అవుతాము. మా యిద్దరిలోనూ పరిపూర్ణ ఆరోగ్యవంతుడ్ని నేను గాబట్టి, నేను తప్పకుండా సెలక్టు అవుతాను అనిపించింది.

అప్పుడే ఒకొక్కరినీ మెడికల్ టెస్టుకోసం పిలుస్తున్నారు. ఒకొక్కరూ వెళుతున్నారు.

అయినవాళ్ళు తిరిగి వెళ్ళిపోతున్నారు. అక్కడ

కూర్చున్న అందరిలోనూ టెన్షన్‌గా వుంది.

అందరూ ఐపోయారు.

నా ప్రక్కన నీరసంగా సిగరెట్లు త్రాగుతూ కూర్చున్నతడికి పిలిపొచ్చింది. అప్పుడే తెలుసుకున్నాను—అతని పేరు ప్రకాశం అని. ప్రకాశం అప్పుడే ముట్టించిన సిగరెట్ తొందర తొందరగా కాల్చేసి ప్రక్కన పడేసిన తర్వాత ధీమాగా లోనికి ప్రవేశించాడు.

ఇంక మిగిలింది నేనొక్కడినే. మరో పావుగంటలో ప్రకాశం నవ్వుతూ వచ్చేశాడు. "ఎలా జరిగింది?" ఆతృతగా ప్రశ్నించాను. అరగంట ప్రక్క ప్రక్కనే కూర్చోవడం వల్ల అతనితో కాస్త చనువు పెరిగింది.

"పర్వాలేదు!" అన్నాడు మరో సిగరెట్ వెలిగిస్తూ.

నాకు అప్పుడనిపించింది: వెళ్ళిన ప్రతీవారు అలానే అంటారని. అందుకే కాస్త సంతృప్తి చెందాను.

తర్వాత నన్ను పిలిచారు.

మొదటిసారిగా కాస్త భయం వేసింది. అయినా ధైర్యం తెచ్చుకుని నెమ్మదిగా ప్రవేశించాను.

ఆ గదిలో ఒక డాక్టర్ వున్నాడు. అతనికి మరో యిద్దరు అసిస్టెంట్లు వున్నారు.

ముందుగా బరువు తూచారు. ఆ తర్వాత ఎత్తు కొలిచారు. ఆ తర్వాత రక్త పరీక్ష. ఈ ఉద్యోగానికి ఆరోగ్యం ముఖ్యం. అందుకే చాల జాగ్రత్తగా చూస్తారు వాటిని. నాకు అన్ని పరీక్షలు జరిగాయి.

ఆతృతగా డాక్టర్ ముఖంలోనికి చూస్తున్న నావైపు చూస్తూ చేతులు తుడుచుకుంటూ "యూ ఆర్ అన్‌ఫిట్" అన్నాడు డాక్టర్.

నాకు మతిపోయింది.

ఆ మాట విని త్రుళ్ళిపడ్డాను. "డాక్టర్! ఏమిటి మీరంటున్నది?" అతని ముఖంలోనికి ఆశ్చర్యంగా చూస్తూ ఆవేశంగా అడిగాను.

"సారీ మైబాయ్! నీ గుండె చాలా బలహీనంగా వుంది!" బండబారిన పెదాల్ని తడిచేసుకుంటూ చెప్పాడు.

"లేదు డాక్టర్! నేనింతవరకూ ఎప్పుడూ గుండె నొప్పితో బాధపడలేదు!" అంతకన్నా అతనికి యింకెలా చెప్పాలో అర్థం కాలేదు నాకు.

"అనవసరంగా ఆవేశపడకు మిష్టర్! నీవు చేయబోయే ఉద్యోగానికి నీ ఆరోగ్యం సరిపడదు. అంతే....ఐ పిటీ యూ!" అన్నాడు అతి మామూలుగా.

నాకేం పాలుపోలేదు. ఏం చేయాలో తోచక నీరసంగా బైటికి వచ్చేశాను.

'నన్ను మోసం చెయ్యకు డాక్టర్!' అంటూ గట్టిగా అరుద్దామనుకున్నాను. కాని ఆ అరుపు నా గొంతులోనే నిక్షిప్తమైపోయింది.

అప్పుడనుకున్నాను.

ఆ ఎనిమిది మందిలోనూ ఉద్యోగం రాని అదృష్టవంతుడు నేనేనని.

నేను ఎన్నో ఆశలు పెట్టుకున్న రోగిష్టి వాడికి ఉద్యోగం వచ్చేసింది.

నాకేం అంతుచిక్కడం లేదు.

ఇంటికెళ్తే నా వుద్యోగంకోసం ఆతృతగా ఎదురుచూసే తనవాళ్ళకి ఏమని సమాధానం చెప్పాలో అర్థంకాలేదు. అంతా నా దురదృష్టం అని ఇంటికి బయలుదేరాను.

* * *

ఇంటర్వ్యూ జరిగి వారం రోజులయిపోయింది.

సెలక్టుకాబడిన అభ్యర్థులు తమ తమ వుద్యోగాలలో చేరిపోయారు.

ఒంటరిగా బీచిలో కూర్చున్నాను.

మనస్సు బావోలేదు.

ఏం చేయాలో తోచడం లేదు. నా దురదృష్టంమీద అసహ్యం వేస్తుంది. తలొంచుకుని ఆలోచిస్తున్న నేను చిన్న చప్పుడుతో తల పైకెత్తాను. ఎదురుగా ప్రకాశం. అప్పుడు కూడా ప్రకాశం చేతిలో సిగరెట్ వెలుగుతూనే వుంది.

"హలో!" అతనే పలకరించాడు.

కూర్చోమన్నట్టు చూశాను.

ప్రకాశం ఇసుకలో ఎదురుగా కూర్చున్నాడు.

ప్రకాశం చాలా అదృష్టవంతుడు అనుకున్నాను.

ఓ ఐదునిమిషాల మౌనం తర్వాత అసలు విషయాన్ని కదిపాను. నా మనస్సుని తొలిచేస్తున్న అనుమానాన్ని తీర్చుకోడానికి అతడిని అడిగాను.

"నువ్వు అస్తమానూ సిగరెట్లు కాలుస్తావు కదూ? నీ ఆరోగ్యం అంత సరిగ్గా లేకపోయినా నీకు ఎలా వచ్చింది వుద్యోగం!" అని.

ప్రకాశం పకపకా నవ్వాడు.

"ఆ రోజు ఎనిమిదిమందిలోనూ వుద్యోగం రాని దుర దృష్టవంతులు మీరేనన్న మాట! మీరు ఒక్క రోజు పరి చయంలోనే నా స్నేహితులైపోయారు. అందుకే మీకు రహస్యం చెబుతున్నాను!" అన్నాడు ప్రకాశం.

ఇసుకలో కాస్త జరిగాను. ఎన్నికల్లో సంస్కార

వంతులు ఎలిమినేట్ అవుతున్నారు. మెడికల్ ఎగ్జామినేషన్ లలో ఆరోగ్యవంతులు ఎలిమినేట్ అవుతున్నారు. ఈ అనారోగ్యవంతుడు యెలా యెన్నికయినాడా అన్నదే నా అనుమానం.

"ఆ రోజు మనకు మెడికల్ ఎగ్జామినేషన్ చేశారు చూశారూ....ఆ డాక్టర్ ఎవరనుకున్నారు?" ప్రశ్నించాడు ప్రకాశం.

"ఎవరు?" నాలో ఆతృత.

"ఆయన స్వయాన నాకు అన్నయ్య!"

ఉలిక్కిపడ్డాను....

ఆ రోజు ఆ డాక్టర్ ఎందుకు అబద్ధం చెప్పాడో ఇప్పు డర్థమైంది.

నేను ఆలోచిస్తూండగానే ప్రకాశం వుత్సాహంగా మరో సిగరెట్ వెలిగించాడు.

□

కూడా వాళ్ళకు తెలీదు? ఒకరి భావాలొకరికి తెలియచేసుకోవటానికి నోటితో చేసుకునే శబ్దాలే వాళ్ళ భాష.

అందుకేనేమో భాష లేకుండా చేసే మూగసైగలు వాళ్ళకు కొద్దిగా అర్ధమయ్యాయి కూడా.

కుహానీ వాళ్ళ ఆరుగురినీ చాలా ఆదరంగా చూశాడు. మంచి మాగిన పండ్లు, తేనె, అరటిపళ్ళు తెప్పించాడు. వెదురుబియ్యం తెప్పించాడు. అందులో నీళ్ళుపోసి వెదురు బొంగులోపోసి, బొంగుకింద చెకుముకితో నిప్పుచేసి పచనం చేశాడు. సురేఖ, అర్చన చెప్పిన మీదట వాళ్ళకు ఆ ఆలోచన బాగా నచ్చింది.

మాంసం చూపించి 'తింటారా?' అని సైగచేసి అడిగాడు.

వాళ్ళు పచ్చిమాంసాన్ని కాల్చి తింటున్నారు. అలా కాకుండా నీళ్ళలో ఉడకబెట్టి ఉప్పు, కారంతో కలిపి తింటే కొంత రుచి వస్తుందని అర్చన సూచించింది.

ఆ గూడెం వాళ్ళకు పక్కనే ఉప్పునీరు ప్రవహిస్తున్నా ఉప్పుమడులు తయారుచేసుకోవటంగాని, ఆహారంలో ఉప్పు వాడకంగాని తెలీదు. అర్చన, సురేఖ గూడెం ఆడవాళ్ళకు ఆ విషయాల్లో మంచి ట్రెయినింగ్ యివ్వాలని నిర్ణయించుకున్నారు.

ఆ దీవిలో రకరకాల చెట్లు, మొక్కలు వున్నాయి. అనుకోకుండా ఎక్కడైనా మిరప మొక్కలు కనిపించక పోతాయా, వాటితో కారం చేసుకోవచ్చునని అర్చనా, సురేఖ సూచించారు. తర్వాత తీరికగా వెతకాలని నిర్ణయించుకున్నారు.

ఆ దీవి పైకి భయంకరంగా కనిపిస్తున్నా, దీవి వాసుల వల్ల ప్రమాదం లేకపోవటంతో వాళ్ళకు ఆ దీవి చాలా

సుందరంగా కనిపిస్తోందిప్పుడు.

చాన్నాళ్ళ తర్వాత అందరూ తృప్తిగా తిన్నారు.

విందు అనంతరం కుహానీ చిన్న డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశాడు. అందులో స్త్రీలు కూడా పాల్గొన్నారు. ఒకరి చేతులు ఒకరు పట్టుకుని వలయంలా తిరుగుతూ చేసే ఆ డ్యాన్స్ చూడటానికి బాగానే కనిపించింది.

ఆ స్త్రీల మధ్య చక్రవర్తి చూసిన మెరుపుతీగె కూడా పాల్గొన్నది. చాలా చలాకీగా ఎగుర్తున్న ఆమె చురుకుదనం చూశాక చక్రవర్తి మనసు గతి తప్పింది.

అప్పటికి రాత్రి బాగా పొద్దుపోయింది.

కుహానీ వాళ్ళందరికీ పక్కలు ఏర్పాటు చేశాడు. వాళ్ళందరూ కటికనేలమీద పడుకోవటం అలవాటయిన అనాగరికులే అయినా, అతిథుల కోసం మంచాలు తయారు చేశారు అప్పటికప్పుడు.

నాలుగేసి గుంజలుపాతి దానిపైన కర్రలతో అడ్డంగా బల్లపరుపుగా పేర్చి ఒకదానితో మరొకటి జతచేసి కట్టారు. పంటపొలాల్లో కాపలాకు తయారుచేసే 'మంచె'లలాగా తయారయిన తర్వాత వాటిపైన మెత్తగా వుండేందుకు రెల్లుగడ్డి, చెట్ల ఆకులు వేసి పరుపుల్లాగా తయారుచేశారు. ఆ విధంగా ఆరు మంచెల మంచాలు తయారయ్యాయి.

రాజేష్, అవినాశ్‌లు కుహానీకి కృతజ్ఞతలు చెప్పారు.

కుహానీ తలవంచి చెయ్యి హృదయానికి దగ్గరగా పెట్టుకుని ప్రణామం చేశాడు.

రాజేష్ తదితరులు అతని పద్ధతిలోనే తలవంచి చేతులు గుండెలకు చేర్చి నమస్కారాలు చేశారు.

కుహానీ తన అనుచరులతో వెళ్ళిపోయాడు.

అందరూ మంచాలమీద నడుములు వాల్చారు.

"వీళ్ళ ఆదరణ చూస్తుంటే వీళ్ళెంత అమాయకులో అర్థమవుతోంది. వీళ్ళెవరో మనకు తెలీదు, మనం వాళ్ళకి తెలీదు. అయినా ఆప్యాయంగా ఆదరించారు. అన్నం పెట్టారు. అతిథి సత్కార్యాలు చేశారు. శయనాగారాలు ఏర్పాటు చేశారు. మన వినోదంకోసం నృత్యాలు చేశారు, పాటలు పాడారు. వీళ్ళ ఋణం తీర్చుకోవటం కష్టం" అన్నాడు రాజేష్.

అందరూ తలలాడించారు.

"అసలు వీళ్ళు కూడా ఆ దీవిలో వాళ్ళలాగే నరమాంస భక్షకులేమోనని భయపడ్డాను. కాని వీళ్ళు చాలా సాత్వికులు వీళ్ళను చాలా తొందరగా నాగరీకులుగా మార్చవచ్చును" అన్నాడు వినోద్.

"నిజమే! వీళ్ళ ఆచార వ్యవహారాల్లో సరైన మార్పు తేవచ్చు. కట్టుబాటుల్లోను, ఆహారపు టలవాట్లలోను, మనకి కావలసిన విధంగా మంచి మార్పు తేవటం కష్టంకాదు" అన్నది అర్చన.

"చూడగా మీరంతా యిక్కడే సెటిలయిపోవాలను కుంటున్నట్టు కనిపిస్తోంది. మనం గమ్యం చేరుకోటానికి యిదొక మజిలీగా తీసుకోవాలేగాని, ఇక్కడే స్థిరనివాసం చేసుకోబోవటంలేదు కదా! వీళ్ళ ఆచార వ్యవహారాల సమస్య మనం తీసుకోవటం దేనికి?" అన్నది సురేఖ తనూ చర్చలో పాల్గొంటూ.

"మరేంలేదు, వాళ్ళకు మనకు చేతనైనంత నాగరికత నేర్పి ఆ మనసున్న మనుషుల్ని సానబట్టడంవల్ల సాంస్కృతిక విప్లవాన్ని తీసుకురావచ్చును" అన్నది అర్చన.

"నీ సోషలాజికల్ స్టడీస్ పక్కనపెట్టవే బాబూ! నువ్వు చూడగా ఈ ప్రజల సోషల్ స్ట్రక్చర్, కల్చర్, ఏటిట్యూడ్స్,

హేబిట్స్ — అంటున్నావంటే నీ సోషలాజికల్ రిసెర్చి విప్పబోతున్నావని నాకు అనుమానంగా వుంది" అన్నది సురేఖ.

"ఎగ్జాక్ట్లీ! మనకు మళ్ళీ యిలాంటి అవకాశం రాదు కదా! ఎలాగూ పి.హెచ్.డి. చెయ్యాలనుకుంటున్నాను కదా ఎం.ఏ. తర్వాత? దానికిది నాంది."

"నమస్కారం తల్లీ! అంతపని మాత్రం చెయ్యకు" భయంగా చేతులు జోడించింది సురేఖ.

"నాక్కూడా యిక్కడి పరిస్థితులు చూశాక కొన్నాళ్ళ పాటు వుండి వీళ్ళలో సైంటిఫిక్ రీజనింగ్ అండ్ థింకింగ్ డెవలప్ చేస్తే బాగుంటుందనిపిస్తోంది" అన్నాడు చక్రవర్తి తన సైన్సు పాఠాలు నెమరువేసుకుంటూ ఆలోచనల మధ్య తను చూపిన అమ్మాయిని నిలుపుకుంటూ.

"సరిపోయింది. ఒకళ్ళ కిద్దరు పిచ్చివాళ్ళయ్యారు. నీ సైన్సుబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. సరే నే నెందుకు అవకాశం పోనివ్వాలి? వీళ్ళకు భాషాజ్ఞానంలేదు. నేను అచ్చ తెలుగులో వీళ్ళకు పొయిట్రీ చెపుతాను. అక్షరాలు నేర్పుతాను" అన్నాడు వినోద్.

"అవినాశ్ ఏం మాట్లాడటం లేదేమిటి?" చక్రవర్తి అన్నాడు.

"మీ రిసెర్చి స్టడీస్కి నేను పక్కనుండి పర్యవేక్షణా బాధ్యతల్ని, మీకు భోజన సదుపాయాల్ని చూసుకుంటాను. సరేనా?" అన్నాడు అవినాశ్ నవ్వుతూ.

"అంతేకాదు, యిక్కడి 'ప్రకృతి' దృశ్యాలని నీ కుంచెలో బిగించి, కుంచెల్లేవనుకో, అయినా 'స్కెచ్' గీసుకొని యింటికి పోయాక డెవలప్ చేసుకో. నీ ఆర్టిస్టిక్ నేచర్కి చక్కటి అవకాశం!" వినోద్ అన్నాడు.

అప్పటికే బాగా పొద్దుపోయింది.

గూడెంలో అందరూ నిద్రల కుపక్రమించినట్టున్నారు. సద్దు మణిగింది.

మాట్లాడుకుంటూనే అందరూ గాఢనిద్రలోకి ఒరిగి పోయారు. రాజేష్, అవినాశ్‌లు చాన్నాళ్ళ తర్వాత కంటి నిండా నిద్రపోయినది ఆ రాత్రే!

అసలు నిద్రపోనివాడు చక్రవర్తి ఒక్కడే!

25

మర్నాడు ఉదయం రాజేష్ బృందం కాలకృత్యాలు తీర్చుకుని, దగ్గర్లో వున్న సెలయేట్లో స్నానం చేసి వచ్చారు.

అవినాశ్ కుహోనీకి బొమ్మగీసి చూపించాడు.

ముందు విమానం బొమ్మగీసి అలాంటిది అతను చూశా డేమో అడిగాడు. కుహోనీ వెంటనే తలూపాడు.

అంటే—ఆ దీవి మీదుగా విమానం ఎగరటం కుహోనీ చూసివుండాలి. బాగా పైగా ఎగురుతుండటంవల్ల పెద్ద బొమ్మగీసి చూపిస్తే చెప్పలేకపోయాడు ముందు. విమానం బాగా ఎత్తుగా మబ్బుల్లో ఎగుర్తుండగా కిందనున్న వాళ్ళకు ఎంత ఆకారం కనిపిస్తుందో, ఆ పరిమాణం గల బొమ్మ వేశాక కుహోనీ వెంటనే గుర్తించాడు.

అయితే విమానం కిందుగా ఎగరగా వీళ్ళు ఎన్నడూ చూడలేదన్న మాట! అంటే యీ దగ్గర్లో విమానాశ్రయం లేదన్నది నిర్వివాదాంశం. దాన్నిబట్టి కూడా ఆ ప్రాంతం ఏ దేశంలో ఏ సరిహద్దుల్లో వుందో ప్రపంచపటంలో దాని ఉనికి ఎక్కడో ఊహించటం సాధ్యపడలేదు వాళ్ళకి.

"ఈ సారి ఓడ బొమ్మవేసి చూపించు" అన్నాడు రాజేష్.

అవినాశ్ షిప్పు బొమ్మ వేశాడు.

కుహానీ ముఖకవళికల్లో మార్పులేదు. అతను షిప్పు నెప్పుడూ చూడలేదన్న విషయం అతని చూపులే చెపుతున్నాయి.

ఈ సారి అవినాశ్ షిప్పు సైజు తగ్గించి వేశాడు. దూరం నించి షిప్పు ల్యాండ్ అయివుండగా ఎంత పరిమాణం వుంటుందో అంత పరిమాణాలతో వేరు వేరుగా గీచి చూపించాడు.

కుహానీ తల అడ్డంగా తిప్పాడు.

లాభంలేదు, యీ ప్రాంతాల ఎప్పుడూ ఓడ ప్రయాణం చేసి వుండలేదు. నౌకాయానం చేసే వర్తకులవల్లగాని, ప్రయాణీకులవల్లగాని తమ గమ్యం తెలుసుకోవాలనుకున్న రాజేష్ ప్రయత్నం విఫలమయింది.

ఇక ఎలా తా మీ దీవి నుండి బయటపడాలి? విమానం ఏదయినా పైనుండి పోతుండగా వాళ్ళకి సిగ్నల్స్ పంపించటం కూడా జరిగేపని కాదని తన ప్రయత్నం ఋజువు చేసింది.

తమ అదృష్టం బావుండి, విమానం ఏదయినా బాగా కిందుగా యెగిరితే, అందులోని వైమానికదళ సిబ్బంది తమ సంకేతాన్ని గుర్తించి ఆగితే అప్పుడు యేదయినా ఫలితం వుంటుంది. కాని అది జరిగేదేనా?

అప్పటికి రెండు మూడు సార్లు పళ్ళు తేనె అల్పాహార విందులను కుహానీ ఏర్పాటు చేశాడు.

మధ్యాహ్నమయ్యేసరికి అర్చన, సురేఖ అక్కడి ఆడవాళ్ళ సాయంతో వెదురుబియ్యం వండారు. మాంసాన్ని యెలా పచనం చెయ్యాలో ప్రాక్టికల్‌గా వాళ్ళకు చేసి చూపించారు. అయితే అందులో ఉప్పు, కారం, సుగంధ

ద్రవ్యాల మషాలా యివేవీ లేవు. అవి ఆ దీవిలో ఎక్కడయినా దొరుకుతాయేమో యీ సారి ప్రయత్నించాలని నిర్ణయించుకున్నారు వాళ్ళు.

ఈ లోపల వినోద్ కూడా ఊరికే కూర్చోలేదు. ఉప్పు నీటి కయ్యల్ని ఎలా తవ్వుకోవాలో, ఉప్పుమడులు యెలా కట్టాలో, ఉప్పును యెలా పండించవచ్చునో గూడెంలోని యువకులకు బోధించాడు. ఉప్పు వేసుకుంటే ఆహార పదార్థాలకు ఎంత రుచి వస్తుందో కూడా యేకరువు పెట్టాడు.

వాళ్ళెవరికీ అతడు చెప్పిన విషయాలు బోధపడలేదు కాని ఉప్పుమడులు కట్టడానికి మాత్రం ఉత్సాహంగా పని చేశారు.

26

కుహానీ మధ్యాహ్నం భోజనాల తర్వాత వాళ్ళందరినీ దీవిలో విహరించడానికి సిద్ధంగా వున్నారా అని అడిగాడు సైగలతో.

అందరూ ఉత్సాహం చూపించారు.

ఈ సారి దీవిలో ఒక్కో అడుగు ముందుకు వేస్తుంటే ఆనందం ఉప్పొంగుతోంది వారిలో. ఇదివరలో ఒక్కో అడుగు మృత్యువుకి దగ్గరగా తీసుకు వెళ్తున్నట్టు గుండె పీచుపీచుమంటూ వుండేది. ఇప్పుడు పక్కన సాయుధులైన ఆటవికులు తమకు సన్నిహితంగా వచ్చిన ఆత్మీయులు నడుస్తుంటే మరపురాని విహారయాత్రలా అనిపిస్తోంది ప్రతి ఒక్కరికి.

నడుస్తూనే చక్రవర్తి చూపులు అటు యిటు పరుగెత్తిస్తున్నాడు.

కుహానితో బాటు మరో పదిమంది ఆటవికులుచేత

రాతితో చేసిన పొడవాటి సూదిగా వున్న ఆయుధాలు పట్టు కుని వాళ్ళతో వస్తున్నారు.

ఛెంగు ఛెంగున లేళ్ళు, దుప్పులు పరుగులు పెడ్తు న్నాయి. చెవులపిల్లులు, కుందేళ్ళు నయనానందకరంగా చెలగాటలాడుతున్నాయి. ప్రకృతి యెంతో అందంగా కని పిస్తోంది.

ఓ పక్క రకరకాల పళ్ళ వృక్షాలు భారంగా నేలకి వంగి నవమాసాలు నిండిన నిండు గర్భిణిలా శోభతో పెరిగి పోతున్నాయి. రంగు రంగుల పూల మొక్కలు చల్లగాలికి గర్వంగా ఠీవిగా తలలూపుతున్నాయి.

కుహానీ తన భాషలో ఆ చెట్లను, పూలను ఏమని పిలు స్తారో అర్చన వాళ్ళకు చెపుతున్నాడు. అతను మాట్లాడు తుండగా వినటం వాళ్ళకి మంచి కాలక్షేపం. అర్థంకాని సినిమా చూస్తున్నట్టనిపిస్తుంది.

అర్చన, సురేఖ మిరపచెట్లు, సుగంధ ద్రవ్యాల మొక్కలు చెట్లు ఎక్కడన్నా వున్నాయేమోనని పరిశీలనగా చూస్తున్నారు. సుగంధ ద్రవ్యాల మొక్కలు చెట్లు యెలా వుంటాయో వాళ్ళకు తెలీసు. వాసననిబట్టి గుర్తుపట్టాలి, అంతే!

ముందు పరుగెత్తుతున్న లేళ్ళకు గురిచేసి ఒక ఆట వికుడు ఆయుధం విసిరాడు. కాస్తలో గురి తప్పిపోయింది. లేడి తప్పించుకుని పారిపోయింది.

మరొకడు దుప్పికి గురిచేసి విసిరాడు రాతి ఆయుధాన్ని. అది సరాసరి పోయి దాని పొట్టలో బలంగా దిగిపోయింది. అది వెంటనే కిందపడి కొట్టుకుని చచ్చిపోయింది.

ఆ దృశ్యాన్ని చూసిన అందరికీ మనసు విలవిల లాడింది. అంత క్రూరంగా సాధుజంతువును వేటాడుతున్న

ఆటవికులు రాక్షసుల్లా కనిపించారు. ఇలా చంపి తెచ్చిన మృగాల మాంసం తాము కూడా తిన్నామనుకునేసరికి అర్చనకు వాంతి వచ్చినట్టనిపించింది.

ఆమెకు ఇక జన్మలో జంతుమాంసం ముట్టకూడదని పించింది. ఉన్న ఆరుగురిలో అవినాశ్, సురేఖ శాఖాహారాలు. తక్కిన నలుగురు మాంసాహారులే! అవినాశ్, సురేఖ అదృష్టవంతులనిపించిందా క్షణంలో అర్చనకు.

ఈ లోపల మరో యిద్దరు ఆటవికులు రెండు కుందేళ్ళని, చెవులపిల్లిని గాయపరచకుండా పట్టుకున్నారు. వాటి కాళ్ళు మెలేసి కట్టేశారు.

సరిగ్గా అదే సమయంలో ఎక్కడి నుంచో పెద్దపులి గర్జన వినిపించింది. మరో అయిదు నిమిషాల్లో పెద్దపులి వాళ్ళ కళ్ళబడింది.

అర్చన, సురేఖ భయంగా పెద్ద పెద్ద కళ్ళతో దానివంక చూస్తూ వుండిపోయారు.

పులి బాగా పోతరించి వుంది. చాలా ఎత్తుగా, బలంగా చూసేవాళ్ళకి భయం పుట్టించేలా వుంది. తాము సాగర లోయ దారిలో చూపిన పెద్దపులి దీనిముందు పిల్లిలా వుంటుంది పోల్చి చూస్తే!

ఆటవికులు మాత్రం చాలా నిదానంగా చూశారు దాని వంక. ఎవరూ బెక్కు చెదర్లేదు.

పెద్దపులి వీళ్ళని చూపింది. ముందుకు ఉరికింది.

కుహోనీ ఒకడు ముందుకు వెళ్ళాడు. చేత ఆయుధం కూడా ధరించలేదు. అతని ధైర్యానికి చూస్తున్నవాళ్ళ గుండెలు ఝల్లుమన్నాయి.

కుహోనీని చూస్తూనే పులి పంజా విసిరింది.

కుహాసీ ఊహించని వేగంతో దాని పంజా దెబ్బనుంచీ తప్పించుకున్నాడు. అంతేకాదు, అదే వేగంతో దాని ముందు కాళ్ళను మెలితిప్పాడు. పెద్దపులి మెలితిరిగి పడి, మళ్ళీ మహోధృతంగా లేచింది. కుహాసీ దాని తల తన ఉక్కు బాహువుల్లో యిరికించి దాని నోరు పగలదీశాడు.

చూస్తున్న రాజేష్ బృందానికి ముచ్చెమట్లు పోశాయి. అంత పెద్దవయస్సులో ఆ ఆటవిక నాయకుడు అంత చురుగ్గా, సాహసంగా పెద్దపులితో నిరాయుధంగా పోరాడటం వాళ్ళు చిరకాలం మరచిపోలేని సంఘటన!

పెద్దపులి పెనుగులాడింది. పంజా విసరబోయింది. కాని కుహాసీ తన పట్టు సడలించలేదు సరికదా మరింత బిగించాడు. సందిట బిగించి నోరు పెగలదీసి, దానినోట తన అనుచరుడు అందించిన రాతి ఆయుధాన్ని నిలువునా దించేశాడు.

అంతే! అంత మహాపర్వతంలాంటి పులి కాస్తా మహోగ్రంగా దిశలు దద్దరిల్లేలా గర్జిస్తూ కిందపడి గిలగిల కొట్టుకుంది. కొద్ది నిమిషాల్లోనే దాని ప్రాణవాయువులు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

రాజేష్ బృందం ఆ వృద్ధనాయకుడి వంక ఆశ్చర్యంగా, అభినందనగా చూస్తున్నారు.

కుహాసీ వాళ్ళని చూసి నవ్వాడు. తనకిది చాలా చిన్న పని అన్నట్టుందా నవ్వు. ఆటవికులు కూడా అది తమకు చాలా తేలికైన అభ్యాసమే నన్నట్టు ఆ విషయానికి ప్రాధాన్యత యివ్వలేదు.

మళ్ళీ అందరూ ముందుకు సాగారు.

పెద్ద కొలను పక్కగా బండరాళ్ళున్న కొండ వుంది. కుహాసీ వాళ్ళవంక తిరిగిచూసి, 'ఎక్కగలరా?' అని

సంజ్ఞ చేశాడు. అందరూ తలలూపారు.

కుహానీ ముందుగా కొండ ఎక్కసాగాడు. అతనికి వెనకగా ఆటవికులు కొందరు ఎక్కుతున్నారు. మధ్యలో రాజేష్ బృందం. వాళ్ళ వెనక రక్షణగా తక్కిన ఆటవికులు చుట్టూ జాగ్రత్తగా పరికిస్తూ నడుస్తున్నారు.

కొండ ఎక్కే కార్యక్రమం పదిహేను నిమిషాల పైగానే పట్టింది. కొండపైన బండరాళ్ళు ఎవరో కావాలని పేర్చినట్టు ఆర్టిస్టిక్‌గా ఒకదానిమీద మరొకటి అమర్చబడి వున్నాయి. అవి ప్రకృతిసిద్ధంగా యేర్పడినవేనని వాళ్ళు గ్రహించారు.

గుండ్రటి సన్నటి బండరాళ్ళ మధ్య గోధుమ వర్ణంతో కోలగా వున్న నాలుగు పెద్ద పెద్ద రాళ్ళను చూడగానే అవి నాశ్‌కి యిదివరకు దీవిలో చూపిన పక్షిగుడ్లు గుర్తొచ్చాయి. నిమిరి చూశాడు. సందేహంలేదు. ఇవికూడా అట్లాంటివే. తాకటానికి పెళుసుగా కనిపించాయి. గుడ్లే యింత వుంటే పక్షి యింకెంత పెద్దగా వుంటుందో ననిపించింది అందరికీ.

రాజేష్ గుడ్లను చూపించి సైగచేశాడు కుహానికి.

కుహానీ చేతులు గాల్లోకి ఆడించిఆకాశంలోకి చూశాడు. అంటే అవి బ్రహ్మాండమయిన ఏదో పక్షి తాలూకు గుడ్లని అతని సైగల కర్థం.

అందరికీ ఆ పర్వత పక్షులని చూడాలని మహాకోరిక వుంది. కాని వాటిని తలుచుకుంటే భయంగా వుంది. పక్కన మేరునగ సమానుడయిన కుహానీ ఆతని అను చరులు వుండగా దేనికీ భయపడ నక్కర్లేదు.

ఇంతలో గాల్లో విపరీతమైన శబ్దం. సర్రున గాలిని కోస్తూ కొండమీదికి దిగుతున్న రెండు పక్షుల్ని చూసి ఆశ్చర్యంగా ఉన్న చోటనే నిల్చుండిపోయారు రాజేష్

బృందం.

కుహానీ చప్పుడు చెయ్యవద్దని నోటిమీద వేలుపెట్టి సూచించాడు.

ఆ పక్షులు కొండ కొనమీద వాలాయి. వాటి అదురుకు కొండ ఊగిసలాడుతున్న అనుభూతి కలిగింది వాళ్ళకు.

వాటి ఆకారాలు ఒక చిన్న సైజు విమానం అంత వున్నాయి. వాటి వీపులమీద ఒకేసారి నలుగురు కూచో వచ్చును.

అర్చన, సురేఖలకి యీసరికి కాస్త ధైర్యం వచ్చినట్టుంది. వాటివంకే గుడ్లప్పగించి చూస్తున్నారు.

రాజేష్ కుహానీవంక చూశాడు. కుహానీ వాటిని వేటాడు తాడేమోనని అనుకున్నాడు. కాని కుహానీ ఆ ప్రయత్నమేదీ చెయ్యలేదు, సరికదా, ఇక కిందికి పోదామన్నట్టు సైగ చేశాడు.

ఆ పక్షులు యిదేమీ పట్టనట్టు నిశ్చలంగా వున్నాయి. అసలు అక్కడ మనుషులున్నట్టు గుర్తించనట్టే వుంది వాటి ప్రవర్తన.

కుహానీ ముందు దిగుతున్నాడు. ఆ వెనక రాజేష్ బృందం వాళ్ళ వెనక బాడీగార్డులా పదిమంది ఆటవికులూ వెంబడిస్తూ దిగుతున్నారు.

అప్పుడే సూర్యాస్తమయం అవుతోంది. సూర్యుడు చాలా దగ్గరగా, చెయ్యి సాచితే అందేంత దగ్గర్లో వున్నట్టు కనిపిస్తున్నాడు. సముద్రంలోకి దిగుతున్న అనుభూతి అందరిలోను.

కుహానీ మౌనంగా నడుస్తున్నాడు. రాజేష్ బృందానికి అతని ప్రవర్తనలోని మార్పు అంతుబట్టలేదు. పెద్దపులితో నిరాయుధంగా పోరాడిన మహావీరుడు పక్షులని చూసి భయ

పడిపోయాడని అనుకునేందుకు వీల్లేదే!

చీకట్లు ముసిరే సమయంలో ఎక్కడినుంచో దీవి దద్దరిల్లేలా గర్జనలు వినిపించాయి. అవి ఎన్నడూ తాము విన్న గర్జనలు కావు. చాలా భయంకరంగా గుండెలు దద్దరిల్లేలా ఢీళలు మార్మోగేలాగా వినిపిస్తున్నాయి.అందరూ ప్రశ్నార్థకంగా కుహానీవంక చూశారు!

కుహానీ నడుస్తున్నవాడల్లా ఆగిపోయాడు తన అనుచరులకు సైగచేశాడు. అందరూ ఆయుధాలను చేతుల్లో సిద్ధంగా పట్టుకుని నిల్చున్నారు.

గర్జనలు బాగా సమీపంగా వినవచ్చాయి.

కుహానీ రాజేష్ బృందానికి చెట్లపక్కకు తప్పుకోమని సైగచేశాడు. రాజేష్ వెంటనే తనవాళ్ళతో పక్కనున్న చెట్ల చాటుకు తప్పుకున్నాడు. అందరి దృష్టి ఆ అరుపులు వినవస్తున్నవైపుకే కేంద్రీకృతమై వున్నాయి.

ఆ గర్జనల తాలూకు మృగం కట్టెదుట ప్రత్యక్షమయింది. చూస్తున్నవాళ్ళంతా ఒక్కక్షణం వులిక్కిపడ్డారు.

మహాపర్వతంలా వున్న ఆ మృగం ఏనుగుమీద ఏనుగును నిలబెడితే ఎంత ఎత్తుంటుందో అంత ఎత్తుంది. దాని నోటినుండి కత్తుల్లా వున్న రెండు పొడవాటి కోరలు తళతళ మెరుస్తూ బయటికి పొడుచుకు వచ్చాయి. ఆరు కాళ్ళు, బెత్తెడు తోక వున్నాయి. ఒంటినిండా మొసలికి మల్లే బగ్గీలుగా వున్న పొలుసులు. నెత్తిమీద ఒకే ఒక కొమ్ము. నల్లటి మిడిగుడ్లు సూదంటురాయిలా తీక్షణమైన దృష్టిని సారిస్తున్నాయి.

కాసేపు గుండె ఆగి కొట్టుకున్నది అందరికీ.

ఆ మృగం వీళ్ళవంక దృష్టి తిప్పేంతలో కుహానీ అమ్ము

చరులు ఒక్కసారిగా దానిమీదకు ఆయుధాలతో దాడి చేశారు.

ఆ మృగం చటుక్కున తల వంచింది. దాని వాడి కొమ్ముతో ఓ అనుచరుడి పొట్టలో గుచ్చి విసిరికొట్టింది. అతను హృదయవిదారకంగా అరుస్తూ బంతిలా ఎగిరి వందగజాల దూరంలో పడ్డాడు. మరో ఆటవికుడు మెరుపు వేగంతో రాతి గదతో దాని తలపైన బలంగా మోదాడు. కొమ్ము సగానికి విరిగిపోయింది.

బాధతో పెద్దగా అరిచింది మృగం. చురకత్తుల్లా వున్న దాని కోరలతో అతడ్ని కుమ్మింది. కాని యీసారి దాని ప్రయత్నం విఫలమయింది. మరో ఆటవికుడు తన దగ్గి రున్న పొడవాటి రాతి కత్తితో దాని కోరలపై బలంగా మోదాడు. ఖంగున శబ్దమైంది.

కుహానీ ఏమీ కల్పించుకోలేదు. తన అనుచరుల సాహసకృత్యాన్ని మామూలుగా తిలకిస్తున్నాడు.

ఆ భయంకర మృగం మరోసారి ఆర్తనాదం చేసింది. దెబ్బమీద దెబ్బ తగలటంతో చటుక్కున వెనుదిరిగి అక్కడినుంచి మెరుపులా పరుగెత్తి మాయమయింది.

కుహానీ అనుచరులతో ఏదో అన్నాడు. వాళ్ళు వెంటనే దానివెంట పరుగెత్తారు. ఇద్దరు మాత్రమే అక్కడ మిగి లారు, కుహానీ కాక.

ఓ పదనిమిషాల తర్వాత వెళ్ళినవాళ్ళు తిరిగొచ్చారు. వాళ్ళ వాలకాలనిబట్టి ఆ మృగం తప్పించుకుపోయిందని అర్థమయిపోయింది వాళ్ళకి.

కుహానీ వాళ్ళపైన చాలా కోపంగా అరిచాడు. వాళ్ళు తలలు దించుకొన్నారు.

రాజేష్ బృందం వూపిరికూడా పీల్చటం మరిచి నిల్చుండి పోయారు.

27

గూడెం చేరుకున్నాక కాసేపటికి కుహానీ తనవాళ్ళచేత రకరకాల పళ్ళు, వెదురుబియ్యం, మాంసం—అన్నీ రాజేష్ బృందానికి పంపించాడు.

అంత క్రితమే చూసిన భయంకర పోరాటాల తాలూకు స్మృతులు వాళ్ళని యింకా విడిచిపోలేదు. ఎవరికీ భోజనం సయించలేదు. ఏదో అయిందనిపించి పక్కలమీదకు చేరారు.

ఎవరూ నిద్రపోలేదు. ఎవరూ నిశ్శబ్దాన్ని భంగపరచటం యిష్టంలేనట్టు మౌనంగా వున్నారు.

ముందుగా అవినాశ్ మాట్లాడాడు: "ఈ రోజు చాలా వింతయిన అనుభవాలు ఎదురయ్యాయి మనకు. చిరస్మరణీయం, అపురూపం కూడా!" అన్నాడు.

వినోద్ సమాధానంగా, "కుహానీ ప్రవర్తన అంతు బట్టడంలేదు. ఇద్దరు అనుచరులు క్రూరమృగానికి ఆహారమయిపోతే ఏం జరగనట్టు వాళ్ళని అక్కడికక్కడ వూడ్చేసి అతి సామాన్యంగా తిరిగొచ్చాడంటే, వీళ్ళకు చావుపట్ల భయంగాని టెన్షన్‌గాని వున్నట్టు కనిపించదు" అన్నాడు.

"అవును. వీళ్ళ నిత్యజీవితంలో యిలాంటి సాహసాలు, వీర మరణాలు చాలా సర్వసాధారణంలా వుంది. అందుకే కుహానీ చాలా మౌనంగా వున్నాడనిపిస్తోంది నాకు" అన్నాడు చక్రవర్తి.

"ఏమైనా వీళ్ళు వేటాడిన సాధు జంతువుల్ని అవి ప్రాణం పోయే ముందు గిల గిల కొట్టుకుంటుండగా

చూస్తూంటే చాలా బాధనిపించింది. ఇప్పటికీ అదే దృశ్యాలు కళ్ళ ముందు కదలాడుతున్నాయి'' అన్నది అర్చన. జన్మలో మాంసాహారం తీసుకోరాదని అప్పటికే నిర్ణయించు కున్నదామె.

"కుహోనీకి కొన్ని సెంటిమెంట్సు, సైకలాజికల్ ఫీల్సింగ్సు వున్నాయి. పక్షుల విషయంలో నేను గమనించాను, గడ్డు పొదగాల్సిన పక్షులు అతని దృష్టిలో పవిత్ర మైనవి. పక్షులు బలమైనవి, వాటివల్ల ప్రమాదము అని కాదు అతను సంకోచించినది! రెండో విషయానికొస్తే, నెత్తిమీద కొమ్మున్న మృగం దెబ్బతిని పారిపోయింది. ఇద్దరు అనుచరుల్ని పట్టుపెట్టింది. అనుచరులు దాన్ని వెంబడించికూడా హతమార్చలేకపోయారు. అది ఓ విధంగా అవమానం. ఆ ఫీలింగ్సు అతని ప్రవర్తనలోని మార్పుకి కారణమని నా అభిప్రాయం'' అన్నాడు రాజేష్.

అందరికీ రాజేష్ ఊహే కరెక్టనిపించింది.

"మనం రేపు కుహోనీతో వివరంగా చర్చించి మనం క్షేమంగా వైజాగ్ చేరగల మార్గం గురించి తెలుసుకోవాలి'' అన్నాడు రాజేష్.

"కాని షిప్పులవంటి వేవీ యీ ఛాయలకే రావని చెపుతున్నాడు కుహోనీ. విమానంమీద హోప్ పెట్టుకోవడం వివేకం కాదు. ఇక ఏది దారి?'' అన్నాడు అవినాశ్,

"వీళ్ళకి వెదురు బొంగులు, బల్లలు వుపయోగించటం తెలుసు. వాటితో ఏదయినా చిన్న చిన్న పడవల్ని తయారు చేయిస్తే....?'' వినోద్ సూచించాడు.

"మహాసముద్రం మధ్య నాటు పడవలవల్ల లాభముండదు. ప్రాణాలకే ఆశ వదులుకోవాల్సి వుంటుంది'' అన్నాడు రాజేష్.

ఎవరికీ గత్యంతరం తోచలేదు. మాటల మధ్య ఒక రొకరు నిద్ర కొరిగారు.

రాజేష్ ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. ఇక్కడినుంచి ఎలా ప్రయాణం సాగించాలి? ఏమిటి గమ్యం? ఎన్నాళ్ళు కుహానీకి అతిథులుగా వుండిపోవాలి? అన్నీ జవాబుల్లేని ప్రశ్నలే! అదృష్టవశాత్తూ కుహానీలాంటి మంచివాళ్ళున్న దీవికి చేరారు. లేకుంటే తమ గతేమయ్యేది?

అవినాశ్ రాజేష్ చెయ్యి నొక్కి, "ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు. నిద్రపో!" అన్నాడు.

రాజేష్ మౌనంగా చూశాడు స్నేహితుడివంక.

అందరూ నిద్రలోకి జారారు.

28

రాజేష్‌కి మగతగా నిద్రపట్టింది. ఇంతలోనే ఏదో పెద్ద కలకలం వినిపించింది.

చటుక్కున లేచాడు రాజేష్. అతనితోబాటు తక్కిన వాళ్ళుకూడా కంగారుగా నిద్రనుంచి లేచారు.

గూడెంలో అందరూ అటు యిటు పరుగులు పెడ్తున్నారు. వెన్నెల్లో దీవి అంతా స్పష్టంగా కనిపిస్తోంది.

రాజేష్ బృందానికి కాస్సేపటి వరకు పరిస్థితి అర్థం కాలేదు. అయితే కొద్ది క్షణాల్లోనే కారణం అర్థమయింది. అర్థమయ్యేసరికి అందరి గుండెలు అవిసిపోయాయి.

ముందుగా వాళ్ళకి కనిపించిన అంశం పొడవాటి కత్తుల్లా వున్న కోరలు. తళతళ చంద్రకాంతిలో మెరుస్తున్నాయి. ఆ తర్వాత కనిపించింది సగం విరిగిపోయిన కొమ్ము నెత్తిమీద. ఒంటినిండా మొసలికిమల్లే బగ్గేలుగా వున్న పొలుసులు.

ఆ సాయంత్రం కుహానీ అనుచరులచేత దెబ్బతిన్న

కొమ్ముమృగం! పగ పట్టినట్టు అందరూ నిద్రించాక గూడెం మీద తిరగబడింది. దాని ధాటికి ఆడవాళ్ళు, పిల్లలు పరుగులు పెడుతున్నారు. మగవాళ్ళు పొడవాటి ఆయుధాలు ధరించి దాన్ని వెంటాడుతున్నారు.

కొమ్ముమృగం ఇష్టమొచ్చినట్టు దీవిలో కనపడినవారినల్లా కొమ్ముతో పొడుస్తోంది. కోరలతో గాయపరుస్తోంది. గాయాలనుంచి వెచ్చటిరక్తం ఎర్రగా చిమ్ముతోంది.

రాజేష్ బృందం ఆ రోజుతో తమ ప్రాణాలు తమవి కావనే నిర్ణయానికొచ్చారు.

సరిగ్గా అదే సమయానికి కుహానీ ఓ రాతి ఆయుధంతో కొమ్ముమృగాన్ని తీవ్రంగా గాయపరిచాడు. అప్పుడు కొమ్ముమృగం చేసిన ఆర్తనాదానికి ఆ దీవంతా మార్మోగింది. దెబ్బ తినేకొద్దీ దానిలో పౌరుషం పెల్లుబుకుతోంది. ఇష్టమొచ్చిన రీతిగా తన దారిలో వున్న ఆటవికుల్ని విపరీతంగా కుమ్మేస్తోంది.

కుహానీ తన అనుచరులతో దాన్ని వేటాడుతున్నాడు. అతనిలో క్షణ క్షణానికీ వుద్రేకం, క్రోధం లావాలా ఎగజిమ్ముతున్నాయి. ఓ క్రూరమృగాన్ని అంతమందివుండి కూడా పట్టుబెట్టలేక పోతున్నందుకు, అది కలిగిస్తున్న నష్టానికీ వుక్రోషం, బాధ అతని నరనరాన్నీ పట్టి తినేస్తున్నట్టు ఛాతీ పొంగింది. రౌద్రం అతని ముఖానిక ఓ వింత రూపాన్నిస్తోంది.

సరిగ్గా అదే సమయానికి కొమ్ము మృగం రాజేష్ బృందమున్న వైపు వేగంగా పరుగెత్తు కొచ్చింది. అప్పటికే దాని శరీరం నిండా గాయాలు. రక్తం విపరీతంగా స్రవిస్తోంది. అయినా అది ఎదురు తిరగటం మానలేదు. దాని మహాకాయంలో ఆ గాయాలు ఏ మాత్రం చలనం

కలిగించినట్టు కనిపించదు।

కొమ్ముమృగం తమ వైపు రావటం గమనించగానే రాజేష్ బృందం భయంతో బిగుసుకుపోయారు. అది సరాసరి వాళ్ళ మధ్యకు వచ్చేసింది. విరిగిపోయిన కొమ్మును కిందికి వంచి మహావేగంగా ముందుకు చొచ్చుకు వచ్చేస్తోంది.

రాజేష్ తన వాళ్ళని దాని దారికి ఎదురుగా నిలవవద్దని హెచ్చరించాడు. చెట్లచాటుకు తొలగి పొమ్మని అరిచాడు. పరుగులు పెట్టారు అందరూ. అయితే ఆ సరికే అది చక్రవర్తి మీదకు దూసుకువచ్చేసింది. మరుక్షణంలో అతను దానికి ఆహూతి అయిపోవలసినవాడే।

కాని కుహానీ సమయస్ఫూర్తి చక్రవర్తి ప్రాణాల్ని కాపాడింది. కుహానీ తన ఆయుధాన్ని సరాసరి దాని కండ్లలోకి గుచ్చేశాడు. కొమ్ముమృగం బాధతో పెనుగర్జన చేసింది. దాని కళ్ళు కనిపించకపోగానే అది తన గమనాన్ని దిశ మార్చింది. ఆ రెప్పపాటు కాలంలోనే రాజేష్ చక్రవర్తిని తన వైపు లాగేసుకున్నాడు. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పింది.

కొమ్ముమృగం సరాసరి ఎదురుగా వున్న చెట్టుకు ఢీ కొన్నది. దాని విరిగిన కొమ్ము మానుమధ్యగా చిక్కుకుపోయింది. కుంభస్థలం పగిలిపోయింది. అదే అదనుగా కుహానీ తన అనుచరులతో కొమ్ముమృగం శరీరం నిండా తూట్లు పొడిచేశాడు.

మహాపర్వతంలా నేలపడి ప్రాణాలు వదిలింది పగబట్టిన కొమ్ముమృగం.

రాజేష్ బృందం తేలిగ్గా ఊపిరి విడిచాడు.

అప్పటికి తూర్పున తెలిరేఖలు విచ్చుకుంటున్నాయి.

గూడెంలో ఎవరెవరు గాయపడ్డదీ, ఎవరి ప్రాణాలు

అంతిమ క్షణాల్లో వున్నదీ తెలిసింది. ఇద్దరు స్త్రీలు, ముగ్గురు పిల్లలు ప్రాణాలు వదిలారు. దాదాపు యిరవై మందికి తీవ్ర గాయాలు, పదిమందికి స్వల్పగాయాలు తగిలాయి.

కుహానీ తన అనుచరులతో అప్పటి కప్పుడు ఏవేవో ఆకు పసరులు తెచ్చి గాయాలకి చికిత్స చేస్తున్నాడు. ఎవరూ అతిగా ఏడవటంగాని సానుభూతి చూపించటంగాని రాజేష్ బృందం చూడలేదు. అదంతా అతి సామాన్యమైన అనుభవమన్నట్టు నిర్లిప్తంగా, ఉదాసీనంగా వున్నారందరూ.

కుహానీలాగానే అతని ప్రజల మనస్తత్వాలు కూడా తెలుసుకోవటం చాలా కష్టమనిపించింది వాళ్ళకి.

అప్పటికి తెల్లవారింది. సూర్యోదయం కాబోతోంది.

కుహానీ వచ్చి వాళ్ళకి నిద్రాభంగం కలిగినందుకు తన విచారాన్ని వ్యక్తం చేశాడు. రాజేష్ గూడెం ప్రజలకి తమ సానుభూతిని వ్యక్తపరుస్తుంటే కుహానీ చిన్నగా నవ్వాడు. ఫరవాలేదన్నట్టు తల అడ్డంగా తిప్పాడు.

29

ఆ రోజంతా చాలా భారంగా గడిచింది. తనవాళ్ళు ఎలాంటి బాధల్లో వున్నా కుహానీ మాత్రం అతిథి సత్కారాలకి లోటు చెయ్యలేదు. టైం ప్రకారం అన్నీ సవ్యంగా అందినాయి రాజేష్ బృందానికి.

"ఇక ఈ దీవిలో వుండటం నావల్లకాదు" అన్నాడు వినోద్ ఆ సాయంత్రం.

"అదేం?" అన్నారు తక్కినవాళ్ళు.

"ఇక్కడి వాతావరణం. యీ పరిస్థితులు మన మేదో భయంకర పరిణామాల నెదుర్కోవటానికి నాందిగా వున్నాయని యీ కొమ్ముమృగం సూచిస్తోంది. కుహానీకి, అతన్ని

ప్రజలకు యిది రొటీనే. కాని, మనలాంటి వాళ్ళకే యిది భయంకరంగా కనిపిస్తోంది'' అన్నాడు వినోద్.

"నాకు మాత్రం యిక్కడే బావుంది'' అన్నాడు చక్రవర్తి.

అందరూ అతని వంక విచిత్రంగా చూశారు.

రాజేష్ అతని మాటలకు ప్రాధాన్యత యివ్వలేదు.

"కుహానీతో రేపు మాట్లాడుదాం. ఈ రోజు అతని మనుషులు కొందరు చనిపోయారు. మరికొందరి పరిస్థితి ప్రమాదకరంగా వుంది. ఇలాంటి సమయంలో ఎంత కాదన్నా వాళ్ళు మానసికంగా బాధపడుతుంటారు'' అన్నాడు రాజేష్.

"ఈ కుహానీకి షిప్పుల గురించి తెలీదేమో! దూరంగా ఎక్కడయినా లంగరు వేసుకుని వెళ్ళిపోతూ వుంటే వీళ్లెవరూ గమనించి వుండకపోవచ్చు'' అన్నాడు వినోద్.

"అందుకే కదా దూరం నుంచి చూస్తే నావ కూడా ఎలా వుంటుందో కూడా ఆ పరిమాణాల్లో బొమ్మలు వేసి కుహానీకి చూపించాను. తెలీదన్నాడు'' అన్నాడు అవినాశ్.

"ఓ పని చేద్దాం. మనమే ఓ పడవ తయారు చేయించి ఓ యిద్దరో ముగ్గురో ట్రయిల్‌గా కొంత దూరం సముద్రం మీద వెళదాం. చుట్టుపట్ల ఎక్కడయినా షిప్పులు ల్యాండ్ అయి వున్నాయేమో వెరిఫై చేసుకుందాం. సాయంత్రానికి మళ్ళీ యీ దీవికి తిరిగొచ్చేలా ప్లాన్ చేసుకుందాం.''

రాజేష్ ప్రతిపాదన అందరికీ నచ్చింది.

"ఈ ఉపాయం బావుంది. అలా రెండు మూడు రోజులు వెళ్ళొస్తుంటే మనకి పరిస్థితి అర్థమైపోతుంది. ఏదయినా షిప్ కనిపిస్తే వెంటనే దాన్ని చేరుకుని, మన పరిస్థితి వివరించి వాళ్ళ సాయం కోరదాం. తక్కిన వాళ్ళని

తీసుకుని ఆ తర్వాత షిప్పు చేరుకోవచ్చు" అన్నాడు అవినాశ్.

"రేపు పడవ నిర్మాణం గురించి కుహానీతో మాట్లాడుదాం" అన్నాడు రాజేష్.

30

అర్ధరాత్రివేళ గూడెంలో పెద్ద కలకలం చెలరేగింది.

మగత నిద్ర నుంచి చటుక్కున మేల్కొన్నాడు రాజేష్. అతనితోబాటే అవినాశ్, అర్చన. వినోద్, సురేఖ కూడా లేచారు. ప్రక్కన చూడబోతే చక్రవర్తి లేడు.

మళ్ళీ ఏదయినా క్రూరమృగం గూడెంపైన పడిందేమో ననుకున్నారు అందరూ. అందరి దృష్టి జన సందోహం చేరిన వైపు మళ్ళింది.

గూడెం అంతా అక్కడే వున్నారు. రాజేష్ లేచాడు. తక్కిన వాళ్ళు లేచారు. ఆ గుంపువైపు అడుగులు వేశారు.

అక్కడి దృశ్యం చూసిన రాజేష్ బృందం చేష్టలు దక్కి నిల్చుండిపోయారు.

అక్కడ చెట్టుకు ఇటుపక్క చక్రవర్తి, అటుపక్క ఓ నల్లటి అమ్మాయి కట్టివేయబడి వున్నారు. చుట్టూ కుహానీ అతని అనుచరులు నిల్చుని వున్నారు.

కుహానీ కళ్ళనుండి నిప్పులు కురుస్తున్నాయి.

పెద్దపులితో అసహాయ శూరుడిలా పోరాడినపుడు గాని, క్రూరమృగం తన గూడేన్ని నాశనం చేస్తున్నప్పుడు గాని అతని కళ్ళల్లో క్రోధం, ఉక్రోషం కనిపించాయే గాని, యీ నిప్పురవ్వలు వెదజల్లలేదు.

ఏం జరిగింది? చక్రవర్తిని ఎందుకు బంధించారు? అతనితోబాటు గూడెం పిల్లను కూడా ఎందుకు బంధించారు? అందరి మనసుల్లోనూ యిదే ప్రశ్న!

అపరాధ పరిశోధన పోటీ-177

ఈ క్రిందకొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-4-83 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూన్ '83 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఈ అగ్నిగుండంలో వందలాది అమాయక ప్రజలు సమిధ లయ్యారు—?

(అస్సాం ఎన్నికలు, ఇజ్రాయెల్ సైనికచర్య)

2. పాటకు ఇది ప్రాణం —? (పల్లవి, సంగీతం)

3. ఈ రోగానికి మందు లేదంటారు—?

(మనోవ్యాధి, కేన్సరు)

4. వీటిని పెంచటంలో భారత ప్రభుత్వానికి సాటి మరొకరు లేరు—? (జీవనస్థాయి, పన్నులు)

5. ఎన్ని విమర్శలకు గురైనా చలించని మన చలన చిత్ర సంస్థ—? (దూరదర్శన్, ఫిలిమ్ డివిజన్)

రాజేష్ మనసు కీడును శంకిస్తోంది. చక్రవర్తిలో యీ మధ్య కాలంలో వచ్చిన మార్పు అతని మనసుకి చూచాయగా తాకింది. కాని అతను దానికి ప్రాముఖ్యత నివ్వలేదు. ఇప్పుడు యీ హఠాత్పరిణామానికి అర్థం?

చక్రవర్తి, రాజేష్‌ని తక్కిన స్నేహితుల్ని చూసి తల వంచుకున్నాడు.

రాజేష్ ముందుకి కదిలాడు. కుహాసీ రాజేష్ వంక, అతని మిత్రుల వంక తల తిప్పి చూశాడు. ఇప్పుడతని చూపుల్లో స్నేహభావం, ఆత్మీయత మచ్చుకయినా కనిపించటం లేదు. ద్వేషం, కసి, ఉక్రోషం, ప్రతీకారవాంఛ యిలా యెన్నెన్నో భావాలు ఒకేసారి కలగాపులగంగా కనిపించాయి. తన చూపుల్తో భస్మీపటలం చేసేవాడిలాగా అనిపించాడు రాజేష్ బృందానికి.

రాజేష్ కుహాసీ చూపుల్ని ఎదుర్కోలేకపోయాడు. ఏం జరిగిందో అర్థమయిపోయింది.

రాజేష్ చక్రవర్తిని సమీపించి, "ఏం జరిగింది, ఎందుకిలా జరిగింది?" అన్నాడు మెల్లగా.

చక్రవర్తి తలెత్తి రాజేష్ వంక చూచాడు. అతని చూపులు దీనంగా వున్నాయి

"ఆ అమ్మాయితో ఏమైనా తప్పుగా ప్రవర్తించావా?" అడిగాడు రాజేష్. తలూపాడు చక్రవర్తి.

"ఎందుకిలా చేశావు? మన మున్నది దిక్కు దరీ లేని ఏదో దీవి. ఇక్కడ మనం తల దాచుకోవటానికి వచ్చాం. మరో నాలుగైదు రోజుల్లో యిక్కడ్నించి సురక్షితంగా మన యిళ్ళకు పోయివుండేవాళ్ళం. అందుకు యీ కుహాసీ వల్ల ఎంతో ప్రయోజనం పొందివుండేవాళ్ళం. అకస్మాత్తుగా ఓక్కల వలయంలో నువ్వు యిరుక్కుపోవటమే

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 55 : నాగమణి వడ్డీ వ్యాపారం చేస్తుంది. ఆమెకు పాలుపోసే పాపమ్మ ఉంగరం తాకట్టుపెట్టి నాగమణి దగ్గర వంద రూపాయలు అప్పు తీసుకున్నది.

పాపమ్మ కొంతకాలం తర్వాత చిల్లరంతా పోగేసి, మొత్తం వడ్డీతో సహా రు. 120/- లు తెచ్చి యిచ్చింది. కాని నాగమణి ఆ చిల్లర నాణేలు తీసుకోవటానికి నిరాకరించింది. ఆ డబ్బు తీసుకొని తన ఉంగరం యివ్వాలని పాపమ్మ పంచాయితీ పెట్టించింది.

పంచాయితీ పెద్ద మీరే అయితే, మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-4-'83 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు జూన్ '83 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 53 (తీర్పు)

అగ్రిమెంట్ అమలు జరుగుతుంది:

కోర్టు తీర్పు గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత శరభయ్యది. ఆ విషయం చెప్పవలసిన బాధ్యత ఆదెయ్యకు ఎంత మాత్రం లేదు. అగ్రిమెంట్ అమలు జరిగి తీరుతుంది.

ఈ నెల న్యాయనిర్ణేత : మిస్. పద్మ, C/o. వై. సుబ్బారావు, టి. పి. ఎమ్. నెం. 3 కాలనీ, గ్రేడ్-1, క్వార్టరు నెం. 6, దౌలతాబాద్-754026, కటక్ జిల్లా (ఒరిస్సా).

కాక, మమ్మల్నందర్నీ యిరికించావు."

"క్షమించు రాజేష్! ఏదో వ్యామోహంలోపడి చెయ్యకూడని తప్పు చేశాను. మితిమీరి ప్రవర్తించాను."

"కుహాసీ మనకు ఎంతో ఉపకారం చేశాడు. అలాంటి మంచి మనిషికి కల్లోకూడా ద్రోహం తలపెట్టకూడదని నీకు తెలీదా? తెలిసీ ఎందుకిలా కూడని పని చేశావు?"

"వయసు వుద్రేకంలో తొందరపడ్డాను. ఈ అమ్మాయి నే నీ దీవికొచ్చినప్పట్నుంచి నా వెంట పడింది. నన్ను ఆకర్షించింది. నేను నిగ్రహించుకోలేకపోయాను. ఫలితంగా యీ రాత్రి ఆమెతో సంబంధం పెట్టుకున్నాను. ఎలా చూశాడో, వాళ్ళ అన్న చూశాడు. వెంటనే కుహాసీతో చెప్పినట్టున్నాడు. కుహాసీతోబాటు గూడెం అంతా కదిలి వచ్చింది. నన్ను, యీ అమ్మాయిని పెడరెక్కలు విరిచి యీ చెట్టుకు కట్టేశారు" అన్నాడు చక్రవర్తి.

రాజేష్ జాలిగా చూశాడు చక్రవర్తి వంక.

"సరే, అయిందేదో అయింది. కుహాసీని ప్రాధేయపడి అడుగుతాం. నిన్ను వదిలెయ్యమని కోరతాం. అవసరమైతే క్షమాపణ వేడుకుంటాం" అన్నాడు రాజేష్.

కుహాసీని సమీపించాడు. అంతదాకా కుహాసీ. అతని అనుచరులు బలవంతాన ఆవేశాన్ని అదుపులో పెట్టుకున్నట్టు కుహాసీ చూపులు చెపుతున్నాయి. రాజేష్ కుహాసీని చూసి, చక్రవర్తిని వదిలిపెట్టవలసిందిగా సైగలతో కోరాడు.

కుహాసీ కోపంతో పెద్ద కేక వేశాడు. అర్చన, సురేఖ త్రుళ్ళిపడ్డారు. కుహాసీని ఆ రూపంలో ఎన్నడూ చూసి వుండలేదు వాళ్ళెవరూ కూడా.

కుహాసీ చూపుడు వేలుతో సముద్రం వైపు చూపించాడు. ఆకాశం వైపు చూపించాడు. సూర్యోదయాన్ని

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

అభినయించి చూపించాడు. తర్వాత సాయుధులైన తన అనుచరుల్ని చూపించాడు. తన చేతిలో వున్న ఆయుధాన్ని భూమిలోకి గుచ్చి చూపించాడు.

అతని చేష్టల కర్థం తెలిసిపోయింది. సూర్యోదయం అయేలోపల రాజేష్ అతని మిత్రులతో ఆ దీవి వదిలిపెట్టి పోవాలి. లేకుంటే అతని అనుచరులు వాళ్ళ ప్రాణాలు తీసి భూమిలో పాతేస్తారు! అయితే చక్రవర్తిని మాత్రం ప్రాణాలతో వదిలి పెట్టేది లేదని సూచించాడు కుహానీ.

రాజేష్‌తోబాటు అందరికీ కుహానీ ఆంతర్యం అర్థం కాగానే వెన్నున చలి పుట్టింది. తెల్లారేలోపల ఆ దీవి వదలి ఎలా పోగలరు! ఎక్కడికి పోగలరు? పైగా తమలో ఓ సభ్యుడ్ని, స్నేహితుడ్ని అతని ఖర్మానికి అతన్నొదిలేసి ఏమీ పట్టనట్టు ఎలా పోగలరు?

"కుహానీ చెప్పింది అర్థమైంది కదూ!" అన్నాడు రాజేష్ తన మిత్రుల వంక తిరిగి.

"అర్థమైంది. కాని చక్రవర్తిని ఎలా వదిలేస్తాం? ఎలాగో అతడ్ని కూడా తీసుకుపోదాం మనతో. బతికినా చచ్చినా అందరం కలిసే అనుభవిద్దాం" అన్నాడు అవినాశ్.

"అవును రాజేష్! చక్రవర్తిని వదిలిపెట్టమని ప్రాధేయపడదాం. క్షమాపణ అడుగుదాం" అన్నాడు వినోద్.

రాజేష్ కుహానీని సమీపించి చేతులు రెండూ జోడించాడు. చక్రవర్తిని చూపించి విడుదల చెయ్యమని జాలి గొలిపేలా అడిగాడు.

కుహానీ సింహనాదం చేశాడు. వదిలిపెట్టేది లేదని ఖచ్చితంగా స్పష్టం చేశాడు. చక్రవర్తి వంక చూశాడు రాజేష్. క్షమాపణ కోరమని సైగ చేశాడు. చక్రవర్తి

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 100-00 లు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 7-4-'83 తేదీలోపల మాకు చేరాలి. ఫలితాలు జూన్ '83 నెల సంచికలో ప్రకటిస్తాము. *

ఫిబ్రవరి '83 పోటీ ఫలితాలు

(1) ఫిబ్రవరి '83 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

తరిమికొట్టు తరిమికొట్టు,
తుపాకులతో మరతుపాకులతో !!

పంపినవారు: శ్రీ ఆర్. వి. ప్రసాద్, ఇ. ఇ. (ఆర్ అండ్ బి) ఇన్వెస్టిగేషన్ డివిజన్, విజయనగరం-531201.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

ప్రియుని తోడు కొంత వరకె,
యముని నీడ పడే వరకె !!

పంపినవారు: శ్రీ మిత్ర ఎస్. ఎస్. యు., ఆంధ్రా బ్యాంక్, అల్కాట్ గార్డెన్స్, రాజమండ్రి-533101.

కుహానీ వంక చూసి క్షమాపణ అడిగాడు. చేతులు కట్టేసి వున్నాయి, తలతోనే సూచించాడు.

కుహానీ మరోసారి సింహనాదం చేశాడు. చక్రవర్తిని సమీపించాడు. అతని రెండు చెంపలు ఛెళ్ళు ఛెళ్ళున వాయించాడు. కాలితో అతని డొక్కలో తన్నాడు. చక్రవర్తి బాధతో మూలిగాడు.

తమ కళ్ళ ముందే తమ స్నేహితుడ్ని చిత్రహింసకు గురి చెయ్యటం రాజేష్ వాళ్ళు చూడలేకపోయారు.

కుహానీ రాజేష్ వద్దకు వచ్చాడు. చాలా కోపంగా వున్నాడు. తర్జనితో మళ్ళీ తీరం వైపు చూపించాడు. గట్టిగా అరిచాడు. ఇక కుహానీ పద్ధతి మారదని, అతడు తమ మాట వినడని అందరికీ అర్థమయిపోయింది.

చక్రవర్తి తనవాళ్ళ వంక నీర్లు నిండిన కళ్ళతో చూసి "నా గురించి బాధపడకండి. నా తప్పుకు ఫలితం నేననుభవిస్తాను. అదెంత హీనమైనా, ఘోరమైనా సరే! నా గురించి మీరు చిక్కుల్లో పడకండి. దయచేసి వెళ్ళిపోండి. పోయి ప్రాణాలు రక్షించుకోండి. నా మీద మీకున్న అభిమానానికి కృతజ్ఞుణ్ని. మరో జన్మంటూ వుంటే మళ్ళీ మీకు స్నేహితుడిగా పుట్టాలని కోరుకొంటున్నాను. మీ అందరికీ పేరు పేరునా నా నమస్కారాలు" అన్నాడు.

వింటున్న రాజేష్ వాళ్ళకు అతని పలుకులు విని హృదయాలు ద్రవించాయి. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. ఒకప్పుడు అతని తొందరపాటువల్లనే తాము చిక్కుల్లోపడిన విషయం యిప్పుడెవరికీ గుర్తులేదు. తమలో ఒకడు, సన్నిహితుడు చిన్న పొరపాటు కారణంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నాడు. దిక్కులేని చావు చస్తున్నాడు.

అపరాధ పరిశోధన పోటీ-175

[ఫలితాలు]

ఫిబ్రవరి '83 నెల "అపరాధ పరిశోధన పోటీ—175"కి సరియైన సమాధానాలు:

1. ఉ. యెమెన్
2. అన్నదాత
3. ఘర్షణలు
4. ఇందిర స్తుతి
5. మేధావులలో

పై జవాబుల ప్రకారం నలుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మే '83 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీమతి ఎమ్. సుగుణ,
10-8-11/ఏ, రాజావారి స్ట్రీట్,
కావలి-524201, (నెల్లూరు జిల్లా)

(2) శ్రీ డి. జగపతి రాజు,
బ్లాక్ నెం. 38/860,
అజిత్ నగర్, విజయవాడ-520015.

(3) శ్రీ టి. ఎమ్. రమేష్,
C/o. ఆంధ్ర ఫార్మ డిస్ట్రిబ్యూటర్స్ అండ్ కం.,
opp. ఆంధ్ర బ్యాంకు, ట్రంక్ రోడ్,
నెల్లూరు-524001.

(4) శ్రీ జి. సతీష్,
శ్రీ వరలక్ష్మి జనరల్ స్టోర్స్,
కోటగుమ్మం వద్ద,
పిఠాపురం-533450. (తూ. గో. జిల్లా.)

సురేఖ ఏడ్చేస్తోంది. ఒకప్పుడు తన ప్రాణం కాపాడిన చక్రవర్తి ఈ రోజు నిర్దాక్షిణ్యంగా ప్రాణం పోగొట్టుకోబోతున్నాడు. ఎంతలో ఎంత మార్పు!

కుహానీ ఆదేశంమీద అతని అనుచరులు నేల తవ్వేతున్నారు. కొంత మంది గుంజలు, వెదురు బొంగులు తెచ్చి కుప్పవేస్తున్నారు.

రాజేష్ తన వాళ్ళవంక చూశాడు. అందరి మనసుల్లోనూ ఒకే భావం! కాని తమ ప్రాణాలు పోగొట్టుకోవడం వివేకం కాదని అందరికీ మనసులో ఉన్నది.

రాజేష్ అలవాటు ప్రకారం వాచీ చూసుకోబోయాడు. ఎప్పుడో సముద్రంలో పడిపోయింది వాచీ. అతని భావం అర్థమయిన అవినాశ్ వాచీ చూసి చెప్పాడు—మూడు గంటలవుతోందని.

ఇక తెల్లవారటానికి మూడు గంటల సమయం కూడా లేదు. ఈ లోపల దీవి నుండి బయటపడాలి! లేకుంటే కుహానీ అన్నంత పనీ చేస్తాడు. అక్కడి వాతావరణం మహాభయంకరంగా వుంది.

అందరూ చక్రవర్తికి సంతాప వీడ్కోలు యిచ్చేశారు. వెను తిరిగి దీవితీరం వైపు పరుగులు తీశారు. తప్పించుకోవాలి. వీళ్ళకు బలి కాకూడదు. అదే నిర్ణయం అందరిలోను. అదేవాళ్ళను పరుగెత్తిస్తోంది.

(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029
and Printed at Kranti Press, Madras-600 001.